

# హనుమద్విజయం

(సుందర కాండ)




మాస్టర్ పార్వతీకుమార్



# హనుమద్విజయం

(సుందర కాండ)

1

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2022 ప్రతులు : 1,000
(శ్రీ శుభకృత్ - ఉగాది)

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

వెల : రూ॥ **100-00**

*ప్రాప్తిస్థానము :*

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.
Website : www.dhanistha.org.
info@dhanistha.org.

*ముద్రణ :*

**ఓం నమశ్శివాయ జెరాక్స్**
మహారాణిపేట, విశాఖపట్నం.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్య వాయువు. ధన మనగ దివ్య సంపద. అది కేవలము డబ్బు కాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబం ధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధన మనిరి. ఆర్షవిజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు 'ధనిష్ఠ' 1992లో జనించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థ కర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన ప్రశాంత వాతావరణమును– "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తి గల నవయుగ యోగ మార్గదర్శి మాస్టర్ పార్వతీకుమార్‌గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్య జీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో "డాక్టర్ ఆఫ్ లెటర్స్" పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారి నప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవ

సేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింప జేయు వైద్యులు, శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించు చున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించు చున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ప్రస్తావన

శ్రీమద్రామాయణము ప్రపంచ వాఙ్మయము నందు శిరోధార్యమైన మహాకావ్యము. శ్రీమద్రామాయణము వివరించుట, ప్రవచించుట గురు సంప్రదాయములో నిరంతరము జరుగు కార్యక్రమము.

శ్రీమద్రామాయణమునకు మూలపురుషుడు శ్రీ రామచంద్ర మూర్తి. అత్యంత కీలకమైన మూర్తి శ్రీ ఆంజనేయుడు. సృష్టి నిర్వహణములో విష్ణుతత్త్వమునకు శివతత్త్వము, శివతత్త్వమునకు విష్ణుతత్త్వము పరస్పరాధారముగా నుండుట విశేషము.

శ్రీమద్రామాయణమునందు శివ తేజముగా అవతరించిన హనుమంతుడు ధర్మాచరణములో శ్రీరామునికి సంపూర్ణ సహకార మును భక్తి శ్రద్ధలతో భృత్యురూపమున నెరపుట అత్యంత విశేషము.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి జీవతత్త్వములో శ్రీరామతత్త్వ మున్నది. శ్రీరామునివలె మౌనముగా మహత్కార్యములను కర్తవ్యముగా మాత్రమే నిర్వహించిన మౌనమూర్తి.

మాస్టరుగారు 'శ్రీమద్రామాయణ ప్రవచనములు' సంపూర్ణ ముగా అందించిన వారు. ఈ ప్రవచనములు గ్రంథ రూపమున 'నావాణి' మాసపత్రికలో ధారావాహికముగా ప్రచురణ జరుగు చున్నది.

మాస్టరుగారి ప్రవచనములు ప్రచురణ కావలెనని ఇతోధికముగా శ్రోతలు కోరుచున్నప్పటికి మాస్టరుగారు మౌనము వహించిరి.

'సుందరకాండ' ప్రవచనములో హనుమంతుని గురు తత్త్వమును, శ్రీరాముని దైవ తత్త్వమును, సీతాదేవి జీవ తత్త్వమును అతి విశిష్టముగా తెలిపినారు. నిత్యాచరణలో జీవులు తత్త్వ సమన్వయమును పొంది, సులభముగా జీవించి, దైవత్వమును చేరు సాధనాపరమైన సోపానములు సరళముగా, సంగ్రహముగా అందించిన విధానము పఠించుటయే కాని వివరింపలేము.

శ్రీ రామాయణ ప్రచురణమునకు చిరకాలము నుండి భక్తితో కోరి వేచియున్న **శ్రీ కర్రి జీవరత్నం దంపతి** నిమిత్తకారకులు.

ఈ ప్రచురణలో సుందరకాండ ప్రారంభము నుండి హనుమంతులవారు లంకాపట్టణము చేరి, సీతమ్మ వారిని దర్శించు వరకు వివరించబడినది. తదుపరి రెండవ భాగములో సుందరకాండ పరిపూర్తి యగును. గ్రంథ విస్తారము వలన ఈ విధముగా ప్రచురించుట జరిగినది. ఈ మహాయజ్ఞము నందు పాల్గొనిన వారందరికీ మాస్టరుగారి ఆశీస్సులు, శ్రీ రామచంద్రుని అనుగ్రహము ప్రసరించవలెనని ప్రార్థన.

**- ధనిష్ఠ**

# హనుమద్విజయం

**(సుందర కాండ-1)**

# పరిచయము

రామాయణమందు సాధకులకు అత్యుత్తమమైన అనుగ్రహ మును అందించేటటువంటిది సుందరకాండ. ప్రతివారు తప్పక అవగాహన చేసుకొని, గురుతత్త్వాన్ని పరిపూర్ణంగా ఆశ్రయించి తద్వారా దైవమును చేరే సమస్తమైన ఉపాయములు సుందర కాండలో చెప్పబడి ఉన్నాయి. జీవాత్మ వేల లక్షల జన్మలు ఎత్తిన వెనుక, తను చేసే తిరుగు ప్రయాణంలో దైవాన్ని చేరవలసిన ఉపాయములన్నీ సుందరకాండలో ఇమిడి వున్నాయి. ఒక జీవుని జీవితంలోకి ఒక సద్గురువు ప్రవేశించడం అనే ఘట్టంకన్నా అత్యుత్తమమైన ఘట్టం వేరే ఏదీ లేదు కాబట్టి అది 'సుందర కాండము'. జీవునికి జీవనము సుందరమైనది కావాలంటే సద్గురువు ఆశ్రయం లభించాలి. సద్గురువు నందు దైవమును దర్శించాలి. సద్గురువును అవగాహన చేసుకొని, అతను తెలిపిన మార్గంలో నడిచి వెళ్ళాలి. సద్గురువు ఒక తపన చెందుచున్న జీవుణ్ణి ఏ విధంగా స్పృశిస్తాడు అనేది ఈ కాండములో చెప్ప బడినది. కోట్లాది జీవులు దిగివచ్చినప్పటికీ వారి జీవితము ఎప్పుడు సుందరమౌతుంది అంటే దైవమును చేరుటకు మార్గాన్ని అందించే దైవ స్వరూపుడు, దైవ ప్రతినిధి అయిన గురువు జీవుని చేరి నప్పుడే.

లంకలో బంధింపబడిన సీతాదేవికి రామునిచేరే ఉపాయము అందించినవాడు హనుమంతుడు. అతడు రామాయణంలో అత్యుత్తమ పాత్ర కలిగినవాడు. రామాయణము హనుమంతుడు లేకపోతే లేనే లేదు. అందరిచేతా కొనియాడబడినవాడు. సాక్షాత్తు శివ స్వరూపుడు. వాయువు వాహికగా, అంజనీదేవి మరికొంత వాహికగా అవతరించిన సద్గురు స్వరూపము. అతడు సీతను దర్శించి, లంకను దహించి, రాక్షసులను మర్దించి, సీతకు రామునికీ మధ్య ఒక చక్కని వారధిగా నిలబడడం అనే ఉత్తమమైన ఘట్టంతో పాటు, అనేకానేకమైన రహస్యములతో కూడిన ఘట్టాలు ఈ సుందరకాండములో ఉన్నాయి. అందుకని అనాదిగా జీవులకి బంధ విమోచనం జరగాలి అంటే సుందరకాండ చదువుకోమని చెప్తారు. అది లౌకికమైన బంధములనే కాదు దేహపరమైన బంధములను కూడా తొలగించి మనిషి ముక్తుడౌటానికి ఉపయోగపడుతుంది. అందులో తెలుపబడిన రహస్యములు అటువంటివి.

లంక అంటే మన శరీరం. అనగా లంక మొత్తం భూమి నుండి వేరుపడినది. అలాగే మన శరీరం కూడా. పంచభూతాత్మకమైన తత్త్వం ఉండగా, అందులోంచి కొంచెం వేరుచేస్తే ఒక్కొక్క జీవుని శరీరమూ ఏర్పడుతుంది. మొత్తం భూమిలో కొంత పదార్థము మన శరీరములో పదార్థముగాను, భూమిలో ఉన్న ఖనిజములలో కొంత భాగము మన శరీరములో ఖనిజములుగాను, మొత్తము భూమిలో వున్న నీటిలో కొంతభాగము మన శరీరములోను, భూమికి ఉండే వేడిమిలో కొంతభాగము మన శరీరములో వేడిమి గాను, భూమిని నంతటిని ఆవరించి ఉన్న వాయువు మన శరీరములో వాయువుగను,

ప్రాణ స్పందనములుగాను, శ్వాసగాను, భూమిని ఆవరించి ఉన్న ఆకాశము మనయందు ఆకాశముగాను, ఈ భూమిని నడిపే మనస్సు మన శరీరాన్ని నడిపే మనస్సుగాను, అటుపైన మనము, అటు పైన దైవము ఇలా మొత్తంలోంచి తానొకడుగా ఏర్పడి, నేను నాది అనే ప్రత్యేకమైన భావన కలిగిన మానవ మేధస్సు, అతని శరీరము 'లంక'. ఈ లంకని నడిపించడానికి త్రిగుణములు ఆధారము. త్రిగుణములలో నుండి అహంకార ప్రజ్ఞ పని చేస్తుంటుంది. తాను అనే వాడు ప్రత్యేకంగా ఉన్నాడనీ, నేను, నీవు, అతడు అనే మూడు స్థితులలో మనుషులను చూడడమూ, మన కన్నా వేరుగా ప్రపంచాన్ని చూడడం. అంతా ఒకటే అయినా ఇతరములుగా సమస్తాన్నీ చూడడం. మనకి ఇష్టమైనవి, ఇష్టం కానివి, పదార్థములు, సన్నివేశములు, ప్రదేశాలూ కూడా అలాగే చూడటం. అది మాయ. ఇదంతా మనయందు ప్రకృతిగా భాసిస్తుంది. సమస్తమునూ ఆవరించి ఉన్న ప్రకృతే మన యందు కూడా ఆవరించి ఉన్నది. అందుచేత మనకి మూడు గుణములు ఏర్పడి మన అహంకార ప్రజ్ఞ కొంత రజస్సులోను, కొంత తమస్సులోను, కొంత సత్త్వంలోను తనదైన జీవితాన్ని అల్లుకొని, తనదైన బంధాన్ని ఏర్పరుచుకొని, తాను ఒకడు ప్రత్యేకంగా ఉన్నాననే భావనతో జీవిస్తూ దాని కారణంగా బద్ధుడౌతాడు. ఇదీ మానవుని కథ.

ధర్మంతో కూడని కోరిక మనలో ఎప్పుడైతే ఉద్భవిస్తుందో అది మనల్ని దైవం నుండి దూరం చేస్తుంది. మొత్తం నుండి దూరం చేస్తుంది. మననొకడినీ వేరుగా తయారుచేస్తుంది. మన అహంకార ప్రజ్ఞ బాగా పెరుగుతుంది. అందుకని లంకలో

బంధింపబడిన సీతాదేవిని, కోరికలతో రకరకములైన బంధము లను ఏర్పరుచుకున్న జీవాత్మలతో పోల్చుకోవాలి. ఆమె కోరిన కోరిక ధర్మసమ్మతమైన కోరిక కాదు. అలా కోరుతూ ఉంటే కాల స్వరూపుడైన లక్ష్మణుడు “ఈ కోరిక సరైన కోరిక కాదు, రాక్షస మాయకు లోబడి నువ్వు ఈ విధంగా కోరుతున్నావు. దీనివల్ల చేటు వాటిల్లుతుంది” అని సీతాదేవికి హెచ్చరిక యిస్తాడు. రాముడికి కూడ తెలుపుతాడు. కానీ ఆమె అలా కోరడంవల్ల తన కోరికయే తనకు బంధమై నిలిచింది. తన కోరిక కారణంగా తాను బద్ధురా లైంది. నిజానికి, బంగారులేడి తనకు అవసరం లేదు. అలాగే మనకు అవసరము లేనివి చాలా ఉంటాయి. అవసరం లేని వాటికి తపన చెందడంవల్ల మనము బంధములలోకి తెలియక ఇమిడి పోయి ఆ తర్వాత ఇరుక్కు పోతాము.

అమ్మవారిగా లేదా ప్రకృతిగా సీతాదేవిని భావన చేస్తే ఆమె ఒక మహామాయ. ఆ మాయ రావణునికి కమ్ముతుంది. ఎందు కంటే రావణుడు కావాలీ, కావాలీ అనుకొనేవాడు. ‘కావాలీ’ అనుకొనే రావణుడు ఉద్ధరింపబడడానికి, మాయయే అతడిని ఆవరించి అమ్మవారిని కోరేట్లుగా, ఆ కారణంగా తన అహంకార నాశనానికి తానే సీతను తెచ్చుకొని లంకలో పెట్టుకున్నట్లుగా భావన చేయవచ్చు. ఇందులో మొదటి భావన సత్సాధకులకి చాలా ముఖ్యం. మన పరిస్థితి ఇదే ప్రపంచంలో.

పంచభూతాత్మకమైన ఈ సృష్టిలో మనం ఆనందంగా ఉండడానికి భగవంతుడు దీనిని నిర్మాణం చేసి ఉంచాడు. కాని మనం తెలియక చేసే పనులవల్ల ఇదే జీవితాన్ని చాలా దుఃఖ

భరితంగా చేసుకుంటున్నాము. అందుచేత భూమి చాలా అపవిత్ర మైనది, త్వరగా వెళ్ళి పోవాలి అని చెప్పేవారు తెలియనివారు. భగవంతుని సృష్టిలో ఏదీ అపవిత్రం కాదు. భూమి అసలే కాదు. ఎందుకంటే అది కూడా భగవతత్త్వము నుండి ఏర్పాటైనదే. ఇక్కడ ఉండే రకరకాలైన సంపదలను, వైభవాలను అనుభవించాలని మనను భూమికి పంపించారు. పంపించి, మనం ఎలా జీవించాలో కూడా పెద్దలు తెలిపి ఉన్నారు. అదే మన వాఙ్మయము. అది మనం ఆచరించని సందర్భంలో ఇదే భూమి మనకి బంధమై ఉంటుంది. భూమి అంటే శరీరము. శరీరములు అనారోగ్యంతో కాని, బాధ పెట్టే ఆలోచనలతో కాని, కోరికలతో కాని మనల్ని అంటే జీవుణ్ణి రకరకాలుగా తిప్పలు పెడుతుంటాయి. కనుక మన తిప్పలన్నిటికీ కారణము మనం కోరకూడనివి కోరడమే! కోర కూడనివి వస్తువులుగా ఉంటాయి, ఆహార పదార్థములుగా ఉంటాయి, ధనంగా ఉంటుంది, అధికారంగా ఉంటుంది. ఏది కోరడంవల్ల మనకి దుఃఖం కలుగుతుందో తెలిసికొని దుఃఖపడకుండా ఉండే పద్ధతులలో జీవించడానికి మనకి ధర్మాలు ఇచ్చారు. ఆ ధర్మాన్ని అవలంబించడానికి కావలసిన వాఙ్మయాన్నిచ్చారు. అది తెలియ చెప్పడానికి సద్గురువుల నిచ్చారు. ఇన్ని ఉన్నా కూడా మనం మోహంలో, మాయలో పడుతుంటాం. ఆ విధంగా అమ్మవారు బంగారు లేడిని కోరింది.

పదమూడు సంవత్సరములు అరణ్యములో ఉన్న సీతాదేవి రాముని తప్ప, ఎప్పుడూ ఏమీ కోరలేదు. రాముణ్ణి బంగారు లేడికోసం పంపిస్తుంది. తన పనికి వినియోగించింది. మనం

కూడా సద్గురువుని ఎలా వాడుకోవాలో తెలియక, ఈనాటికీ మన పనులకి ఆయన్ని వాడుకోవటానికి ప్రయత్నం చేస్తుంటాం. మనకి తెలిసింది అంతే! అందుచేత సద్గురువుచేత పని చేయించుకొనే వారంతా దైవానికి దూరం అవుతారు. బంగారులేడిని తెచ్చివ్వమని సీతాదేవి రాముని కోరడంవల్లకదా, ఆమె రామునికి దూరం అయింది. రాముడు దూరంగా వెళ్ళడం వల్ల కదా అమ్మవారు అపహరించబడింది! అలాగే మనం కూడా దైవంతో ఉండడంగా భావన చేస్తూ మనకి అందివచ్చిన జీవితాన్ని దైవసంకల్పంగ అంగీకరించి జీవించడానికి ప్రయత్నం చేయాలి. దైవాన్ని లౌకికమైన విషయాలకు వినియోగించుకోవడంగా కాకుండా, నీ పాదములవద్ద నేను ఎప్పుడూ ఉండేటట్లుగా నన్ను అనుగ్రహించమని కోరడమే నిజమైన సాధకుల యొక్క దీక్ష. అటువంటి దీక్ష కలిగిన సీతాదేవి రామునితో అరణ్యానికి వచ్చింది, అన్ని కష్టాలలోను పాలుపంచుకొన్నది, కానీ ఈ విధంగా మాయకి గురి అయి లేడిని కోరి రామునికి దూరం అయ్యింది. అలాగే మనం ఎప్పుడో దూరం అయిపోయాము. మనం ఇంకా ఉంటున్నది లంకలోనే.

లంకని పరిపాలించే వాళ్ళు ముగ్గురు. ప్రత్యేకించి ఒకడు అహంకార పురుషుడు. వాడు దైవాన్ని ధిక్కరిస్తుంటాడు. ద్వేషిస్తుంటాడు. ధర్మాన్ని అతిక్రమిస్తుంటాడు. అదీ అహంకార పురుషుడి లక్షణం. వాడికి ధర్మంతో పనిలేదు. దైవంతో పని లేదు. తానే సమస్తమని జీవిస్తుంటాడు. అటువంటి రావణాసురుడు రజోగుణ సంపన్నుడు. రజోగుణం చేతనే అది కావాలి, ఇది కావాలి అని అనిపిస్తుంది. అలాగే అతని తమ్ముడు కుంభకర్ణుడు

ఒకడు. అతడికి ఏమీ అక్కరలేదు. నిద్రపోతే చాలు. అనగా కర్తవ్యముల యందు కూడా నిద్రే. మన శరీరములో తమో గుణము చేత మనకి నిద్ర వస్తుంది. రజోగుణము అధికమైతే నిద్రకూడా పోకుండా అడ్డమైన పనులూ చేస్తుంటారు. పగలూ రాత్రీ కూడా లోకాలను గగ్గోలు పెడుతుండేవాడు రావణుడు. ఎప్పుడూ నిద్ర పోతుండేవాడు కుంభకర్ణుడు. తినడం పడుకోవడం అంతే పని. మనలో కూడా ఈ రోజు భోజనం ఎక్కడ దొరుకు తుంది, పడుకోవడానికి వసతి ఎక్కడ దొరుకుతుంది అనే భావన మిక్కుటంగ కలిగినవాళ్ళు ఉంటారు. వాళ్ళు తమోగుణ సంపన్ను లుగా ఉంటారు. కాని మనకి నిద్ర రావాలంటే తమోగుణం ఉండాలి. అలాగే బాగా సంకల్పించి పనులు చేయాలంటే రజో గుణం ఉండాలి. దైవ సంబంధితమైన విషయములైనప్పటికీ అహంకారం చేతిలో అవి పడేటప్పటికి వాటికి ఉండే ఉపయోగం తారుమారు అవుతుంది. అలా తారుమారు అయ్యే రావణ కుంభకర్ణులు లంకలో ఉంటారు. అక్కడే విభీషణుడు కూడా ఉంటాడు. మనలో సత్త్వగుణం కూడా ఉంటుంది. లంకలో సత్త్వగుణం అటు రావణుడికి, ఇటు కుంభకర్ణుడికి లోబడి ఉంటుంది. వారిద్దరి కంటే విభీషణుడు చిన్నవాడు. చిన్నవాడు అంటే ఇక్కడ శరీరంలో ఉండే తత్త్వంలో రజోగుణం పాలు ఎక్కువ, తమోగుణం పాలు సరి సమానంగా ఉన్నది. సత్త్వగుణం పాలు అంతంత మాత్రంగా ఉన్నది. అదీ జీవుడి యొక్క పరిస్థితి.

నిద్ర, ఆహారము, మైథునము ఈ మూడింటి యందు ఆసక్తి కలిగి ఉండడం, లేచినప్పుడు ధర్మాధర్మ విచక్షణ లేకుండా

పనిచేయడం, మాట్లాడటం, తిరగటం, ఆలోచిస్తూ ఉండడం. శరీరంలో బంధింపబడిన జీవుడికి ఇట్లా జరుగుతుంటుంది. అందుకని వీడికి మూడు బంధము లుంటాయి. అవే 'బ్రహ్మ గ్రంథి', 'విష్ణు గ్రంథి', 'రుద్ర గ్రంథి' అని మూడు గ్రంథులుగా. ఈ శరీరంలోంచి బయటకు పోలేవని, మూడు చోట్ల మనకు ముడివేసేశారు. అలా శరీరంలో బంధింపబడ్డ వాడు ఖైదీయే తప్ప అతడు స్వతంత్రుడు కాడు. శరీరం ఒక గృహమువలె నివసించి, అవసరమైతే బయటకు వెళ్ళి, మళ్ళీ లోపలకు వచ్చేట్లుగా ఏర్పాటు చేసుకోవాలి. అలాకాక మన శరీరము మనకు బంధమైతే అది కారాగార మౌతుంది. ఈ కారాగారం నుండి జీవుడు తప్పించుకోకుండ ఒక తత్త్వం ఉన్నది. అదే లంకిణి. రావణుని అనుమతి లేకుండా లోపలకు ఎవరూ రాకుండా అప్రమత్తతతో ఉంటుంది. అందుకే ఈ బంధింపబడిన జీవుని ఎవరూ వచ్చి రక్షించే అవకాశం లేదు. అదీ లంక పరిస్థితి.

అటువంటి లంకలో అమ్మవారు బంధింపబడి ఉన్నది. ఆమె ఎక్కడ ఉన్నదీ? అశోకవనంలో ఉన్నది. అశోకము అనగా శోకము లేనిదని అర్థము. అక్కడ దుఃఖమూ లేదు, అమితమైన సంతోషమూ లేదు. ఒక సమస్థితి, సమభావము ఉన్న తత్త్వము అది. శరీరంలో దానికి సంబంధించిన కేంద్రం కూడా ఉన్నది. శరీరములో అక్కడ ఉన్నవారికి శరీరం బాధపెట్టటం ఉండదు. శరీరము నిజానికి దైవవిభూతి చెందడానికి ఇవ్వబడినది కాబట్టి, దీని నుండి కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, ధర్మాన్ని అనుసరిస్తూ, చక్కగా జీవితాన్ని నడుపుకొనే వాడికి జీవితం బంధించే అవకాశం లేదు. అందుకని

అశోకవనం కూడా అక్కడ ఉన్నది. లంకలో ఎవరెక్కువ ఉంటారూ? అక్కడ చేరేవారంతా, అక్కడ ఉండే వారంతా రాక్షసులే, అసురులే! కనుక విపరీతమైన రాక్షసబృందములు శరీరములో చేరి ఉంటాయి. అహంకార పురుషుడు మనలో బాగా తాండవమాడి, దైవానికి ఏమాత్రమూ చోటులేని పరిస్థితి. ఇదీ లంక పరిస్థితి.

లంక ఎప్పుడూ గొప్పదనం కోరుతుంది. లంకలో ఉండే వన్నీ ఎప్పుడూ గొప్పగొప్పగా ఉంటుంటాయి. గొప్పదనమే ఆధారంగా జీవించే వారూ, మంచితనం లేనటువంటి వారూ, దైవాన్ని ధిక్కరించి, ధర్మాన్ని అతిక్రమించి జీవించుచున్నవారూ, వారికి నాయకుడుగ అహంకారమూ ఉన్నది. అదీ ఒక సగటు మానవుని యొక్క పరిస్థితి. ఇటువంటి లంకలో ఉన్న జీవుడికి తపన పుడితేనే ఆ లంక నుండి విముక్తి. ఆ తపనే సీతాదేవి తపన. సీతాదేవి రావణుని ద్వారా అపహరింపబడిన తర్వాత చాలా పశ్చాత్తాపంతో కుంగిపోతుంది. అందుకనే హనుమంతుడు సీతా దేవిని చూచినప్పుడు ఆమె ఎలా ఉన్నది? ఆమె అపహరింపబడిన సమయంలో ఏ వస్త్రమైతే ధరించి ఉన్నదో ఆ వస్త్రమే కట్టుకొని ఉన్నది. చీరలో కొంతభాగము చింపి ఆభరణములు మూటగట్టి అక్కడ ఉండే ఋష్యమూకపర్వతము మీద పడవేసింది. అదే చీరతో ఉన్నది. చీర బాగా చివికి పోయినది. శిరోజాలని సంస్క రించుకోలేదు. ఆభరణాలన్నీ తీసేసింది. దుఃఖంలో ఉన్నప్పుడు మనవద్ద వజ్రాభరణములున్నా ఏం ఉపయోగం? అన్ని నగ లున్నాయి కదా అవి చూసుకొని కష్టాలు మరిచిపొమ్మని కష్టాలలో ఉన్నవాళ్ళకి చెప్తే ఎలాగుంటుంది? విపరీతమైన తిట్లు తిడతారు.

ఆభరణాలు నీకు ఎప్పుడు పనికి వస్తాయి? నువ్వు ఆనందంగా ఉన్నప్పుడు. సీతకు రాముని వియోగంవల్ల ఆనందమే లేదు. అట్లా శోకంతో రామునికోసం తపిస్తున్నది. లంకలో లేని వైభోగం లేదు. లంక ముందు అయోధ్య ఎందుకూ చాలదు. అంతదృుతమైనది లంక. అయోధ్య మన వారణాసి అయితే లంక అమెరికాలో ఉన్న లాస్వేగాస్‌లాగ ఉంటుంది. సకల దుర్గుణముల యందు వైభవోపేతముగా ఉంటుంది.

లంకలో ఉన్నవాడు 14 లోకాలు కబళించి ఉన్నాడు. “ఆ రావణుడు 14 లోకాలకి నేను అధిపతిగా ఉన్నాను, కనుక అన్నిలోకముల స్త్రీలు నన్నుకోరి నన్ను చేరినవారున్నారు” అని అంటాడు. రావణుని వద్ద ఉన్న రాజకుమార్తెలు, అప్సరసలు మొదలైన వారంతా రావణునివద్దకు కోరి వచ్చిన వారే! అలాంటి వారు లెక్కకు మించి ఉన్నారు. వారందరిలో ఉత్తమమైన స్త్రీ మండోదరి. “అటువంటి మండోదరిని కాదని నిన్ను పట్టమహిషిని చేస్తాను, నెత్తిన కూర్చో పెట్టుకుంటాను, లంకను నువ్వు పరిపాలించ వచ్చు, నీ మాట కాదనకుండా అన్నీ జరిగిపోతాయి” అని ఎన్నో రకాలుగ మోహపెడతాడు సీతని. కాని ఆమె వాటికి వేటికీ లొంగక రాముడినే తలుచుకుంటుంది. అప్పుడప్పుడు భగవంతుని తలుచుకొనేసరికే, మనం మహాభక్తులమనే అనుమానం వచ్చేస్తుంది. సీతాదేవి పరిస్థితి ఏమంటే ఆమెకి ఇహ ఏమీ అక్కరలేదు. ప్రపంచంలో ఉన్నవి ఏమీ తనకు ఆకర్షణ కాదు. తనకు రాముడే కావాలి. ఆ స్థితిలో ఉన్నది సీత. కాబట్టి సద్గురువు ప్రవేశించడం జరుగుతుంది.

సద్గురువు మహేంద్ర పర్వతం నుండి బయలుదేరాడు. మహేంద్ర పర్వతం అంటే మన విశుద్ధిచక్రం, అనగా కంఠం. అక్కడ నుండి మనము ఆకాశమార్గంలో ప్రయాణము చేయవచ్చు. హనుమంతుడు ఆకాశమార్గంలో ప్రయాణము చేయడానికి మహేంద్ర పర్వతాన్ని అధిష్ఠిస్తాడు. దానికి తాను ఆకాశ శరీరము కలిగి ఉండాలి. 'ఆకాశ శరీరం బ్రహ్మ' అన్నారు కదా! ఆకాశ శరీరమే మనకు ఇప్పుడు యోగము ద్వారా అందింపబడుతున్నది. ఇప్పుడు కాదు ఎప్పుడూ అదే కార్యక్రమం. అందుకని యోగమునకు అంత ప్రాముఖ్యత ఉన్నది. జీవుడు ఆకాశజుడు. అంటే ఆకాశ శరీరమున్నది. అటుపైన మిగిలిన శరీరా లున్నాయి. కనుక, హనుమంతుడు మహేంద్రగిరి పర్వతాన్ని ఎక్కడము అంటే ఆకాశ మార్గమునకు సంబంధించిన కేంద్రమును అధిష్ఠించి అక్కడ నుండి ఆకాశమార్గంలో బయలుదేరి వస్తాడు. సద్గురువు ఆకాశ మార్గముననే శిష్యుని చేరడానికి వస్తాడు. ఎటువంటి శిష్యుని? పై చెప్పిన అర్హతలు కలిగిన శిష్యుని. ఎవరికైనా విశుద్ధి నుండే వాక్కు వస్తుంది. వాక్కు ద్వారా ఒక సద్గురువు శిష్యునిలో ప్రవేశించ గలడు. అది సద్గురువు మాత్రమే చేయగలడు. అందరూ చేయ లేరు. తన వాక్కుని జీవులలోనికి ప్రవేశింపచేసి, సంస్కారవంతము చేసుకొని తద్వారా జీవుడు ఊర్ధ్వగతి, ఉత్తమగతి పొందేటట్లుగా చూస్తాడు. అలా ఊర్ధ్వగతికి తీసుకువెళ్ళే తత్త్వంగా మనకు హనుమంతుడు గోచరిస్తాడు. హనుమంతుడు ఎంత యోగ నిష్ఠాపరుడో అతడు చేసే ఉల్లంఘనం ఉన్నదే, ఆ మహేంద్ర పర్వతము మీదనుండి ఆకాశగమనము చేయడంకోసం హను

మంతుడు శరీరమునుండి ఎటువంటి మార్పులు వచ్చినాయో ఆ మార్పులన్నీ కూడ ధ్యానం చేసుకొనేవారికి రావాలి. వస్తే ధ్యానం జరుగుతున్నట్లు, లేకపోతే అదొక వ్యామోహమే. ఆ విధంగా ఆకాశమార్గాన వచ్చిన హనుమంతుడు లంకిణిని ఛేదిస్తాడు. భేదిస్తాడు.

కనుక లంకలో అనగా ఇతరుల శరీరములలోకి ప్రవేశించ గలిగి వారిని ఉద్ధరించగలిగే వారు జీవులను ఆవరించి ఉన్న దుర్గమమైన తత్వమును ఛేదించి, ఆ జీవుని శరీరములోకి ప్రవేశించి, జీవుని ఉద్ధరించే కార్యక్రమం చేయాలి. అది సద్గురువు చేయగలడు. దీనినే “side ways, vertical levels, meet centers” అని మూడు మంత్రాలలో మాస్టర్ సి.వి.వి.గారు అందించారు. అంటే తన చేతనమును సమాంతరముగ ప్రవహింపచేసి జీవుని చేతనమును చేరి, ఆజ్ఞను చేరి అక్కడ నుండి verticalగా దిగివచ్చి, అతడిని ఉద్ధరించి తనతో సమానమైన స్థితికి తీసుకువచ్చి తన శిష్యుణ్ణి తనంతవానిగా చేస్తారు. సద్గురువు శరీరంలో నుండి బయటకు రాగలడు, బయటకు వెళ్ళగలడు. తన శరీరమేకాదు ఇతరుల శరీరం లోనికి ప్రవేశించగలడు. ఆ విధంగా ప్రవేశించ గలవాడే సద్గురువు. ఆకాశగమనం చేయగలవాడే సద్గురువు. వాక్కుచేత ఇతరులకు ప్రచోదనము కలిగించ గలవాడే సద్గురువు. అందుకనే సద్గురువు ఇచ్చే వాక్యం మహామంత్రమై, జీవులను ఉద్ధరిస్తుందని చెప్పారు. హనుమంతుడు లంకలో ప్రవేశించడం పెద్ద విషయం కాదు. ఆ విధంగ లోపలకి వెళ్ళిన హనుమంతుడు జీవుని వెతికి, ఆమెవున్న పరిస్థితి చూసి, రావణునితో అమ్మవారు

మాట్లాడే మాటలని శిష్య పరీక్షగా చూస్తాడు. ఒక సద్గురువు శిష్యుడికి అర్హత ఉన్నదా, లేదా అని చూస్తాడు. ఏ అర్హత చూస్తాడు శిష్యునిలో సద్గురువు? ఆ జీవుడు దైవమును తప్ప కోరని స్థితిలో ఉన్నడా, లేడా అని చూస్తాడు. అది ఉంటే దైవమును చూపే మార్గం చూపించడానికి అంగీకరిస్తాడు. ఇక్కడ రాముని తప్ప ఇంకొకటి కోరని స్థితిలో అమ్మవారున్నది. అటువంటి తపన ఉన్నవారికి సద్గురువు. హనుమంతుడెలా సద్గురువు? దైవకార్యం కోసం తనున్నాడు తప్ప కేవలము దైవ భక్తులమని చెప్పి తమ కార్యాలను నిర్వర్తించుకున్నవాడు కాదు. ఒక సద్గురువు ఎవరయ్యా అంటే దైవము నుండి తాను పొందవలసినది ఏమీ లేక దైవము నకు సహాయము చేయడానికి దిగివచ్చినవాడు. దైవమునకు ప్రతి రూపము. దైవమునకు ప్రతినిధి. అటువంటివాడు హనుమంతుడు.

రాజ్యాన్ని కోరిన సుగ్రీవుడు కాదు, విభీషణుడూ కాదు. దైవాన్ని ఆశించి దైవాన్ని ఆశ్రయించడం కూడా ఉన్నది. ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు వీరంతా ఒక కోవలోకి వస్తారు. కాని రాముని వద్ద నుండి హనుమంతునికి ఏమీ అక్కరలేదు. రాముని వద్ద నుండి పొందవలసినది ఏమీ లేదు. అదీ హనుమంతుని గొప్పదనం. సాక్షాత్తు శివతత్త్వం. ఈ సృష్టికి ఆధారమైన అగ్నితత్త్వమే తన రేతస్సును వాయువుకు అందిస్తే, వాయువు తీసుకువచ్చి ఆ రేతస్సుని అంజని గర్భంలో పెడితే, ఆ అంజని గర్భం నుండి ఇంద్రుని చేత సంహరింపబడక బయటకు వచ్చినవాడు. ఇంద్రుడు సంహరించడానికి సలసల కాగుతున్న బంగారునీరు అంజని యోనిలో పోసినా కూడా ఆ సలసల కాగుతున్న బంగారునీరు

హనుమంతునికి చక్కని బంగారు వర్ణము కలిగేట్లుగా, ఆభరణంగా తయారైందే తప్ప, అతడిని సంహరించ లేకపోయింది. వాలి అప్పటి నుండీ హనుమంతుడంటే భయపడుతూనే ఉండేవాడు. ఎందుకంటే సాక్షాత్తు శివుని రేతస్సు నుండి వచ్చినవాడు కాబట్టి శివ స్వరూపము. వాయువు చేత తీసుకోబడినవాడు కాబట్టి వాయు పుత్రుడు. అంజనికి పుట్టినవాడు కాబట్టి అంజనీపుత్రుడు. అంజని భర్త కేసరి, కనుక కేసరి నందనుడు. ఈ విధంగా హనుమంతుడు కనిపిస్తాడు. అటువంటి హనుమంతుడు రామ కార్యార్థమై తను శరీరం ధరించాడు తప్ప, రాముని నుండి అతడు పొందవలసినది ప్రత్యేకంగా ఏమీ లేదు. ఆయన సీతాదేవి పరిస్థితి ఎలా ఉన్నదీ చూస్తాడు. ముందు మండోదరిని చూసి సీతాదేవి అనుకుంటాడు. కాని మళ్ళీ ఈమెయే సీత అయితే మనం ఇంత దూరం రానక్కర్లేదు. రాముడు ఇంత తపన పడడు. కనుక వెతుకుతాడు. ఆ వెతకడంలో కొన్ని రహస్యాలు చెప్తాడు. అటుపైన అమ్మవారిని చూస్తాడు. ఆమె పడే తపన చూస్తాడు. రావణుడు సీతతో చేసిన సంభాషణ, అందుకు సీతాదేవి యొక్క సమాధానం వింటాడు. 'భేష్' అనుకుంటాడు. సీత అంటే ఇట్లాగే ఉంటుంది. ఇంకొకలాగ ఉండడానికి వీల్లేదు. నిజమైన శిష్యుడు ఇలాగే ఉంటాడు. ఇంకొక రకంగా ఉండడానికి వీల్లేదు. అంటే దైవమును తప్ప ఇంకొకటి కోరని శిష్యుడు సరైన శిష్యుడు. ఉపదేశమునకు అర్హుడైన శిష్యుడు. ప్రతి గురువు వద్దా ఏవో పనులకోసం చేరతారు. వారికి ఆ పనులే తప్ప దైవం దక్కదు. సీత అలాకాదు. పూర్తిగా దైవం కోసమే తపన చెందుతూ వుంటుంది. హనుమంతుడు సంతోషించి ఆమెకు సహాయం చేయడానికి పూనుకుంటాడు.

మన వేద ధర్మంలో శిష్యుడు కూడా గురువును పరీక్షించి అంగీకరించాలి అని ఉన్నది. తనకున్న కొద్ది బుద్ధితోనే శిష్యపరీక్ష గురువు ఎలా చేస్తాడో– శిష్యుడు కూడా గురుపరీక్ష అలా చేయాలి. ఈయనకి ప్రపంచంలో కావలసినవి ఏమన్నా ఉన్నాయా, ఇవేవో అడ్డుపెట్టుకొని ఏమన్నా బూటకాలు సాగుతున్నాయా అని చూసుకోవాలి. సద్గురువును “నువ్వు దైవాన్ని చూశావా? దైవము యొక్క స్వరూప స్వభావాలు నీకు తెలుసా? దైవప్రతినిధిని అని చెప్పుకోవడానికి నీవద్ద ఏమన్నా ఋజువున్నదా? దైవము నీకు తెలుసా?” అని ప్రశ్నలు అడగడమే. సీతాదేవి “నువ్వు మాయ కాదని, రాముని ప్రతినిధివని నేను నమ్మడానికి నువ్వేం చెప్ప గలవు? నీకు రాముడు తెలుసా?” అని హనుమంతుని అడగడం. ఆయన దైవప్రతినిధియే! అందువల్లనే తనవద్ద ఉన్న ఉంగరాన్ని రాముడు అతనికి ఇచ్చి పంపుతాడు. దాన్ని హనుమంతుడు ముందు చూపించడు, తర్వాత చూపిస్తాడు. ‘రాముడు ఎలా ఉన్నాడు, ఇప్పుడేం చేస్తున్నాడు’ అని సీతాదేవి అడగడమే ‘దైవమంటే ఏమిటి? అతని స్వరూప స్వభావములు ఏమిటి? అని అడగడం.

వివేకానందుడు అడగలేదూ రామకృష్ణ పరమహంసని, ‘నువ్వు నిజంగా దైవాన్ని చూశావా?’ అని. ‘చూశాను!’ అన్నాడు. ‘చూస్తే ఎట్లా ఉంటుంది?’ అని అడిగాడు. ‘ఇలా రా చూపిస్తా’ అన్నాడు. రామకృష్ణులు మంచం మీద కూర్చొని ఉన్నారు. వివేకానందునీ కూర్చోమన్నాడు. ఈయన కాలు తొడ వరకు ఆయన తొడమీద పెట్టాడు. అంతే! సమస్త ప్రపంచమూ, మొత్తము గోళాలన్నీ కూడా ఒక విశ్వరూప సందర్శనమై, తను లేక అలా

ఉండిపోయాడు. 'నేను ఉన్నాను' అనే భావం కూడా లయమై పోయింది. సమస్తమూ ఒక మహత్తరమైన నీలమైన అనంతమైన ఆకాశంగాను, అందులో గ్రహములు గోళములు తారకలు వాటి మధ్య తాను తిరుగుతుంటే ఒక మహా సముద్రంలో తాను ఉన్నట్లు, తనకి తాను కనబడలేదు, కాని తాను ఉన్నానని తెలుసు, కాని ఎక్కడ ఉన్నాడో తెలియదు. మంచం లేదు, పక్కన గురువు లేడు, ఉన్న భవతారిణి ఆలయ ప్రాంగణము లేదు, భూమి లేదు, ఏమీ లేదు. తాను ఉన్నట్లు ఎరుక తప్ప ఇంక ఏమీ లేక మొత్తం అంతా నీలంగ ఆవరించి ఉన్నట్లుగా అయిపోయిన తర్వాత, అలా కాసేపున్నాక రామకృష్ణుడు కాలు తీస్తాడు. అప్పుడు స్పృహలోకి వస్తాడు. ఎలా ఉంది అని అడుగుతాడు రామకృష్ణుడు. దణ్ణం పెడతాడు. శిష్యుడంటే వివేకానందుడిలాగా ఉండాలి. గురువంటే రామకృష్ణుడి లాగ ఉండాలి. ఎవరెవరి స్థితిగతులని బట్టి వారి వారికి అటువంటి వారు దొరుకుతుంటారు. అలా దైవాన్ని చూపించగలవాడు హనుమంతుడు.

రాముని స్వరూప స్వభావాలను ఆవిష్కరించి చూపిస్తాడు. రాముని కథ చెప్తాడు. రాముడు వున్న పరిస్థితి చెప్తాడు. రాముడు సీతకోసం ఎంత తపన చెందుతున్నాడో చెప్తాడు. అలా తెలియ పరిచిన తర్వాత హనుమంతుడు రామదూత అని నమ్మడానికి ఋజువుగా 'ఆయన ఇచ్చాడమ్మా ఇది. ఇది నీ సొత్తే కదా! ఆయన వద్ద ఉన్నది' అని ఉంగరం ఇస్తాడు. చూస్తుంది. అది రాముని వద్ద నుండి ఎవరూ తెచ్చుకోలేరు, రాముని జయించి ఆ ఉంగరం తేవడం ఎవరి వల్లా కాదు. కాబట్టి రాముడు ఇవ్వడంచేతనే ఇతను

వచ్చాడని తెలుస్తుంది. అంతే కాదు హనుమంతునికి ఇంకా పరీక్షలు పెడుతుంది సీతాదేవి. నీవు కావాలంటే నేనే నిన్ను దైవం వద్దకు చేర్చగలను అంటాడు. సద్గురువు జీవుని దైవం వద్దకు చేర్చగలడు.

ఆ విధంగా హనుమంతు డడిగితే ఆయన తనకున్న మహత్తరమైన స్వరూపాన్ని ఆవిష్కరిస్తాడు. భూలోకము, భువర్లో కము, సువర్లోకము దాటివున్న తన స్వరూపాన్ని సీతాదేవికి చూపిస్తే ఆమె ఆశ్చర్యపోతుంది. చూడటానికి కోతివలె ఉంటాడు. చూపులకి కోతి తప్ప, అది కోతి కాదు కదా! అంటే సద్గురువు తనని తాను మరుగుపరచుకొని ఉంటాడు. ప్రకటించుకొని ఉండడు. ప్రకటన చేసుకొనేవారు సద్గురువులు కారు. తాను ప్రకటింపబడక శిష్యుని అర్హతని బట్టి ప్రకటింపబడతారు. అలా అమ్మవారు జీవుడిగా మనం భావన చేస్తే సద్గురువుని పరీక్షచేసి అంగీకరిస్తాడు. సద్గురువు కూడా శిష్యుని పరీక్ష చేసి అంగీక రిస్తాడు. వారిద్దరి మధ్య ఒక అంగీకారం ఏర్పడిన తర్వాత అప్పుడు సద్గురువు కార్యంలో దిగుతాడు. అంతవరకు దిగడు. ఎందుకంటే నీవు దానికి సంసిద్ధుడవై లేవు. లేవు కాబట్టి చేయడు.

సీతాదేవిని తాను పరిపూర్ణంగా అనుగ్రహించిన సందర్భంగా హనుమంతుడు లంకలో రాక్షసులను చాలామటుకు సంహరిం చేస్తాడు. లంక బలం చూసుకోవడంకోసం, లంకలో రాక్షసులను చంపడం కోసం. రాక్షసులను దోమలు చంపినట్లు చంపేశాడు చేతుల్తో. ఆయుధాలేం లేవు. అందుకే హనుమంతుడు 'మసికీకృత రాక్షసం'– మసికం అంటే దోమ. రాక్షసులని దోమలతో సమానంగా

చంపేశాడు. మనలో ఎన్ని రాక్షస గుణాలున్నాయి? ద్వేషం ఉన్నది, ప్రేమ లేదు, సోదరభావం లేదు, శత్రుభావం ఉన్నది. మిత్రభావం లేదు, ఉన్నది అహంకారం. అందరికీ ఎవరి స్థాయిని బట్టి వారికి అసూయ ఉన్నది. కొంతమంది మీద మమకారం ఉన్నది, అది ప్రేమ అనుకుంటాం. కొంతమంది మీద ద్వేషం ఉంటుంది. ప్రేమ ఉన్నవారికి అందరి మీదా ప్రేమ ఉంటుంది. తనవారు అని అనుకోవడంవల్ల ప్రేమ, తనవారు అని మనస్సులో నిర్ణయించుకోకపోవడంవల్ల ప్రేమ లేకపోవడం అనేది జరుగుతుంది.

ఆ విధంగ విభజించి కదా జీవిస్తాం? విభజించి జీవించే వాడు తానే విభజన చెందాడు. అందుకని అతనికి ఘర్షణ తప్పదు. విభజన నీలో ఉంటే అది నిన్నే బాధ పెడుతుంది. అలా మనం అన్నీ విభజించి ఏలుకోవడంకోసం చూస్తుంటాం. అవన్నీ మనలో రాక్షసగుణాలు పుట్టిస్తాయి. పుట్టించి కొంతమందిని ఏడ్పించడం, కొంతమందిని ఇబ్బంది పెట్టడం, కొంతమందికి మెలికలు వేయడం, కొంతమందిని అదుపులో ఉంచాలని ప్రయత్నము చేయడం. కనుక మనలో ఎంతమంది రాక్షసు లున్నారో ఎవరికి వారుగా చూసుకోండి.

మన లోపల తొంగిచూస్తే, భయంకరమైన లంక మనది. రావణుడి లంకతో సమానంగా ఉంటుంది. మనలోని అసుర భావాలైన రాగము, కామము, లోభము, మోహము, మదము, మాత్సర్యము, ఈర్ష్య, అసూయ అనేవన్నీ రాక్షసులే! ఈ రాక్షసుల నుండి నన్ను ఎలా రక్షించుకోవాలి? అంటే సద్గురువుని ఆశ్రయించుకోవాలి. 'సద్గురు సమాశ్రయము' అంటారు. సీత అంత

మంది రాక్షసులూ అన్ని కష్టాలు పెడుతున్నా, వారిని తల్చు కోకుండా దైవమునే, రాముణ్ణే నమ్ముకొని ఉండడం చేత సద్గురు వైన హనుమంతుడు లంకలో ప్రవేశించి రాక్షస సంహారం చేస్తాడు. నీ దుర్గుణాలన్నీ కూడా సద్గురువే నిర్మూలిస్తాడు. అదీ దీక్షాబద్ధ జీవితాన్ని నీవు అంగీకరించినట్లయితే! అటుపైన అహంకార ప్రజ్ఞకి హెచ్చరిక చేసి వెడతాడు. నామమాత్రంగా ఉండు లేకపోతే చస్తావ్, నీ అస్తిత్వము దైవము యొక్క అస్తిత్వమే అని. గుణములకి అస్తిత్వము ఏదీ? అవి ప్రకృతి నుండే పుట్టినాయి. ప్రకృతి ఎక్కడ నుండి వచ్చినది? దైవము నుండే కదా! దైవం వుండబట్టే కదా రావణుడైనా ఉన్నాడు. కాబట్టి దైవతత్త్వము నందు నీవు ఇమిడి ఉండక దైవమును వ్యతిరేకించి, ధర్మాన్ని అతిక్రమించి నీవు జీవిస్తున్నావు. నీకు సమయం వచ్చేసిందని, సద్గురువు అహంకారాన్ని హెచ్చరిస్తాడు. సద్గురువు కేవలం ఒక సత్త్వగుణాన్ని మాత్రమే ఆదరిస్తాడు. అందుకనే ఆయన లంకంతా ముట్టించేసి, మొత్తం లంకంతా పెద్ద అగ్నిశిఖలతో, జ్వాలలతో ఉండడం, సముద్రతీరం నుండి చూస్తుంటే ఆయనకు ఆలోచన వస్తుంది. మరి లంకలో సీత ఉన్నది, సీత కాలిపోతే? వచ్చిన పని వికటించినట్లవదూ! అందుకని దేనిని సద్గురువు సంరక్షించి, దేనిని కాలుస్తాడు అని మనం చూస్తే విభీషణుని భవనం మాత్రము మిగిలి ఉంటుంది. దానికి నిప్పు అంటుకోదు. అంటే సత్త్వగుణాన్ని మాత్రమే మిగులుస్తాడు. దైవమును చేరడానికి సత్త్వగుణం ఒక్కటే దారి. రజోగుణము, తమోగుణము మనల్ని బంధాలలో బాగా ఇరక పెట్టడానికి పనికి వచ్చే గుణాలు. అందుకని అన్ని గృహములూ తగలబడతాయి.

విభీషణుని గృహము మాత్రమూ తగలబడలేదని సిద్ధులు, చారణులు ఆకాశం నుండి చూసి సంతోషిస్తూ మాట్లాడుకుంటూంటే ఈయన వింటాడు. అలాగే అశోకవనమంతా పాడు చేస్తాడు. కాని సీతాదేవి ఉన్న చోటు మాత్రమూ చక్కగా రక్షింపబడి ఉన్నది. అంటే జీవు డున్నాడు, సత్త్వగుణమున్నది. మిగతా లంకలో ఉండే సమస్తమూ ధ్వంసం చేస్తాడు. ఆ విధంగా సద్గురువు మనయందు కృప కలిగి ఉన్నట్లైతే అలా ప్రవర్తిస్తాడు. అది జీవునికి దైవాన్ని చేరుకోడానికి మార్గము ఏర్పాటు చేసినట్లుగా ఉంటుంది.

ఆ విధంగా దైవమే తపన చెందుతున్న జీవుని వద్దకు సద్గురువును పంపిస్తాడు. అందుకనే గురువుని వెతుక్కోనక్కర్లేదు. మనం ధర్మము నందు, దైవము నందు బాగా లోతుల్లో ఉంటు న్నట్లయితే సద్గురువు తానుగా వచ్చి ప్రవేశిస్తాడు అని మన సంప్రదాయం చెప్పింది. సీతాదేవి హనుమంతుని కోసం ప్రార్థన చేయలేదు కదా! నీ సద్గురువు నీకు దగ్గర కావాలంటే నీవు దైవాన్ని ఆశ్రయించాలి. దైవాన్ని ఆశ్రయించడమంటే ప్రవర్తనలో ధర్మాన్ని ఆశ్రయించడమే! ధర్మాన్ని ఆశ్రయించకుండ దైవాన్ని ఆశ్రయించడ మంటే హాస్యాస్పదమే. నీ తోటివారిని నువ్వు చక్కగా చూడకుండా నీవు దైవాన్ని ఆరాధన చేస్తే దైవం నీకు ప్రసన్నుడు అవుతాడా! ధర్మాచరణతో కూడిన దైవారాధన ఎక్కడ జరుగుతుందో ఆ దైవారాధనలో, ఆ ధర్మాచరణలో అతను బాగా అప్రమత్తుడై, అనన్య చింతన కలిగి, నిత్య అభివ్యక్తుడై వాసుదేవోపాసన చేస్తూ, తపన చెందుతూ, తను తప్ప దిక్కులేదు అనే స్థితిలో నిలబడ్డ జీవుని వద్దకి, దైవమే తన స్వరూపంగా ఉన్న గురువుని

పంపిస్తాడు. హనుమంతుడు ఎవరు పంపిస్తే వచ్చాడండీ! రాముడు పంపిస్తే వచ్చాడు కదా! కనుక గురువుకోసం తపన చెందవద్దు. దైవంకోసం తపన చెందండి. ధర్మంకోసం తపన చెందండి. మీరు ధర్మాన్ని, దైవాన్నీ ఎంత ఆశ్రయిస్తే గురువు మీకు అంత చేరువ అవుతాడు. అదొక రహస్యం. హనుమంతుడు ఏ కారణంచేత వచ్చాడు? రాముడు పంపిస్తే వచ్చాడు. రాముడు ఎందుకు పంపించాడు? సీతాదేవి తనయందు తపన చెందుతున్నది కనుక.

రకరకాలుగా మనం మనంగా సాధన చేయాలనిపిస్తుంది కదా! అది జరుగుతుందీ జరగదూ అనేది మనలో ఉన్న సంకల్ప బలం, మనలో ఏర్పరుచుకున్న పవిత్రత, మనలోని దీక్షకి సంబంధించిన సంగతి. అది వేరే విషయం. అందుకని ముందు ధర్మము ఏమిటో తెలిసికొని ఆచరించడం మొదలు పెట్టండి. అదీ ముందు చేయవలసిన సాధన. ధర్మము అంటే ఏమిటో మహాభారతంలో చెప్పబడింది. అందులో చెప్పబడని ధర్మం లేదు. మహాభారతంలో 18 పర్వాల (భగవద్గీతతో కలిపి)లో అంత విపులంగా ధర్మాలు చెప్తే, అంతా అయ్యాక మీరు ఇంత చెప్తే మేమేం తెలుసుకోగలమండీ, చాలా కష్టం కదా, చిన్నధర్మం చెప్తే బావుంటుంది మీరు, అని అడిగితే వ్యాసుడు చెప్తాడు, ఏ చిన్నధర్మం నువ్వు ఒక్కటి పాటిస్తే, నీకు క్రమశః మిగిలిన ధర్మాలన్నీ అర్థమౌతాయో అది నీకు చెప్తానని చెప్పి, అది చెప్తాడు. ఏమిటయ్యా అది అంటే "ఏది నీకు ఇతరులు చేస్తే నీవు దుఃఖిస్తావో అది నీవు ఇతరులకు చేయక." అంతే ధర్మం. అక్కడ మొదలు పెట్టు. అక్కడ మొదలు పెడితే ఒక్కో ధర్మం నీ యందే ఆవిష్కరింపబడి నీకు తెలుస్తుంది.

నీకు తెలియ పరచడానికి మనుషులు వచ్చి చెప్తారు లేదా నీవు ప్రస్తుతం చేయవలసిన ధర్మము ఒక పుస్తకం రూపంలో నీకు తెలియ బడుతూంటుంది. కనుక ఈ విధంగా ధర్మాన్ని ఆచరిస్తుంటే అప్పుడు దైవము యొక్క స్వరూప స్వభావాలు కొంతవరకు అర్థ మౌతూంటాయి. అప్పుడు దైవము యొక్క ఆరాధన ఇంకొంచెం పెంచుకోవచ్చు. దైవము యొక్క ఆరాధన ఎందుకంటే ధర్మంలో బుద్ధి ఉండేట్లుగా అనుగ్రహించేట్లు చూడమని కోరడానికే. అంతే కాని అవి తెచ్చిపెట్టు ఇవి తెచ్చిపెట్టు, ఇవి ఇప్పించు అవి ఇప్పించు అని కోరడానికి కాదు.

"*ధియః యోన ప్రచోదయాత్*" అని కదా! గాయత్రి మంత్రములో మనము కోరేది, మన బుద్ధిని ప్రచోదనము చేయ మని కదా! భారతీయునికి గాయత్రీ మంత్రము ఒక దీక్ష. అది లింగ భేదము లేకుండా చేసుకొనవచ్చును. ఎందుకనీ, అందరికీ బుద్ధి కావాలి. ఆడవాళ్ళకి బుద్ధి అక్కర్లేదా? ఉత్త మనసుంటే ఏం లాభం? బుద్ధి కావాలి. ఉత్త మనసు గాడిద లాంటిది. ప్రతి నిత్యమూ దైవాన్ని ఆరాధన చేయడంలో ముఖ్యమైన ఆశయం బుద్ధి ప్రచోదనము చేయమని. బుద్ధి పెరిగితే ఏం జరుగుతుంది? ధర్మం తెలుస్తుంది. ధర్మం తెలిస్తే దాన్ని అనుసరిస్తూ ఉండవచ్చు లేదా ధర్మాన్ని అనుసరించే వారి వద్దకు వెళ్ళవచ్చు. అందుకే మామూలుగా శరీరానికి సంబంధించిన మనస్సు, స్వభావము ఏం చేస్తుందంటే ధర్మాన్ని చెప్పేవాళ్ళ వద్దకి, నడిచేవారి వద్దకి వెళ్ళకుండా రకరకాల ఉపాయాలు చెప్తుంది. చాలా అలసటగా ఉంది, ఇవాళ వెళ్ళకపోతే ఏం అని అనిపిస్తుంది. అలా అనిపించిన

వాళ్ళు రాలేరు. ఎందుకనీ మనస్సుకు లోబడి ఉన్నారు. బుద్ధికి లోబడి ఉండేవాడు అలా అనుకోడు. వారానికి ఒక్కసారి వెడితే చాలదా, రోజూ వెళ్ళడం ఎందుకు అని చెప్తుంది. ఎంత వీలైతే అంత మనల్ని మనం స్పేర్ చేసుకోకుండా ధర్మానికి, దైవానికి అందుబాటులో వెళ్ళడానికి ఒక ప్రయత్నం జరగాలి. అలా జరిగితే బుద్ధి స్థిరపడుతుంది. బుద్ధి స్థిరపడితే ధర్మాన్ని అనుసరించే భావం స్థిరపడుతుంది.

ధర్మాన్ని ఆచరింప చేయగలిగే గుణము రామతత్త్వంలో మనకి బాగా ఎక్కువగా కనబడుతుంది. *'రామో విగ్రహవాన్ ధర్మః'* అని కదా! అంటే మూర్తీభవించిన ధర్మమే రామునియొక్క రూపము. రాముని గుణవిశేషాలు మనం బాగా కీర్తిస్తుంటే మనలో ధర్మం చక్కగా పాటించే ఒక బుద్ధి ఏర్పడుతుంది. అతణ్ణి మీరు నిలువునా కోసినా అవినీతి ఉండదు. అసత్యము ఉండదు. మనసుతో మెలికలు వేయడం ఉండదు. మోసం ఉండదు. తాను కష్టమైనా పడతాడు కాని ధర్మాన్ని త్యాగం చేయడు. దేన్నయినా త్యాగం చేస్తాడు కాని ధర్మాన్ని త్యాగం చేయడు. అదీ రామభక్తుడు. అటువంటి రాముడికి దగ్గరగా చేరాలంటే హనుమంతుడిని ప్రార్థన చేయాలి. ఎందుకని? హనుమంతుడిని ప్రార్థన చేస్తే అమ్మవారు ప్రసన్న మవుతుంది. అమ్మవారు మాయా స్వరూపము. హనుమంతుని ప్రార్థన చేస్తే లక్ష్మణుడు ప్రసన్న మవుతాడు. లక్ష్మణుడు కాల స్వరూపుడు. హనుమంతుడిని ప్రార్థన చేస్తే రాముడు ప్రసన్న మవుతాడు. రాముడు పరతత్త్వము. కనుక పరతత్త్వము, ప్రకృతి మాయ, కాలము నీకు ఎవరి ద్వారా

దొరుకుతుంది? సద్గురువు ద్వారా దొరుకుతుంది. కనుక సద్గురువు అందించే బోధనలను ఆచరణలోనికి తెచ్చుకోవాలి. అందుకనే రాముని మించిన ధర్మము, హనుమంతుని మించిన ధర్మమూ ఏం లేదు. కృష్ణుని ధర్మము మహా ధర్మం. ముందుగా కృష్ణుని ధర్మము అని చెప్పి ఎవరైనా కొంచెం ఉత్సాహపడితే దెబ్బ తింటారు. కృష్ణుని ధర్మము అంత సులభంగా అవగాహన కాదు. వాలి సంహరణం, సీతని మళ్ళీ పరిత్యాగం చేయడమనే విషయా లలో ఉండే మహాధర్మం ఎవరికైతే క్షుణ్ణంగా అర్థమౌతుందో, వారికి శ్రీకృష్ణుడు ఆచరించిన ధర్మాలు అర్థమౌతాయి. లేకుండా శ్రీకృష్ణుడు మనికి అవగాహన అయ్యాడనుకుంటే అది ఒక వెఱ్ఱి. అందుకని శ్రీకృష్ణుని ఆరాధన చేసుకోవాలి, రాముని అనుసరించాలి. రాముని అనుసరించడానికి మనకి హనుమంతుడు ముఖ్యమైన తత్త్వం. అందుకని అతడు గురువు. గురు స్వరూపము.

కపిలుడు కూడా హనుమంతుడే అని చెప్తారు. దత్తాత్రేయుడు కూడా హనుమంతుడే. ఆ విధంగా ఉన్న సద్గురువు ఏ విధంగా జీవుడిని ఉద్ధరించాడు, లంకని ఏ విధంగా దహించాడు, సత్త్వ గుణాన్ని ఏ విధంగా స్ప్రెర్ చేశాడు, ఏ విధంగా ఎవరితో ప్రవర్తించాడు, రావణుడికి ఏ విధంగా హెచ్చరిక ఇచ్చాడు- ఇటువంటి విషయాలన్నీ సుందరకాండలో ఉన్నాయి కాబట్టి, జీవులకి జన్మ జన్మల నుండి పరిష్కారం దొరికే కాండము కాబట్టి, సుందరకాండము సుందరమే!

సుందరకాండము ఎన్నవ కాండము? బాలకాండ, అయోధ్య కాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ. ఇది

ఐదవది. ఆకాశ మార్గములోనికి వెళ్ళే తత్త్వము, ప్రజ్ఞకి సంబంధించినది ఐదవ కాండములోనే ఉంటుంది. ఎందుకనీ? ఐదవ కేంద్రము ఏదీ? మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరకము, అనాహతము, విశుద్ధి. అనాహతము అంటే మన హృదయకేంద్రము. హృదయ కేంద్రము లోనికి వచ్చేప్పటికే హనుమంతుడు తారసిల్లుతాడు. కిష్కింధకాండలోనే సద్గురువు తారసిల్లుతాడు. అంటే అనాహత చక్రంలో పరిచయమైన హనుమంతుడు విశుద్ధిచక్రానికి చేరేసరికి కార్యోన్ముఖు డౌతాడు. అందుకనే సాధకులందరూ విశుద్ధి చాలా జాగ్రత్తగా ఉంచు కోవాలని చెప్తారు.

విశుద్ధి జాగ్రత్తగా ఉంచుకోవడమంటే స్తోత్రములు, స్తవములు చేసే కంఠముతో ఇతరములైన అపవిత్రము, అసత్యము, అప్రియ ములు, అధర్మముతో కూడుకున్న మాటలు ఆ కంఠం నుండి రాకూడదు. అదొక దీక్ష. అలా ఉంటేనే విశుద్ధి చక్కగా విప్పారి, గురు అనుగ్రహానికి అవకాశం ఏర్పరుచుకుంటుంది. “May the sound I utter reveal the light in me” కదా! మనం మాట్లాడే మాటల నుండి మనలో ఏమాత్రం వెలుగుందో తెలుస్తుంది. (మాట్లాడితే ఇతరులకు ఆనందం కలిగించే విధంగా, వాళ్ళ చైతన్యం వికసించే విధంగా మాట్లాడే పద్ధతి ఎవరికి ఉంటుంది? అందుకనే విశుద్ధి. కాబట్టి విశుద్ధి చక్రం నుండి మొదలు పెడతాడు.) అంతకుముందు అనాహత చక్రం కిష్కింధ, అంతకు ముందు అరణ్యము. అదే మణిపూరకము. అంతా రాక్షసులు, దండక వనం. అంతకుముందు అయోధ్య. మహా కల్లోలంగా ఈ

కైకేయి అడగడంచేత అంతా తారుమారైపోయి, అల్లకల్లోలమైనట్టి అయోధ్యకాండ. అంతకుముందు బాలకాండ. జీవుడు మూలాధారం లోని తత్త్వము. మన గ్రంథములన్నీ కూడా మన దేహంలోని కేంద్రములకు సంబంధించే ఇవ్వబడి ఉన్నాయి. కాబట్టి ఆకాశ మార్గాన బయలుదేరిన హనుమంతుని గూర్చి మొదలు పెడుతుంది సుందరకాండ.

# 1

**జాం**బవంతుడు ప్రోత్సాహం చేయడంవల్ల హనుమంతుడు తనశక్తి తాను తెలుసుకున్నాడు. ఎప్పుడూ సద్గురువు తనకెంత శక్తి ఉన్నదో గుర్తుపెట్టుకోడు. ఎందుకంటే శక్తి గుర్తు పెట్టుకున్నవాడు శక్తిమంతుడే తప్ప ఆత్మవంతుడు కాదు. ఎప్పుడూ దైవంలో ఉండే వాడికి దైవము యొక్క వైభవం అతడిలో భాసిస్తుందే తప్ప, తనకింత బలం ఉన్నదనిగాని, తనకిన్ని శక్తు లున్నాయని గాని గుర్తుపెట్టుకుంటాడా! పెట్టుకోడు. అదీ హనుమంతుని ప్రత్యేకత. దైవమునకు తనకు ఏ మాత్రం తేడాలేదు, అలాంటి భక్తాగ్ర గణ్యుడు. జ్ఞానులలో కూడా అగ్రగణ్యుడు. *'జ్ఞానినాం అగ్రగణ్య'* అనికదా! నారదుడంతటి వాడు నమస్కరించి వెళ్లిన సందర్భా లున్నాయి. అర్జునుడు నమస్కరించవలసిన పరిస్థితి వస్తుంది. హనుమంతుని భక్తి ముందు రాముడే దిక్కు తెలియని పరిస్థితికి వచ్చేస్తాడు.

హనుమంతుని భక్తి ఎలాంటిదంటే రాముడేం చేయలేక పోతాడు. రాముని కన్నా రామ నామముయొక్క బలాన్ని తన యందు సంపూర్ణంగా నింపుకున్నవాడు హనుమంతుడు. ఎందుకనీ? తనయందున్నది రాముడే. కాబట్టి రాముడిని రాముడే సంహరించు

కోవాలి, హనుమంతుడు సంహరింపబడాలంటే! అది అయ్యే పనా? హనుమంతుడితో రాముడు యుద్ధానికి తలబడితే ఏం జరిగితే హనుమంతుడు సంహరింపబడతాడు? రాముడు సంహరింపబడితే హనుమంతుడు కూడా సంహరింపబడతాడు. కాబట్టి హనుమంతుడు సంహరింపబడడు. అలా హనుమంతుడికి తన గురించి తనకు గుర్తే ఉండదు. ఆయన దైవమునందే జీవిస్తుంటాడు. ఆయన పాటలు పాడుతుంటే మొత్తం 14 లోకాలు కూడా తన్మయత్వం చెందుతుంటే, నారదు డంతటివాడు ఎక్కడికి వెళ్ళినా అందరూ హనుమంతుడి గానం గురించి చెప్తూంటే "ఇదేమిటి ఈయనొకడు తయారైనాడు అసలు మనమే కదా గానానికి" అనుకుంటాడు. Musical heirarchy కి head నారదుడే. మొత్తం గురుపరంపరకి నారదుడే. చిట్టచివర పరతత్త్వంలోకి వెళ్ళే ముందు కలిసే వాడూ నారదుడే. ఏం సందేహం లేదు. అలాంటి నారదుడు ఎక్కడికి వెళ్ళినా హనుమంతుని కీర్తి వింటూంటే, ఏమిటి ఈ హనుమంతుడని తెలుసుకోడానికి వెళ్ళి ఏమిటయ్యా నువ్వు చాలా బాగా పాడతావా అంటే 'అవునా, నాకు తెలియదు' అంటాడు. నారదునికి తను బాగా పాడతానని తెలుసు. కాని హనుమంతునికి తెలియదు. మరందరూ అంటున్నారంటే 'ఏమో నాకు తెలియదు' అంటాడు. ఏదీ ఒకసారి పాడి వినిపించమంటాడు. పాడితే నారదుడే కరిగిపోతాడు. హనుమంతునికి తను పాడుతున్నానని కూడా తెలియదు. తనెంతటివాడో అతనికే తెలియకపోవడం పరమేష్ఠిగురువు లక్షణంగా చెప్పుకుంటాం. అంతేకానీ "ఆయన బలం ఆయనకే తెలియదుట" అని ఎవరూ

అనుకోరాదు. తన గురించి తను ఆలోచించని వాడే అసలు భక్తుడు. అంబరీషుడు అదే, ప్రహ్లాదుడు అదే!

ప్రహ్లాదునికి తనను ఏం చేసినా చావను అని తెలియదు కదా! పాముచేత కరిపించి చూసుకో అన్నాడా? కొండమీద నుండి విసిరి చూసుకో అన్నాడా? ఏం అనలేదు. ఏమిటిరా అంటే 'నారాయణా!' అంటాడు. ఏదైనా నారాయణే! ఏదైనా నారాయణే కాబట్టే నారాయణుడికి పట్టింది ఈయన సంగతి. వీడే నారాయణుడు. ఇంత బుడతడికీ వాడి గురించి వాడికి తెలియదు కదా! ఎందుకు తెలియడం? వీడు నారాయణునిలోనే కలిసి పోయాడు కదా, వాడే వీడు. అంబరీషుడంతే, శుకుడు అంతే, హనుమంతు డంతే! వాళ్ళెవరూ కూడా మనం ఇంతటి వాళ్ళం అనే భావన ఉన్నట్టివారు కాదు. బొత్తిగ అహంకారం లేకుండా జీవిస్తున్నవారు. త్రిగుణములు ఎప్పుడూ వాళ్ళకి లోబడి ఉండాలి తప్ప వారిని అధిష్ఠించి ఉన్నవారు కాదు. మాయ ముట్టుకోడానికి వీల్లేదు, ప్రకృతి బంధించడానికి వీల్లేదు. కాలం తిప్పలు పెట్టడానికి వీల్లేదు. బ్రహ్మాస్త్రమే హనుమంతుడిని బంధించలేదు. ఎవరూ చంప లేరుట అంటే దైవాన్ని ఎలా చంపుతారండీ! కనుక దైవమే ఆ సద్గురువు రూపంలో ఉన్నట్లు లెక్క. అటువంటివాడు వాళ్ళు వీళ్ళు చెప్తే, నాకు శక్తి ఉంది కాబోలు అనుకున్నాడు. ఎందుకంటే దైవం శక్తులే కదా! అంతట ఆ శత్రుకర్శనుడు అయిన రావణాసురుడు ఎత్తుకుపోయిన సీతాదేవి ఎక్కడ ఉన్నదీ వెతకడానికి దేవగాయకు లైన చారణులు సంచారం చేసే ఆకాశమార్గాన పోవాలని అనుకున్నాడు. ఆకాశగమనం చేద్దా మనుకున్నాడు. ఎందుకంటే

అంతకుముందు భూమి మీద చాలా విపరీతంగా తిరిగారు. ఇహ లాభం లేదని అగ్ని ప్రవేశం చేసేద్దామని కదా అంగదుని ప్రతిపాదన. అప్పుడు కదా ఆ సంపాతి ద్వారా పరిష్కారాలు దొరుకుతాయి.

అయితే సద్గురువు ఎప్పుడూ ఆకాశమార్గాన్నే వెళుతుంటాడు. అందుకనే Masters presence is not physical అని చెప్పారు. భౌతికంగా ఉంటేనే ఉన్నారని అనుకోకండి, ఈథరిక్‌గా వాళ్ళు ఎప్పుడూ ఉంటారు. వాళ్ళు ఎప్పుడూ ప్రయాణం చేస్తూ ఉంటారు. కాబట్టి ఆకాశ మార్గాన్నే పోవాలనుకుంటాడు, ఇంకో రకంగా అనుకోడు. ఆ దుర్ఘటకార్యాన్ని సాటి లేకుండాను, తోడు లేకుండాను ఆచరించాలని అనుకున్నాడు. ఇంక తోడు ఎందుకూ? అన్నిటికీ ఎవడు తోడో వాడే వీడు. వాడు ఎప్పుడూ వీడితోనే ఉంటాడు. వాడికి తోడు అక్కరలేదు. తోడువస్తావా అని అడిగే వాడు దైవము ఒకడు ఉన్నాడని గుర్తులేని వాడు. తనకిగా తను పోతూ ఉంటాడు. వాడికి అసలు వాడే తోడు, మిగిలిన వాడేం తోడు? ఎవడైనా తోడు వస్తానన్నా వాడు బరువు అవుతాడు. దారిలో ఆకలేస్తోంది, కాసేపు ఇక్కడ ఆగుదాం అంటాడు. నిద్రవస్తోంది ఆగుదాం అంటాడు. ఎవరికి నిద్ర అక్కరలేదో, ఎవరికి విశ్రాంతి అవసరం లేదో, ఎవరు దేనికీ చలించక కార్యోన్ముఖులై ఉంటారో, అలాంటి దైవం తోడు కాబట్టి వీళ్ళందరిని ఇక్కడ వదిలేశాడని అర్థం. వాళ్ళెవరూ అసలు అలా రాలేరు. రాలేనివాళ్ళని తోడు అడిగి ఏం లాభం?

ఆ మహేంద్ర పర్వతం మీద నిలుచుని మెడ నిక్కబెట్టి, తల ఎత్తి ఆబోతువలె సముద్రాన్ని చూడసాగినాడు. ఆబోతు అని ఎందు

కన్నాడు? వృషభం. అది ఎక్కడ ఉన్నది? విశుద్ధి. అందుకే అక్కడ ఇంకొకటి చెప్పరు. అంటే పులిలా చూస్తున్నాడని, సింహంలా చూస్తున్నాడని చెప్పరు. ఎందుకంటే రాసే వాల్మీకి కూడా సాక్షాత్తు రాముడే. నారాయణుడే అయిపోయిన వాడు కదా! మరి ఆయన రాస్తున్నాడంటే సరిగ్గా చూస్తాడు, సరిగ్గా రాస్తాడు. అదే మనంరాస్తే మనకున్న పిల్లిబుర్రలోంచి మనకు తోచింది రామాయణంగా వచ్చేస్తుంది. అది పిల్లి రామాయణంలాగ ఉంటుంది. అందుకే రాముడు లాంటి వాళ్ళు వచ్చినప్పుడు వారితో సరి స్థాయిలో ఉన్నవారిని తెచ్చుకుంటారు. కృష్ణుడు వేదవ్యాసుడిని తెచ్చుకున్నాడు, చక్కగా రాసిపెట్టాడు. రాముడి వేళకు నారదుడు ముందే ఒకడిని తయారుచేస్తాడు. అతడే రత్నాకరుడు. ఆ తర్వాత వాల్మీకి అయిపోయాడు. అటువంటి వారు రాసేది యుగాల తరబడి నిలబడుతుంది తప్ప మనం రాసే పుస్తకాలు మనం వెళ్ళక ముందే వెళ్ళిపోతాయి. సత్యం దర్శనం చేసిన వాళ్ళు రాస్తే ఉంటాయి తప్ప, ఏదో డబ్బు లున్నాయి, మనకి భాష వచ్చు, మనం చెప్తే వినేవాళ్ళున్నారు కాబట్టి అంటూ, పుస్తకాలు వచ్చేస్తే ఉండవు. రాసేవాడు చిరంజీవి అయితే వాడి పుస్తకాలు కూడా చిరంజీవులే.

వాల్మీకి ఇందులో ఆబోతు అని, మహేంద్రగిరి అని, హను మంతుడికి తన శక్తి తనకి తెలియదని ఎంతో రహస్యార్థములతో వ్రాశాడు. భాష వచ్చును కదా అని చదువుకోవడం కాదు భక్తి ఉండాలి. బుద్ధి ప్రచోదనం ఉండాలి. అది వాళ్ళే యిస్తారు భక్తిగా చదువుకుంటుంటే. ఆ ధైర్యవంతుడు హనుమంతుడు వైడూర్య మణుల వలెను, సముద్ర జలాలవలెను ఉన్న పచ్చిక బయళ్ళలో

అటు ఇటు పచార్లు చేశాడు. పచ్చటి కాంతి విశుద్ధి చక్రంలో ఉంటుంది. aqua-marine అంటూంటాం కదా ఆ రంగు. అది నీలమో తెలియదు, ఆకుపచ్చో తెలియదు, అటువంటి రంగు. దాన్నే మాస్టరుగారు నెమలి కంఠం అన్నారు. 'Taurus' అనే chapter లో "Spiritual Astrology" లో కనిపిస్తుంది. The neck of the peacock. అది ఆకుపచ్చా, నీలమా, బంగారుకాంతా, ఎరుపా... అన్ని రంగులూ. కాసేపు ఒకటి, కాసేపు ఒకటి తళతళ మెరుస్తూ, తల తిప్పడాన్ని బట్టి ఒక్కొక్క రంగు కనిపిస్తుంది.

మహేంద్ర పర్వతం ఎలా ఉందీ, పచ్చిక బయళ్ళతో ఉన్నది. అవి సముద్రజలాల వలె ఉన్నాయిట. అక్కడే మనకి వైడూర్య కాంతు లున్నాయిట. పక్షులు పచార్లు చేసినవట. అంటే ఉత్తమ మైన విశుద్ధిలో పచార్లు చేస్తుంటే పక్షులను బెదిరించినాడు. అక్కడ పక్షులన్నాడంటే అవి ఆకాశ గమనం చేసేవి. పెద్ద చెట్లను ఎదురు రొమ్ములతో పడదోసినాడు. చెలరేగిన సింహము వలె అనేక మృగములను హతమార్చాడు. మృగా లున్నాయి. విశుద్ధిలో అవి కూడా ఉంటాయి. విశుద్ధిలో విషముంది. విశుద్ధిలో అమృత మున్నది. మరణ మాసన్నమైనపుడు గొంతులో అదో ఇదో పుడు తుంది. చిరంజీవికి అమృతం పుడుతుంది. మిగతా వాళ్ళకి నురుగు వస్తుంది. రోజూ మాట్లాడే మాటలని బట్టి మన కంఠంలో ఏం ఉందో చెప్పవచ్చు. ప్రియంగా ఉన్నాయా, అప్రియంగా ఉన్నాయా, పాములవలే ద్వేషాన్ని కక్కుతున్నాయా! అందుకని అక్కడ జంతువులు ఉంటాయి అంటే పశుప్రవృత్తి ఉంటుంది. వాటి నన్నిటినీ ఒకసారి హూంకరించాడుట. సింహంవలె గర్జిస్తే పోయినాయిట.

సింహంవలె గర్జించడం అంటే వేదాధ్యయనము బాగా చేసిన గొంతుకే ఉంటుంది. మిగతా గొంతులకు ఉండదు. అందుకే సూక్తాలు, స్తోత్రాలు చదివినప్పుడు గట్టిగా చదవమని చెప్పేది. ఖంగుమని మోగని గొంతు గొంతే కాదు. పూడుకుపోయిన బావివలె గొంతు ఉంటే ఆ శరీరము నిండా సమస్త కల్మషములు ఉన్నాయని అర్థము. అవన్నీ ఎట్లా బయటికి తీస్తాం? గట్టిగ స్తోత్రం చేయాలి. అలా స్తోత్రం చేస్తుంటే సు-ఉక్తములు, మంచి మంచివి ఏరి, తపస్సు చేసి, సాధించి యిచ్చినవి రోజుకి ఒక గంట చేసుకోండిరా అని చెప్పారు. అందుకనే ఏ ముని ఆశ్రమములో అడుగు పెట్టినా ఉదయం 3 గంటలు పాటు వేదాధ్యయనం ఉంటుంది. ఈ రోజు చదివావా? అని అడుగుతారు. చదివాను గురువుగారు అంటే వినబడలేదేం అని అడుగుతాడు. గొంతు స్టీరియో లా ఉండాలి. రోజూ గంట రెండు గంటలు సాధన చేయాలి. *'శీక్షాం వ్యాఖ్యా స్యామః, వర్ణ స్స్వరః, మాత్రా బలం, సామ సంతానః'* ఇలా చదివిన వాడికి గొంతు సింహ గర్జనవలె ఉంటుంది. ఎందుకని? ఇది జరగాలంటే బాగా సోహం జరగాలి. 16 అక్షరాల, 12 అక్షరాల, 11 అక్షరాల, 8 అక్షరాల స్తోత్రా లున్నాయి. ఇవన్నీ చందస్సులు. మీరు విష్ణు సహస్రనామం చదువుతుంటే ఒకేస్థాయిలో ఈ శ్వాస ఆడుతుంది. ఎందుకంటే ఒక్కోసారి 16 అక్షరాలు వెడతాయి. ఊపిరి లేకపోతే 8 అక్షరాలు ఒక్కసారి పలుకుతాయి. అంటే 8 అక్షరాలు పలికి, గాలి పీల్చుకొని, మళ్ళీ 8 అక్షరాలు పలుకుతారు. 16 అక్షరాలు పలికితే 16 అక్షరాలు పలకాలి. అంటే అరగంటసేపు ఒక క్రమబద్ధంగా

శ్వాస పీల్చడం జరుగుతుంది. ఆ చందోబద్ధమైన శ్వాస కారణం చేత లోపల అగ్ని పుడుతుంది. అందులో పుట్టిన అగ్నిలో నుండి లోపల కల్మషాలు దగ్ధమౌతాయి. అప్పుడు శ్వాస బాగా సోహం అని జరిగి వీడు సింహం అవుతాడు. అప్పుడు వాడు గర్జిస్తే క్రూర మృగాలు వెళ్ళిపోతాయి. సద్గురువు ఒక్కొక్కసారి తన మాటలచేత ఎదుటి వ్యక్తిలోని కల్మషాలను కాల్చి వేస్తాడు. ఒక్కొక్కసారి చీరేసినట్లు మాట్లాడుతాడు. అట్లా చీరడంలో ఉద్దేశ్యమేమంటే. వాడిలోనివి వాడే సంహరించుకోలేడు కనుక, వాడిలో ఉన్న వాటిని తానే సంహరించేస్తాడు.

హనుమంతుడు గర్జించాడు. చెలరేగి సింహంవలె అనేక మృగాలను హతమార్చాడు. ఆ మహేంద్ర పర్వతంలో ధాతువులు స్వత సిద్ధంగా ఉన్నాయి. విశుద్ధిలో ఉన్నవాడికి ధాతువు లుంటాయి. విశుద్ధిలో ఉన్నవాడికి జబ్బు లుండవు. జబ్బు లున్నాయిట అంటే విశుద్ధి ఇంకా బాగు చేసుకోవాలి. ఎలా? మాట ప్రియంగా పలుకు, సత్యంగా పలుకు. సత్యాన్ని ప్రియంగా పలకాలనే దీక్ష పెట్టుకో. రోజూ బాగా స్తోత్రం చేయి. కనీసం రోజుకి ఒక గంట చేయాలి. అసలు 3 గంటలు చేయాలి. కానీ 3 గంటలు అనేసరికి నీరసం వస్తుంది కొంతమందికి, సాధన చేసిన వాడికి ఉత్సాహం వస్తుంది. కాబట్టి వాళ్ళ ధాతువులు స్వత సిద్ధముగా ఉన్నవి. అందువలన నీలము, ఆకుపచ్చ, ఎరుపు, పసుపుపచ్చ, తెలుపు నలుపు కలిసిన బూడిద రంగుతోను అలంకరించినట్లు ఆ పర్వతము శోభాయ మానంగా ఉన్నది.

విశుద్ధిచక్రం గురించి చెప్పమంటే ఇవన్నీ చెప్పేయవచ్చు. అన్ని రంగులూ కనిపిస్తాయి. అది ఏ రంగో తెలియదు. ఎరుపో, పసుపో, నలుపో, బంగారు రంగో తెలియదు. చంద్ర కాంతీ ఉంటుంది, సూర్య కాంతీ ఉంటుంది. నెమలి అలా కంఠం తిప్పుతుంటే అన్ని రంగులూ కనిపిస్తాయి. అట్లా విశుద్ధిలో సమస్త రంగులూ చేరి ఉన్నాయి. కామరూపులైన యక్షులు, కిన్నరులు, గంధర్వులు, దేవతలతో సరిసమానమైన పన్నగులు చక్కగా అలంకరించుకొని అక్కడ కన్నుల పండుగగా విహరిస్తుంటారు. విశుద్ధి చేరినవాడికి కామరూపం వస్తుంది. కామరూపం అంటే? కోరిన రూపం పొందగలిగే శక్తి. అది కదా హనుమంతుడు. రాముడుకి వేదాధ్యయనం చేసే ఒక పండితునివలె కనిపిస్తాడు. మామూలుగా కోతివలే ఉంటాడు. లంకిణికి భయంకర ఆకారంలా కనిపిస్తాడు. అమ్మవారికి మూడు లోకాలూ ఆక్రమించే వానిలా కనిపిస్తాడు. ఏ రూపమైనా తీసుకుంటాడు. సూక్ష్మంగా, కనిపించనంత అయిపోతాడు. *'అణోరణీయాం మహతో మహీయ'* అంటే మహత్తు అంతా కూడా ఉండగలడు, అలా అని అణు రూపంగ కూడా ఉండగలడు.

కామరూపులు ఎక్కడ ఉంటారండీ? మహేంద్రగిరిమీద, అంటే విశుద్ధి. విశుద్ధి చేరిన వాడికి కామరూప గమనం వస్తుంది. అలా వస్తే వాళ్ళు రకరకాల కార్యక్రమాలు ఎక్కువగ, ఉధృతంగా చేయగలుగుతారు. ఎందుకంటే వాళ్ళ శరీరమనే పరికరం కొన్ని కోట్ల రెట్లు ఈ శరీరం కన్నా సమర్థతగా ఉంటుంది. అటువంటి వారంతా ఆ పర్వతంమీద ఉన్నారు. ఉత్తమోత్తమమైన మదపు

టేనుగులకు అది ఉనికిపట్టు. మదపుటేనుగులకు అంటే బాగా జ్ఞానము చేత దిట్టంగా బలిసిన జ్ఞానులు అని అర్థము. ఆ మహేంద్రగిరిమీద ఉన్న హనుమంతుడు ఒక పెద్ద మదపు టేనుగువలె కనిపించాడు. అక్కడ చాలమంది విశుద్ధి చక్రంలో, అద్భుతమైనవారు, ఎంతో సాధన చేసినవారు ఉంటే వారందరి మధ్య హనుమంతుడు వారందరిని మించి కనిపించాడంటే హనుమంతుడు ఎంతటివాడు? ఊహించలేం! హనుమంతుడు అక్కడ నుండి ఎగిరిపోవాలని అనుకున్నాడు.

ప్రజ్ఞ విశుద్ధి చేరితే ఆకాశమార్గాన ప్రయాణం చేసేటువంటి స్థితి సాధకునకు కలుగుతుంది. హనుమంతుడు ఎగిరిపోవాలని అనుకున్నప్పుడు సూర్యుడికి, ఇంద్రుడికి, వాయుదేవుడికి, బ్రహ్మ దేవుడికి, పంచభూతాలకి నమస్కారం చేశాడు. మనం కూడా ఈ దేవతలని రోజూ ఒక్కసారి ఉన్ముఖం చేసుకోవాలి. ఏ విధంగా, ఎక్కడెక్కడ, ఎలా ప్రార్థన చేశాడో గమనిస్తే అవన్నీ మనకి కూడా మార్గదర్శక సూత్రాలుగా మనం భావించాలి. ఇదేదో హను మంతుడికి సంబంధించినదని అనుకోవద్దు.

తూర్పు దిక్కుకి నమస్కరించి ముందు ఇంద్రుణ్ణి ఆవాహన చేసుకోవాలి. ఆ ఇంద్రుడు మన ముఖమునందు ఆవరించి ఉన్నట్లుగా భావన చేసుకోవాలి. అలాగే ఆజ్ఞా చక్రమునందు సూర్యుని ఆవాహన చేసుకోవాలి. అటుపైన ఆకాశమార్గానికి పయనించడానికి అత్యుత్తమ సహకార మిచ్చే వాయుదేవుని ప్రార్థన చేయాలి. మామూలుగా వాయువు యొక్క సాధన మనకు ప్రాణా

యామంగా ఇవ్వబడినది. ప్రాణాయామం చేసుకొనే వారంతా కూడా 'నమస్తే వాయుః, త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి, త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి' అని మనం వాయువుని ప్రసన్నం చేసుకోవాలి. దేవతల సహకారం అందుకొని ప్రాణాయామం చేస్తే ఒకలా ఉంటుంది. వారిని ప్రార్థిస్తే సహకరిస్తారు, ప్రార్థించకపోతే అడ్డుపడుతుంటారు. దేవతలకు ఆ లక్షణమున్నది. దేవతారాధన చేయడంవల్ల సహకారం లభిస్తుంది. చేయకపోవడం వల్ల కొన్ని క్లిష్ట పరిస్థితులు వస్తాయి. అందుకే దేవతలను ఉన్ముఖులను చేసుకోవాలి. అష్ట దిక్పాలకులని, సప్త ఋషులని, నవగ్రహాలని మనయందు భావన చేయాలి. ఇవన్నీ మన పెద్దవాళ్ళు సంధ్యా వందనంలో పెట్టి ఉంచారు. అందుకనే అవన్నీ సక్రమంగా చేయడానికి ప్రయత్నం చేయాలి. న్యాసము చేయాలి. మన ప్రాణశక్తి బాగా ఉండాలంటే సూర్యుణ్ణి ప్రార్థన చేయాలి. చంద్రుని ద్వారా చక్కని మనసు, చైతన్యము మనకు ఏర్పడతాయి కనుక చంద్రుని ప్రార్థన చేయాలి. బలం కలగాలంటే ఇంద్రుని ప్రార్థన చేయాలి. సమస్త సృష్టిని పాలించేవాడు ఇంద్రుడు కనుక ఆయన్ని నిర్లక్ష్యం చేయకూడదు. అదే విధంగా సంకల్పం సక్రమంగా నెరవేరాలంటే చతుర్ముఖ బ్రహ్మని ప్రార్థన చేయాలి. అలాగే వాయువుని ప్రార్థన చేసుకోవాలి. పంచభూతాలూ మనకు సహకరిస్తే మన ప్రయాణాలు చక్కగా జరుగుతాయి. జీవనం చక్కగా జరుగుతుంది. పృథ్వి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం అన్నీ తోడ్పాటు గావిస్తే కార్యక్రమాలు చక్కగా జరుగుతాయి. ఇది కేవలము భారతీయులకే తెలిసిన విద్య. అంటే ఒక్కొక్క దేవతని ఒక్కో పనికి

మనం ఆవాహన చేసుకొని, దాని సహకారం కోరి అటుపైన మన కార్యాలని నిర్వర్తించుకోవడం కేవలం భారతీయులకు మాత్రమే తెలుసు. దీన్ని Applied Science అంటారు. Pure Science ఒకటి ఉండగా, తత్త్వం ఒకటి ఉండగా, ఆ తత్త్వము నిర్వర్తిస్తున్న ప్రజ్ఞలుగా ఉన్నవారందరినీ కూడా సుముఖులను చేసుకోవలసిన పరిస్థితి ఉన్నది.

హనుమంతుడి లాంటి మహాత్ముడే ఈ దేవతల యొక్క సహకారం కోరాడంటే ఇహ మనలాటి వాళ్ళం ఏపాటి? అందుకని ఇవన్నీ అక్కర్లేదు, ఇవన్నీ waste అని కొంచెం ఆధునికంగా మాట్లాడుతుంటాం, కొంచెం english వచ్చేసరికి. మనకి దేవత లంటే అవగాహన లేదు, తెలుసుకుందామనే ఉద్దేశ్యం లేదు, మనకి వారెంత సహాయం చేస్తారో అనే భావనా లేదు. కానీ ప్రతిదీ అక్కర్లేదు అనే భావన మాత్రం మనయందు బాగా స్థితికొని ఉంటుంది. అందుకని వినయం నశించి, అహంకారం పెరిగి చెడిపోతుంటాం. మనం మన పెద్దలిచ్చిన శాస్త్రమును చక్కగా అవగాహన చేసుకొని, అనుసరించడానికి ప్రయత్నం చేయాలి. అలా కాకపోతే అహంకారం చేత భ్రష్టులమై పోతాము. అంతటి సద్గురువే ఈ విధంగా ప్రార్థనచేసి బయల్దేరుతున్నాడు. అంతట రామాభ్యుదయమునకు ఎగిరిపోవడానికి కృతనిశ్చయుడైనాడు. తూర్పు దిక్కుకు తిరిగి వాయుదేవునకు నమస్కారము చేశాడు. తండ్రికి నమస్కారము చేసుకోవాలి. (ఆ మా నాన్న అంత మంచి వాడు కాదు అని అనుకోకూడదు. ఎలాంటివాడైనా నిన్ను పుట్టించింది ఆయనే.) ఎదురుగుండా ఉంటే నమస్కరించుకొని,

ఎదురుగా లేకపోతే మనసులో నమస్కరించుకొని బయలుదేరాలి. గురుశిష్య సంప్రదాయములో ఈ రోజున ఏం చెప్తున్నారంటే పొద్దుట లేవగానే తల్లిదండ్రులకు నమస్కరించుకోవాలని, వీలున్నంత వరకు వారి మనసుకు ఏది అనుకూలంగా ఉంటుందో ఆ విధంగా ప్రవర్తించడానికి ప్రయత్నం చేయి అని చెప్తున్నారు. అది ధర్మపరం కాకపోతే చేయనక్కర్లేదు. ధర్మపరం అయితే మాత్రం చేయాలి. కానీ అంత మాత్రం చేత వారికి మనం దణ్ణం పెట్టడం మానెయ్య కూడదు. హనుమంతుడు వాయుదేవునికన్నా గొప్పవాడు. మా నాన్న కన్నా నేనే గొప్పవాణ్ణి కాబట్టి నేను దణ్ణం పెట్టక్కర్లేదు అనే పద్ధతి హనుమంతుడి వద్దే లేదంటే మన వద్ద అసలుండకూడదు.

పర్వ సమయంలో పొంగిపోయే మహా సముద్రంవలే వానరు లందరూ చూస్తూ ఉండగా హనుమంతుడి దేహం అంతులేకుండా పెరిగింది. ప్రయాణానికి బయలుదేరే ముందు మనసు ఉత్సాహంగా ఉండాలి. ఏడుస్తూ బయలుదేర కూడదు. చుట్టూ ఉండేవాళ్ళు కూడా ఉత్సాహపరచాలి తప్ప ఏడిపించకూడదు. వెళ్ళేప్పుడు భోరు భోరున ఏడుస్తున్నారనుకోండి, వెళ్ళేవాడు కూడా ఏడుపు మొహం పెట్టేస్తాడు. తర్వాత కావాలంటే పక్కకి వెళ్ళి తీరిగ్గా ఏడవచ్చు. మనిషి చచ్చిపోయినా ఏడవకూడదు. ఎందుకంటే వాడు చేసే ప్రయాణానికి మనం అడ్డుపడుతున్నాం. మంచి పనిమీద వెళు తున్నప్పుడు మనిషిని ఉత్సాహంగా పంపించాలి. అందుకని హను మంతుడి మనస్సు ఉప్పొంగే విధంగా వానరులు జై జై ధ్వానాలు చేస్తుంటే హనుమంతుడు తన శరీరాన్ని అంతులేకుండా పెంచు కొన్నాడుట. అది సూక్ష్మశరీరం కలవాళ్ళకి మాత్రమే వీలవుతుంది.

సూక్ష్మశరీరం మాత్రమే అలా పెరుగుతుంది. భౌతిక శరీరం అలా పెరగదు. ఈ భౌతిక శరీరాన్ని అలా ఉంచుకొని, తద్వారా సూక్ష్మ శరీరాన్ని పెంచి అందులో యిది భాగంగా వెళ్ళిపోతాడు. ఆ తర్వాత అక్కడ అవసరమైతే భౌతిక శరీరం లేదా సూక్ష్మశరీరం. కార్యాలను ఆ విధంగా నిర్వర్తిస్తాడు.

కాయాన్ని పెంచిన హనుమంతుడు చేతితోను, కాళ్ళతోను మహేంద్ర పర్వతమును కదిలించినాడు. ఎప్పుడూ కదలని ఆ మహేంద్ర పర్వతము అలా ఒక ముహూర్తం సేపు కదలుతూ ఉండిపోయింది. అంటే హనుమంతుడు విశుద్ధిచక్రం కంటే తానే బలవంతు డవడం వల్ల అతని ధాటికి విశుద్ధి అల్లల్లాడి పోయింది. ఆ కుదుపుకి అక్కడ చెట్లకి పూసిన పూలన్నీ రాలాయి. ఆ పర్వతాన్ని మూసివేసినాయి. అప్పుడా పర్వతం ఘుమఘుమ గుబాళిస్తూ ఒక పూల కొండవలె తోచింది. ఆ మహా పరాక్రమవంతుడైన హను మంతుడు కుదిలించిన కుదుపు మదపుటేనుగు కార్చే మద ధారల వలె ఆ మహేంద్రపర్వతం నుండి జలధారలు కారినాయి. ఆ కుదుపుకు రాళ్ళన్నీ విచ్చిపోయి బంగారు, వెండి, ఇనుము చారికలు ఆ మహేంద్ర పర్వతం మీద కనిపించాయి.

విశుద్ధి 16 దళాలచక్రం, అది బాగా విచ్చుకున్న వాళ్ళకి ఈ విధమైన కాంతులు మనకి కనిపిస్తాయి. అంతేకాదు మొత్తం శరీరమంతా బాగా వేడెక్కిపోయి, ఆ వేడిలో పుట్టిన మార్పు వలన శరీరంలో ఉండే ధాతువులు పూలు పూసినట్లుగా విచ్చుకుంటాయి. చెట్టు కొమ్మ ఎలా ఉంటుంది? పువ్వు యొక్క కోమలత్వం ఎలా ఉంటుంది? మనం సరిపోల్చి చూసినట్లయితే పువ్వుకుండే సున్ని

తత్త్వము చెట్టుకు గాని, చెట్టు కొమ్మకు గాని, చెట్టు ఆకుకు గాని ఉండదు. చక్రముగా ఉన్న కేంద్రాన్ని పద్మంగా మార్చు కున్నట్లయితే ఒక్కో పద్మంలో కొన్ని కొన్ని దర్శనాలు జరుగు తుంటాయి. అది తెలిసిన వాల్మీకి మనకి అక్కడక్కడ అలా అందిస్తుంటాడు.

బాగా సాధన జరిగి సాధకుడు విశుద్ధి కేంద్రాన్ని చేరి నట్లయితే ఒళ్ళంతా బాగా చమటలు పడుతుంది. మామూలుగా మనం ధ్యానంలో కూర్చుంటే ఒళ్లు బాగా వేడెక్కాలి. ఆ వేడికి ఒంటి నుండి చమటలు కారాలి. మదం అంతా కారిపోవాలి. అంత వేడి లోపల పుట్టాలి. అలా ప్రాణాయామం జరగాలి. ఆ విధంగా ధ్యానం జరగాలి. ఆ వేడి కారణం చేత ధాతువులలో మార్పు రావాలి. ప్రతి సంవత్సరం సత్యసాయి బాబాగారు బంగారు శివలింగం అని, స్ఫటిక శివలింగమని తీస్తారన్నది అందరికీ తెలిసిందే. మనల్ని అనుగ్రహించడంకోసం ఆయన, లోపల తపస్సు ద్వారా ఓ సంవత్సరం పాటు అవన్నీ తయారుచేసి, ఉత్పత్తి చేసి బయటకు తీస్తారు. తీయడమంటే మాటలా? అదెంత తపస్సు జరుగుతుంటే లోపల నుండి వస్తాయో తెలుసా! ఎందుకంటే మానవుని శరీరంలో లేని ధాతువు లేదు, లేని గని లేదు, లేని శక్తి లేదు, లేని మణులు లేవు. సృష్టిలో అంతా ఏది ఉందో అదంతా మానవుని శరీరంలో ఉన్నది. దాన్నంతా ఒకసారి మనందరకు తీసి ఇవ్వడంలో ఆయన యొక్క తపశ్శక్తి, సంకల్పబలము ఇవన్నీ మనకి బాగా గోచరిస్తాయి. ఆయనే దీని వివరణ ఇచ్చారు. తన

లోని ధాతువులన్నీ కలిపి బంగారు కావాలంటే బంగారు, వెండి కావాలంటే వెండి, స్ఫటిక కావాలంటే స్ఫటిక- సంకల్పంచేత ఆయన శరీరంలోంచే అలా తీసి యిస్తున్నారు.

మామిడి పండు ఎలా వస్తుంది? ఆ మామిడి చెట్టుయొక్క సారమే ఆ పండుగాను, పుష్పముగాను మనకు తీసి ఇస్తుంది. పువ్వయితే దేవుడికి పెట్టడమో, తల్లో పెట్టుకోడమో చేస్తాం. పండయితే తింటాం. కాని ఆ చెట్టు ఎంత ప్రసవవేదన భరించి ఆ పండునో, పుష్పాన్నో ఇచ్చింది! అదే పుష్పము, ఫలము ఆ చెట్టు యొక్క సూక్ష్మ శరీరానికి సంబంధించిన విషయాలు. ఏ జీవి, సూక్ష్మ శరీర నిర్మాణము చేసుకొని తనలోని ఫలములను ఇతరుల కివ్వదో ఆ జీవనము వృథా అన్నారు. అంటే మనలో కూడా ఈ సూక్ష్మ శరీర నిర్మాణము ఎవరైతే చేసుకుంటారో వారికి మానవ శరీరము యిచ్చినందుకు ఒక సార్థకత ఉన్నది. అలా సూక్ష్మ శరీర నిర్మాణము చేసుకోకుండా చచ్చిపోయిన వారు, వారికి మానవ శరీరము ఎందుకిచ్చారో తెలియక వృథా చేసుకున్న వారిని గొడ్రాళ్ళు అంటారు. పూయని చెట్టు, కాయని చెట్టు వాటికి పెద్ద విలువ ఉండదు. అలాగే సూక్ష్మ శరీరము పోయిన మానవ జీవితము కూడా వృథా. అందుకే మహాత్ములు మాటి మాటికీ దిగివచ్చి, ఎన్నిసార్లు పుట్టావ్, ఎన్నిసార్లు చచ్చావ్, ఎన్నిసార్లు ఆరాట పడ్డావ్ అవే విషయాల కోసం, ఇంకా బుద్ధి రాలేదని చెప్తూంటారు. భగవద్గీత కావచ్చు, భాగవతం కావచ్చు, పతంజలి యోగసూత్రాలు కావచ్చు, రామాయణము కావచ్చు వాళ్ళు చెప్పే విషయ మేమంటే ముందు సూక్ష్మ శరీర నిర్మాణము చేసుకో,

అప్పుడే మానవజీవితానికి అర్థమున్నది. ముందు అమృతత్వాన్ని సాధించు. మిగిలినవన్నీ చిల్లర విషయాలు, చెత్త విషయాలు. వాటి కోసం ఆరాట పడక. పూర్వకర్మలని బట్టి, వాసనలని బట్టి జరక్క తప్పదు. ఇప్పుడేమన్నా పని చేస్తే ముందుకు పనికి వస్తుంది తప్ప పాతగా చేసిన అశుభ వాసనలు పీడింపక తప్పదు. అది పీడించ కూడదంటే కుదరదు. అందుచేత దాన్ని అంగీకరించి యోగసాధన చేసుకోమని పెద్దలు చెప్పారు. కాని మనకి ఎంతసేపూ దాన్ని సర్దు కోవటంతో జీవితము గడిచిపోతుంటుంది.

హనుమంతుడిలో వేడి పుట్టుకొచ్చింది. ఆ మహా పరాక్రమ వంతుడైన హనుమంతుడు కుదిలించిన కుదుపుకు మదపుటేనుగు కార్చే మదధారలవలే ఆ మహేంద్ర పర్వతము నుండి జలధారలు కారినాయి. ఇక్కడ కుదుపు అంటే కుండలిని ఊర్ధ్వగతి చెందడం అని అర్థం. మామూలుగా పాము ఎప్పుడూ పడగ విప్పి ఉండదు. అవసరానికి నిలబడి పడగ విప్పుతుంది. మరీ అవసరమైతే తోక మీద నిలబడుతుంది నాగుపాము. ఎప్పుడూ verticalగా ఉండ నక్కర్లేదు. మామూలుగ ఉన్నప్పుడు horizontalగా పడుకొని ఉంటుంది. అవసరమైతే నిలబడి పడగలు విప్పుతుంది. మనం కూడా అవసరమైతే నిలబడతాం. లేకపోతే పడుకుంటాం. మన అవసరమైన విషయాలు వేరు. మహాత్ముల అవసరమైన విషయాలు వేరు. వారంతా ఎంతో తక్కువగా ఉంటారు. అవసరాన్ని బట్టి అంత పెరుగుతుంటారు. ఆ విధంగా లోపల శరీరాన్ని పెంచు తుంటే, రక్తము మాంసముతో కూడిన ఈ భౌతిక శరీరము నుండి

కుండలినీ శక్తి ఊర్ధ్వగతి చెందే సమయములో వచ్చే వేడి చేత... మదపుటేనుగు నుండి మదధారలు ఎలా వస్తున్నాయో అలా జలధారలు వస్తున్నాయట.

సి.వి.వి. గారు యోగం చేస్తుంటే, ఆయన గంటల తరబడి గాలి పీలుస్తూ వదలుతూ ఉంటే, శరీరంలో పుట్టే వేడికి చెంబులు చెంబులు మజ్జిగ తాగినా ఆ వేడి చల్లారేది కాదు. బాగా తపస్సు చేసే వాళ్ల శరీరం మాటిమాటికీ బాగా వేడెక్కుతుంటుంది. ఆ వేడెక్కినప్పుడల్లా ఏ మంచినీళ్ళో, మజ్జిగో తాగి తగ్గించుకుంటారు. ప్రాణాయామం బాగా చేస్తే ఒంట్లోంచి బాగా వేడి పుట్టుకొస్తుంది. ప్రాణవాయువును ఎంత లోపలకు తీసుకుంటే అంత వేడి పుట్టు కొస్తుంది. అది కారణంగా బొగ్గుపులుసు వాయువు బయటకు పోతుంది. ఇవన్నీ బాగా చేసేవాళ్ళకు చలి, వేడిమి బాధపెట్టవు. వాళ్ళ శరీరము వేడికి, వర్షానికి, చలికీ తట్టుకోగలుగుతుంది. ప్రతి ఋతువులోనూ జబ్బులు రావు. ఋతువులు మారినా లోపల పటిష్ఠమైన ప్రాణశక్తి కలిగి ఉంటారు. భగభగ మండే అగ్ని హోత్రాల జ్వాలలలో నుండి పొగలు పైకి లేచేట్లు ఆ పర్వత శిఖరము మీద నుండి నల్లటి మనశ్శిలల బండలు పైకి లేచినవి. 72 నిమిషాల పాటు, 3 గంటల పాటు బాగా ధ్యానం చేసేవాళ్ళకి ఒంట్లో వుండే మలినాలు కాని, లోపల ఉండే రుగ్మతలు కాని, అజ్ఞానానికి సంబంధించిన మలినాలు కాని అలా విసర్జింపబడు తుంటాయి. ఆ మహాబలవంతుడైన హనుమంతుడు ఆ మహేంద్ర పర్వతమును అలా కుదిలిస్తూంటే, ఆ కుదుపుకు ఆ గుహలలో ఉన్న జంతువులన్నీ భయంకరంగాను, వికృతంగాను అరచి పారి

పోయినాయి. బాగా తపస్సు చేసుకొనేవారి ఒంట్లో అశుభ వాసనలు ఉండవు. అన్నీ పారిపోవలసినదే! అవన్నీ మనలో ఉండే జంతు ప్రవృత్తులని గుర్తించాలి. ఈ విధంగా అన్నిటినీ సాధించు కొని తయారైనవాడు సద్గురువు.

హనుమంతుడు ఎలాంటివాడు అని చెప్పడానికి వాల్మీకి 2, 3 పేజీలలో చాలా రహస్యంగా అందించాడు. అందుకని ఆయన ఒక్కసారి ఒళ్ళు పెంచితే అంటే మనలాగ ఒళ్ళు పెంచడం కాదు. లోపల ఉండే సూక్ష్మ శరీరాన్ని ప్రచోదనం చెందించుకోవడానికి దాన్ని వ్యాపనం చేస్తుంటే శరీరంలో ఇంతవరకు దాగి ఉన్నవి ఎలా బయటకు వస్తాయో ఇక్కడ ప్రతిపాదిస్తున్నారన్న మాట! ఆ పర్వతాలమీద ఉండే సర్పాలు స్వస్తిక చిహ్నములు కనిపించేట్లుగా తమతమ పెద్దపెద్ద పడగలు విప్పి నిప్పులు కక్కుతూ, కోరలతో అక్కడ రాళ్ళను కరచివేసినవి. ఆ కుపిత సర్పాలు వేసిన కాట్లకు ఆ రాళ్ళన్నీ భగభగ మండుతూ ముక్కలు ముక్కలుగా పగిలి పోయినవి. అటువంటి విషాగ్నిని హరించే ఓషధులు ఎన్నో ఆ పర్వతము మీద ఉన్నప్పటికినీ అవిఏవీ ఆ సమయాన ఆ విషాగ్ని జ్వాలలను చల్లార్చ లేకపోయినవి.

బాగా సాధన జరుగుతుంటే, సాగర మథనం జరిగినప్పుడు ఏ విధంగా ముందు విషం పుట్టిందో అలా ముందు మన ఒంట్లో ఆమూలా ఈమూలా దాగివున్న జబ్బులు బయటకు వస్తాయి. అందుకనే సి.వి.వి. గారి యోగం చేయవద్దని చెప్పేవారు చాలా మంది ఉన్నారు. అవి లోపల దాగి ఉంటే నిన్నెప్పుడో తెలియ కుండా చంపేస్తాయి. ఇంట్లో పాముంటే ఏదో రోజు చంపేస్తుంది

కదా! ఒంట్లో తెలియకుండా జబ్బులుండి చచ్చిపోవడంకన్నా జబ్బేమిటో తెలిసికొని చికిత్స చేసుకోవచ్చు కదా! అందుకనే యోగంలో నీలో ఉన్న అశుభ వాసనలన్నీ బయటకు తీస్తారు. నీలో ఉండే అనారోగ్యకరమైనవన్నీ బయటకి తీస్తారు. సద్గురువు అవన్నీ చేస్తాడు. సద్గురువు యిచ్చిన మహా వాక్యాన్ని దీక్షతో, నియమంతో పాటిస్తూ ఒక పద్ధతిగా జీవిస్తున్నట్లయితే అన్నిట్లోంచి ఆయనే నిన్ను రక్షించుకుంటాడు. లేకపోతే వీడికి ఈ దెబ్బకి సగం జరిగి యోగ భ్రష్టుడై చచ్చిపోతాడు. మళ్ళీ జన్మ ఎత్తాలి. మళ్ళీ మొదలు పెడతాడు. మళ్ళీ ఇదే పద్ధతి. అందుకనే యోగభ్రష్టుడైన వాడికి మళ్ళీ యోగం దొరుకుతుంది. ఎందుకంటే అది గురు కృప. ఒకసారి యోగోపదేశం జరిగినవారికి మళ్ళీ యోగంలోకి ప్రవేశం వస్తుంది. కాని అతడు ఎంత దీక్షగా తన యోగాన్ని నిర్వర్తించు కుంటాడు అనే విషయం మీద అతని పురోగతి ఆధారపడి ఉంటుంది.

ఇక్కడ ఈ విధంగా సర్పాలన్నీ బయటకు వచ్చినాయంటే లోపలదాగిన విషపూరితమైన వన్నీ ఒక్కసారి బయటకు వచ్చినా యన్న మాట. ఆ కుదుపుకు ఆ పర్వతము మీద ఉంటూ ఉన్న తాపసులు పృథ్వ్యాది భూతాలతో ఆ మహేంద్ర పర్వతం బద్దలు అయిపోతుందేమో అని భయపడిపోయారు. ఒంటినిండా రక్త చందనాలు పూసుకొని, మెడలలో ఎర్రటి పూలదండలు వేసికొని, తమతమ ప్రియురాండ్రతో అక్కడ మద్యపానము చేయుచున్న విద్యాధరులు భయభ్రాంతులైపోయి చేతులలో వున్న పానపాత్ర లను, మహా విలువైన భోజనపాత్రలను, బంగరు చెంబులను,

రుచ్యములైన లేహ్యములను, రకరకాల భక్ష్యాలను, వివిధ మాంసాలను, ఎద్దుతోలు వేసిన డాళ్ళను, బంగారు పిడులు వేసిన ఖడ్గాలనూ ఆ పానభూమిలోనే వదిలిపెట్టి ముత్యాలహారాలతోను, అందెలతోను, బాజుబందులతోను, కంకణాలతోనూ కళకళలాడు తున్న తమతమ ప్రియురాండ్రను వెంట వేసుకొని పైకి ఎగిరినారు.

విశుద్ధి చక్రములో విద్యాధరులు, చారణులు ఉంటారని చెప్పుకున్నాం. బాగా విద్య ధరించిన వారు విద్యాధరులు. పూర్తిగా విద్యను ధరించినా కూడా బ్రహ్మత్వం పొందకపోతే మళ్ళీ భోగాలకి బాగా అలవాటు పడతారు. అందుకే సురలోకపు భోగాలకు అలవాటు పడ్డవారికి దైవము పరిపూర్ణంగా తెలియదు. అదే విభూతి యోగంలో చెప్పుకుంటున్నాము. దేవతలకు కూడా నే నేమిటో తెలియదు అంటాడు కృష్ణుడు. నా పుట్టుక ఏమిటో తెలియదు. వారి పుట్టుక ఏమిటో వారికే తెలియదు. ఎందుకంటే కొంతదూరం వచ్చాక ఈ విద్యాధరులు, చారణులు, దేవతలూ భోగలాలసులై ఉంటారు. అలా భార్యలతో తిరుగుతున్న విద్యాధరు లకి భయం కలిగిందిట. విద్యాధరులంతా విశుద్ధి చక్రం అంటే ఆకాశంలో ఉంటారని అర్థం. విశుద్ధి, ఆకాశము, శబ్దము ఇవి మనకి ముఖ్యమైన విషయాలుగా భావన చేసుకోవాలి. విద్యాధరులు ఏవైతే కళావంతమైనవి ఉన్నాయో వాటిని తీసుకొని ఆకాశంలోనికి వెళ్ళిపోయారు. ఎందుకంటే వారు ఆకాశంలో చరించే ప్రజ్ఞలు కలిగినవారు. మిగతావన్నీ వారు అక్కడే పారేసిపోయారు. మహా విద్యా ప్రభావం వల్ల ఆ విద్యాధరులు అట్లా ఎగిరిపోయి ఆధారం ఏమీలేని ఆకాశంలో నిలుచుని తమతమ ప్రియురాండ్రను వెంట

తెచ్చుకున్నందుకు సంతోషపడుతూ, మహేంద్ర పర్వతం అట్లా కదులుతూ ఉంటే ఆశ్చర్యపడుతూ మద్యపానమువల్ల ఎర్రటి తామర రేకులవంటి కన్నులతో కిందకి చూడసాగారు.

అప్పుడు ఆ పర్వతగుహలలో ఆత్మధ్యాన నిమగ్నులైన పరమర్షులు ఆకాశంలో నిలుచుని ఉన్న విద్యాధరులతో ‘ఓ విద్యాధరులారా! అడుగో, ఆ పర్వతాకారుడు, వాయుదేవుడి పుత్రుడు హనుమంతుడు, తిమింగలాలతో ఉన్న సముద్రాన్ని అమిత వేగంతో దాటిపోవలె ననుకుంటూ ఉన్నాడు. రామాభ్యుదయం కోసమూ, రామాభ్యుదయం కాంక్షిస్తూ ఉన్న వానరులకోసం ఈ హనుమంతుడు మహా దుర్ఘట కార్యము తలపెట్టినాడు. ఎవరికీ దాటనలవికాని సముద్రాన్ని దాటి అవతలిగట్టుకు పోవలెనని అనుకుంటున్నాడు.’ ఆ మాటలు విద్యాధరులు విన్నారు. ఇంత అంత అని నిర్ణయించ నలవికాని ఆకారంలో పెరిగిపోయిన హనుమంతుణ్ణి ఆ మహేంద్ర పర్వతము మీద చూచినారు.

అప్పుడు ఆ పర్వతాకారుడు హనుమంతుడు ఒళ్ళు విరుచు కున్నాడు. అతని ఒంటిమీద రోమాలు నిక్కబొడుచుకున్నవి. ధ్యానంలో బాగా ఊర్ధ్వగతికి వెళ్తే రోమాలు నిక్కబొడుచుకోవాలి. భగవంతుని గూర్చి మంచి రసవత్తరమైన ఘట్టాలు విన్నప్పుడు రోమాలు నిక్కబొడుచుకున్నవారు అదృష్టవంతులు. వారిలో స్ఫూర్తి ఉన్నదని అర్థం. యోగానికి అర్హత ఉన్నదని అర్థం. ఎంత రస వత్తరమైన ఘట్టమైనా అలాగే మొద్దల్లే ఉండే వాళ్ళకి ఈ జన్మకి దైవవిషయాలతో సంబంధం లేదని తెలుసుకోవాలి. చిన్నతనంలో పిల్లలకి దైవ విషయాలు చెప్పినప్పుడు, ఏ పిల్లవాడికైనా రోమాలు

నిక్కబొడుచుకున్నట్లయితే ఆ పిల్లవాడిని చేరదీసి వాడిని ప్రత్యేకంగా ఒక సద్గురువు ఆశ్రయంలో ఉంచడానికి ప్రయత్నం చేయాలి. భక్తి తత్త్వము లేనివారికి అన్నీ ఒక్కటే. అంటే వాడికి తైత్తిరీయోపనిషత్తు, ABCD ల పుస్తకము ఒకలాగే కనిపిస్తాయి. వాడిమటుకు రెండూ పుస్తకాలే, రెండూ అక్షరాలే! వాడికి అంతకన్నా ఏం జరగదు. ఎందుకంటే వాడికి లోపల స్ఫూర్తి లేదు. రోమాలు బాగా నిక్కబొడుచుకోవడ మనేది తనలో దైవసాన్నిధ్యం పరిపూర్ణంగ ఏర్పడితే జరుగుతుంది. మనకి బాగా మనస్సు కరగిన సందర్భంలో, బాగా దైవప్రార్థన చేసే సమయంలో, మనకి దైవము బాగా స్పర్శ ఇచ్చినప్పుడు, మనకి రోమాలు ఆ విధంగా నిక్క బొడుచుకుంటాయి. లేకపోతే పడుకొని ఉంటాయి. మంచి స్తోత్రము చేస్తున్నా, మంచి కథలు వింటున్నా, మంచి కథలు చెప్తున్నా ఆవిధంగా రోమాలు నిక్కబొడుచుకోవడం అనేది బాగా సంస్కారం ఉండే వారికి జరిగే సన్నివేశము. అదిక్కడ వాల్మీకి చెప్తున్నాడు.

అంతట ఆ మహాత్ముడు మేఘం వలె గర్జించినాడు. విశుద్ధి బాగా స్వామిత్వం పొందినవారి గొంతు బాగా ఖంగుమని మోగు తుంటుంది. గర్జన వలె ఉంటుంది. గరుత్మంతుడు పామును విదిలించినట్లు హనుమంతుడు దట్టంగా పెరిగిన వెంట్రుకలతో చుట్టు చుట్టుకొని ఉన్న తన తోకను విదిలించినాడు. అట్లా విదిలించిన హనుమంతుని తోక ఆకాశంలో గరుత్మంతుడు ఎత్తుకొనిపోతూ వున్న మహా సర్పంవలె కనిపించినది. అంతట హనుమంతుడు ఎగిరిపోతలచి ఇనుప గుదియల వంటి తన

బాహువులను ముందుకు పారచాచి బిగపెట్టినాడు. నడుమును కుంచించినాడు.

బాగా పొట్ట పెంచినవారికి యోగం జరగదు. యోగం చేయాలంటే అంత పొట్ట ఉండకూడదు. ఎందుకంటే ధ్యానం చేసే సమయంలో వెన్నెముక, పొట్ట ఒకదానితో ఒకటి అతుక్కు పోవాలిట. క్రియాయోగంలో బాగా సిద్ధిపొందిన వారి పొట్టలు తమలపాకువలె అతుక్కుపోతాయి. యోగాభ్యాసం చేసేవారందరికీ కూడా ఆ విధంగా అతుక్కుపోతాయి. దాన్నే 'ఓఢ్యాణ బంధము' అంటారు. అసలు కూర్చోలేని వారికి అది వీలు పడదు.

ధ్యానానికి కూర్చున్నప్పుడు వీలున్నంత వరకు నిట్టనిలువుగా కూర్చోమని చెప్తారు. ధ్యానం చేస్తూ పొట్టనెట్టితే, అంటే మళ్ళీ నెట్టాలని నెట్టితే కాదు. అది పలచగా ఉంటేనే సాధ్యపడుతుంది. అందుకే పశ్చిమోత్తాసనము అంటే కూర్చుని కాలి బొటన వేలు చేతివేళ్ళతో పట్టుకొని ముక్కును మోకాలుకి ఆనించాలి. అలా ఆనిస్తే పొట్టభాగం బాగా పలుచగా ఉంటుంది. అలాగే హలాస నము వేసుకోవాలి. అలాగే ఓఢ్యాణాసనము వేసికొని కూర్చుంటారు. తమలపాకువలె కటి భాగానికి వెనుక ఉన్న వెన్నెముక భాగానికి చేర్చడం అంటే రెండూ ఒకటేనా అన్నట్లు అయిపోతాయన్న మాట. అలా అయిపోతే మూలాధారానికి, స్వాధిష్ఠానానికి ఒక రకమైన alignment ఒకటి వస్తే ఆ alignment లోంచి కుండలిని చైతన్యము ఊర్ధ్వగతి చెందుతుంటుంది. అందుకని యోగం చేసేవారు ఆ విధంగా యోగం సమయంలో పొట్టను బాగా లోపలకు తీసు కుంటారు. అలాగే మాస్టర్ సి.వి.వి. పరిస్థితి కూడా ఆ విధంగానే

గోచరిస్తుంది. అగస్త్య మహర్షి గురించి కూడా అదే చెప్తారు. ఆయన చేసేంత ధ్యానం ఎవరూ చేయలేరని చెప్తారు. ఎందుకు ఈ విధంగా చేస్తారంటే వారికి ఆ విధంగా ఇవన్నీ బాగా సిద్ధించినవి కాబట్టి. ఇవన్నీ మనకు తెలియడంకోసం హనుమంతుడు ఏ విధంగ ఒక అద్భుతమైన యోగస్థితిలో నిలబడి లంఘనం చేశాడో మనకి తెలియాలని వాల్మీకి మహర్షి చెప్తున్నా డన్నమాట.

అలా సుందరకాండ అంతా చాలా రకాలైన యోగ రహస్యాలు ఉంటాయి. ప్రతి వాక్యమూ అలానే గోచరిస్తుంది. అందుకే ఇది 'సుందరమైన విషయం'. రామాయణము చదువు కుంటున్నప్పుడు కథగా చదువుకోవడం ఒక పద్ధతి. మన కథగా చదువుకోవడం ఇంకో పద్ధతి. అది యోగ విషయంగా చదువు కోవడం మరొక పద్ధతి. కాళ్ళను ముడుచుకున్నాడట అంటే అయ్యప్పలాగన్న మాట. అలా కూర్చోవడం కూడా చాలా అవసరము. అంటే భౌతిక శరీరమే మన స్వాధీనంలో లేదంటే ఇంద్రియాలు, మనస్సు అస్సలు స్వాధీనంలో ఉండవు. అందుకని వీటన్నిటినీ స్వాధీనంలోనికి తెచ్చుకోవాలి. దానికి ప్రయత్నం కావాలి. ఆ ప్రయత్నంలో నుండి యోగసిద్ధి సులభం అవుతుంది. లేకపోతే కష్టము, కష్టతరము, అసాధ్యము- ఇలా అయిపో తుంటాయి.

ఆ విద్యావంతుడు అంతట తన భుజాలను, మెడను వంచి తనలో ఉన్న శక్తిని, సామర్థ్యాన్ని, పరాక్రమాన్ని ఆవేశింప చేసుకున్నాడు. కనుచూపు మేర వరకు ఆ దారిని తేరిపార

చూచినాడు. ప్రాణవాయువుని హృదయంలో బంధించినాడు. శ్రవణేంద్రియాలను స్తంభింప చేసినాడు. రెండు పాదాలనూ ఆ కొండకు తన్నిపెట్టినాడు. ఆకాశంలోకి ఎగిరిపోతున్న ఆ మహా బలవంతుడు, ఆ కపికుంజరుడు, హనుమంతుడు అప్పుడు వానరులందరినీ చూసి "ఓ వానరులారా! వాయువేగంతో పోయే రామబాణము వలె నేను రావణాసురుడు పరిపాలిస్తున్న లంకా పట్టణమునకు పోతాను. సీతాదేవి ఒకవేళ అక్కడ కనబడక పోయినట్లయితే అదేవేగంతో దేవ లోకమునకు పోతాను. అక్కడా కనబడక పోయినట్లయితే అలసట కూడా లెక్కచేయకుండా మళ్ళీ లంకాపట్టణానికి పోతాను. అప్పుడు కూడా సీతాదేవి కనిపించక పోయినట్లయితే రావణాసురుని ఈడ్చుకు వస్తాను. అంటే రావణుడు ఆమెను ఎక్కడ దాస్తే అక్కడ వెతుకుతాను. ఎక్కడా దొరక్కపోతే ముందు రావణుడిని తెచ్చి ఇక్కడ పడేస్తాను. ఇక్కడికి తెచ్చి అంటే లాకప్పులో పెట్టి కొడితే సంగతి చెప్తారు చూడండీ అలా అన్నమాట. ప్రస్తుతం తనకి అప్పచెప్పబడిన కార్యం సీతాన్వేషణమే! ఒకవేళ అలా దొరక్కపోతే ఏంచేస్తాడో చెప్తున్నాడన్న మాట! హనుమంతుడికి రావణుడు చాలా చిన్నవాడు. కాకపోతే తన చేత సంహరింప బడవలసినవాడు కాదు కనుక ఎప్పటికప్పుడు వాడిని వదిలేస్తుంటాడు. ఎందుకంటే సరాసరి శివుడే హనుమంతుడు. ఆయన భక్తుడే రావణుడు. వాడిని హెచ్చరించడం, వాడిని సరైన దారిలోనికి తీసుకురావడం వరకే హనుమంతుడు. వాడిని సంహరించడం అనేది విష్ణుకార్యము, ప్రభుకార్యం హనుమంతునికి. అందుకనే వాడిని కట్టి తీసుకొస్తాను అని చెప్పాడు.

ఏ విధముగానైనా ఆ పని సాధిస్తాను. సీతాదేవిని వెంట పెట్టుకొని వస్తాను. అట్లా కాకపోయినట్లయితే రావణాసురునితో సహా లంకా పట్టణాన్ని పెళ్ళగించి ఎత్తుకొని తెస్తాను అని చెప్పి ఆ వేగవంతుడు, హనుమంతుడు రెక్కలున్నట్లుగా భావించి, భావించడం కాదు నిజంగానే రెక్కలు ఉంటాయి. ఎందుకంటే మనలో ఉండే ఊపిరితిత్తులు మన లోపల అస్థిపంజరంలో బంధింపబడ్డ రెక్కల్లాంటివి. నిజంగా బాగా ప్రాణాయామం చేసి విశుద్ధి చేరిన వారికి ఈ ఊపిరితిత్తులు సూక్ష్మ లోకాల్లో రెక్కలుగా తయారౌతాయి. దాంతోనే వారు ఆకాశగమనం చేస్తారు. అందుకనే దేవతలను చూపించేటప్పుడు వారికి రెక్కలున్నట్లుగా చూపిస్తారు. ఆ రెక్కలు బదులు ఇంకో రెండు చేతులు చూపిస్తుంటారు. మనకి నిజానికి నాలుగు చేతులున్నాయి. ఆ రెండు చేతులూ మన యొక్క ప్రవర్తనచేత బంధింపబడి ఉన్నాయి. నిజానికి మనం గాలి పీల్చుకొనేప్పుడు కూడా అంతంత మాత్రంగానే పీలుస్తాము. మనం మన ఊపిరితిత్తులు పీల్చగలిగే గాలిలో 20 శాతం మాత్రమే పీలుస్తాం. అందుచేత మనకుగా మనం మన లోపల ఉన్న రుగ్మత లని విసర్జించలేని సమర్థత లేని స్థితిలో ఉంటాం. ఎందుకలా ఉన్నామంటే రుగ్మతలకి బలం ఎక్కువ. ప్రాణశక్తికి బలం తక్కువ. అందుకే పెద్దలు బాగ ప్రాణాయామం చేస్తే జబ్బులు అసలు ఎందుకుంటాయి అంటారు. బాగా ప్రాణాయామం చేద్దా మన్నా చేయలేం. ఎందుకంటే ప్రారబ్ధకర్మ అడ్డువస్తూంటుంది. అందుకనే చేయలేక పోవడానికి ఏవో కారణాలు కనిపిస్తుంటాయి. మామూలుగా పీల్చేగాలే రోజూ 72 నిమిషాలు బాగా గట్టిగా

పీల్చవచ్చుకదా! తెలిసినా ఎందుకు పీల్చం? పాతవాసనలు ఈ కొత్తగా తెలుసుకున్న వాటికన్నా చాలా బలమైనవి అవడంవల్ల అవి మనచేత చేయ నివ్వవు. అందుకని మనం సత్కర్మాచరణ ద్వారా పాత కర్మలని నశింపచేసుకుంటూ ఉంటే అప్పుడు మనకు కొంత అవకాశం ఏర్పడుతుంది. అది కారణంగా సాధన జరుగుతుంది. పూర్వకర్మ ద్వారా బాగా కష్టాలు ఏర్పరుచుకొనే వారికి సాధన జరగదు. వారికి అనారోగ్యమువల్ల సాధన జరగదు. అందుకే పతంజలి మహర్షి యోగమునకు- అనారోగ్యము, జీవితంలో సాధనకు అనుకూల పడనటువంటి సన్నివేశములు అంతరాయములు అని చెప్పారు. ఇవన్నీ పూర్వ కర్మవల్ల వస్తాయి. కాబట్టి అంగీకరించి వీలున్నంత వరకు భగవంతుణ్ణో, గురువునో 'నన్నిందులోంచి రక్షించు, నాకేమన్నా మార్గ మియ్యి, నీ బలంచేత ఏదన్నా సాధన జరగాలి తప్ప నా బలం చేత నేనేమీ సాధన చేసుకోలేను' అని చెప్పుకోవాలి.

సద్గురువంటే బంధాలన్నీ దాటిన వాడు. తనకి బంధాలు ఉండవు కనుక బంధాలలో బంధింపబడిన వాని బంధాలు కూడా తొలగించ వచ్చు. అందుచేత అతని బలమే మన బలంగా మనలో సాధన జరగాలని కోరుకోవాలి తప్ప అదేదో సాధన చేసేస్తాం అంటే చేయలేం. అది గుర్తు పెట్టుకొని సద్గురువుని ఆశ్రయించి, పాదములకు బాగా పూజచేసుకొని ఆ పాదముల వద్ద పడి ఉండి సాధన చేసుకోవడం అనే పరిష్కారం పెద్దలు మనకి ఇచ్చారు. ఆ విధంగా మనం నిర్వర్తించుకుంటే మనకి ఒక్కోటి నెమ్మది నెమ్మదిగా వీలుపడతాయి. అలా కాకపోతే ఏదో మనం చాలా

కాలం చేశాం, చాలామంది మనల్ని మంచి వాళ్ళంటున్నారు, మనకేదో స్తోత్రాలు, సూక్తాలు వచ్చని మనుషులు భయపడు తుంటారు. అంతే తప్ప మనకేం ప్రశాంతత ఉండదు, ఆనందం గానూ ఉండదు. ఎప్పుడూ వాళ్ళ గురించి, వీళ్ళ గురించి ఏవో పిచ్చి ఆలోచనలు చేసేవాళ్ళు సాధన జరుగుతున్నదని ఎలా అనుకోగలరు?

మనం మంచివాళ్ళమని అనుకుంటుంటే మనకి మనమే ప్రశ్న వేసుకోవాలి 'మనకి ఇతరుల గురించి ఎటువంటి భావనలు వస్తున్నాయి' అని. 'మనకి ఇష్టం లేని వారున్నారా' అని ప్రశ్న వేసుకోవాలి. ఉంటే సాధన లేదని అర్థం. 'మనకి ఇష్టంలేని సన్నివేశాలున్నాయా' ఉంటే సాధన జరగడం లేదని అర్థం. "మనకి ఇష్టంలేని మనుష లున్నారు, మనకి ఇష్టంలేని పరిస్థితులు ఉన్నాయి" అంటే సాధన జరగదు. అవన్నీ అలా ఉంటాయి. వాళ్ళూ దైవానికి సంబంధించినవారే! ఆ సన్నివేశాలూ దైవమే కల్పించాడు అనే భావనలో ఉన్నవాడు సాధనలో ఉంటాడు తప్ప ఎంతసేపూ నేను చాలా మంచివాడిని, నా చుట్టూ ఉండేవాళ్ళు వెధవ లనుకొనేవారు సాధనకి కొన్ని వేల మైళ్ళ దూరంలో ఉన్నట్లుగా మనం అవగాహన చేసుకోవచ్చు.

ఇక్కడ ఈయన గట్టిగా గాలి పీలుస్తున్నాడని చెప్పడమంటే మనం ఎలా గాలి పీల్చవలెనో చెప్పడానికే. రెక్కలు ఉన్నట్లుగా భావించాడు అంటే రెక్కలు ఎలా వస్తాయో చెప్తున్నాడు. అలా రెక్కలు వచ్చినవాడు రాత్రిపూట పడుకుంటే శుభ్రంగా శరీరాన్ని మంచం మీద పెట్టేసి ఏదైనా సద్గురువు కార్యమునకో, లేదా

ఎవరైనా తనను నమ్మి, ఆర్తితో ప్రార్థన చేస్తున్నవారికి ఏదో ఒక విధంగా స్ఫూర్తి కలిగించడమో, ఏదో ఒక విధంగా సహాయం చేయడంగా జీవిస్తుంటాడు. అందుకని హనుమంతుడు రెక్క లున్నట్లుగా భావించాడని వాల్మీకి చెప్పాడు. కాని ఇక్కడ రెక్కలు ఉన్నట్లుగా భావించడం కాదు, ఆయనకి రెక్కలున్నాయి. మనకి కనబడవు. ఇంతకు ముందు చేసిన యోగసాధన వల్ల లోపల ఉన్న రెక్కలను గరుత్మంతుడి లాగ బయటకు తీశాడు. ఇహ అక్కడ నుండి ఎగరడానికి కావలసిన సాధన సంపత్తి అంతా తన వద్ద ఉన్నది. అది పట్టుకొని బయల్దేరుతాడు. రెక్కలున్నట్లుగా భావించి నిర్వికారంగా, చివాలున ఆకాశంలోనికి ఎగిరిపోయినాడు. ఆ కపికుంజరుడు హనుమంతుడు ఎగిరిన ఉరవడికి ఆ పర్వతం మీద ఉన్న చెట్లు అన్నీ పెళ్ళగిలి కొమ్మలతోనూ, కొమ్మ కొనలను ఉన్న పూలతోను, ఆ కొమ్మల మీద ఉన్న లకుముకి పిట్టలతోనూ ఆకాశానికి ఎగిరి, దూరదేశానికి పోయే బంధువును సాగనంప డానికి వెంటపోయే బంధువులవలె ఆ హనుమంతుని ఒక్క ముహూర్తము సేపు వెంబడించినవి.

ఊరు వెళ్తే కొంతమందికి గేటు వద్ద టాటా చెప్పే వారుంటారు. కొంతమంది ఇంట్లోనే టాటా చెప్పేవారుంటారు. కొంతమంది Stationకి వస్తారు. కొంతమంది వీలుంటే హైదరా బాదు వరకు వచ్చి విమానం ఎక్కిస్తారు. ఇంకా వీలుంటే ముంబాయి వస్తారు. ఇహ ఆ తర్వాత సముద్రం వచ్చేస్తుంది కాబట్టి ఇంక రారనుకోండి! ఎందుకిలా వస్తారు? ఆ వెడుతున్నవాడి మీద వీళ్ళ కుండే ప్రేమ. అలాగే చివరి ప్రయాణం చేసే వారికి కూడా

కొంతదూరం వరకూ అలాగే వెడతారు కదా! అందరూ రాలేరు కదా! కొంతమంది ఇంట్లోనే ఏడుస్తూ ఉండిపోతారు. కొంతమంది మోసుకుంటూ వెడతారు. కొంతమంది మోసుకొని వెళ్ళేవారి వెంట వెడతారు. కొంతమంది అక్కడవరకూ వెడతారు. కొంతమంది ముట్టించెయ్యగానే వచ్చేస్తారు. కొందరు పూర్తిగా కాలేవరకు ఉంటారు. అందరూ వెళ్ళిపోయిన తర్వాత ఉంటారు మరి కొందరు. ఏదైనా ఒక పరిమితి ఉన్నది. ఎంత సేపుంటారు? వాడితో పాటు వీడూ పోలేడు కదా!

సద్గురువు ఏం చేస్తాడో తెలుసా నువ్వు శరీరం వదిలేస్తే, నువ్వు అందులోంచి బయటకు వస్తే నిన్ను జాగ్రత్తగా తీసుకువెళ్ళి కొంతమందికి అప్పజెప్పి వచ్చేంత వరకూ నీతో ఉంటాడు. అంతే కాదు నువ్వు పుట్టగానే ఎక్కడ పుట్టావో చూసి మళ్ళీ తన వద్దకు తెచ్చుకొనే ప్రయత్నం చేస్తాడు. అందుకని ఆయన నీకు ఎక్కువ దూరం సహకరించి, నీతోపాటు ఉండి నిన్ను రక్షించుకో గలడు. అది అతడికి ఉండే విశిష్టత.

ఈ చెట్లన్నీ ముహూర్తకాలం అంటే 4 నిమిషాల పాటు హనుమంతుడితో కొంతదూరం ప్రయాణంచేసి అక్కడ నుండి కింద పడిపోయినా యన్నమాట. చెట్లన్నీ అలా ఎగిరి పోతూంటే హనుమంతుడి పర్వతాకారం అత్యద్భుతంగా కనిపించింది. పూర్వము దేవేంద్రునికి భయపడి పర్వతాలు సముద్రంలో పడిపోయినట్లు, చేవతో బరువెక్కిన ఆ చెట్లు గభాలున ఆ సముద్రంలో పడిపోయి నాయి. హనుమంతుడి దేహమంతా పూలు, మొగ్గలు, మొలకలూ కమ్ముకొన్నందువల్ల రాత్రిపూట మిణుగురు పురుగులతో మెరిసే

పర్వతం వలె కనిపించినాడు. ఆ హనుమంతుడి ఉరవడికి వెనుక పడిపోయిన చెట్లు తమ పూలను రాల్చివేసి ఊరికి పోయే చుట్టాన్ని నీళ్ళు అడ్డము వచ్చేవరకు పంపించి వెనకకు మరలిన బంధువుల వలె సముద్రంలో కనబడకుండా పడిపోయినవి. బాగా బరువుగల చెట్లు ఆ హనుమంతుడితో కొంతదూరం పోయి కిందపడి పోయినవి. కొన్నైయితే వెంటే ఉండి పోయినాయి, పూలు లాంటివి. ఎందుకంటే అవి చాలా తేలికైనవి. అలా ఎవరెవరు ఎంత దూరం వస్తారనేది ఇక్కడ వాల్మీకి చాలా చక్కగా నిర్వచించారు. వాళ్ళతో మనకుండే సంబంధం బట్టి, సన్నిహితత్వమును బట్టి అలా వస్తుంటారన్న మాట.

బాగా బరువుగా ఉండే చెట్లు అప్పుడే పడిపోయినవి. తేలిక చెట్లు మరికొంత దూరం ఆ వానరోత్తముని వెంట పోయినవి. అన్నిటికన్నా తేలికైన రకరకాల రంగుల పూలు ఇంకా మరికొంత దూరంపోయి రాలి సముద్రంలో పడ్డాయి. అట్లా సముద్రజలాల మీద పడ్డ పూలన్నీ చీకటిలో ఆకాశాన ఉదయించిన నక్షత్రాల మాదిరిగా కనిపించినవి. సముద్రంలో రాలకుండా ఇంకా ఒంటికి అంటుకొనిపోయిన పూలతో వడివడిగా పోతున్న హనుమంతుడు ఆకాశంలో మెఱపు తీగలతో పోయే మహా మేఘంవలె కనిపించి నాడు. ఆకాశంలోనికి నిక్కి చూచిన హనుమంతుని రెండు బాహువులూ పర్వత శిఖరము నుండి బయటకు వెళ్ళుటకు వచ్చిన ఐదు తలల పాముల జంటవలె కనిపించినది. అట్లా పోతూ ఉన్న హనుమంతుడు మెడను వంచినప్పుడు మహాసముద్ర జలాలను తరంగాలతో కూడ త్రాగబోతున్న వాడివలె, మెడను పైకి ఎత్తి

నప్పుడు ఆకాశాన్ని మ్రింగివేయబోతున్న వాడివలె కనిపించినాడు. ఆ హనుమంతుని గుండ్రని తేనె రంగు కన్నులు ఏక కాలాన ఉదయించిన సూర్య చంద్రులవలె కనిపించినవి. ఎర్రని ముక్కుతో ఎర్రబడిపోయిన హనుమంతుడి ముఖము సంధ్యారాగం అలుము కున్న సూర్యమండలము వలె కనిపించినది.

సాధన బాగా జరిగినవాడికి రెండు ఐదు తలల పాములు చాచుకొని వచ్చినట్లుగా వీడికి రెండు కొమ్ములు వస్తాయి. అవి నందీశ్వరుని కొమ్ములు. అవి మనలో ఉండే ఇడ, పింగళ ప్రజ్ఞలు. బుర్రలోంచి బయటకు విచ్చుకొని వస్తాయన్నమాట. అలా బయటికి వచ్చి కిరణాల్లాగ కనిపిస్తుంటాయి. వాటిని కిరణా లంటాము. అవి ఏమిటయ్యా అంటే ఒకటి సూర్యకిరణము, ఒకటి చంద్రకిరణము. మనకి రెండు తలల పాము ప్రార్థన ఒకటి ఇస్తుంటారు. నాగ ప్రతిష్ఠలు కూడా చేస్తుంటారు. అందుకే 'ముందు వచ్చిన చెవుల కన్నా వెనుక వచ్చిన కొమ్ములు వాడి' అంటారు. వాడి అంటే వాటి ప్రతిభ ఎక్కువ అని. వాటియొక్క ప్రజ్ఞ ఎక్కువ. భగవంతుని చూడాలంటే ఆ రెండూ పెరిగి ఆ రెంటి మధ్య నుండి చూడ వచ్చును. అందుకనే మనం శివుణ్ణి నంది రెండు కొమ్ములవద్దా వేళ్ళుపెట్టి అందులోంచి చూస్తూ వెనుక తోకవద్ద రాస్తుంటాం కదా! తోక దగ్గర ఎందుకు రాస్తామంటే మూలాధారం నుండి ప్రజ్ఞ ఊర్ధ్వగతి చెంది ఈ కొమ్ముల వరకు వస్తే, ఆ కొమ్ముల్లో నుండి నీకు దైవ దర్శనం దొరుకుతుంది. మోసెస్ బొమ్మ చూసినట్లయితే కొమ్ములు బయటకు ఉన్నట్లుగ వేస్తారు. మనకి కూడా Masonic higher ritualsలో ఒక కిరీటంలాగ పెట్టుకుంటారు. దానికి కొమ్ములు

ఉంటాయి. వారంతా ఈ నందీశ్వరుని Brand అన్నమాట. వారికి అవగాహన ఉండి వారలా చేస్తుంటారు.

హనుమంతుడి ముక్కు ఎఱ్రగా ఉన్నది అని వ్రాశారు. అంటే బాగా సాధన చేస్తే ముక్కు వేడిగా, ఎఱ్రగా ఉంటుంది. అంతేకాని హనుమంతుడు కోతి గనక ఆయన ముక్కు సహజంగా ఎఱ్రగా ఉండడం కాదు. బాగా ప్రాణాయామం చేస్తాడు కాబట్టి ఆయన ముక్కు ఎఱ్రగా ఉన్నది. అలాంటి వాడి తలలో వేడి ఎక్కువగా ఉంటుంది. అది బి.పి. కాదు. యోగం బాగా చేసేవాడికి ముఖము వేడిగా ఉంటుంది. ఆ ముఖము వేడిగా ఉండడమే కాదు, ఆ వేడి కారణంగా వచ్చే ఒక వెలుగు చుట్టూ ఉంటుంది. ఆ కాంతివల్ల వాడి ముఖవర్చస్సు బావుంటుంది. అందుకనే అమ్మవారి ముఖము వర్ణించేప్పుడు అలా వర్ణిస్తుంటారు. పెద్దవాళ్ళ ముక్కులు అలా వర్ణిస్తుంటారు. మొత్తం వర్చస్సు అంతా కూడా ముఖ భాగం, శిరస్సు అంతా ఆవరించి ఉంటుంది. అప్పుడు అది ఊర్ధ్వగతి కింద లెక్క. ఊర్ధ్వము నందు మొత్తం ప్రజ్ఞ ఉండడం చేత హనుమంతుడి ముఖం ఎలా ఉన్నదంటే సంధ్యారాగము అలుము కున్న సూర్యమండలము వలె ఉన్నది. ఎంత కాంతి పెంచాడండీ? మామూలుగ అలా బయటపెట్టుకు తిరగనక్కర్లేదు. హనుమంతుడు పనిలేకపోతే ఏదో గోక్కుంటూ కూర్చున్నట్లుంటాడు. కోతి ఏం చేస్తుంది ఏ పనీ లేకపోతే, అది ఇది గోక్కుంటూ ఉంటుంది. అట్లాంటిది కోతి ఇంత చేయగలదా! అవసరాన్ని బట్టి పెరిగేవాడు మహాత్ముడు. అవసరం లేకుండా ఊరికే అలా పటాటోపంగా తిరిగేవాడు మహాత్ముడు కాడు. తనకి తను గుర్తు లేకపోవడమే

హనుమంతుని గొప్పదనము. మన గురించి మనకి బాగా గుర్తుంటుంది కాబట్టి మనం చాలా తక్కువ వాళ్ళమని గుర్తుంచు కోవాలి.

ఇప్పుడు ఈ హనుమంతుడు ఎలా ఉన్నాడు, మామూలుగా ఉన్నప్పుడు ఓ మూల ఉంటాడు. పిలిస్తేగాని రాడు. సుగ్రీవుడు పిలిస్తే వస్తాడు. జాంబవంతుడు చెప్పాడు కాబట్టి వచ్చాడు. ఎవ రెగర గలరు, ఎవ రెగర గలరు అని అందరూ అనుకుంటుంటే హనుమంతుడు దూరంగా పోయి కూర్చున్నాడు. ఏదో వాళ్లు తేల్చు కుంటారులే అని. అంతేగాని వీళ్ళు మన కాళ్ళ వద్దకు రావాలనే భావనలు కూడా ఉండవు. దేవుడితో ఉంటాడు. దేవుడిలో ఉంటాడు. దేవుడై ఉంటాడు. ఇహ మిగతాదేమీ ఉండదు. కోరితే లోపల శక్తిని నెమ్మదిగా లేపుకుంటాడు. లేకపోతే అలా ఉంటాడు. అందుకే అందరూ ఏదో ప్రాయోపవేశం, ఇంకేదో అని గందర గోళం పడుతుంటే, ఇదేం గోల అనుకున్నాడు, ఓ మూలకు పోయి కూర్చున్నాడు. వాళ్ళల్లో వాళ్లు ఏవో తర్జనభర్జనలు పడ్డారు. చివరికి ఈయన్నే వచ్చి అడిగారు. నువ్వు తప్ప ఎవరూ చేయలేరు, నువ్వే చేయాలని. 'ఆహా! అలాగా! నాకంత శక్తి ఉన్నదా' అని అడిగాడు. 'ఉంది' అంటే ఇహ అక్కడ నుండి ఒక్కొక్కటే ఒక్కొక్కటే ఎంత శక్తి చూపించాడో! తన సహజమైన బలాన్ని ఆవిష్కరించి, ఆ విధమైన కాంతితో, ఆ విధంగా వ్యాపనము చెందిన శరీరంతో, యోగవిద్య తనయందు పరిపూర్ణముగా సిద్ధించినవాడు, మహాసిద్ధుడు కాబట్టి, సిద్ధులు చారణులూ కూడా అబ్బురపడే పద్ధతిలో ఆకాశం లోకి ఒక పర్వతం లేచినట్లు లేచాడు.

అట్లా ఎగిరిపోతున్న హనుమంతుడు పైకి ఎత్తిన పొడుగాటి తోక ఆకాశములో ఇంద్ర ధ్వజమువలె కనిపించినది. ఆ హనుమంతుడు అప్పుడు ఆ తోకను తన చుట్టూ గుండ్రంగా చుట్టుకున్నాడు. అప్పుడు ఆయన పరివేషము మధ్య ఉన్న సూర్యునివలె ఉన్నాడు. ఎర్రగా ఉన్న ఆయన కటిభాగము పర్వతాన్ని బ్రద్దలు చేసుకొని వచ్చిన గైరిక ధాతువువలె కనిపించినది. ఆ వానర సింహుడు హనుమంతుడు అట్లా అమితవేగంతో సముద్రాన్ని లంఘిస్తుంటే అతని చంకలలోంచి దూసుకొనిపోయే గాలి మేఘం వలె గర్జించింది. అంటే వేగం బాగా ఉందని అర్థం. విమానం గాలిని చీల్చుకొని పోతుంటే చప్పుడు రాదూ! ఎంత వేగంగా వెళుతున్నాడంటే మేఘగర్జన వలె ఆ ధ్వని వినిపిస్తున్నది.

ఉత్తర దిక్కు నుండి దక్షిణ దిక్కుకు పోతున్న హనుమంతుడు అప్పుడు ఆకాశంలో ఉత్తరము నుండి దక్షిణ దిక్కుకు వ్యాపిస్తున్న తోకచుక్క మాదిరిగా కనిపించినాడు. తోకచుక్క మాదిరిగా అనిపించడం అంటే ఆయన తేజస్సు ఆయన వెంట అలా వస్తుంటుంది. అసలే వెలుగు శరీరం. ఆ వెలుగు యొక్క వెలుగు ప్రభావం ఉంటుందే ఆ వెలుగున్న ప్రాంతమంతా కూడా అలా కనిపిస్తుందన్నమాట. అలా తోకచుక్కలా కనిపించదు. మహాకాయంతో ఆకాశంలో సూర్యునివలె పోతున్న ఆ హనుమంతుడు తన తోకను ముడుస్తూ, వేళ్ళాడేస్తూ ఉంటే నడికట్లు తాళ్ళు తెంచుకొని పరుగెడుతున్న ఏనుగు వలె కనిపించినాడు.

ఆకాశంలో ఎగిరిపోతున్న హనుమంతుడి కాయము, క్రింద సముద్రంలో పడుతున్న అతడి నీడ ఏకమై, గాలికిపోతున్న ఓడవలె

కనిపించినది. హనుమంతుడు ఎంతమేర సముద్రం దాటుతుంటే అతని వేగానికి అంతమేర సముద్రం పిచ్చెక్కినట్లై పోయినది. ఆ వేగానికి, ఆ ఆకారానికి, అందులోంచి పుట్టిన గాలికీ సముద్ర మంతా హోరెత్తి పోయిన దన్నమాట. ఆకాశంలో ప్రయాణం చేస్తున్న దారంతా సముద్రములోని నీళ్ళను చెల్లాచెదరు చేస్తున్నది. కొండలంత ఎత్తుకెగిరిన తరంగాలు అతని తాకిడికి చిందర వందరై పోయినవి. అప్పుడు హనుమంతుడి గాలికి మేఘాల గాలి ఏకమై చేసిన భయంకర శబ్దానికి సముద్రం కంపించి పోయింది. ఆ కపి శార్దూలము ఆ సముద్రపు అలలను ఒరుసుకు పోతుంటే భూమ్యాకాశాలను వేటికి అవిగా చీల్చివేసే వాడిగాను, మంద వేగంతో పోతుంటే మేరు మందర పర్వతాలవలె పైకి లేస్తున్న సముద్ర తరంగాలను లెక్కవేస్తున్న వాడివలెనూ సాగిపోయినాడు. ఆ హనుమంతుడి వేగానికి సముద్ర జలము మేఘ మండలం వరకు లేచి శరత్కాల మేఘంవలె ఆకాశాన శోభించింది.

యోగసాధన చేసే వారికి లోపల స్వాధిష్ఠానము, మణి పూరకము మధ్య ఆవరించే జలా లుంటాయి. అదే జీవనం. ఆ ప్రాణశక్తి అంతా కూడా మన లోపల కామ క్రోధ లోభ మద మాత్సర్యాలు ఉండడం చేత కలుషితంగా ఉంటాయి. దాన్నే emotional waters అంటారు. ఆ waters అన్నీ కూడా బాగా వేడెక్కించడం వల్ల distill అయిపోయి చక్కని శరత్కాల మేఘాలు అంటే అందులో నీళ్లుండవు కానీ మబ్బులు తెల్లగా అందంగా ఉంటాయి. శరత్కాల మేఘానికి, ఆషాఢ మేఘానికి చాలా తేడా ఉన్నది. ఆషాఢ మేఘము మనలాంటిది. బాగా కర్మతో కూడినది.

నిండా బరువే! ఆ బరువంతా ఆశ్వయుజ మాసానికి గాని దించుకోవడం అవదు. అప్పటికి తెల్లగా మెరుస్తూ అందంగ ఉంటుంది. అట్లా మన శరీరంలోవున్న జలాలన్నీ కూడ పరిశుద్ధి కావాలి. "*క్షుత్పిపాసామలాం జ్యేష్ఠా మలక్ష్మీ ర్నాశయా మ్యహమ్, అభూతిం అసమృద్ధిం చ సర్వాన్నిర్ణుద మే గృహాత్*". ఈ శరీరంలోంచి, ఈ క్షుత్, పిపాస అనే మలినాలు ఏమున్నాయో అవి తీసెయ్యమ్మా. అవి ఉన్నంతకాలం మంచి విభూతి ఉండదు, మంచి అనుభూతులు ఉండవు, అలా పడి ఉంటాం. అభూతులుంటా యన్న మాట. అసమృద్ధించ అంటే ఎప్పుడూ లేనివే గుర్తొస్తుంటాయి. ఉన్నవేమీ గుర్తురావు. అదిలేదే ఇదిలేదే అని ఏడవడం ఉంటుంది. లేనిదానికి ఏడుస్తుండడం, ఉన్నదాన్ని అనుభవించ లేకపోవడం అసమృద్ధి. అలాగే ఏ విభూతీ లేనివాడు ఎన్నాళ్ళు యోగంలో ఉంటే ఏం ఉపయోగం? ఎప్పుడు విభూతులు ఇవ్వబడతాయీ అంటే లోపల మలినాలు లేనివానికి ఇవ్వబడతాయి.

దేవకీదేవి శ్రీకృష్ణుని గర్భముతో ఉన్నప్పుడు బోలెడు అనుభూతులున్నాయి. ఎందుకున్నాయంటే ఆమె అంత పవిత్రమైన చైతన్యం కలిగినటువంటిది. ఏదో ఒక కల వస్తే అది ఊరంతా చెప్పుకుంటే గాని తోచిచావదు మనకి. ఆవిడకి ఎటువంటి కలలు వచ్చినాయి? ఎవరో వచ్చి విభూతి పెట్టినట్లుగా వచ్చిందట. తర్వాత వసుదేవుడు చూసి, 'అదేమిటీ నీ మొహాన విభూతి ఉన్నదీ' అని అడిగాడు. అలా ఉండాలి కల. అంతేకాని 'ట'గా ఉండకూడదు. అంటే సత్యంగా ఉండాలి. మనకన్నీ ట లే, అదీ ఎప్పుడన్నా. అదే విభూతి సత్యంగా, చక్కని దైవ అనుభూతులతో, ఆనందంతో,

ఉల్లాసంతో, హృదయం పొంగుతూ ఉంటుంది. అది లోపల కుళ్ళు ఉంటే ఉండదు. లోపల కుళ్ళు లేకుంటే ఉంటుంది.

మనం కృష్ణుని ప్రార్థన చేస్తుంటే ఆ గోపికల మాదిరి మనకి కృష్ణుడు కనిపించడేం అనిపిస్తుంది. ఎలా జరుగుతుంది ... గోపిక లేమిటీ, నువ్వేమిటీ? గోపా అంటే రహస్యంగ చేసుకుంటారు సాధన. మనదీ? అంతా వ్యతిరేకము. సాధన అంతా బజారులోనే. అందుకని అసమృద్ధి, అభూతి నుండి మనకి విభూతి. అందుకనే భగవంతుడిని అదే బాబాని విభూతి అడుగుతుంటాం. ఆయన బూడిద ఇస్తుంటారు అంతేకదా! అంటే ఏం లేదురా అనే సత్యం నీకు దర్శనమైతే అప్పటి నుండి విభూతి. ఇక్కడేమో ఉన్నాయని, నువ్వు అన్నీ పచ్చి పచ్చివి పీక్కు తిందామనే పద్ధతిలో ఉంటే నీకు విభూతి లేదు అని చెప్పడానికి బూడిద.

విభూతి అంటే విశిష్టమైన అనుభూతి అని అర్థము. ఎవరికి విశిష్టమైన అనుభూతి వస్తుంది? బూడిదైపోయిన వాడికి వస్తుంది. బూడిద అయిపోవడమంటే మరి కాల్చడానికి అక్కడ ఏం లేదు. అది కదా విభూతి. విభూతి ఎక్కడ నుండి వచ్చింది? శుభ్రంగా పవిత్రమైన గోమయం కదా! ఆవుపేడ కదా! విభూతి గేదె పేడతోనో, గొర్రె పేడతోనో చేయరు. ఆవు అంటే ఏమిటీ? సాధు జంతువు. ఆవు పేడ ఎక్కడ వేస్తే అక్కడ పొలాలు బాగా పండుతాయని ఇప్పుడు కనుక్కొన్నారు. మనవాళ్ళు ఎప్పుడో చెప్పారనుకోండి. ఆవుపేడ, ఆవు ఉచ్చ వీటిలో భూమి సారవంతం చేయడానికి వలసిన PH levels ఉంటాయిట. అవి 5% ఉంటే చాలా అద్భుతమైన పంట వస్తుందిట. మామూలుగ భూమిలో అవి

ఎక్కువ వుంటాయిట. అందుకనే మన వాళ్ళు ఆవు పేడ, ఆవు ఉచ్చ, ఆవు పాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి ఇవి 5 కలిపి గోపంచకమని యజ్ఞం చేసేవాడికి ఉదయాన్నే మనం కాఫీ త్రాగినట్లుగా ఓ కప్పు ఇస్తారు, ఇది త్రాగరా అని. అదేమంటే ఇది త్రాగితే శరీరం పవిత్రం అవుతుంది, నీకు యజ్ఞం చేయడానికి అర్హత వస్తుంది, లేకపోతే నువ్వు యజ్ఞం చేయడ మేమిటి నీ వెధవ శరీరంతో అని యిస్తారు.

మనవాళ్ళు వీడు చెప్పాడు తప్పదని ముక్కు మూసేసుకొని త్రాగుతారు. ముందు చెప్పి ఉంటే యజ్ఞం చేసేవాళ్ళం కాదు. యజ్ఞం అంటే మనకి తెలియదు కదా! మనం చేద్దామంటే ఓ..... అని చెప్పి ముందు రక్షాబంధనం కడతాడు. సంకల్పం చేయిస్తాడు. ముందు మరి ఇది త్రాగాలి కదా అంటాడు. ఏదో ముక్కు మూసేసుకొని త్రాగేస్తాం. సాధుజనులు, తపస్సులు చేసేవారు రోజూ ఇది పుచ్చుకుంటారు. ఇంకా పాతవాళ్ళు అప్పుడప్పుడు కాస్త నెత్తిమీద జల్లుకుంటూంటారు. కొత్తవాళ్ళు ఏమిటిది non-sense అంటారు.

గోవు సాధుజంతువు. ఆ గోవు నుండి వచ్చే దానితో పిడకలు చేసి, ఆ పిడకలు కాలిస్తే అందులో ఉన్న సమస్తమూ అగ్ని పవిత్రీకరిస్తుంది. అగ్ని కంటే ఏదీ పవిత్రీకరించలేదు. ఏదన్నా కాల్చేస్తే మిగిలిపోయినది పరమ పవిత్రమైన దన్నమాట. కాల కుండా మిగిలినదని కదా సీతాదేవికి అగ్నిపరీక్ష. అగ్నిలో పెట్టి వెళ్ళిపొమ్మంటే ఆమె మళ్ళీ అందులో నుండి intact బయటకి వచ్చేసింది. ఎందుకని వచ్చిందీ, అగ్నిచేత కాల్చబడలేని పవిత్రత

కలిగినది కావడం చేత. ఏది కాల్చబడదు అగ్నిచేత! కేవలము జీవాత్మ మాత్రమే. ఆకాశం మాత్రమే. ఆకాశము, వాయువూ ఈ రెండూ అగ్నికన్నా గొప్పవి. కేవలము ఆకాశతత్వము, వాయు తత్వమూ మనలో నిండి ఉన్నదనుకోండి, అగ్ని మననేం ముట్టు కోదు. నలుడు, నీలుడు, వాయువు, అగ్ని. అందుకనే మనం చేసే పూజల్లో కూడ ముందు ఇంద్రునికి దండం పెట్టిన తర్వాత, అగ్నికి దండం పెట్టుకొని తర్వాత వాయువుకు దండం పెడతాం. మనకి ఉన్నది అభూతి. అభూతి నుండి విభూతి లోనికి రావాలంటే ఏంచేయాలో సంకేతపరంగ పెద్దలంతా విభూతి ఇస్తుంటారు. అంటే నిన్ను నువ్వు పవిత్రీకరించుకో అని చెప్పడం అన్నమాట. The message of vibhuthi is to remind you that you should try to be pure as far as possible but for pure in thought, pure in your senses, pure in your body, pure in your speech, pure in your wearings.

అంటే పవిత్రంగ ఉండడమే. బాగా వాసనలు కొట్టే బట్టలు వేసుకోకూడదు. శరీరం వాసన రాకూడదు. వాసన వస్తే రోజుకు 6 సార్లు స్నానం చేయి, మంచిదే! యోగాభ్యాసం చేసేవారు చెప్తారు, ఎన్నిసార్లు స్నానంచేస్తే అంత మంచిదని. ఎందుకంటే శరీరము నుండి వాసన రాకూడదు. వస్తోంది అంటే స్నానం చెయ్యి. బట్టలు వాసన రాకూడదు. వస్తున్నాయి అంటే విడిచేసి మరో బట్టలు వేసుకో. మనకుండే నాగరికత అంతా గంగానది, సింధునది, మయనది, అమెజాన్ నది, మిసిసిపి, మిస్సోరి నదులు, నైలునది, రైన్ నదుల ఒడ్డున- ఇలా జీవనదుల ఒడ్డున

జీవనం ఏర్పాటు చేసుకున్నారు తెలిసినవాళ్ళు. లేకపోతే నీళ్ళులేని జీవితం ఏం జీవితం అండీ దరిద్రపు జీవితం. ఎక్కడ నీళ్ళు లేవో అక్కడ ప్రాణం లేదని అర్థం. అందుకని బాగా పవిత్రీకరించు కోవాలి. పవిత్రత ఉన్నచోట విభూతులు ఉంటాయి. అవి మనకు ఆనందం కలిగిస్తాయి. ఉత్సాహాన్ని కలిగిస్తాయి.

అందుకని ఇక్కడ ఈ హనుమంతుడు ఉత్సాహంగా బయలు దేరి వెళుతుంటే ఆ సముద్ర తరంగాలు ఎగిరి ఆయన రొమ్ముకు తాకి పవిత్రీకరింపబడి శరత్కాల మేఘాలవలె తయారైనాయి. అది కూడా మళ్ళీ ఒక యోగమే! 'వృషాకపి రమేయాత్మా' అని చెప్పు కున్నాం. వేసవికాలం వేసవికాలం అని మనం దాక్కుంటుంటాము. కాని వేసవికాలం మనలోని నీళ్ళన్నీ సూర్యుడు ఇగిరింప చేస్తాడు. జబ్బు చేసేంత ఎండలోకి వెళ్ళకూడదు గాని మరీ ఎక్కువగా దాక్కోకండి. శరీరం భరించ గలిగేంత భరిస్తుంటే లోపల నీళ్ళన్నీ ఇగిరి పోతాయి. ఇగిరిపోతే వర్షాకాలం తొలకరి వస్తుంది. వచ్చి నప్పుడు అందులోంచి మనకు తమస్సు వస్తుంది. అందుకే శ్రావణ భాద్రపదాలు కొంచెం అప్రమత్తతతో ఉండాలి. శరీరం మళ్ళీ కొత్తధాతువులు ఏర్పరచుకుంటుంది. అప్పుడు శరీరాన్ని ఎక్కువ పవిత్రంగా వుంచుకుంటే ధాతువులు కూడా పవిత్రంగా ఉంటాయి. అందుకని తొలకరి వచ్చి మనకి నీళ్ళు ఇస్తున్నప్పుడు వాటితో ధాతువులు కట్టుకొని వస్తాడు. రామాయణంలో వర్షఋతువు గురించి చెప్తూ మనుషులు ఏ విధంగా బరువు పెరుగుతారు అనేది దశరథుడు అప్రమత్తత లేక శ్రావణ కుమారుడని తెలియక సంహరించాడని తెలుస్తుంది. శరీరానికి మత్తు వస్తోందిటా అంటే

లోపల ధాతువులు బాగా మందంగా ఉన్నాయని అర్థము. Tendency to sleep బాగా ఉందిట అంటే మనిషికి బాగా మత్తు ఉన్నట్లు లెక్క. అంటే పదార్థము యొక్క సాంద్రత ఎక్కువున్నది. రాత్రే నిద్ర. పగలు నిద్ర పనికి రాదు అని చిన్నప్పుడు కాపీలు రాసినా మనం నిద్రపోతూనే ఉంటాము.

అలా ఈ మేఘాలన్నిటిని ఆయన స్పృశించడం చేత తెల్లని కాంతి ఏర్పడింది. అందుకే మేఘ మంటే శరత్కాల మేఘంతో పోలుస్తారు. వర్షించే సందర్భమైతే ఆషాఢ మేఘంతో పోలుస్తారు. శరత్కాల మేఘాలు చాలా అందంగా ఉంటాయి. తెల్లటి కాంతి వంతమైన అంచులు, మొత్తం శరీరమంతా తెల్లదనమూ, సూక్ష్మ శరీర ధారణలాగ. అంతకు ముందు బరువుగా, నల్లగా ఉంటాయి. ఆ తెల్లటి మేఘాలు భూమికి కొంచెం ఎక్కువ దూరంలో ఉంటాయి. అలాగే ఈ విధంగా పరిశుద్ధి చెందినవారు భూమ్యాకర్షణ శక్తికి కొంచెం దూరంగా ఉంటారు. ఇటువంటివన్నీ మనం ఇలా ఇక్కడ భావన చేసుకోవచ్చు. ఎందుకంటే మహాత్ములు ఎంత వర్ణన చేసినా యోగానికి, దైవానికి సంబంధించినదే రాస్తారు తప్ప ఇంకొకటి రాయరు. ఎందుకంటే వాళ్ళు ఆత్మజ్ఞాన సంపన్నులు.

ఆ మహాతేజస్వి, ఆ మహాకాయుడు వాయు మార్గాన పోతూ ఉంటే రెక్కల పర్వతం ఎగిరిపోతున్నట్లు కనిపించింది. ఆ మహా కాయుడు హనుమంతుడు అలా పోతూవుంటే ఆ మహా సముద్రము ప్రక్కకు తొలగి మధ్యన తొట్టిగా ఉండే దోనెవలె కనిపించినది. గరుత్మంతుడివలె ఎగిరిపోతున్న హనుమంతుడు వాయుదేవునివలె మేఘాలను వెంట లాగుకొని పోయినాడు. హనుమంతుడిని

వెంబడించి తెలుపు, ఎరుపు రంగు మేఘాలు అప్పుడు ఆకాశానికి అలంకారముగా కనిపించినవి. ఆ హనుమంతుడు అమితవేగంతో పోతూ ఉంటే మేఘాల చాటుకు పోతూ వస్తూ దాగుడుమూతలు ఆడుకొనుచున్న చంద్రునివలె కనిపించినాడు. మనం రాత్రి పడుకున్నప్పుడు భావన చేసుకొని పడుకుంటే బావుంటుంది.

హనుమంతుడు అతి శీఘ్రంగా అనుగ్రహించే సద్గురువు. అతి ప్రాచీనమైన సద్గురువు. కపిలుడు / దత్తాత్రేయుడు తర్వాత ఈ భూమి మీద హనుమంతుడే! కపిలుడు దత్తాత్రేయుడు తేడా ఏం లేదు. ఒకరే! ఆ తర్వాత మనకి హనుమంతుడు త్రేతా యుగంలో కనిపిస్తాడు. అప్పటి నుండి ఈ భూమి మీద ఉన్నవాడు. పిలిస్తే పలికే దైవం. కేవలం కోరికలకే కాదు యోగానికి కూడా సహాయం చేయగలడు. ఆత్మ సాధనకి కావలసిన సమస్త సంపత్తి ఇవ్వగలడు.

అప్పుడు ఆకాశంలో అమితవేగంతో ఎగురుతున్న హను మంతుని మీద దేవతలు, గంధర్వులు పూలవాన కురిపించారు. ఆ హనుమంతుడికి దేహతాపం ఎత్తకుండా సూర్యుడు ఎండకాశాడు. వాయుదేవుడు రామకార్య సిద్ధికోసం అనుకూలంగా గాలి వీచాడు. ఎప్పుడూ కూడ సత్కర్మలు చేసేవాడికి ప్రకృతి సహకరిస్తుంటుంది. సత్కార్యాలు చేసేవారి సంకల్పంలోని పవిత్రతను బట్టి ప్రకృతి, దేవతలు సహకరిస్తారు. అందుకనే సత్కార్యాలు చేసేవారికి ఉండే బలం మామూలు వారికి ఉండదు. సాఫీగా జీవితం గడిచిపోవా లంటే జీవితంలో సత్కార్యాలు ఆచరించాలి. హనుమంతుడు సద్గురువు. అతడు దైవం నుండి జీవుని ఉద్ధరించుటకు, జీవుని

వద్దకు అన్వేషణకు బయలుదేరాడు. కాబట్టి సద్గురువుకి ఎప్పుడూ కూడ సూర్యుడు, చంద్రుడు, పంచభూతాలు, ఇంద్రుడు, అగ్ని... ఇలా దేవతలంతా తమ తమ సహకారాన్ని అందిస్తుంటారు.

## 2

అట్లా ఆకాశంలో ఎగిరిపోతున్న హనుమంతుణ్ణి మహర్షులు అందరూ స్తోత్రము చేశారు. ఎందుకంటే మహర్షులంతా ఈ సమయము కోసం ఎదురు చూస్తున్నారు. రావణుని వధ కోసం మహర్షులు ఎప్పటినుండో తపస్సు చేస్తున్నారు. దేవతలూ అదే కాంక్షిస్తున్నారు. అష్టదిక్పాలురూ అదే కాంక్షిస్తున్నారు. నవగ్రహాలూ అదే కాంక్షిస్తున్నాయి. అందుకనే హనుమంతునికి ఈ విధంగా అందరూ సహాయం చేస్తున్నారు. దేవతలు, గంధర్వులు ఆ మహా తేజోవంతుని పొగడినారు. అలుపు లేకుండా ఎగిరిపోతూ ఉన్న ఆ హనుమంతుణ్ణి నాగులు, యక్షులు, రాక్షసులు, కిన్నరులు, కిం పురుషులు మెచ్చుకున్నారు. ఈ విధంగా సమస్త ప్రకృతి, సమస్త దేవతలూ ఆయన్ని మెచ్చుకోవడమే కాక ఆయనకి పూర్తి సహకారాన్ని అందచేస్తున్నారు.

ఆ కపిశార్దూలము హనుమంతుడు అలా దాటిపోతుంటే సముద్రుడు అతనికి సాయపడవలె ననుకున్నాడు. దేవకార్యానికి ఎవరైతే సిద్ధపడతారో వారిలోని పవిత్రతని బట్టి చాలామంది సహకారం కలిసి వస్తుంది. అదొక నదీ ప్రవాహం లాంటిది. మనము నదీప్రవాహం మొదలు చూచినట్లయితే ముందొక చిన్న

ప్రవాహము, మన పంపులోని నీళ్ళవలె బయలుదేరుతుంది. అది బయలుదేరి సాగర సంగమం చేరేవేళకి మధ్యలో రకరకాలుగా అట్నుంచి, ఇట్నుంచి మరికొన్ని నదులుచేరి, ఒక మహానది అయ్యి కొన్నివేల మైళ్ళు ప్రయాణము చేసి, అటుపైన ఎంతోమందిని పునీతం చేస్తూ, ఎన్నో భూములను పంట భూములుగా మార్చి, ఎన్నో జీవులకు ప్రకృతి పరంగా తరింపు మార్గాన్ని ఇస్తూ, తను వెళ్ళి సముద్రంలో కలుస్తుంది.

అలాగే సద్గురువు చేసే ప్రయాణము ఎప్పుడూ ఒంటరిగానే ఉంటుంది. ఎందుకంటే తను దైవము వద్దనుండి జీవులకోసం వచ్చినవాడు. ఆ జీవుల ఉద్ధారణ కార్యక్రమంలో ఆ సంకల్పాన్ని అనుసరించి తాను వెడుతుంటాడు. వాళ్ళూ వీళ్ళూ సహకరిస్తే పనిచేద్దాం అన్నట్లుండడు. సద్గురువులు ఎప్పుడూ కూడా వారు చేయవలసిన పని చేసుకుంటూ వెడుతుంటారు. సహకారం కోసం ఎదురు చూడకుండా తనకు ఉండే బలం మీద, తనలో ఉండే దైవశక్తి మీద ఆధారపడి ముందుకు వెడుతుంటారు. సత్కార్యాలను చేసేవారికే ఇలా దేవతలు, ఋషులు, గంధర్వులు, ప్రకృతి అన్ని విధాలుగా సహకరిస్తారు. మైత్రేయునికి అలా దేవతలు, ప్రకృతీ చుట్టూ సహాయం చేస్తారని జ్వాలాకూలుడు రాస్తాడు. ఇది చాలా సహజమైన విషయం. ప్రతి సద్గురువు చెంతా వీరంతా చేరి తమవంతు సాయం చేస్తుంటారు. ఈ సద్గురువు చెంత పవిత్రత తగ్గితే మాత్రం వీరంతా వెళ్ళిపోతారు. అందుకే ఇది పవిత్రతకు సంబంధించినది.

హనుమంతుడు అతి పవిత్రుడు. సాక్షాత్తు శివ స్వరూపుడు. అతనికి సాయం చేయడానికి ఆ విధంగా వెడుతుంటే సముద్రుడు కూడా సాయపడాలనుకున్నాడు. ఇక్ష్వాకు వంశీయుల మీద ఆయనకు ఎంతో గౌరవమున్నది. ఇక్ష్వాకు వంశీయుడైన సగరచక్రవర్తి తనను వృద్ధి చేసినాడని, ఆ ఇక్ష్వాకు వంశీయుడైన రామునికి హను మంతుడు సాయం చేస్తున్నాడని, అతడు అలసిపోకుండా తను ఏదైనా సహాయం చేయవలెననుకొని, రామ కార్యార్థియై వెళుతున్న హనుమంతునికి సహాయపడకపోతే తనని అందరూ అన్నివిధాల నిందిస్తారని సముద్రుడు అనుకున్నాడు. సద్భావం కలవాడు కాబట్టి. హనుమంతుడు వెడుతున్న కార్యం రాముని కార్యం. రాముడు ఇక్ష్వాకు వంశీయుడు. ఇక్ష్వాకు వంశీయుల వల్లనే సముద్రం ఏర్పడినది. సముద్రము వృద్ధి చెందినది. కనుక వారికి తను కృతజ్ఞత తెలియజేయవలసిన అవసరమున్నది. కారణ మేమంటే ఇక్ష్వాకు వంశీయులకు ఇంతవరకు సముద్రుని అవసరము రాలేదు. ఎన్నో తరాల కిందట సహాయం జరిగింది. తన వృద్ధికి వారు కారణమైనారు. ఎప్పుడూ ఉపకారం పొందిన వారు ప్రత్యుపకారం చేయడానికి వేచి ఉండాలి. ఎందుకంటే మనకి ఉపకారం చేసేవారు మనకన్నా శక్తిమంతులు, బలవంతులు, ఎక్కువ దైవశక్తి సంపన్నులు కావచ్చును. అలాంటప్పుడు మనం వారికి సాయం చేయడానికి అవకాశం చాలా తక్కువ ఉంటుంది. అయినప్పటికీ కూడా మనకి తోచిన సాయం, అవసరం వచ్చి నప్పుడు, అప్రమత్తతతో మనం వారికి నిర్వర్తించడం సంస్కారుల లక్షణం. ఇక్ష్వాకు వంశీయులకు హనుమంతుడు చేస్తున్న సహాయానికి

దోహదం చేయడంకోసం ఆ విధంగా సముద్రుడు భావించాడు. అంటే మనలో సంస్కారము పెరగాలంటే మనకి చిన్న సాయం చేసినవారికి కూడా వాళ్ళకి బాగా మంచి జరగాలని ప్రార్థించి, అటుపైన అవకాశముంటే శక్తివంచన లేకుండా, శరీరశ్రమ అనుకోకుండా వాళ్ళకి మనం సహాయం చేయడానికి ప్రయత్నించాలి.

హనుమంతుడు ఎవరి సహాయమూ కోరడు. సద్గురువు ఎన్నడూ ఎవరి సహాయమూ కోరడు. ఎందుకంటే దైవమే అతని యందున్నాడు. దైవము నందు అతడున్నాడు. కనుక అతడు దైవమునే అంటిపెట్టుకొని తన కార్యాలను నిర్వర్తిస్తాడు. అందుకని రామకార్యం ఆ విధంగా జరగుతుంటే, హనుమంతుడు ఈ కార్యము నందు దిగి ఉన్నప్పుడు, ఒక సద్గురువు వలె కార్యములు తను నిర్వర్తించుచున్న సందర్భంలో, అతడికి సహాయము చేద్దామని అనుకోవడం సముద్రుని యొక్క సంస్కారం.

అలా వచ్చే హనుమంతునికి కాస్త అలుపు తీర్చుకొనే ఏర్పాటు చేస్తే తక్కిన దారి అంతా సుఖముగా పోగలుగుతాడని సముద్రుడు మనసులో నిశ్చయించుకొని, తనలో దాగి ఉన్న పర్వతశ్రేష్ఠుడైన మైనాకుడిని చూసి “హిరణ్యానాభా! పాతాళ లోకములో ఉంటున్న రాక్షసులు పైకి లేచి రాకుండా వారి ద్వారానికి మూత బండగా ఉంటున్నావు. ఆ రాక్షసులు, పరాక్రమ వంతులు పైకి రావలెను అని ఎంతో ప్రయత్నము చేస్తే నీవు అపరిమిత ఆకారముతో ఆ పాతాళ ద్వారానికి అడ్డం అయినావు. నీకు క్రిందకీ, మీదకీ, పక్కలకీ పెరిగే శక్తి ఉన్నది.” ఒకటి– మైనాకుడు రాక్షసులను తొక్కిపెట్టి ఉంచగలడు. రాక్షసులు

పాతాళలోకం నుండి విజృంభించకుండా తను అడ్డుగా నిలవ గలడు. రెండు- అడ్డంగా పెరగ గలడు. మూడవది- నిలువుగా పెరగగలడు. నాలుగవది- అతనికి రెక్క లున్నాయి. ఎగరగలడు. ఇవన్నీ మణిపూరక చక్రానికి సంబంధించిన సంకేతాలు.

మైనాకుడు మణిపూరక చక్రానికి సంబంధించిన వాడు. మణిపూరక చక్రం ద్వారానే మనకి మనస్సు పనిచేస్తుంది. ఆ మనస్సు అటు ఊర్ధ్వగతికీ పోగలదు. ఇటు అధోగతికీ పోగలదు. ఇక్కడ అధోగతి అంటే పాడైపోవడమని కాదు. భౌతికమైన విషయాలకి కూడా మనస్సు కావాలి. ఆధ్యాత్మికం, దైవికం అయిన విషయాలకి కూడా మనస్సు కావాలి. అటు కావాలి, ఇటు కావాలి. పక్కలకి పోగలదు. అంటే మనం ఈ ప్రపంచంలో కూడా పేరు, ప్రతిష్ఠ, కీర్తి, సంపాదన, అన్నీ కూడా మనస్సు చేసుకోగలదు. మనస్సు మనల్ని ఊర్ధ్వగతికి తీసుకువెళ్ళగలదు, అధోగతికీ తీసుకు వెళ్ళగలదు. మనల్ని ఈ భూమిమీద బాగా వ్యాపనం చేయించ గలదు. అంతే కాదు దానికి రెక్కలు కూడా ఉన్నాయి. అవసరమైతే ఎగిరి పోగలదు. మనస్సుకి ఇన్ని ప్రజ్ఞలున్నాయి. అందుకని మనోప్రజ్ఞకి సంబంధించి మైనాకు డున్నాడు.

హనుమంతుడు మహేంద్ర పర్వతం మీద నుండి ఎగిరాడు. మహేంద్ర పర్వతం అంటే విశుద్ధి చక్రము అని కదా! విశుద్ధి చక్రమునకు ఆకాశానికి సంబంధమున్నది. ఉండడం చేత ఆకాశానికి సంబంధించిన మార్గంలో వెడుతున్నాడంటే హను మంతుడు తను ప్రజ్ఞా స్వరూపుడై ఆజ్ఞ యందుండే వాడు, మహేంద్ర పర్వతము అంటే విశుద్ధి చక్రమునకు వచ్చి అక్కడ

నుండి ఆకాశమార్గాన వెడుతుంటే, వింధ్యపర్వతం మాదిరిగా బొడ్డుదగ్గర మైనాకుడిని పైకి లేచి ఆతిథ్యం ఇవ్వమని సముద్రుడు చెప్తున్నాడు. ఎందుకంటే తను అతనికి ఆశ్రయం ఇచ్చాడు. తనకి ఇదివరకు సాయం చేసినవారికి సాయం చేస్తే బావుంటుందని సముద్రుడు మైనాకుడిని ఆ విధంగా కోరాడు. మనలో ఆ విధంగా అర్థం చేసుకోవచ్చు. మైనాకుడు మనలో మణిపూరక చక్రము. అది ఎటైనా వెళ్ళగలదు. పైకి వెళ్ళగలదు. కిందకి వెళ్ళగలదు. పక్కలకి వ్యాపనం చెందగలదు. సృష్టిలో మనసుతో చేయలేని పని ఏం లేదు. కనుక మనోబలం కలిగినవాళ్ళు ఊర్ధ్వమైన చైతన్యంతో ముడిపడితే, పైకి వెళ్ళగలరు, కింద రాక్షసులని దమించి ఉంచనూ గలరు. మనోజయమే ముఖ్యము. అంటే మనలో ఉండే ఈర్ష్య, అసూయ, ద్వేషము, రాగము, క్రోధము వగైరాలే రాక్షసులు. వీటిని మనసుతోనే జయించగలం. మనసు ఎట్లా జయించ గలదు? దైవశక్తిని తోడు తెచ్చుకొని జయించాలి. అలాంటి మైనాకుడిని సముద్రుడు అడుగుతున్నాడు "నువ్వు నాకు కొంచెం సాయం చేసిపెట్టు, రామకార్యార్థం హనుమంతుడు ఆకాశంలో ఎగిరి వస్తూ ఉన్నాడు. ఆ కపిశార్దూలము తలపెట్టినది ఒక పరమ సాహస కృత్యం. నీ మీదుగా పోతాడు. సీతాదేవి త్రికూట పర్వతముమీద లంకలో బంధింపబడి ఉన్నది." త్రికూట పర్వతం మన మూలాధార చక్రములో ఉంటుంది. అక్కడ ఆమె బంధింపబడి ఉన్నది.

మూలాధారంలో చిక్కుకున్న జీవుడి కథే రామాయణము. ఆ జీవుడిని ఉద్ధరించడమే హనుమంతుడు చేసే పని. ఉద్ధరించడం అంటే దైవానికి చేరే మార్గాలన్నీ సద్గురువు చూపిస్తాడు. కనుక

సద్గురువు ముందు జీవునిలోనికి ప్రవేశించి, ఆ జీవునిలో ఉండే చైతన్యాన్ని వృద్ధి పరచి, దైవోన్ముఖులను గావించి, దైవానుగ్రహం వాళ్ళు పొందేట్లుగా చేసి, దైవానికి కూడా వీళ్ళమీద కరుణ గలిగేట్లుగా చేసి... ఇన్ని రకాలుగా సద్గురువు తాపత్రయ పడతాడు. అందుకని సద్గురువు చేసే కార్యక్రమం చాలా ఉత్కృష్ట కార్యక్రమము. అందుచేత హనుమంతుడు రామకార్యార్థము వెడుతున్నాడంటే దైవం పనిమీద వెడుతున్నాడు. జీవులను ఉద్ధరించడంకోసం భూమి మీద ఉన్నాడు. కనుక నువ్వు ఇతడికి సాయం చేయి అని మణిపూరక చక్రానికి సముద్రము చెప్తున్నది. ఎందుకంటే ఈ మణిపూరక చక్రం అడ్డుపడిపోతే చాలా ఇబ్బందులు వచ్చేస్తాయి. అందుకే పొట్ట పెరగకూడదు. కోరికలు బాగా ఉండి, క్రమమైన జీవితము లేకపోతే పొట్ట బాగా పెరుగుతుంది. క్రమమైన జీవితమున్న వారికి పొట్టరాదు. మన కోరికలు తిండి రూపంలో ఉండవచ్చు. విశ్రాంతి రూపంలో ఉండవచ్చు. శరీరానికి సంబంధించి చేయవలసినవి చేయకపోవడం వలన ఆ విధంగ అది వృద్ధిచెందుతూ అడ్డు పడుతుంటుంది. అది అడ్డుపడితే మనం ఏం చేయలేం. అయితే హనుమంతుడికి అది అడ్డే కాదు. ఎందుకంటే ఆయన అట్నుంచి వస్తున్నాడు. అందుకే సీతాదేవి తనకు తానుగ లంక నుండి బయటకు రాలేదు. రాముడు వచ్చి ఉద్ధరించుకుంటే తప్ప తనకుగా తాను రాలేను, ఇక్కడే ఉంటాను, నువ్వు ఆయనను పట్టుకువచ్చి నన్ను తీసుకెళ్ళు అని చెప్తుంది.

జీవుడు చేయవలసింది ఒక్కటే! అదే తపస్సు! ఎవరి గురించి? దైవం గురించి. దైవం గురించి మనం తపస్సు చేసినప్పుడు దైవమే

ఒక గురువుని సంధానకర్తగా పంపిస్తాడు. సీతాదేవి చేసిన తపస్సు కారణంగానే హనుమంతుడు రావడం జరుగుతుంది. అట్లాగే ఒక సత్పురుషునికి తనలో ఉండే దైవచింతన ద్వారా, దైవం గూర్చిన తపన తీవ్రమైతే అప్పుడు ఒక సద్గురువు అతని జీవితంలో ప్రవేశిస్తాడు. సద్గురువుని మనం వెతుక్కోనక్కర్లేదు. మన ప్రవర్తన లోని బలమును బట్టి, పవిత్రతను బట్టి సద్గురువు మన జీవితంలో ప్రవేశిస్తాడు అని మన సంప్రదాయము మనకు చెప్తున్నది. హనుమంతుడు ఏ విధంగా సముద్రాన్ని దాటి సీత వద్దకు చేరాడో చూసినట్లయితే జీవుని వద్దకు చేరటానికి అన్నిపాట్లు సద్గురువుకు ఉంటాయి అని తెలుస్తుంది. కాని అతడు దైవబల సంపన్నుడు. దైవ స్వరూపమే! కాబట్టి అన్నిటినీ జయించుకొని, ఛేదించు కుంటూ జీవుని వద్దకు చేరగలడు. జీవునికి సరైన ఉపదేశం చేయగలడు. మార్గం చూపించగలడు.

అందుకని మార్గంలో హనుమంతునికి ఈ మైనాకుని అతిథ్యము ఏర్పడింది. అంటే తనకుగా తాను ఆత్మజ్ఞానం పొందిన వాడిని, దైవమునకు చేరువైనవాడిని దైవము తన ప్రతినిధిగా అతని చేత జీవోద్ధరణ కార్యక్రమం నిర్వర్తింప చేస్తాడు. ఆత్మజ్ఞానం పొందినవారిని దైవం ముప్పొద్దులా మేపడం ఉండదు. వాళ్ళు దానికి సిద్ధంగా ఉండాలి. దైవప్రతినిధులుగా దైవకార్యం చేస్తుంటారు. దైవకార్యమేమంటే జీవుల ఉద్ధారణమే! తన నుండి వేరుపడిన జీవు లందరినీ మళ్ళీ తన వద్దకు తెచ్చుకోడానికి దైవం ప్రయత్నం చేస్తుంటాడు. కనుక తన కార్యక్రమాన్ని తన ప్రతినిధు

లకు అందిస్తాడు. అలా అందించినప్పుడు వీళ్ళు తిరిగి వచ్చినప్పుడు వీళ్ళకి రకరకాల సత్కారాలు జరుగుతుంటాయి.

హనుమంతుడి కిక్కడ సముద్రుడు పెద్ద సత్కారం సంకల్పించాడు. ఏమిటీ? మహేంద్ర పర్వతము మీద నుండి ఎగిరి అంటే విశుద్ధి నుండి మణిపూరకము వద్దకు వచ్చాడు. ఇంకా కిందకు వెళ్ళాల్సిన దారి ఉన్నది. వచ్చిన పని సీతాన్వేషణ. తాను వచ్చినది రామదూతగా, రామబాణం వలె వచ్చాడు. ఎందుకంటే వానరులకు 'నేను లంఘించి, లంకవరకు రామబాణం వలె వెళ్ళిపోతాను' అని చెప్తాడు. సద్గురువన్న వాడు తాను ఏ పనిమీద వచ్చాడో ఆ పనిమీదే ఉండాలి. అటుఇటు చిలవలు పలవలుగా ప్రతి పక్కకి ప్రపంచం లాగేస్తుంటుంది. ఆకర్షణలు చాలా ఉంటాయి. అలాంటి ఆకర్షణలకు లోనైతే కాలం వృథా అయిపోతుంది. వచ్చిన పని యొక్క బలం పలచబడిపోతుంది. అడ్డదారులలోకి వెళ్ళకూడదు. మిగిలిన విషయాలు పట్టించుకో కూడదు. తను ఏ పనిమీద బయలుదేరాడో ఆ పని ముఖ్యం తప్ప మిగతా పనులు కాదు. బజారుకు ఒక పనిమీద బయలుదేరి వెళ్ళినప్పుడు సూటిగా ముందు ఆ పని చూసుకోవాలి. తిరిగి రావడానికి ఇంకా సమయం ఉంటే మిగతా పనులు చూసుకోవాలి. అంతేగాని ముందు మిగతా పని చూసుకొని, ఆ తర్వాత అసలు పని చూసుకోవడానికి సమయంలేక, అది సరిగ్గా చేయక వచ్చేవాళ్ళు పనికిరాని వాళ్ళు. విద్యార్థికి సూటిగ చూడవలసినది చదువు. గృహమేదికి సరిగ్గా చూడవలసినది సంతానము, సంసారాన్ని చక్కగా నడిపించుకోవడము. అంతేకాని ఇవి కాకుండా ఏవేవో చేసేస్తామంటే అవ్వవు. అన్నీ

సక్రమంగా ప్రతిదీ చేసుకుంటూ వచ్చేవాడికే అన్ని విషయాలలోను సక్రమంగా సాధించే ఒక స్థితి కలుగుతుంది. ఒక సామర్థ్యం కలుగుతుంది.

ఇక్కడ మైనాకునిచేత అతిథి సత్కారం చేయించడము సముద్రుని కర్తవ్యం. అలా చేయడం మైనాకుని కర్తవ్యం. ఎందు కంటే మైనాకుడు కూడా వాయుదేవునికి ఋణపడి ఉన్నాడు. వాయుదేవుడు సహాయం చేయడం వలన, ఇంద్రుని వజ్రాయుధం నుండి తప్పించుకొన్నాడు. వాయుదేవుడు అనుకూలంగా వీచడం వలన మైనాకుడు వేగంగా ఎగిరి సముద్రంలో దాక్కోగలుగుతాడు. పూర్వం పర్వతాలన్నిటికీ రెక్కలుండేవి. అవి ఎగురుతూ ఉండేవి. అలా తిరుగుతూ ఎక్కడైనా దిగుతుంటే ఆ కిందన ఉండే మున్యాశ్రమాలు, పల్లీపట్టణాలు, ఇవన్నీ పచ్చడై పోతుండేవి. ఇలా అయితే మాకు చాలా కష్టంగా ఉన్నదని ఋషులు, మునులు మొర పెట్టుకుంటే ఇంద్రుడు తన వజ్రాయుధము చేత పర్వతాల రెక్కలు కత్తిరిస్తాడు.

ఆ కత్తిరించే సమయంలో మైనాకుడు తప్పించుకుంటాడు. ఆ సమయంలో వాయుదేవుడు సాయం చేస్తాడు. ఇప్పుడు ఎగురు తున్నవాడు ఎవరు? వాయుదేవుడి పుత్రుడు. కనుక వాయుదేవుని పుత్రునికి సాయం చేయవలసిన కర్తవ్యం తనకున్నది. రాముడికి సాయం చేయవలసిన కర్తవ్యం సముద్రునికి ఉన్నది. కనుక సముద్రుడు మైనాకుడికి చెప్తే అటు తనకు ఆశ్రయమిచ్చిన సముద్రునికి, ఇటు అంతకు ముందు తన గతికి, స్థితికీ కారణమైన వాయుదేవునికీ కృతజ్ఞత తెలుపుకోవడానికి ఇదొక చక్కని అవకాశం.

అందుకనే మనం ఎవరి వద్ద ఉండి పెరిగి పెద్దవాళ్ళ మౌతామో, వాళ్ళకి ఏదన్నా ఒక చిన్న ఉపకారము జరిగే సందర్భం ఉంటే, అందులో మనము పాల్గొని నిర్వర్తించడం మన ధర్మము అని ఇక్కడ రామాయణము బోధిస్తుంది. అది సంస్కారానికి సంబంధించింది. అందుకని మైనాకుడు కూడా సిద్ధమౌతాడు. ఇందులో అనేక రహస్య అర్థాలున్నాయి.

సముద్రుడు మైనాకుడితో "నీవు ఇప్పుడు పెరిగి పైకి పోవలెను. రామ కార్యార్థం హనుమంతుడు పైకి ఎగిరి ఆకాశంలో వస్తున్నాడు. ఆ కపిశార్దూలము తలపెట్టినది పరమ సాహస కృత్యం. ఇహ నీ మీదుగా పోతాడు. రాముడు ఇక్ష్వాకు వంశీయుడు. ఆ వంశీయులందరూ నాకు పూజనీయులు. నీవు నాలో దాగుకొని నా అభ్యుదయాన్ని కాంక్షిస్తూ ఉన్నవాడవు. అందు వలన రాముడు మరింత పూజనీయుడు." నా ఆశ్రయంలో నువ్వున్నావు కదా, నా అభ్యుదయం నువ్వు కాంక్షిస్తుంటావు కదా అంటాడు.

ఎవరి నీడలో మనం బ్రతుకుతున్నామో వారి అభ్యుదయం కాంక్షించకుండా మనం ఉన్నా మనుకోండి, అది దుర్మార్గము.

దేనివల్ల మనం బ్రతుకుతున్నామో దాన్ని మనం దూషించ కూడదు. దేన్ని ఆశ్రయించి మనం బ్రతుకుతున్నామో దాన్ని దూషించకూడదు. అంతేకాదు, అది బాగుండాలని కూడా అనుకోవాలి. అదొక సంస్కారం. వీడి పీడ ఎప్పుడు విరగడ అవుతుందో, మనం ఎప్పుడు పెద్దవాళ్ళ మౌతామో... ఇలా ఉండకూడదు. కలియుగం ప్రభావం ఎలా ఉంటుందంటే ఈయన పోతే ఇహ

మనమే కదా, ఇక్కడ కూర్చోవచ్చు అన్నట్లుగ ఉంటుంది. సముద్రుడు మైనాకుని సంస్కారం తెలిసినవాడు కాబట్టి "నీవు ఎప్పుడూ నా అభ్యుదయాన్ని కాంక్షిస్తూంటావు కదా, నీవు ఈ విధంగా చేయి" అని కోరుతున్నాడు. అంతర్లీనంగా రామాయణంలో ఎన్ని సంస్కారాలు చెప్తున్నారో చూడండి. ఊరికే మనం చాలా మంచి వాళ్ళమని చంకలు గుద్దుకుంటే కాదు. ఒక ఇంట్లో మనం భోజనం చేస్తే ఆ ఇల్లు కలకాలం వృద్ధిచెందాలని కోరుకుంటూ భోజనం చేయమని మన సంస్కృతి చెప్తుంది. అక్కడ తిని వచ్చి 'ఉప్పూకారాలు ఎక్కువున్నాయి, అన్నీ మాడ్చేశారు, అదేం తిండి' ఇలా మాట్లాడుకోవడం సంస్కారాలు లేనివాళ్ళు చేసే పని. చిన్న ఉపకారం పొందినా అది గుర్తు పెట్టుకొని పెద్ద ఉపకారము చేయడం అనేది రాముడు చేస్తాడట.

రాముడి గుణాలు వివరించేప్పుడు అదొకటి చెప్తారు. అతనికి అవసరము లేకున్నా నువ్వు ఎంతో చిన్న ఉపకారం చేస్తే, ఆయన ఎంతో సంతోషించి కొండంత ఉపకారం చేస్తాడట. అదీ రాముడు. ఎందుకని? అది దైవమే! అటువంటి రాముని వద్ద నుండి దూతగా బయలుదేరి వస్తున్నవాడు ఈయన. ఆయనకి సహాయం అక్కర్లేదు. అయినా సంస్కారవంతులు కనుక, వారు చేస్తున్నారు. అసలు చేసే బాధ్యత వారికి ఉన్నది. ఏ పని ఎప్పుడు చేయవలెనో అప్పుడు చేయని యెడల సత్పురుషులకు కోపం వస్తుంది. అది మనం బాగా గుర్తుపెట్టుకోవాలి. ఏమిటో ఈయన ఎప్పుడూ తిట్టిపోస్తాడు అనుకోకూడదు. ఆయన నీ మంచికే తిడతాడు. ఎందుకంటే కాలం ఒకసారి జారిపోతే ఎప్పటికీ రాదు.

దానిని నీవు వృథా చేసినా, చేయవలసిన పనులు చేయవలసిన కాలంలో చేయక వృథా చేసినా, నీవు నా ఆశ్రితుడివైతే నేను నిన్ను కోప్పడి బాగు చేసుకోవాలి.

ఏదైనా ఒక పని చెప్తే ఆ పనిని సకాలంలో పూర్తి చేయడం సాధనలో చాలా ముఖ్యమైనది.. చెప్పిన పనిని చెప్పినట్లుగా చెప్పిన సమయంలో పూర్తి చేసినవాడినే లెక్కవేసుకుంటారు. అన్నీ మరచిపోయేవాడినీ, మళ్ళీ మళ్ళీ చెప్పించుకొనేవాడిని ఎవ్వరూ లక్ష్యపెట్టరు. ఎందుకంటే అప్రమత్తులు కాదు. దానికి కారణం సోమరితనము. సోమరితనము ఎవరి యందుంటే వారి యందు మరపు ఉంటుంది. చెప్పింది వ్రాసుకొని, ఎప్పటిలోపల పూర్తి చేయాలో చూసుకొని, అప్రమత్తంగా పనిచేస్తే సోమరితనమూ పోతుంది. సమయపాలన చేసే ఒక చక్కని సంస్కారము మనలో వస్తుంది. సమయానికి మనం చేయవలసిన పనులు చేయకపోతే జీవితంలో పెద్ద పెద్ద విషయాలు ఎన్నో పోతాయి. చిన్న చిన్న విషయాలలో ఈ సమయపాలన చేయనివారికి ఈ అపాయం చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకని సమయపాలన చేయాలి. మునిగిపోతుందని కాదు. సత్పురుషులు కాలం విలువ తెలిసిన వారు. అందుకే చేయవలసిన పనిని చేయవలసిన కాలంలో చేయకపోతే వారికి కోపం వస్తుంది.

అదీ చెప్తున్నాడు సముద్రుడిక్కడ. ఎవరికి కోపం వస్తుందిక్కడ? సముద్రుడికే! నువ్వు నా ఆశ్రయంలో ఉన్నావు. రెండవది నా మీద ఇక్ష్వాకు వంశానికి కోపం వస్తుంది. మా పనిమీద హనుమంతుడు సముద్రం మీద నుండి ఎగిరిపోతుంటే నువ్వేం చేయలేదు కదా!

అని కోపగిస్తారు. అంతే కాదు మైనాకుడికీ తెలుసు. వాయు దేవునికి మనం ఏం సహాయం చేయగలం? ఎలా చేయగలం? ఎప్పుడో కృతయుగంలో మైనాకుడికి వాయుదేవుడు సహాయం చేశాడు. సముద్రుడికి ఇక్ష్వాకులు చేసింది కూడా కృతయుగంలోనే. ఇప్పుడు త్రేతాయుగంలో ఉన్నారు. ఇప్పటివరకు వారికి ప్రత్యుప కారం చేసే అవకాశమే రాలేదు. ఇప్పుడు చేయకపోతే అటు వాయుదేవుడూ కోపిస్తాడు, ఇటు సముద్రుడూ కోపిస్తాడు అని వీళ్ళు అనుకోవాలి. అంతే!

నిజానికి సత్పురుషులకి ప్రత్యుపకారం చేయకపోతే కోపం రాదు. చెప్పిన పని చెప్పినట్లుగా చేయకపోతే కోపం వస్తుంది. ఎందుకంటే నేర్చుకోవలసిన బాధ్యత వారికి ఉన్నది. తన చుట్టూ ఉండేవాళ్ళకి ఓనమాలు దగ్గర నుండి నేర్పుకోవాలి. వాళ్ళకి అన్నీ వచ్చు, పెద్ద పెద్ద తత్త్వాలు తెలుసు, అయినా ఓనమాలు రావు. కాని, రావని వారికి చెప్పకుండా నేర్పించాలి. అలా నేర్పించడానికి సమయపాలన ముఖ్యం. సమయపాలనకి సత్పురుషులు చాలా ప్రాధాన్యత ఇస్తారు. చెప్పిన పని చెప్పిన కాలానికి చేయలేకపోతే, వాడికి వాడే పనికి రాడు, ఇహ మిగతావాళ్ళకి ఏం పనికి వస్తాడు? ఏ పని ఎప్పుడు చేయవలెనో అప్పుడు చేయని ఎడల సత్పురుష లకు కోపం వస్తుంది. ఈ వాక్యం మనం బాగా గుర్తు పెట్టు కోవాలి. ఎప్పుడో గుర్తొచ్చే కాలానికి, ఏ పౌర్ణమికో, ఏ అమావాస్యకో పనులు చేస్తే మనిషి పెరగడు. చెట్టు పెరిగినా, మొక్క పెరిగినా, సృష్టిలో ఏది పెరిగినా రోజూ పెరుగుతుంది అనుస్యూతంగా! అందుకని మనం కూడా ఒక continuity

పెట్టుకున్నప్పుడు మనకి ఉన్న కర్తవ్యాలలో కాలం మనకి అనుకూలించినంత వరకు చేసుకుంటూ వెడుతూండాలి. ఎందుకని? కాలం విలువ తెలిసి చేసుకోవాలి. ఈ రోజు మనం వాయిదా వేసుకుంటూ పోడానికి మనం చాలా కారణాలు చెప్పుకోవచ్చు. కొంతమంది ఏమయ్యా చెప్పిన పని చెయ్యలేదేమిటి అంటే సాకులు చెప్తుంటారు. వినే వాళ్ళకి చాల విసుగ్గా ఉంటాయి. చివరికి చెప్పింది చెయ్యలేక పోయావుగా!

హనుమంతుడు చెప్పచ్చు ఏమిరా అంటే మైనాకుడు తినడానికి చక్కగా పళ్ళన్నీ పెట్టాడు. అక్కడే ఉండిపోయాను అంటే ఎలా? కోతులకి ఫలాలు అతి ప్రీతికరమైనవి కదా! మనం కూడా ఇంట్లో అరగంట కింద ఇడ్లీ తిని బయలుదేరి, బెజవాడ వెడుతున్నాం. మధ్యదారిలో ఒకచోట మాంచి ఇడ్లీలు ఉన్నాయి. తిని వెడదామంటే? సరే! మళ్ళీ అనకాపల్లిలో మామిడిపళ్లు కనిపించాయి. తిని వెడదామన్నాం అనుకోండి. ఇంక ఇలా అయితే బెజవాడ ఎప్పుడు జేరుతావు? ఇలాగే కదా మనం చేస్తుంటాం? మనం బయలుదేరిన పని ముఖ్యమా, side issues ముఖ్యమా? గుర్తుపెట్టుకోండి, ఇలాంటి విషయాలలో సద్గురువులు కూడా పొరపాటు పడుతుంటారు. ఎందుకంటే ప్రపంచంలో ఉండే ఆకర్షణలు అలాంటివి.

మైనాకుడు శరీరానికి సంబంధించిన సమస్త సౌకర్యాలూ అక్కడ అతడికి సమర్పణ చేస్తాడు. ఇతడు ఈ bodily comforts కి లొంగిపోతాడా లేదా అనే పరీక్ష అన్నమాట. Bodily comforts ఉన్నా లేకపోయినా దైవకార్యాలు చేయగలడా! చెయ్యాలి. Bodily

comforts ఉంటే చేస్తాను, లేకపోతే చేయను అని అనకూడదు. ఆ సంసిద్ధత హనుమంతునికి ఉన్నది లేనిదీ దేవతలు పరీక్ష పెడతారు. ఎంత తెలిసినా సంసిద్ధత లేకపోతే ఏం కాదు. సంసిద్ధత ఉన్నా ఏమీ తెలియని వాళ్ళు ఏమీ చేయలేరు. సంసిద్ధత, సమర్థత, పవిత్రత ఈ మూడు ఉంటేనే వాడి నుండి పని అవుతుంది. ఏ పని అయినా రెండోసారి చెప్పించుకున్నాడుట అంటే వాడు పనికిరాని వాడని లెక్క. వాడు second class అని అర్థం. First class మరి చెప్పించుకోరు. Super class అయితే పక్కవాడికి చెప్తుంటే విని నేర్చుసుకుంటాడు. వీడికింకా చెప్పలేదు. కాని, వాడికి చెప్పిందానిలో మనకి కూడా ఉందని నేర్చుకొనే వాడు Super class అవుతాడు. మనల్ని మనం బాగు చేసుకుందాం అనుకుంటే ఇలా ఉంటాయి. నన్ను నేను బాగుచేసుకుందామని నేను ఈ క్లాసులు పెడుతున్నా, మీరు అందుకే వస్తున్నారు. అంటే మిమ్మల్ని మీరు బాగు చేసుకోడానికి మీరు వస్తున్నారు. బాగుపడదా మనుకుంటే చెప్పిన నియమాలు పాటించుకోవాలి.

తుని వెడుతుంటే అనకాపల్లిలో మా ఇంట్లో కాస్త భోజనం చేయండి సార్! టిఫిన్ చేయండి సార్! లేకపోతే నాలుగు పళ్ళు తినండి సార్! ఊహు తిరిగి వచ్చేప్పుడు అవకాశముంటే చూస్తాను. వెళ్ళిన పని వేరు. అందుకని ప్రలోభాలనేవి సద్గురువుకు మనకన్నా కొన్ని కోట్లరెట్లలో ఉంటాయి. ఈ హనుమంతుడికి లంక చేరే లోపల ఎన్ని ప్రలోభాలు వస్తాయో! అవే ప్రలోభాలు సద్గురువైన ప్రతివాడికీ వస్తాయి. మొదటి ప్రలోభము భౌతికమైన సుఖం,

సంతోషం, సంపద, సౌకర్యము ఇలాంటివి అన్నీ ఉంటాయి. వీటినే భోగాలు అంటారు.

ఏసుక్రీస్తు అంతటి వాడికి తపస్సు చేసుకొని, దైవకార్యం మీద జీవోద్ధరణకు బయలుదేరితే మొదటి ప్రలోభము ఏమి వస్తుంది? ఇప్పుడు తనకుండే శక్తికి మొత్తం భూగోళానికి చక్రవర్తి కాగల స్థితిమంతుడు అవుతాడు. అదొక ప్రలోభం లోపల నుండి వస్తుంది. అయిపోదాం అనుకుంటాడు. పెద్ద సన్నివేశాలు వచ్చి నప్పుడు పెరగాలి, లేనప్పుడు సాధారణంగా ఉండాలి. ఎప్పుడూ పెద్దగా శంఖుచక్రాలు పెట్టుకుని తిరగ నక్కర్లేదు. మామూలు మనిషల్లే ఉండు. పరిస్థితిని బట్టి పెరుగు. పెరిగి నీ శక్తిసామర్థ్యాలు చూపించు. హనుమంతుడు చాలా మామూలుగా ఉన్నాడు. కోతివలె ఉన్నాడు కాని కోతి కాదు కదా! అందుకని, మనం చాలా ఆధ్యాత్మిక సాధన చేస్తున్నాం, మిగతావాళ్ళకన్నా మనం చాలా special.... ఇవన్నీ పనికివచ్చే భావాలు కావు. సద్గురువుకి తన గురించే గుర్తుండకూడదు. అదేకదా హనుమంతుడికి తన శక్తి గురించి తనకు తెలియదు అంటారు.

అలా హనుమంతునికి రెండో పరీక్ష ఉంటుంది. ఎంత పెరగగలడు? ఎంత తరగ గలడు? ఎంత యుక్తిగా ఉండగలడు? అనే పరీక్ష అది. మూడో పరీక్ష ప్రతి సద్గురువుకీ ఉంటుంది. అదే స్త్రీ వ్యామోహం. తన వెంట ఒక స్త్రీ పడితే ఆ స్త్రీ వ్యామోహంలో తను చిక్కుకుంటాడా, అధిగమిస్తాడా? ఇలా మూడూ ఉంటాయి. అదే స్త్రీ లైతే పురుష వ్యామోహం. ఈ మూడు దాటినవాడే

సద్గురువు. దాటినవాళ్ళకి వీటికి సంబంధించిన పరీక్షలు చాలా పెద్దవి వస్తాయి. వాటిని అధిగమించి నప్పుడల్లా దేవతా శక్తి పెరుగుతుంటుంది. లోబడిపోతే మొత్తం అంతా గాలి తీసేసినట్లు అయిపోతుంది. ఇక్కడ హనుమంతునికి అసలు సంకల్పించినది సముద్ర లంఘనం. అది ఒక దుర్గమ కార్యం. దుస్సాహసంతో కూడినటువంటిది. ఎవరూ చేయలేరు. ఈ సంసార మనే సముద్రానికి ఎక్కడో లోపల అట్టడుగున పడిపోయిన జీవుడిని ఉద్ధరించడానికి నీవు సంసిద్ధుడి వయ్యావంటే తెలిసో తెలియకో ఎంతో పెద్దకార్యం సంకల్పించినట్లు. సామాన్యమైన విషయం కాదు. కాబట్టి దానికి నీవు మణిపూరక చక్రానికి సంబంధించిన వ్యామోహాలను తట్టుకోవాలి, స్వాధిష్ఠానానికి సంబంధించిన వ్యామోహాలను తట్టుకోవాలి, మూలాధారానికి సంబంధించిన వ్యామోహాలను తట్టుకోవాలి. మూడు పరీక్షలు. ఈ మూడు పరీక్షలే ఏసుక్రీస్తుకు సాతాను పెట్టిన మూడు పరీక్షలని చెప్తారు. సాతాను అనేది వేరే ఏమీ ఉండదు. నీలో ప్రలోభం పుడుతుందా, లేదా అనేది లెక్క! పుట్టడానికి చాలా అవకాశమున్నది.

"ఓ మైనాకుడా! నీ బంగారు శిఖరాల మీద ఇదివరకు దేవతలు, గంధర్వులు విహరించినారు." ఈ పర్వతం ఎటువంటి దంటే అడ్డమైన వాళ్ళూ తిరిగింది కాదు. అంతకు ముందు దేవతలు, గంధర్వులు మెచ్చి, విహరించి, నీ ఆతిథ్యం పుచ్చుకున్న ఉన్నతోన్నతమైన బంగారు పర్వతము నీది. "ఈ హనుమంతుడు నీ మీద నిలిచి అలుపు తీర్చుకుంటాడు. మిగతా దారి అంతా హాయిగా పోతాడు. ఓ మైనాకుడా! రాముడు సజ్జనుడు. భార్యను

పోగొట్టుకున్నాడు. అతని భార్య మైథిలి ఇప్పుడు పరదేశవాసం చేస్తున్నది. సీతారాములను ఒక దరి చేర్చడానికి ఇప్పుడు హనుమంతుడు ఆకాశమార్గాన పోతున్నాడు. ఆ రామునికోసం ఇతడు పడుతున్న శ్రమ గమనించు. ఇహ నీవు పైకిరా!" ఈ విధంగ సముద్రుడు చెప్పిన మాటలను మైనాకుడు విన్నాడు. మేఘమండలాన్ని భేదించి వచ్చే సూర్యునివలె సముద్రజలాల నుండి మైనాకుడు మహోన్నత వృక్షాలతోను, లతలతోను, బంగారు శిఖరాలతోను లేచి వచ్చినాడు. పైకి రావడమంటే కింద నుండి పైకి రావడము కాదు. కింద నుండి పైకి వ్యాపిస్తాడు. కింద అటునుండి రాక్షసులు బయటకి రాకుండా పాతాళానికి మూతగా ఉండి అక్కడ నుండే వ్యాపించాడు. రెండు పనులూ ఒకేసారి ఎలా చేయమంటావు, అని సముద్రుడితో అనలేదు. రెండూ అతడు చూసుకో గలడనే చెప్పాడు సముద్రుడు కూడా!

అంటే బాధ్యతలు పెరుగుతాయన్నమాట. నీ సంసిద్ధతను బట్టి నువ్వు అదీ చేసుకోవాలి ఇదీ చేసుకోవాలి. అలా బాధ్యతలు ఒకటికి రెండు, మూడు, నాలుగు, పది, వంద, వెయ్యి ఇలా పనులు పెంచేస్తారు. బాధ్యతలు అన్నీ సక్రమంగా నిర్వర్తిస్తున్నప్పుడే చైతన్యానికి expansion అంటే వ్యాపన శక్తి, శరీరానికి మంచి శిక్షణ, అణువులు కరుగుతాయి. ఒక పని చెప్తే ఇంకో పని మర్చి పోయే వారికి ఎప్పుడూ ఒకలాగే ఉంటుంది. అణువులకి చైతన్యం వ్యాపనం చెంది వాటిని కరిగించి చైతన్యవంతంగా చెయ్యాలంటే పని అలా పెంచుతూ పోవాలి. ఇంకొకడికి పెంచడం కాదు. సాధకుడు తనకు తానుగా పెంచుకోవాలి. సద్గురువు పని చేసే

వాళ్ళకి పెంచుతూ పోతాడు. అందుకనే తమిళంలో ఒక సామెత ఉన్నది. "పనిచేసే వాడికి పని ఇవ్వు, పని చేయని వాడికి తిండి పెట్టు" అని. పని చేయనివాడు పనిచేసే వాడికి అడ్డుపడు తుంటాడు చొల్లు కబుర్లు చెప్తూ. అలా చొల్లు కబుర్లు చెప్పేవాడు ఆ పని చేసేవాడిని పాడుచేస్తాడు కదా! అందుకని చొల్లు కబుర్లు చెప్పేవాడికి కడుపు నిండా పెట్టేస్తే వాడు నిద్రపోతాడు. ఈ పని చేసేవాళ్ళకి వాడు అడ్డురాడు. అలాగ మైనాకుడు ఆ పని ఇచ్చాడు కాబట్టి ఈ పని ఎత్తెయ్యకుండా ఆ మూత మూత గానే ఉంచి పైకి పెరిగాడు. పైకి బంగారు శిఖరములతో ఆకాశాన్ని అంటి ఉదయసూర్య కాంతులతో తేజరిల్లుతూ ఉంటే నల్లగ కనిపించే ఆకాశం బంగారు రంగులతో దేదీప్యమానంగా కనిపించింది. హనుమంతుడు 7వ ఆకాశంలో ఎగురుతుంటాడు. అంటే ఎంత వేగంగా వెళ్ళాలంటే అంత ఎత్తున ఆకాశంలో ఎగరాలి. మామూలు విమానం 10,000 అడుగుల ఎత్తులో ఎగురుతుంది. జెట్ విమానం 30,000 అడుగుల ఎత్తున ఎగురుతుంది. దీనికి దానికి చాలా తేడా ఉంటుంది. ఎత్తు పెరిగే కొలది speed వస్తుంటుంది. నువ్వు కూడా అంతే! నీ చైతన్యం బాగా ఊర్ధ్వగతికి వెళ్ళేకొలది పనులు విపరీతంగా జరిగి పోతుంటాయి. అంటే యమస్పీడ్‌గా అన్నమాట. వాడు హైవే మీద వెడుతున్నాడు, నువ్వేమో కంకర రోడ్డుమీద వెడుతున్నావు. వాడికి నీకూ తేడా లేదూ? మీతో రాలేం సార్! అంటే ఉండిపోండి అంటాడు. మాస్టర్ ఇ.కె.గారు 79లో అన్నారు, "ఇకనుండి నాతో రాగలిగినవారే నాతో ఉంటారు. నేను వేగం పెంచుకుంటున్నాను, నాతో రాగలిగిన వారు రండి" అని. వేగాలు అలా పెరిగిపోతుంటాయి.

అలా ఆకాశంలో పైన పోతున్న హనుమంతునికి అడ్డంగా వెళ్ళాలి మైనాకుడు. అంటే ఎంత పెరగాలో అంత పెరిగాడు. పెరిగి అక్కడ ఆ నీలాకాశంలో మరో సూర్యుడొచ్చినట్లు పెరిగి పోయాడు. నీలాకాశాన్నే నల్లని ఆకాశమని కూడా అంటారు. ఏ అడ్డమూ లేకుండా అలా పైకి పెరిగిపోయిన ఆ మైనాక పర్వతమును హనుమంతుడు చూచినాడు. తనకు సముద్ర మధ్యంలో విఘ్నం ఒకటి వచ్చిందని అనుకున్నాడు. వాయుదేవుడు మేఘములను కిందకు తోసివేసినట్లు ఆకాశమంత ఎత్తున లేచిన మైనాక పర్వతాన్ని ఆ మహాబలవంతుడు హనుమంతుడు తన ఎదురు రొమ్ములతో ఢీ కొట్టినాడు. అంత వేగముతో వచ్చి తనని ఢీ కొట్టినందుకు ఆ మైనాకునకు ఒళ్ళు పులకించినది. మామూలుగా దుష్టుడైతే మూర్ఛపోతాడు. చైతన్యవంతుడు కనుక ఇంకొక అతి మహత్తరమైన చైతన్యము తాకినందువలన పులకించాడు. ఆయన ఢీ కొట్టి దాటిపోయాడు. ఎంతో వేగంగా వెళ్ళిపోతున్నాడు!

మహాత్ముల స్పర్శ మనకి తగిలినప్పుడు మన ఒళ్ళు అలా పులకరిస్తుంది. అంటే వాళ్ళు చెంప పెట్టు పెట్టినా ఒళ్ళు పులకరిస్తుంది. షిరిడీ సాయిబాబా అదే చేస్తుంటారు. వాళ్ళు కోరి కొట్టించుకొనేవారు. దాంతో వాళ్ళపని అయిపోయేది. గిచ్చు కోవడం, కోప్పడటం, తిట్టడం ఆయన విధానం. ఎందుకంటే ఒక మాట మెత్తగా చెప్పినదానికి, ఒక దెబ్బ గట్టిగా కొట్టినదానికి చాలా తేడా ఉంటుంది. Impact కోసం ఒక్కొక్కసారి ఒక్కొక్క సద్గురువు పరిస్థితిని బట్టి, శిష్యుడికి తనకీ ఉన్న సన్నిహితాన్ని బట్టి చేస్తుంటాడు. కొంతమందితో మర్యాదగా మాట్లాడుతుంటాడు.

కొంచెం దగ్గరైన వాళ్ళకి ఎక్కువ పనులు చెప్తుంటాడు. ఇంకా దగ్గరగా ఉన్నవాళ్ళు సరిగ్గా చేయకపోతే కోప్పడతాడు. ఇంకా దగ్గరగ ఉన్నవాడికి చిన్నచిన్న పొరపాట్లకే ఇంకా ఎక్కువ తిట్లు, చీవాట్లు ఉంటాయి. మనల్ని మర్యాదగా చూస్తున్నారుట అంటే మనల్ని దూరంగా పెట్టారుట అని అర్థం. ఇదీ సద్గురువు దగ్గర లెక్క. చాలా మర్యాదగా చూస్తుంటారు. ఏంటంటే ఇంకా ఆయన మన మార్గంలోకి రాలేదు. మార్గంలోకి వచ్చాడంటే వదలడు. అదీ సద్గురువు చేసే పని. అతను అంగీకరించాడు అంటే ఇహ వాడు గిలగిల్లాడాల్సిందే! వాడు బాగుపడేంత వరకు వాడిని పిశాచం కన్నా గట్టిగా పట్టుకొని వదలడు. అంగీకరించడం మాత్రం చాలా పెద్ద విషయం.

Accepted descipleship అని మాస్టర్ జ్వాల్‌కూల్ మహర్షి రాస్తారు. గురువులు శిష్యులని అంత తొందరగా అంగీకరించరయ్యా, అంగీకరించారంటే మాత్రం నువ్వు చాలా అదృష్టవంతుడివి. నువ్వు ఎటువంటివాడివైనా వాళ్ళే ఉద్ధరించేసుకుంటారు. అంగీకరించడం అనేది నీకు సంబంధించినది. నీ పవిత్రతకి, నీ శ్రద్ధకి, నీ ఏకాగ్రతకీ, నీ కర్తవ్య ఉన్ముఖత్వానికి సంబంధించి ఉంటుంది. ఒకసారి అంగీకరించారో పెళ్ళి చేసేసుకున్నట్లే! భారతదేశంలో పెళ్ళి చేసుకున్నాక పెళ్ళాం తన మాట వినకపోయినా తప్పదు. మొగుడు తన మాట వినకపోయినా పెళ్ళాంకి తప్పదు. ఏదో మనం అనుకున్నట్లులేదు అని వదిలెయ్యలేరు. ఇది కూడా అంతే! గురుశిష్య సంబంధం కూడా పతి-పత్ని సంబంధం లాంటిది. అందుకనే ఒక పట్టాన అంగీకరించరు.

మైనాకుడికి ఒళ్ళు పులకరించిందట! అప్పుడు మైనాకుడు మనుష్యరూపము ధరించి తన పర్వత శిఖరం మీద నిలుచొని వీరుడైన ఆ హనుమంతుని చూచి 'వానరోత్తమా! నీవు దుర్ఘటమైన కార్యము తలపెట్టినావు. నా శిఖరాల మీద వాలు. కొంతసేపు అలుపు తీర్చుకో. ఆ పైన సుఖంగా పో'. అని తను చెప్పాల్సింది చెప్పాడు. ఓ హనుమంతుడా! ఈ సముద్రుని పూర్వము సగర చక్రవర్తి పుత్రులు అభివృద్ధి చేసినారు. వాళ్ళే సాగరులు. రాముడు ఆ సగర చక్రవర్తి వంశీయుడు. అందుచేత సముద్రుడు రామునికి మేలు చేయడానికి నిన్ను పూజింప తలుచుకున్నాడు. ఉపకారికి ప్రత్యుపకారం చేయడము సనాతన ధర్మం (అది గుర్తు పెట్టుకోవాలి). రాముడికి సాయం చేస్తున్న నిన్ను పూజించి ఈ సముద్రుడు సాగర వంశములో పుట్టిన రామునికి ప్రత్యుపకారము చేసినవాడు కాదలుచుకున్నాడు. కృతజ్ఞుడైన ఈ సముద్రుడు నాతో 'మైనాకుడా! ఈ హనుమంతుడు నూరు యోజనాల దూరం పోవలెను. ఈతడు నీ నెత్తాలలో అలుపు తీర్చుకున్నట్లైతే ఇక్కడ నుండి మిగతా దారి సులభముగా దాటిపోతాడు. నీవు పైకి లేవవలెను' అని చెప్పి నిన్ను గౌరవించడానికి నన్ను ప్రోత్సహించినాడు, అందువల్ల నీవు నామీద విశ్రమించి ఇక్కడ ఉన్న రుచ్యములైన కందమూలాల ఫలాలను ఆరగించు. అలుపు తీర్చుకొని ఆ తర్వాత వెళ్ళు! అని ప్రార్థించాడు.

హనుమంతుడు దుర్ఘటమైన సముద్ర లంఘనము అనే దైవ కార్యాన్ని పెద్దల అనుగ్రహము పొంది ప్రారంభము చేసినప్పుడు అతనికి మొదటగా మైనాకుని సాదర ఆహ్వానము లభించింది. కర్తవ్యమునందు ఉన్ముఖుడై ఉండడంచేత హనుమంతుడు

మైనాకునితో స్నేహభావంతో, సుహృద్భావంతో చేసిన ఏర్పాట్లను అనుభవించకే భావన ద్వారా తాననుభవించినట్లుగా సంతృప్తి చెంది ముందుకు సాగాడు. కర్తవ్య నిర్వహణయందు అతడికి గల దీక్షను చూసి దేవతలు చాలా సంతోషించారు. కర్తవ్య దీక్ష ఎవరికి ఉన్నా వారు ఇతర సౌకర్యాలతో సంబంధము లేకుండా కర్తవ్యాన్నే నిర్వర్తించుకుంటారు. అలా నిర్వర్తించుకున్న వాళ్ళు మాత్రమే జీవితంలో దేన్నయినా సాధించవచ్చు. ప్రత్యేకించి ఒక సద్గురువుకి ఏర్పడే సత్కారాలు, సపర్యలు, విందులు, భోజనాలు వీటి ద్వారా అతడు కర్తవ్యాన్ని మరచే అవకాశం కలదు. హనుమంతుడు సద్గురువు కాబట్టి జీవుడిని దైవం వద్దకు చేర్చడానికి తను చేసే మహత్ ప్రయత్నంలో మొదటగా ఇతడి కార్యదీక్ష చూసి దేవతలు 'ఇతడు సంకల్పము నందు పూర్ణమైన దీక్ష గలవాడు, మార్గము తప్పడు' అని గ్రహించడం జరుగుతుంది.

మొదటగా సద్గురువు జీవునికి సత్యదర్శనం చేయించడానికి జనుల మధ్యకి వచ్చినప్పుడు అతడు జనుల పొగడ్తలకు, సత్కారములకు, ప్రశంసలకు ఇత్యాది వాటికి లోబడే అపాయ మున్నదని తెలుస్తున్నది. దేవతలు ఇతడు చేసిన కార్యాన్ని చూసి ఆనందించి, పరమహర్షులైనారని వాల్మీకి మహర్షి రాయడం జరిగింది. అటుపైన దేవతలకి ఇతనియందు వేడుక గలిగి ఇతడికి ఇంకా ఎంత సామర్థ్య మున్నది, యుక్తి ఉన్నది, సమయస్ఫూర్తి ఉన్నది అనే విషయాలను పరీక్ష చేయాలని భావన చేశారు. దైవ కార్యము నిర్వర్తించే వారికి ఇక్కడ హనుమంతుడు నిర్వర్తించి చూపే గుణాలన్నీ కూడా పరిపూర్ణంగా ఉండాలి. సమయస్ఫూర్తి

లేకపోయినా, యుక్తి లేకపోయినా, సామర్థ్యము లేకపోయినా, సమయానుకూలంగా కార్యాన్ని చక్కబరచ లేకపోయినా, కాలం వృథా చేయకుండటం తెలియకపోయినా అతడు సత్కార్యములు చేయలేడు, జీవులను ఉద్ధరించలేడు.

ఎందుకంటే తానే లోబడిపోతే తాను ఇతరులకి సహాయం చేసే పరిస్థితిలో ఉండడు. ఎందుకంటే తను ప్రవేశిస్తున్నది పంచ భూతాత్మకమైన సృష్టి లోపల. అక్కడ రకరకములైన ఆకర్షణ లుంటాయి. మోహము లుంటాయి. మమకారము లుంటాయి. వాటన్నిటికినీ తాను సంబంధించిన వాడు కాదని, దైవమునకే సంబంధించిన వాడని భావన చేసుకుంటూ, వీరందరినీ ఉద్ధరించ డానికి భగవంతుడు తనని ఎన్నుకున్నాడనే భావన కలిగి ఉంటాడు. ఆ భావనకు చిహ్నంగానే రాముడిచ్చిన ముద్రిక. ఇంతకుముందు ఎంతోమంది వానరులు, సమర్థవంతులు ఉన్నప్పటికీ కూడా దైవముచేత ఎన్నుకొనబడినవాడే గురుడు. జ్ఞానులు ఎంతోమంది ఉండవచ్చు. అందరినీ భగవంతుడు తన కార్యానికి వినియోగించుకోడు. అలా ఎవరైతే భగవంతుని చేత అనుగ్రహింపబడి కార్యములు నిర్వర్తిస్తుంటారో వారి సమర్థతను ఒకసారి మనం కూడా తరచి చూద్దాం అని దేవతలు పరీక్ష పెట్టడానికి నిర్ణయం చేసుకున్నారు. ఇటువంటి పరీక్షలు సజ్జను లందరికీ జరిగినాయి. హరిశ్చంద్రుడికి ఇటువంటి పరీక్ష జరిగింది. ఎందుకంటే అతడు సత్యవంతుడు అని చెప్పినప్పుడు సత్యానికి ఎంతవరకూ నిలబడతాడు అని దేవతలలో ఒక వివాదం వచ్చి విశ్వామిత్ర మహర్షిని దానికి ప్రయోగించారు. అలాగే చాలా

కథలు మనకి గోచరిస్తాయి. అలాగే ఇక్కడ కూడ దేవతలు ఒక నిర్ణయం చేసుకున్నారు.

హనుమంతుడు ఒక ముహూర్తంలో ఆ ప్రదేశము దాటి అవతలకు పోయినాడు. మైనాకుడిని స్పృశించి స్నేహభావంతో, సుహృద్భావంతో అతడియొక్క అనుజ్ఞగొని, అతడి ఆశీస్సులు కూడ అందుకొని ముందుకు సాగాడు. అంతట దేవతలు, గంధర్వులు, సిద్ధులు, పరమ ఋషులు, సూర్యకాంతులతో తేజరిల్లే నాగ మాతను చూచి 'ఓ సురసా! ఈ కాంతిమంతుడు, వాయుపుత్రుడు హనుమంతుడు ఈ సముద్రము మీద ఎగిరిపోతున్నాడు. నీవు ఇతని గమనాన్ని ఒక ముహూర్తము సేపు విఘ్నము చేయవలెను.' ముహూర్తమే అన్నారు, ఎందుకంటే వారంతా కూడా ఇతడు రామకార్యం చేయవలసి ఉన్నదని తెలిసినవారు. దేవతలు ఎప్పటి కప్పుడు రాముడిని జనస్థానానికి, చిత్రకూట పర్వతానికి, పంచ వటికి మార్గం చూపించి అక్కడ సీతాపహరణం జరిగేట్లుగా వెనుక నుండి కథ నడిపిస్తారు. రావణ వధకు రాముడు వచ్చాడు కాబట్టి ఆ కథ అలా నడిపిస్తారు. అందుకే హనుమంతుడు రామ కార్యం చేస్తుంటే అడ్డు పడడం ఉద్దేశ్యం కాదు. ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించ గలడా లేడా అనే ఉద్దేశ్యంతో దేవతలు కొన్ని విఘ్నాలు ఏర్పాటు చేశారు. నీవు పర్వతం ఎత్తున భయంకరమైన రాక్షసరూపం దాల్చి, పెద్ద పెద్ద కోరలతో, పెద్ద నోటితో, తేనెరంగు కన్నులతో ఆకాశమంత ముఖముతో నిలిచి ఉండవలెను. మేము ఇతడి బల పరాక్రమములు తెలిసికొనవలెను అని అన్నారు.

ఇందాక వారు తెలుసుకున్నది అతడికి కార్యమునందు గల దీక్ష, సౌకర్యములకు లొంగని స్వభావము, అలాగే తను వచ్చిన పనిమీద మాత్రమే ధ్యాస కలిగి, పక్కదారులలో ఉండే ఏవిధమైన ఆకర్షణలలోనూ ప్రవేశించని పట్టుదల ఉన్నదని తెలుసుకున్నారు. ఇప్పుడు వారు పెట్టే పరీక్ష అతడికి పరాక్రమము, యుక్తి, శక్తి, బలం, సామర్థ్యం, సమయస్ఫూర్తి ఎంత ఉన్నది అని తెలుసు కోవడానికి.

సురస అంటే పరిపూర్ణమైన రసమూర్తి అని అర్థం. నాగులకు మాత అంటే చాలా పెద్ద విషయం. నాగులంటే కేవలం కుండలిని చైతన్యం రూపుదిద్దుకుంటే అది నాగమాత అవుతుంది. అందుకనే మన పురాణాలలో కాని, మన శాస్త్రాలలో కాని, మన గ్రంథాలలో కాని నాగులకు, సర్పాలకు తేడా చెప్తారు. సర్పాలన్నీ నాగులు కావు. కేవలం పరిపూర్ణమైన ప్రజ్ఞావంతులు ఆ రూపంలో ఉంటారు. కుండలిని పరిపూర్ణంగా అనుభూతి చెంది కాలాన్ననుస రించి జీవులకు ఆశీర్వచనముల నందిస్తూ, తమవంతు కర్తవ్యాన్ని భగవత్పరంగా నిర్వర్తించే వారంతా నాగులు. వారందరిదీ కూడా vertical movement, అంటే నాగుపాము తోకమీద నిలువుగా పైకి లేవగలదు. 'గ' అంటే గమనము. 'అగ' అంటే గమనము లేకపోవుట. న అగ అంటే గమనము లేకపోవుట కలిగినటు వంటిది. అంటే కదులుతోందా అంటే, కదులుతున్నట్లు తెలియదు. కాని కదులుతోంది. కదులుతూ కూడా కదలనట్లు కనిపించేది. భూమి అటువంటిది.

భూమి చాలా వేగంగా కదులుతోంది కాని మనకు కదులుతున్నట్లు తెలుస్తున్నదా? మనం అనుకొనే జెట్ విమానాలకన్నా వేగంగ కదులుతోంది. ఒక జెట్ విమానం ఈ భూమి చుట్టూ ఒకసారి తిరగాలంటే ఒక 24 గంటలకన్నా ఎక్కువ సమయం పడుతుంది. కాని అది అంత వేగంగా కదులుతున్నట్లు మనకి తెలియదు కదా! స్థిరంగ ఉన్నదనే ఇల్లు కట్టుకుంటున్నాం, సామాను సర్దుకుంటున్నాం. కదులుతున్నా ఈ సామాను ఏం పడిపోకుండా తిరుగుతోందే! ఎంత గొప్పవిషయం? అదీ నాగజాతి. వాళ్ళు సమస్తమూ నిర్వర్తిస్తుంటారు. నిర్వర్తిస్తున్నట్లు ఎవ్వరికీ తెలియవలసిన అవసరము లేదు. తెలియదు కూడా! అంత సున్నితమైన పద్ధతులలో వాళ్ళు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తుంటారు.

మనలో కదిలేవి చాలా ఉన్నాయి. కాని వీటన్నిటినీ కదిలించేది ఒకటి ఉన్నది. ఆ కదిలించేది మనకు ఉన్నట్లు కూడా తెలియదు. మనకు ఆలోచనలు వస్తుండడం తెలుసు. ఇంద్రియాలు పనిచేయడం, శరీరం కదులుతూ ఉండడం, ఉచ్ఛ్వాసనిశ్వాసలు, వీటికి ఆధారమైన స్పందనం కూడా మనకు తెలుస్తుంటుంది. స్పందించే ప్రజ్ఞ, ఆ స్పందనాన్ని ఎలా స్పందింప చేస్తోంది మనకి తెలియదు కదా! అది ఉండబట్టికదా ఇవన్నీ జరుగుతున్నాయి? మనో వ్యాపారంగాని, ప్రాణ వ్యాపారంగాని అది లేకపోతే ఏవీ జరగవు కదా! ఏ శక్తి ఆధారంగా జీవుడిలో ఇన్ని కదలికలు జరుగుతున్నాయి? అది కదులుతున్నట్లుండదు. 'కదలినట్లు తోచు కదలకుండు.' నాసత్య స్థితి అని చెప్తారు దీన్ని. ఉన్నదా అంటే ఉన్నదని చెప్పలేము, లేదా అంటే లేదని చెప్పలేము. నా అసత్యము

అన్నారు దాన్ని. అశ్వినీ దేవతలు అటువంటి వారు. నా అసత్యులు. మనలో కుడి ఎడమ భేదాలు తెలిపేవారు, ఈ సృష్టిలో పదార్థాన్ని, ప్రజ్ఞని ప్రతి లోకంలోను చక్కగా అల్లిక చేసేవారు. ఎవరికీ ఉన్నట్లుగ తెలియనివారు.

మహాత్ముల ప్రజ్ఞ అలా ఉంటుంది. వాళ్ళు డబ్బా కొట్టు కుంటూ బతికేవారు కాదు. వారున్నట్లుకూడా ఎవరికీ తెలియని పద్ధతులలో నిర్వర్తించుకొని వెళ్ళిపోయేవారు. అలా ఉండే వారిని నాగులంటారు. నాగ అనే పదం నుండే 'నజ' అనే పదం వచ్చింది. అందుకనే ఏసుక్రీస్తును నజరీన్ అన్నారు. ఆయన ఎంత శక్తివంతుడో అప్పుడు ఆ కాలంలో నివసించినప్పుడు ఎవరికీ తెలియదు. అలాగే పరమగురువు లందరినీ నాగులంటారు. నాగాలాండ్ అని మనం దేన్నయితే అంటున్నామో అక్కడ ఇలాంటి మహాత్ములు ఒకప్పుడు చాలా ఎక్కువగ ఉంటుండేవారు. అందుకనే మనం నాగుపాముకు పూజ చేస్తాం. ఏ పాము పడితే ఆ పాముకు పూజ చేయం. ఎందు కంటే అది కుండలినీ చైతన్యం. అదీ నాగులచవితి నాడు ఎందుకు ప్రార్థన చేస్తాం అంటే మన రాశి చక్రంలో వృశ్చికరాశి లేక కార్తీకమాసం మూలాధార ప్రజ్ఞకి సంబంధించినది. అక్కడ మనకి కుండలినీ చైతన్యం ఉంటుంది. ఆ కుండలినీ చైతన్యమును ప్రార్థన చేసి దాన్ని ఊర్ధ్వముఖం పట్టించడంకోసం మనకి నాగపూజ ఇచ్చారు. నాగపూజ చేసుకుంటే సమస్తదోషాలు తొలగిపోతాయి అని పెద్దలు చెప్తారు. అందుకని కార్తీకమాసంలో మనం నాగపూజ చేసుకొని ఆరాధన మొదలు పెట్టి మార్గశీర్షమాసంలో ఇంకొంచెం పెంచి, మకరమాసంలో హృదయం చేరి, కుంభరాశికి ఫాలభాగం

చేరి, మీనరాశి లేదా ఫాల్గుణమాసానికి సహస్రారం చేరే సాధన మనకి ఇచ్చి ఉన్నారు. ఇవన్నీ కూడా ఈ నాగకి సంబంధించినవి.

నాగ అంటే మనలోవున్న కుండలినీ చైతన్యము. ఈ చైతన్యములో భూమికి ఒక కుండలినీ చైతన్యము ఉన్నది, అది భూమిని కదిలిస్తుంటుంది. మనలో ఉన్న కుండలిని చైతన్యము మనల్ని కదిలిస్తుంటుంది. అలాగే ఇన్ని రకములైన గోళములు, జీవులు వీటి యొక్క చైతన్య ముంటుంది. ఆ చైతన్యం భూమి, ఆకాశాన్ని ఆవరించి ఉంటుంది. అన్నీ ఆ చైతన్యానికి లోబడే ఉంటాయి. అందుకని ఆ చైతన్యంలో ప్రవేశించి, ఆ చైతన్యాన్ని అధిగమించి సమయస్ఫూర్తితో హనుమంతుడు బయటకి రాగలడా అనేది ఇక్కడి పరీక్ష! ఇది చిన్న పరీక్ష కాదు. ఏదో దారిలో వస్తే సమయ స్ఫూర్తితో తప్పించుకున్నారుట అనే విషయం కాదు. పైగా బ్రహ్మ ఇచ్చిన వరం ఉన్నది. అదేమిటి అంటే ఆమె నోట్లో ఎవరన్నా పడితే మరి బయటకు రాలేరు. మనమంతా అదే! ఆ విధంగా సృష్టి జీవులంతా కూడా మింగబడ్డవారే! అది కూడా మరొక విధమైన కాల స్వరూపంగా భావన చేసుకోవాలి. అటువంటి నాగమాతని పిలిచి 'వెళ్ళేవాడు కాంతిమంతుడు' అని చెప్పారు. పరిపూర్ణమైన వెలుగు స్వరూపమది. ఆయనలో ఎటువంటి రంగు లుద్భవించి నాయో ఆయన లంఘనం చేసేప్పుడు కనిపించాయి.

వేగం అంటే వాయుపుత్రుడు. "అతి వేగంగా సముద్రాన్ని లంఘిస్తున్నాడు, ఇతని గమనాన్ని నువ్వు విఘ్నం చెయ్యగలవేమో చూడమన్నారు" సురసని. ఎందుకంటే చేయవలసిన కార్యం చాలా దుర్గమమైన కార్యం, ఎవరూ చేయగలిగినది కాదు. ఎవరి వలనా

అయ్యే పని కాదు, హనుమంతుని వలన మాత్రమే అయ్యే పని. అసలు ఇతడు చేయగలడా లేదా? ఇలాగ సద్గురువులకి పెద్దలు పరీక్షలు పెడుతుంటారు. దీన్ని అధిగమించితే సద్గురువు. అప్పుడు దేవతల సహకారం పరిపూర్ణంగ ఉంటుంది. ప్రతి సద్గురువు యొక్క సాన్నిధ్యంలో అందరి దేవతల సాన్నిధ్యమూ ఉంటుంది. అందుకనే మీ పరిస్థితులని బట్టి ఒక్కొక్కళ్ళకి ఒక్కో దేవతా మంత్రాన్నిచ్చి తద్వారా పరిమితమైన స్వభావం నుండి నిన్ను ఉద్ధరించే కార్యాన్ని చేపడతాడు. అలా రక రకాలుగా మంత్రాలిచ్చి, ఆ మంత్ర దేవతల ద్వారా తానే పనిచేయించి, తానే పనిచేసి తద్వారా జీవులని ఉద్ధరింపచేసే మంత్రశాస్త్రవేత్త అయి ఉండాలి సద్గురువు. హనుమంతుడు రాముడిని కలిసే ఘట్టంలో కిష్కింధ కాండలో చెప్పుకున్నాం, ఆచార్యునికి ఎటువంటి అర్హతలు ఉండాలి అని తెలుసుకున్నాం. అందులో ఒకటి వేదం తెలియడం, శాస్త్రము తెలియడం, మంత్రము తెలియడము, మంత్రద్రష్ట అయి ఉండడం, మంత్ర దేవత తను చెప్పినట్లుగా సహకరించి జీవులని ఉద్ధరింప చేయడం అనేవి చేయగలిగిన వాడే ఆచార్యుడు.

రాముడు లక్ష్మణునికి హనుమంతుని సద్గుణాలని ప్రశంసించుతూ చెప్తాడు. ఇప్పుడు ఇక్కడ కూడా మొత్తం కుండలిని చైతన్యము యొక్క అనుగ్రహము, ఆనుకూల్యము, స్వామిత్వము ఇతనికి ఉన్నవా లేవా అని పరీక్ష. ఎందుకంటే కాలం మింగితే అందులోంచి బయట పడగలిగినవాళ్ళు ఎవరు? రాహువు మింగితే కేతువు పట్టుకుంటే చేయగలిగినవాళ్ళు ఎవరు? అయినా హనుమంతుడు వీటన్నిటికీ అతీతుడు. సూర్యబింబాన్నే మింగ

గలిగినవాడు. అందుకే హనుమంతుని ఆరాధన వలన కుజ దోషాలు పోతాయి. హనుమంతుని ఆరాధన వలన రాహు కేతు బంధనాలు పోతాయి. హనుమంతుని ఆరాధన వల్ల శనిగ్రహ ప్రభావము సరి అయిన రీతిలో ఉంటుంది. అసంబద్ధంగా మనల్ని ఇబ్బంది పెట్టదు. ఈ విధంగా హనుమంతుడు రకరకములైన గ్రహముల మీద ఆధిపత్యము కలిగినవాడు. అందుచేత ఈ సురస అనే నాగ దేవతను దేవతలు ప్రయోగించారు. 'నీవు పర్వతం ఎత్తున భయంకరమైన రాక్షసరూపం దాల్చి, పెద్ద పెద్ద కోరలతో, పెద్ద నోటితో, తేనెరంగు కన్నులతో, ఆకాశమంత ముఖముతో నిలిచి ఉండవలెను. మేము ఇతడి బలపరాక్రమములు మళ్ళీ ఇప్పుడు తెలుసుకొనవలెను అనుకుంటున్నాము. ఇతడు ఏదైనా ఉపాయంతో నిన్ను గెలుస్తాడో లేదా ఓడిపోయి దుఃఖపడతాడో తెలుసుకొనవలెను.' ఇది దేవతా పరీక్ష. ఓడిపోతాడా మరిక ఈ పనికి పనికిరాడు అని అర్థం.

దేవతలు అలా చెప్పడంవల్ల ఆ సురస భయంకరమైన రాక్షసాకారంతో హనుమంతుని కమ్ముకొని (అంటే అన్ని ప్రక్కలా ఆమే ఉంది) "ఓ హనుమంతుడా! దేవతలు నిన్ను నాకు ఆహారంగా చూపించారు. నేను నిన్ను భక్షిస్తాను. నా నోటిలో చొరబడు" అన్నది.

అట్లా నోరు తెరచిన ఆ సురసాదేవిని చూచి ఆ కాంతి మంతుడు హనుమంతుడు చేతులు జోడించి ముఖాన సంతోషము ఉట్టిపడుతూ, (ధరించినది భయంకరమైన రాక్షసాకారము. కేవలము నోరు మాత్రమే ఉన్నది. కాళ్ళూ చేతులూ లేవు. పైగా

నిన్ను దేవతలు నాకు ఆహారంగా పంపించారు అంటే హను మంతుడు చేతులు జోడించాడట! ఎందుకు జోడించాడు? రాక్షసి అయితే జోడించడు కదా! రాక్షసాకారమే గాని రాక్షసి కాదని ఆయనకి తెలిసిపోయింది. అందుకే ఆయన చేతులు జోడించాడు.)

'ఓ సురసా' అన్నాడు. అదేమిటండీ! నువ్వు ఏ ఆకారంలో వచ్చినా నిన్ను నేను గుర్తించ లేకపోను అని చెప్పడము. ఎంత పెద్ద విషయం! వచ్చినావిడ రాక్షసాకారంలో కేవలము నోరు మాత్రమే కనబడేటట్లు వచ్చింది. మాటలు వినిపిస్తున్నాయి. కానీ ఈయన పిలవడమే ఓ సురసా! అని పిలిచాడు. "దశరథ మహారాజు కుమారుడైన రాముడు పితృ ఆజ్ఞా పరిపాలనకోసం తమ్ముడైన లక్ష్మణునితోను, భార్య వైదేహితోను దండకారణ్యమునకు వచ్చాడు. అతడికి రాక్షసులతో బద్ధవైరం వచ్చింది. ఆ రాముడు అన్యకార్యాసక్తుడు అయి ఉండగా అతడి భార్య యశస్విని, సీతాదేవిని రావణాసురుడు ఎత్తుకు పోయినాడు. నేను ఆ రాముడి దూతను. రామాజ్ఞతో నేను సీతాదేవి వద్దకు పోతున్నాను. నీవు నివసిస్తున్నది రాముడి దేశము. అందువలన నీవు రామునకు సహాయము చేయవలెను". రాజుకు సాయం చేయవలసిన బాధ్యత నీకు కూడా ఉన్నది. రామకార్యం మీద వెడుతున్నాను, రామబాణంగా వెడుతున్నాను అని చెప్పాడు. రామ బాణానికి తిరుగేమున్నది? తిరిగి వచ్చే ప్రశ్నేది? నువ్వంటే నాకు గౌరవమే! నీ నోట్లో పడడానికి ఏం అభ్యంతరం లేదు. కాని నేనొక పని మీద వెడుతున్నాను. ఆ పని పూర్తి చేసుకొని వచ్చి కావాలంటే నీ నోట్లో పడతాను. మైథిలిని చూడాలి, ఆమె ఎక్కడ ఉన్నదో రాముడికి

చెప్పాలి. చెప్పేస్తే తర్వాతి కార్యం రాముడే చేసుకుంటాడు. అంతవరకే నా పని. అంతవరకు నాకు సమయం ఇస్తే నేను మళ్ళీ వచ్చి నీ నోట్లో పడతాను. 'నీకు సత్యంగా చెప్తున్నాను. నువ్వు నమ్ము' అన్నాడు.

ఆ కామరూపిణి సురసాదేవి హనుమంతునితో 'ఎవడూ ఇక్కడ నుండి మీరిపోవడానికి వీలు లేదు. నాకట్లా బ్రహ్మదేవుడు వర మిచ్చినాడు. ఇప్పుడే నీవు నా నోటిలో పడవలెను. నేను బ్రహ్మవరప్రసాదను.' కాబట్టి నాకేవో పనులున్నాయంటే కుదరదు. ముందు నా సంగతి చూసి తర్వాత నీ సంగతి చూసుకో అన్నదన్నమాట. హనుమంతునికి కోపం వచ్చి 'ఓ సురసా నన్ను మింగడానికి వీలయ్యేట్లు నోరు తెరువు' అంటూ పదియోజనాల వెడల్పుగా తన కాయాన్ని పెంచాడు. సురస అంతట 20 యోజనాల వెడల్పుగా నోరు తెరిచింది. ఈ విధముగ ఒకరితో ఒకరు పోటీపడినారు. హనుమంతుడు దేహాన్ని 90 యోజనాల వెడల్పు పెంచాడు. సురస 100 యోజనాల వెడల్పున నోరు తెరిచింది. మహా నరకం వంటి పొడుగాటి నాలుక జాచింది. అది చూచి ఆ బుద్ధిమంతుడు అంగుష్ఠమాత్రుడు అనగా బొటనవేలంత అయ్యి, ఇట్టే ఆ సురస నోటి లోపలకు పోయి అది నోరుమూసే లోపలనే బయటకు వచ్చి ఎగిరి ఆకాశములోనికి పోయి ఆ సురసను చూస్తూ 'ఓ దాక్షాయనీ! నీవు కోరినట్లు నీ నోటిలో పడ్డాను. బ్రహ్మదేవుడిచ్చిన వరం సఫలం అయ్యింది. నీకు నేను నమస్కారము చేస్తున్నాను' అని చెప్పినాడు. అదీ యుక్తి. సమయస్ఫూర్తి.

సూక్ష్మదేహం అనేది సద్గురువుకి తప్పక ఉండాలి. అది లేకపోతే పేరు పెట్టుకున్నంత మాత్రాన సద్గురువులు, గురువులు అయిపోరు. అయినవారు పేరు పెట్టుకోరు. చుట్టూ ఉన్నవాళ్ళు వాళ్ళకు కలిగే దర్శనాల నుండి ఈయన సద్గురువని గ్రహిస్తారు. వాళ్ళ గురించి వాళ్ళు చెప్పుకోరు. చెప్పుకోవలసిన అవసరం కూడా వారికి లేదు. ఆయనకి రెండు రకాల సూక్ష్మ దేహా లున్నాయి. జ్వాల్‌కూల్ మహర్షికి మూడు దేహాలున్నాయని చెప్తే మనం నోళ్ళు వెళ్ళబెట్టుకు విన్నాం. జ్వాల్‌కూల్ పరమగురువుకే కాదు ప్రతి పరమగురువుకూ మూడు దేహాలుంటాయి. భౌతికము, అటుపైన సూక్ష్మము, అటుపైన కారణ శరీరము. సూక్ష్మ శరీరం బంగారు రంగులో ఉంటుంది. కారణ శరీరం వజ్రకాంతితో ఉంటుంది. ఆ రెండు శరీరాలు ఈ శరీరం ఆధారంగా ఉంటాయి. అవసరాన్ని బట్టి ఏ శరీరము నుండి అయినా ఆ మహాత్ముడు పని చేసుకో గలడు. సద్గురువులకు అలా మూడు శరీరాల నుండి పని చేసుకొనే అవకాశమున్నది.

కనుక హనుమంతుడు కాయం పెంచడం అంటే కాంతి వంతమైన కాయాన్ని పెంచాడన్న మాట. ఆమెకూడ పెంచింది. కాని ఆయన ఏం చేస్తాడో తెలియదు. అందుచేత ఆమె నూరు యోజనాలు పెంచేసరికి ఈయన క్షణమాత్రంలో మళ్ళీ బొటన వేలంత అయిపోయి లోపలికి వెళ్ళి బయటకి వచ్చేశాడు, ఆమె మళ్లీ నోరు మూసే లోపల. అది అక్కడ ఆయన సమయస్ఫూర్తిని సూచిస్తుంది. బుద్ధి కుశలతను చూపిస్తుంది. తర్వాత దుర్గమ

కార్యాన్ని సులభంగా నిర్వర్తించే శక్తి. ఏదో మీదపడి పోతోంది అంటే బెంబేలు పడిపోకుండా తనలో ఉన్న బుద్ధిబలం చేత దాటాలి. ఏదో ఆరాటపడుతూ తిరిగితే అవ్వవు. ఆరాటం ఉండేవాడు సద్గురువు అవడానికి అవకాశం లేదు.

ఆకాశంలో నిలబడి 'నీ వరం ప్రకారం నిర్వర్తించాను, వస్తాను' అని నమస్కరించాడు. అప్పుడు సురస నిజరూపము ధరించి 'ఓ హనుమంతుడా! నీ కార్యం సాధించడానికి సుఖంగా పో! రామునితో వైదేహిని చేర్చు' అని ఆశీర్వదించింది.

ముందు మైనాకుని ఆశీర్వచనం, మళ్ళీ సురస ఆశీర్వచనం. ఇవన్నీ సద్గురువుకు వచ్చే పరీక్షలు, ఆశీర్వచనములూను. సద్గురువు యొక్క కళ్యాణ గుణాలను తెలియచెప్పారు. శిష్యుడు కూడా గురువును పరీక్ష చేసుకోవాలి. ఊరికే దాసోహమని, తర్వాత ఇక్కడంత లాభం లేదని వెళ్ళిపోకుండా. మనం ఎవరు నదురుగా కనబడితే వాళ్ళ కాళ్ళు పట్టుకుంటాం. అక్కడేం కుదరకపోతే ఇదేం బాగోలేదు అని ఇంకో చోటుకి పోతుంటాం. అక్కడా బాగోలేకపోతే ఇంకో చోటుకి పోతుంటాం. గురువు శిష్యుడిని పరీక్ష చేసి అంగీకరిస్తాడుట.

సీతాదేవి ముందుగా హనుమంతుని రకరకాలైన ప్రశ్నలు వేస్తుంది. అంతకు ముందు హనుమంతుడు ఈ సీతాదేవి నిజ సీతేనా అని పరీక్ష చేస్తాడు. రామ అనుగ్రహానికి తగిన అర్హత సీతలో ఉన్నదా లేదా అన్నది హనుమంతుడు చూస్తాడు. తనను రాముని వద్దకు లేదా దైవం వద్దకు చేర్చగలిగే సామర్థ్యం

హనుమంతునకు ఉన్నదా లేదా అని సీతాదేవి పరీక్ష చేసి చూసు కుంటుంది. పెద్దల ప్రవర్తనలు ఎలా ఉన్నాయో సరిగ్గా చదువు కోవాలి. ఆ ప్రవర్తనలో నుండి మనకు అన్ని విషయాలు తెలుస్తాయి. అందుకే 'చదువని వాడు అజ్ఞుండగు' అన్నారు. మరి ఇటువంటి శక్తి సామర్థ్యాలు సద్గురువుకు ఉండాలి. శిష్యుడు కూడా ముందు కాళ్ళమీద పడిపోయి నేను నీకు సమర్పణ చేసుకుంటున్నాను అని తర్వాత నాలుక కొరుక్కోవడం అసత్యభాషణం అవుతుంది. ఇహ వాడికి ఆ జన్మకి పరిష్కారం లేదు. ప్రతి కాళ్ళమీదా పడిపోతూ ప్రతివారితోను అదే మాట అంటుంటే అదెట్లా ఉంటుంది? డబ్బున్న ప్రతివాడి దగ్గరా ఓ పది అప్పిస్తావా అన్నట్లుంటుంది. అది కాదు పద్ధతి.

సద్గురువు ఎలా ఉండాలో సుందరకాండలో దర్శనమిస్తుంది. కిష్కింధకాండలో రాముడు హనుమంతుడు కనిపించినప్పుడే పొగడుతాడు. ఒక ఆచార్యునికి ఉండవలసిన అన్ని లక్షణాలూ ఇతడిలో ఉన్నాయని చెప్పి ఈయన గుణాలన్నీ పొగడుతాడు. అక్కడ ఆచార్యుని గుణాల పట్టి వస్తుంది. మళ్ళీ సముద్ర లంఘన నిర్వహణలో ఇది కనిపిస్తుంది. అటుపైన సీతాదేవిని ఆయన తనదైన దృష్టితో పరిశీలించి చూస్తాడు. అక్కడ తెలుస్తుంది. ఆ విధంగా మనకి సద్గురువు లక్షణాలన్నీ కూడా సీతాదేవి అడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్పడంలో తెలుస్తాయి.

సుందరకాండ ఎందుకు చదువుకోమంటారంటే ఏ జీవుడికైనా ముక్తి మార్గానికి లేదా తరింపు మార్గానికి లేదా జీవితాన్ని చక్కగా పండించుకోవడానికి భగవంతుడు తానే గురువు స్వరూపంగా

భూమి మీద తిరుగుతుంటాడు. వారు భూసురులు. అంటే కేవలం జంధ్యం ఉండే వారంతా భూసురులు కారు. భూసురులు ఎందుకు భూమి మీద తిరుగుతున్నారూ అంటే జీవుల సమస్యలకి పరిష్కారం ఇవ్వడానికి, వారికి తరింపు మార్గమివ్వడానికి ఆ విధంగా తిరుగుతుంటారు. కాబట్టి ఆ తిరిగే వాడికి ఎటువంటి లక్షణాలుండాలి? ఏదో సరదాగా తిరగడం కాదు కదా! అందుచేత హనుమంతుడు ఆ విధంగా చేసి చూపిస్తే- అంటే మొదటిది సముద్ర లంఘనానికి వేసిన మొదటి గంతు. రెండవది మైనాకుని ఆతిథ్యము స్వీకరించక స్వీకరించినట్లుగా భావించి సుహృద్భావంతో సమయాన్ని వృథా చేయకుండా వెళ్ళిపోవడం. మూడవది యుక్తి తోను, యోగబలంచేత అధిగమించాడు. అంతేకాని తనకి ఉన్న కండబలంచేత కాదు. ఆ యుక్తిని తన సూక్ష్మశరీరంతో నిర్వర్తించి చూపించాడు. ఆయన కామరూపుడు. ఏ రూపం కావాలంటే ఆ రూపం తీసుకోగలిగిన వాడు. అదొకటి సద్గురువు లక్షణం. ఈ విధంగా నిర్వర్తించాడు.

హనుమంతుడు చేసిన ఆ దుర్గమ కృత్యానికి సర్వభూతాలూ మెచ్చుకున్నాయి. దాటనలవి కాని వర్ణాలయమైన ఆ సముద్రాన్ని దాటడానికి గరుత్మంతునివలె మరల ఆకాశమార్గాన్ని పట్టినాడు. అట్లా సముద్రాన్ని దాటిపోతున్న హనుమంతుని సింహిక అనే రాక్షసి చూసింది.

ఈ 'సింహిక' అనే పదం చాలా అర్థంతో కూడినటువంటిది. హింసించేదాన్ని సింహము అంటారు. మొత్తం సృష్టిలో హింసించే స్వభావ మొకటి ఉన్నది. అది హింసిక. మనం ఒక బ్లాటింగ్

పేపర్ మీద చుక్క ఇంకు వేస్తే ఎలా లాగేస్తుందో? అలాగే జీవుడిని వాడి వాడి స్వభావం ద్వారా పీల్చేసి వాడిని హింసిస్తూ ఉంటుంది. మనందరికీ బాధలు ఎక్కడి నుండి వస్తున్నాయి? మన స్వభావం నుండే! అది మన హింసిక. ప్రతివాడూ వాడి స్వభావంలో నుండి వాడి సమస్యని సృష్టించుకొని వాటిచేత హింసించబడుతుంటాడు. అట్లా మనందరిలో కూడా హింసిక వున్నది. ఆ హింసిక ఛాయా గ్రాహి. అంటే జీవుడు ఇంద్రియాలలోకి, శరీరంలోకి ప్రతిబింబిస్తాడు. అది చాలు ఆమెకి. నీడ పట్టి లాగేస్తుంది. చేతబడులు చేసేవారు కూడా నీడ బట్టే లాగేస్తారు. ఈ భూత ప్రేత పిశాచాలను ప్రయోగించే వారు మనం ముట్టుకున్న వస్తువు, మనం వాడిన వస్తువు ఇలాంటివన్నీ పట్టుకొని మన స్వభావాన్ని లాగి, వాడి దగ్గర బంధించి తిప్పలు పెడతారు. అందుకే హనుమంతుడు "*భూత పిశాచ నికట నహి ఆవై, మహావీర జబ్ నామ్ సునావై*" కదా! అందుకే భూతాలు, ప్రేతాలూ పట్టుకున్నా సద్గురువు క్షణకాలంలో వాటి నుండి మనని విముక్తి చేయగలడు.

మనని మన స్వభావం పడుతుంది. ఆ స్వభావంలోని అశుభ వాసనలు మనల్ని పట్టేస్తాయి. అక్కడ నుండి గిలగిల లాడుతుంటాం. వాడట్లాగు, వీడట్లాగు అని నోరు పారేసుకుంటాం. వాళ్ళని వీళ్ళని తిట్టుకుంటుంటాం. పైకి తిట్టలేకపోతే లోపల తిట్టుకుంటుంటాం. అన్నీ హింసికే! మనకే హింస. అదట్లా ఎందుకు ఉంది? ఇదట్లా ఎందుకుంది? వాడెందుకు అట్లా ఉన్నాడు? వాడెందుకు అట్లా ఉన్నాడంటే అది వాడి కర్మ. నువ్వెందుకు అలా ఏడుస్తున్నావ్?

అది నీ కర్మ. ప్రతివాడిలో వ్యక్తిగత కర్మగా వాడిలో వాడిని ఏడ్పించే దంతా కూడా హింసికండీ! దీన్నే personality అంటారు.

Person and Personality అంటారు జ్వాల్‌కూల్ మహర్షి. person అంటే వాడు, personality వాడి స్వభావము. భాగవతంలో చెప్పినా, భగవద్గీతలో చెప్పినా ఈ స్వభావాన్ని మార్పు చేసుకో అని చెప్తారు. మనవల్ల అయ్యేపని కాదు. ఎందుకిలా చెప్తారో తెలుసా? మార్పు చేసి చేసి, అలసిపోయి, విసిగిపోయి చేసుకోలేం అని తెలుస్తుంది. అదేమిటండీ చేసుకో మన్నారు, మరి చేసుకోలేనిది చేసుకోమన్నా రెందుకండీ అంటే, చేసుకోలేం అని తెలిస్తే కదా నువ్వు ఎవడి కాళ్ళయినా పట్టు కుంటావ్! నేనే చేసుకోగలను అనుకొనికదా నువ్వు విర్రవీగు తుంటావ్. అందుకని చేసుకో అంటారు.

అదే కదా భగవద్గీత 17 అధ్యాయాలు. నువ్వట్లా చేసుకో, ఇట్లా చేసుకో అని పెద్ద పెద్ద పట్టీలు పుస్తకాలు ఇచ్చేస్తాడు. చివరి దశకి వచ్చేసరికి మనం ఏం చేయలేంకదా అని. మరి ఏం చేయలేం అని వాడు అంటే 'నా కాళ్ళు పట్టుకో' అన్నాడు. 'నా కాళ్ళు పట్టుకుంటే దాటించేస్తానురా' అన్నాడు. అదీ భారతీయ సంప్రదాయము. నీ అంతట నువ్వేం చేసుకోలేవు అని.

అదే భాగవతంలో మొట్టమొదట్లోనే చెప్తాడు, బంధింపబడ్డవాడు బంధింపబడిన వాడిని రక్షించలేడు కదా! అని. సినిమాలో విలన్ అటొకడిని ఇటొకడిని సంకెళ్ళతో కట్టేస్తాడు. చంపేస్తా నంటాడు. ఏం చేయగలరు వీళ్ళిద్దరూ? ఎవరో రావాలి. ఎవడూ? సంకెళ్ళ

చేత బంధింపబడని వాడు వచ్చి వీళ్ళ సంకెళ్ళు తీస్తేనే కదా వీళ్ళు విముక్తులౌతారు. సంకెళ్ళ చేత బంధింపబడని వాళ్ళు ఈ లోకంలో కొంతమంది ఉన్నారు. వాళ్ళే నిన్ను విముక్తి చేయగలరు తప్ప నీ అంతట నీవు నిన్ను విముక్తి చేసుకోలేవు.

అలా ప్రతి సద్గురువుకి ఒక పద్ధతి ఉంటుంది. ఆ పద్ధతి ప్రకారం జీవోద్ధరణ కార్యక్రమము ఉంటుంది. ఈ హింసిక నుండి తప్పించుకో గలవాడే సద్గురువు. లేకపోతే వాడే పీడింపబడు తుంటే వాడేమి సద్గురువు? చాలా అప్పులున్నాయి గురువుగారూ, ఎలా బయట పడడం అంటే నాకే అప్పులున్నాయి, నీకు నేనేం చూడను అంటే ఆ గురువేం గురువండీ? దేనికీ లోబడనివాడు కదా సద్గురువు అవుతాడు. అందుకని హింసిక అంటే ఏదైతే మనల్ని బాధ పెడుతోందో అవి మన స్వభావములే. అది మన మనస్సు కాదు. మనస్సు దేముంది ప్రతిబింబిస్తుంటుంది అంతే! ఒక మహాత్ముడు చెప్పారు, మనసుదేముంది మనసును తిట్టబోక. మనసు అద్దంలాంటిది. ఆకాశంవైపు తిప్పితే సూర్యుణ్ణో, చంద్రుణ్ణో, నక్షత్రాలనో చూపిస్తుంది. పెంటకుప్ప వైపు తిప్పితే పెంటకుప్ప చూపిస్తుంది. మనస్సులో ఏం లేదు. నీ దృష్టి ఎటు ఉందో దాన్ని బట్టి నీకుండే వాసన. నీకుండే బాధ. దృష్టిబట్టి బాధ. దృష్టి దేనిని బట్టి? భావన బట్టి. అది నీకుగా నీవు ఏర్పరుచుకున్నావు. కాబట్టి అది నిన్ను లాగుతూ ఉంటుంది. ఏది తినకూడదో అది తినాలనిపించే భావన లోపల నుండి బలీయంగా రాదూ! ఏ పని చేస్తే నువ్వు చెడిపోతావని చెప్తాడో అది చేసేంత వరకు తోచదు. అదీ హింసిక. రావణుడిని అదేకదా పట్టింది. నువ్వు సీతాదేవిని

తెస్తే కొరివిని తెచ్చుకున్నట్లైపోతుంది అని అందరూ చెప్పారు. అయినా తెచ్చుకున్నాడుగా! అంటే హింసికకి లోబడే ఉన్నాడు.

కేవలము ఆత్మ తత్త్వంతో జీవించేవారు తప్ప మిగతా వారంతా ఏదో ఒక హింసికతో బాధ పడుతుంటారు. శాస్త్రాలు తెలిసినవాడు శాస్త్ర భావనచేత పీడింప బడుతుంటాడు. జ్యోతిష్యం తెలిసినవాడు జ్యోతిష్యపరంగా చూస్తాడు కాని దైవపరంగా చూడలేడు.

అందుకని జ్యోతిష్యం ముక్తి యిస్తుందనుకోకండి. ఏ శాస్త్రాలూ ముక్తి ఇవ్వవని గీతలో కృష్ణుడు చెప్పాడు. నన్ను తలుచుకోరా నీ లోపల శాస్త్రాలు వికసిస్తాయి. నన్ను వదిలేశావా శాస్త్రాల్లో మునిగిపోతావు. శాస్త్రాలు నిన్ను హింసిస్తాయి. నిన్ను పొగిడిన నిన్ను చంపుకు తింటున్నట్లే! వాడెందుకు చంపుకు తింటున్నాడు అంటే వాడి లోపల స్వభావం వాడిని చంపుకు తింటోంది. అందుకని వాడి స్వభావం వాడిని చంపకుండా వాడిని అందులోంచి ఉద్ధరించడానికి నువ్వు నీ స్వభావానికి అతీతంగా ఉండాలి.

అదికదా సి.వి.వి.గారు చేశారు. ఎవడో నాడి పట్టుకొచ్చి, గురువు గారూ మీ నాడి చూశాను, మీరు పరబ్రహ్మమే అన్నాడు. ఏడ్చినట్లుంది అన్నారాయన. నేను పరబ్రహ్మమని నువ్వు నాకు చెప్పడమేమిటి, ముందు నాకే తెలుస్తుంది కదా అని. ఇవాళ నువ్వు ఇడ్లీలు తిన్నావంటే ముందు నీకు తెలుస్తుందా, నాకు తెలుస్తుందా? అయినా ఇవన్నీ ఎందుకూ పక్కన పారేసి నువ్వు

నాలా అవడానికి ప్రయత్నించు అని చెప్పారు. అంతే మాస్టరుగారి మార్గాన్ని తమిళనాడులో ఇచ్చుకుంటూ వెళ్ళాడు. ఆయనే NRBV.

ఇంతకీ అసలు విషయము తెలిసినవాడికి అన్నీ చేతిలో ఉంటాయి. ఈ చిల్లర విషయాలు తెలిసినవాళ్ళు ఆ చిల్లర విషయాల్లోనే ఉండిపోతారు. చిల్లర్ల చేతనే హింసింపబడతారు. అందుకని ఈశావాసోపనిషత్తు చెప్తుంది జ్ఞానం ఉన్నా, విజ్ఞానం ఉన్నా బతికిపోయాను అని అనుకోక- జ్ఞానానికి, అజ్ఞానానికి రెంటికీ పైన ఉన్నదాని యందు నీవుండగలిగితే, సమదృష్టితో చూడగలిగితే అప్పుడు ఈశ్వరుడుతో వసించినట్లు. ఈశ్వరుడిగ ఉన్నట్లు.

ప్రతి మనిషిలోను ఏదో లోటు ఉంటుంది. అది హింసిక. అది పట్టుకొని వాడిని లాగేస్తుంది. కొందరికి డబ్బు మోజు, కొందరికి పదవి, కొందరికి కీర్తి, కొందరికి శరీరం మోజు. మనం దీన్ని ఎంతబాగా చూసినా కాలక్రమేణ అది క్షీణిస్తూనే ఉంటుంది కదా! ఇలా మోజులేవో ఉన్నాయి. అవన్నీ నిన్ను తిప్పుతున్నాయి కదా! శరీరం మోజుంటే Beauty Clinics బాగుపడతాయి. సినిమా మోజులుంటే సినిమాహాళ్ళు బాగుపడతాయి. తిండి మోజున్నవాడు తిని తిని రోగం తెచ్చుకుంటాడు. అన్నీ అవేగా! నువ్వు దేనికో ఒకదానికి లొంగి జీవిస్తున్నావు కదా! మరి అదీ హింసిక అంటే! అందుకని సింహము, సింహిక, హింసిక. అంటే సింహాన్ని నువ్వు గెలవలేవుగా! సింహాన్ని గెలిచినట్లుగా కొంతమంది గురించి చెప్తారుగా!

జాంబవంతుడు సింహాన్ని చంపాడుట అంటే దాన్ని దాటాడు

అని అర్థం. గ్రీకు దేశంలో Sampson సింహాన్ని చంపాడు అని చెప్తారు. అంటే దాటాడు అని అర్థం. Hercules సింహాన్ని చంపాడని చెప్తారు. అంటే దాటాడని అర్థం. సింహాన్ని చంపడం అంటే నిన్ను హింసించేదేమీ లేని స్థితికి నువ్వు ఎదిగావు. అది సింహం. ఆ విధంగా ఇప్పుడు ఆ హింసిక పట్టిందదండీ. మనని ఏది బాధిస్తుంటే అది హింసిక. అది నిజంకాదు ఒక ఛాయే! అందుకని హింసిక అన్న పదం రాగానే ఇన్ని విషయాలు చెప్పడం జరిగింది.

సముద్రాన్ని దాటిపోతున్న ఆ హనుమంతుని సింహిక చూసింది. అది కామరూపిణి. ఆలోచించింది. దేహాన్ని పెంచింది. పెద్ద జంతువు ఇంతకాలానికి నాకు చిక్కింది. ఏమిటా పెద్ద జంతువు? అన్నిటికన్నా పెద్ద జంతువు జీవుడు. ఎందుకంటే సరాసరి దేవుడి నుండి దిగివచ్చినవాడు. అది చిక్కింది. అన్నిటి కంటే పెద్ద జంతువు అంటే అన్నిటికన్నా శ్రేష్ఠమైన జంతువని అర్థం. ఆ విధంగా ఇది దొరికింది, దీన్ని పట్టాలి అని మనస్సులో అనుకొని హనుమంతుని నీడను పట్టుకుంది. మన నీడ మన స్వభావంలో ప్రతిబింబిస్తుంది. మన స్వభావం అశుభవాసనలు లేనిదైతే అదేం చేయదు. కాని నీ స్వభావంలో ఎక్కడైనా ధర్మ విరుద్ధమైన ఆకర్షణలకి లోబడే తత్త్వ మున్నట్లయితే చాలు నిన్ను కిందకి లాగేయడానికి. లాగేసి ఎక్కడో పెడుతుంది. మూలాధారంలో తలకిందుల పెట్టేస్తుంది. 'అలా పడి ఉండరా!' అంటుంది. అదీ హింసిక చేసే పని. దాన్నే ప్రపంచంలో మాయ అని అనవచ్చు. మాయ యొక్క ఒకరూపం అనవచ్చు. ఆ విధంగ జీవుడిని అలా

తొక్కిపట్టి భూమి మీద ఉంచుతుంది కనుక ఆమె రాక్షసి అయ్యింది. అలా అనుకొని ఆయన నీడ పట్టుకుంది.

ఆ సింహిక తన నీడను పట్టుకోగానే సముద్రంలో ఎదురు గాలికి తల్లడిల్లే ఓడవలె వేగము కుంటుపడి తను హఠాత్తుగా పట్టుబడినట్లు భావించినాడు. ఏదో పట్టిందని తెలిసింది. పైకి కిందకి పక్కలకి చూచినాడు. సముద్రంలో లేచిన మహాసత్త్వము కనిపించింది. సత్త్వము అంటే ఇక్కడ జీవమని. వికృతాననముతో అది మహాద్భుతముగా తోచింది. ఎంత బ్రహ్మాండంగా ఉన్నదీ అనుకున్నాడట. అదివరకు తనతో సుగ్రీవుడు చెప్పిన ఛాయాగ్రాహి అనే జంతువు ఇదే అనుకున్నాడు. సందేహించలేదు. అప్పుడు ఆ మతిమంతుడు హనుమంతుడు ఆయా గుర్తులనుబట్టి అది నిశ్చయముగ సింహికే అని తెలుసుకొని, వర్షాకాల మేఘంవలె మహాకాయుడైనాడు. అలా పెరిగిపోయిన హనుమంతుని సింహిక చూసింది. మేఘాలవలే గర్జిస్తూ, పాతాళ ద్వారంవలే నోరు తెరచి హనుమంతుని మీదకు పరుగెత్తింది. అలా నోరు తెరిచిన సింహిక ఆయువుపట్టును ఆ మేధావి హనుమంతుడు చూచినాడు. మనకి మన ఆయువు పట్లమీద దెబ్బలు తగులుతుంటాయి కదా!

ఆయువుపట్లు అంటే ప్రాణాలనే కాదు, కొంతమంది డబ్బు పోతే చచ్చిపోతారు. కొంతమంది కీర్తిపోతే చచ్చిపోతారు. కొంత మంది తమ వాళ్ళని పోగొట్టుకున్నా చచ్చిపోతారు. అదే చేశాడుగా రావణుడు! రాముణ్ణి నువ్వు గెలవలేవురా అని చెప్తారు. మరేం చెయ్యాలి అంటే ఆవిడిని ఎత్తుకొచ్చేయ్, అప్పుడు ఆయన బలహీన పడతాడు అన్నారు. ఎందుకంటే సీతాదేవి ఆయనకు సగభాగం.

సీత లేకపోవడం వలన రాముడు బలహీనపడతాడు. అప్పుడు రాముడిని కొట్టుకో! వాడు తెలివి అలా వాడుకున్నాడు. ప్రతివాడికీ అలా ఒక ఆయువుపట్టు ఉంది. అక్కడ కొడితే వాడు పడిపోతాడు.

అలా ఆ ఆయువు పట్టును చూశాడు హనుమంతుడు. అంతట ఆ మహా బలవంతుడు, ఆ వజ్రసమాన దేహుడు తన దేహాన్ని కురచచేసి ఆ సింహిక తెరిచిన నోటన పడిపోయినాడు. అలా దాని నోటనబడుతున్న హనుమంతుడు పర్వకాలాన రాహువు నోటిలోనికి పోయే పూర్ణచంద్రుడివలె కనిపించాడు. పూర్ణచంద్రుడికి గ్రహణం పట్టినా మళ్ళీ వచ్చేస్తాడుగా! అందుకని అటువంటి ఉపమానాన్ని వేసుకున్నారు. చంద్రుడు అనడంలో ఒక సందేశమున్నది. సూర్యుడి కిరణాలు మనకు చంద్రుని ద్వారా అందుతాయి. సూర్యుని కిరణాలు మనం భరించలేం. అదే సూర్యుడు చంద్రుడి ద్వారా వస్తే ఏ చైత్ర పూర్ణిమగనో, వైశాఖ పూర్ణిమగనో వస్తే బాగుంటుంది కదా!

అందుకని పరమాత్మ తత్త్వాన్ని మనం సరాసరి భరించలేం. ముందు తను పొంది, తన నుండి ప్రతిబింబింపచేసి, మనకి ఆహ్లాదాన్ని కలిగించి, మనకి ఆ వెలుగునందు ఆకర్షణ కలుగ జేసేవాడు గురువు. అందుకని గురువుని చంద్రుడితో పోలుస్తారు. మహావేగంతో సమానంగాపోయి ఆ పరాక్రమవంతుడు ఆ సింహిక ఆయువు పట్టును తన వాడి గోళ్ళతో చీల్చివేసి దాని నోటిలో నుండి బయటకు ఎగిరినాడు. ఆ ప్రశస్తదేహుడు, ఆ ధైర్యవంతుడు, ఆ పరమ సమర్థుడు హనుమంతుడు అంతట దానిని పడదోసి

వెంటనే మళ్ళీ దేహాన్ని పెంచినాడు. సింహిక గుండెలు బద్దలై ఆ సముద్రంలో పడి చచ్చిపోయింది. ఇదే జరగాలి.

మన స్వభావంలో మార్పులు తీసుకు రాగలవాడే సద్గురువు. దానికి మనల్ని వదిలెయ్యకుండా రకరకాలుగా మన స్వభావానికి తిప్పలు పెడుతుంటాడు. అది బాగా కరుగుతుంటుంది. మరుగుతుంటుంది, ఇగిరిపోతుంటుంది. ఇగిరిపోతే ఇహ ఈ సింహిక నీలో ఉండదు. అప్పుడు నువ్వు సుఖంగా జీవించవచ్చు. అదీ తనంత వాడినిగా చేయడమంటే! అది కేవలం సి.వి.వి. గారి కార్యక్రమమే అనుకోకండి. అందరి సద్గురువుల కార్యక్రమమూ అదే అయి ఉంటుంది. ఒక్కొక్కళ్ళకీ ఒక్కో పద్ధతి ఉంటుంది. ఆ విధంగా చేస్తారు.

సిద్ధ చారణ గంధర్వాదులు ఆకాశాన్నుండి హనుమంతుని చూచి 'ఓ హనుమంతుడా! ఎగిరిపోయేవారిలో నీవు శ్రేష్ఠుడవు'. ఇదివరకు నీవు గరుత్మంతుడితో సమానం అన్నారు. ఇప్పుడు నువ్వే శ్రేష్ఠుడవు అంటున్నారు. 'ఇప్పుడు మహా భయంకరమైన పని చేసినావు. గొప్ప రాక్షసిని చంపినావు. మంగళకరమైన నీ అభీష్ట కార్యాన్ని ఇక సాధించు. ఓ హనుమంతుడా! నీకున్న ధైర్యమూ, దూరదృష్టి, మేధస్సు, కార్యసాధనా సామర్థ్యము ఎవరికి ఉంటాయో వాడి పనులు ఏవీ చెడవు' అని చెప్పారు.

ఇదొక సత్యం. ధైర్యం ఉండాలి. దూరదృష్టి ఉండాలి. రేపేం జరుగుతుందీ అని కాక పదేళ్ళ తర్వాత ఏం జరగాలి అని, ఏం జరగబోతోంది అని తెలిసి దాని ప్రకారం పని చేసుకోగలగాలి.

మేధస్సు లేకపోతే ఏం లాభం లేదు. చాలామందికి మేధస్సు ఉండవచ్చు కానీ పని చేయలేరు. సలహాలు మాత్రము చెప్ప గలరు. చేయలేరు. చెయ్యగలిగి ఉండాలి. చెయ్యగలిగిన పద్ధతి తెలిసి ఉండాలి. కాలాన్ని తెలిసి ఉండాలి. అదే దూరదృష్టి అంటే. ఇవన్నీ ఉన్నవాడు సద్గురువు. అటువంటి వాడికి పనులు చెడిపోవడం ఉండదు.

అట్లా సిద్ధచారణాదుల సమ్మాన వాక్యాలు వింటూ ఆ పూజ్యనీయుడు హనుమంతుడు తన ప్రయోజనం సాధించుటకు ఆకాశమార్గంలో గరుత్మంతునివలె పోయినాడు. ఎప్పుడూ ఆకాశంలో పోవడమంటే గరుత్మంతునితోనే పోలుస్తారు. దేవతలు అలా అన్నా వాల్మీకి మహర్షి మళ్ళీ ఇలాగే చెప్పాడు. వాళ్ళు పొగుడుతుంటే హనుమంతుడు అక్కడ ఆగిపోలేదు. మనం పొగడ్తలకి ఆగి పోతుంటాం. ఆయన పొగుడ్తుంటే పట్టించుకోకుండా వెళ్ళి పోయాడు తప్ప అన్నీ విని వెళ్ళలేదు.

## 3

ఆ సముద్రానికి నూరు యోజనాల వద్ద ఉన్న గట్టు దగ్గర దగ్గరగా హనుమంతునికి కనిపించింది. ఆ గట్టు పార చూచినాడు. తీరంలో అడవులు కనిపించినవి. నానావిధ వృక్షాలతో ఉన్న ఆ ద్వీపాన్ని, అక్కడ మలయ పర్వతంమీద ఉన్న ఉద్యానవనాలను కిందికి రాకుండానే చూచినాడు. ఆ ధైర్యవంతుడు, ఆ మతిమంతుడు హనుమంతుడు ఆ సముద్రాన్ని, ఆ తడినేలను, అక్కడ పెరుగు తున్న చెట్లను, సముద్రంలోకి వచ్చిపడుతున్న నదులను, నదులు పుట్టిన కొండలను చూచినాడు. ఆకాశంలో ఎగిరి వచ్చుచున్న మహా మేఘమయమైన తన శరీరాన్ని గూర్చి యోచించినాడు. రాక్షసులు నా వేగాన్ని, నా మహాకాయాన్ని చూచినట్లయితే నేనెవడినో తెలుసుకొనవలెనని కుతూహల పడతారు అనుకొని కొండంత దేహాన్ని కుదించినాడు.

అజ్ఞానం వదలిపోయి, ఆత్మజ్ఞానివలె స్వస్వరూపం ధరించినాడు. ఆకారము పెద్దగా కనిపించేట్లుగా ఉండకూడదు. మన కీర్తి మన ప్రతిష్ఠ చెప్పుకొని మరీ వెడుతుంటాం కదా మనం. సద్గురువు అలా వెళ్ళడు. వాడుగా వెళ్ళిపోతాడు అంతే! అంటే తన శక్తి, తన ప్రతిభ, తన గొప్పతనం అన్నీ తనకుగా తాను చాటుకోడు. అంతేకాదు ఇంకొకరిచేత చెప్పించుకోడు. మామూలుగా పెద్ద

వాళ్ళు ముందు ఆయన ఎంతటివాడో చెప్పిస్తారు. తర్వాత ఆయన వస్తాడు. అలా వచ్చేవాడు లౌకికమును నమ్మినటువంటి వాడు. పారలౌకికమైనవారు పెద్దాకారాన్ని అజ్ఞానం వదిలినట్లు వదిలేస్తారు. అందుకనే ఆ పెద్దాకారాన్ని అజ్ఞానం వదిలిన జ్ఞానవంతునిగా వాల్మీకి మహర్షి ఇక్కడ వర్ణిస్తున్నాడు. వాల్మీకి ఎక్కడో మూల కూర్చుని మనం ఇంత రామనామం చేశాం అని ఎవరికీ తెలియ కుండా, ఇంత రామాయణం రాస్తున్నామనేది ఎవరికీ తెలియ కుండా రాసేసి వెళ్ళిపోయాడు. తర్వాత కదా ఆ పిల్లలు వెళ్ళి అయోధ్యలో పాడితే ఇదొకటి వచ్చిందని తెలుసుకున్నారు.

ఎప్పుడూ మహాత్ములు కొద్దిగా ఉంటారు. 'కొండ అద్దమందు కొంచెమై ఉండదా!' అని కదా వేమన చెప్పింది. అది కొండే! కాని అద్దంలో ఎంతగా కనిపిస్తుంది? ఈ ప్రతిబింబాత్మక లోకంలో తానెంతటి వాడో చెప్పుకొనేవాడు అవివేకి. తనెంతటివాడైతే తన కెందుకు? అట్లా చెప్పుకోకుండా తన పని తను చేసుకువెళ్లేవాడు జ్ఞానవంతుడు. ఈ వాక్యం చాలా లోతైన అర్థం కలది. అజ్ఞానం వదిలిపోయిన ఆత్మజ్ఞానివలె స్వస్వరూపం ధరించినాడు.

ఆత్మజ్ఞానం కలిగినవాడి స్వస్వరూపం ఎంత ఉంటుంది? బొటనవేలు ప్రమాణం. మీక్కూడా మీ జీవస్వరూపం మీ బొటన వేలంత ఉంటుంది. మీ బొటనవేలు పెద్దగా ఉంటే మీరూ లోపల పెద్దగా ఉన్నట్లు లెక్క. చిన్నగ ఉంటే చిన్నగ ఉన్నట్లు. అంతే మీ సైజు. అందుకే మనకు హస్త సాముద్రికములో ఇది సోల్ (బొటన వేలు) అంటాడు. ఇది సోల్ ఏమిటి? బొటనవేలు లేకపోతే ఏం పనికిరాదుకదా! ఇది ఉండి మిగిలిన నాలుగు వేళ్ళలో ఏదైనా

లేకపోయినా పని చేసుకోవచ్చు. కాని ఇది పోతే చాలా కష్టం. అంతే కాదు నిజంగానే జీవతత్త్వం ఇందులో ఉంటుంది. అందుకే బొటనవేలు చూసి చెప్తుంటారు. వీడు ఎటువంటి జీవుడని.

విశ్వరూపంతో మూడడుగులు వేయడానికి బలిచక్రవర్తి పరాక్రమాన్ని హరించి వేసిన మహావిష్ణువు వామనుడైనట్లు, హనుమంతుడు తన మహదాకారాన్ని వదిలిపెట్టి ఎప్పటి మాదిరిగా అయిపోయినాడు. నానావిధ రూపాలు ధరించి ఇతరులకు అశక్యమైన పనులు చేసిన ఆ హనుమంతుడు తన నిజస్వరూపంతో ఆ సముద్రతీరం చేరి, తీరము చూచుకున్నాడు. తను చేయవలసిన పనులు గురించి ఆలోచించుకున్నాడు. మహాపర్వత శిఖరము వంటి ఆ ధైర్యవంతుడు పొదలతోను, నానావిధ వృక్షాలతోను, విచిత్ర శిఖరాలతోను ఉన్న లంక పర్వత శిఖరము మీదికి ఎగిరినాడు. ఒళ్ళు విదిలించినాడు. అక్కడి పక్షులను, మృగాలను బెదిరించినాడు. అక్కడ నుండి త్రికూట పర్వతము మీద ఉన్న లంకాపట్టణాన్ని చూచినాడు. అది దేవేంద్రుని అమరావతి పట్టణమువలె తోచింది. అయోధ్యలో మనుషులు గురించి వర్ణిస్తాడు. వారి సంస్కారం గురించి వర్ణిస్తాడు. లంకలో నగరం, వీధులు, భవనాలు ఎంత పెద్దగా ఉన్నాయి, ఎంత బంగారం ఉందీ, ఎంత కాంతివంతంగా ఉందీ లెక్కలు వేస్తారు.

పాశ్చాత్యదేశాలు వెళితే అవే కదా మనం చూస్తాం! వాళ్ళ రోడ్లు ఎంత బాగున్నాయి, వాళ్ళ కార్లు ఎంత బాగున్నాయి, వాళ్ళ భవనాలు ఎంత బాగున్నాయి, వాళ్ళ సౌకర్యాలు ఎంత బాగున్నాయి– ఇవే కదా చూస్తాం? అంతే లంక కూడా! అంటే లంకలాగ అవి

ఉంటాయి. లంక ఇంకా బాగుంటుంది. మరి మనుషులో? బాగుండరు. లంకలో మనుషుల స్వభావము బాగుండదు. మనుషులతో ఏం చెయ్యడానికి ఉండదు. మనుషులు బాగుండి ఇల్లు బాగో లేదనుకోండి! ఇల్లు బాగుండి మనుషులు బాగో లేరనుకోండి! ఏది కావాలి మనకి? మనుషులతో మాట్లాడుకుంటావా, ఇంటితో మాట్లాడుకుంటావా! ఏది ముఖ్యం అనేది రామాయణం చెప్తుంది.

లంకలో ఉన్నట్టి పట్టణాలు అయోధ్యలో లేవు. అయోధ్యలో ఉన్నట్టి మనుషులు లంకలో లేరు. ఏది కావాలి నీకు? ఒక చోట ధర్మం ఉంటుంది. ఒక చోట భోగం ఉండడం చేత అధర్మ ప్రవర్తనకు లోబడే అవకాశం ఉంటుంది. రావణుడు మహా భక్తుడు. భోగలాలసుడై అధర్మానికి పూనుకున్నాడు. కాబట్టి ఇదా అదా! ఏది కావాలి? మాస్టర్ ఇ.కె. గారు రాశారు, 'మంచితనము మాతవలె పోషించును. గొప్పతనము సుందరివలె ఆకర్షించును' అని. సుందరి ఆకర్షణ ఎంతసేపు? ఎన్నాళ్ళు ఆ సౌందర్య ముంటుంది? స్వభావాకర్షణ- చాలా రోజు లుంటుంది. శుభ మైనటువంటి స్వభావముంటే అందం లేకపోయినా అంగీకరించ బుద్ధి అవుతుంది మనిషిని. అందంగా ఉండి లోపల తాచుపాము లాంటి ప్రవర్త నుంటే! అంగీకరించగలరా? ఎరక్కపోయి వచ్చాను ఇరుక్కు పోయాను అంటాం కదా! అలా ఇరుక్కుపోతాం. కేవలం బాహ్య సౌందర్యం చూసి ఏం చేయకూడదు. అంతఃసౌందర్యం చూసి స్నేహం చేయాలి. అంతఃసౌందర్యం చూసి వివాహమాడాలి. అంతఃసౌందర్యం చూసి పరిచయాలు పెంచుకోవాలి. అది బాగో

లేని వాళ్ళ పరిచయాలు గ్రక్కున విడువంగ వలయును. వెంటనే! మరింక ఆలస్యం చేయకూడదు. అది మాస్టర్ ఇ.కె. గారి వద్ద నేర్చుకోవాలి. ఆయనకుండే ప్రేమ స్వభావం చేత మనిషిని దగ్గరకు తీసినా ఉండకూడనివి కొన్ని ఎక్కువగా ఉంటే మర్నాడే అదేమిటో నిలువునా చీల్చేసుకొనేవారు. కట్ ఆఫ్ అన్నమాట. ఇంక మన దగ్గరికి వాడు రాలేడోయ్! అనేవారు. దుస్సాంగత్యాలను అట్లా కట్ చేసుకోగలిగి ఉండాలి.

సత్సాంగత్యాన్ని పెంచుకోగలిగి ఉండాలి. దానివల్ల మనలో ఉన్నవి కూడా కాస్త కరుగుతాయి. దుస్సాంగత్యం పెంచుకుంటే అవే వస్తాయి. మనం ఏం చదువుతున్నాం, ఏం చూస్తున్నాం, ఎవరితో జీవిస్తున్నాం- మన స్వభావం దాన్నిబట్టి ఉంటుంది. ఇక్కడ ముందు ముందు అంతా లంకవర్ణన ఉంటుంది, అందుకు ఇదంతా చెప్పుకున్నాం.

ఆ మహా బలవంతుడు హనుమంతుడు ఎవరూ దాటి పోలేని ఆ సముద్రాన్ని దాటి పోయినాడు. త్రికూట పర్వతము మీద ఉన్న లంకా పట్టణాన్ని చూచినాడు. స్వస్థచిత్తుడైనాడు. గమ్యాన్ని చేరాడు కదా, అందుచేత. అక్కడి చెట్లు అప్పుడు అతని మీద పూలవాన కురిపించినాయి. ప్రకృతి ఎక్కడైనా సత్పురుషులుంటే పులకిస్తుంది. అమెరికా వెళ్లినా పులకిస్తుంది. అక్కడైనా పరమ గురువులు కనిపించవచ్చు. భారతదేశం పుణ్యభూమి కదండీ అక్కడెలా కనిపిస్తారండీ అని మనం ఆంక్షలు పెట్టుకుంటే ఏం లాభం లేదు. సత్పురుషులకి ప్రకృతితో సంబంధం, ప్రకృతికి సత్పురుషులతో సంబంధం. ఓ సత్పురుషుడు అడుగుపెడితే

ప్రకృతి పులకిస్తుంది. మాబోటి వాళ్ళందర్నీ ఎలా భరించ గలుగు తున్నావు? అని భూమిని అడిగారట. కోట్లాదిమంది ఇలాంటి వాళ్ళున్నా అక్కడక్కడా సత్పురుషుల పాదస్పర్శ తగలడం చేత ఒళ్ళు పులకించి మిమ్మల్నందరినీ మోస్తున్నానురా! అని చెప్తుందిట భూదేవి.

ఒక సత్పురుషుని పాదస్పర్శ అలా ఉంటుంది. హనుమంతుడి లాంటివారు లంకకి రారు కదా! మహాత్ములు లంకకి రారుకదా! శివుడిని ప్రార్థన చేసి శివుడి దగ్గరకి రావణుడు వెళ్ళాడు కాని శివుడు లంకకి రాలేదు. కనుక ఒక మహాత్ముడు భూమిలో ఆ భాగాన్ని మొదటిసారిగా స్పృశించాడు. ఎప్పుడూ అలాంటి స్పర్శ ఇవ్వలేదు. అందుకే ఆ ప్రదేశం ఈయన రాగానే పులకించి, పూలు వర్షించింది. పుష్పాభిషేకము చేసిన వీరుని వలె అప్పుడు ఆ హనుమంతుడు తేజరిల్లినాడు.

ఆ కాంతిమంతుడు, ప్రశస్త పరాక్రమవంతుడు నూరు యోజనాల సముద్రమును దాటినప్పటికిని ఏ కొంచెము అలసి పోలేదు. ఒక్క నిట్టూర్పు అయినా విడవ లేదు. ఎగరగలనా అని అనుకున్నాడు. జాంబవంతుడు చెప్పాక ఓహో మనమింతటి వాళ్ళము కదా అని అనిపించింది. దానికి తగ్గట్లుగా శరీరం పెంచాడు. మళ్ళీ ఎక్కువ పెంచకూడదు. ఎందుకంటే ఎదుటి వాడికి అతి మానుషీ చర్యలుగా కనబడకూడదు. వీళ్ళంతా కోతులు గానే కనబడాలి. రాముడు దేవుడుగా కనబడకూడదు, నరుడిలాగే కనబడాలి. సురస నోట్లో పడకుండా ఉండడానికి శరీరాన్ని 90 యోజనాలు పొడుగు పెంచినవాడు కేవలం నూరు యోజనాల

దూరము మాత్రమే ఉన్న సముద్రమును దాటడం ఏం కష్టం? ఇంకొంచెం శరీరాన్ని పెంచి దాటెయ్య వచ్చుగా? కాని అలా దాటలేదు. "నేను అనేక వందల యోజనాలు దాటిపోగలను, ఈ నూరు యోజనాల దూరమూ నాకొక లెక్కా ?" అని మనస్సులో అనుకున్నాడు. అతడు పరమ పరాక్రమవంతులలో పరాక్రమవంతుడు. ఎగిరిపోయే వారందరిలో ఉత్తమోత్తముడు. అందువలెనే అంత మంది వానర వీరులలో హనుమంతుని మాత్రమే సముద్రమును దాటి పొమ్మని జాంబవంతుడు ప్రోత్సహించినాడు. ఆ మహా వేగుడు హనుమంతుడు అందువల్లనే తెంపుచేసి మహోదధిని దాటి లంకా పట్టణం చూచినాడు.

'లంకా పట్టణము చూచినాడు' అనే వాక్యం చాలా ముఖ్యము. మనం కూడా మన ధ్యానంలో లంకా పట్టణమును చూడాలి. లంకను చూడడ మంటే మన శరీరాన్ని మనం చూడాలి. అంటే మన శరీరంలో నుండి బయటకు వచ్చి గాని మనం మన శరీరాన్ని చూడలేం. హనుమంతునికి ఎదురుగుండా లంకా పట్టణము కనిపించినది కదా! అట్లాగే మనం కూడా సూక్ష్మ శరీర ధారుల మైనప్పుడు శరీరంలో నుండి బయటకు వచ్చి సూక్ష్మ శరీరంలో ఉండి తన శరీరాన్ని తను చూస్తాడు. ఈ రక్త మాంసా లతో కూడిన శరీరాన్ని ఆ విధంగా దర్శించగలిగిన వాడే సద్గురువు. లంక అంటే శరీరము. ఎందుకంటే మొత్తం భూభాగము నుండి వేరుచేయబడ్డ ద్వీపం. వేరుపడడము అంటే ఏమిటి? మొత్తం పంచభూతాల నుండి కొంచెం కొంచెం తీసుకొని ఈ శరీరాన్ని తయారుచేసింది. అంటే మొత్తంలో నుండి వేరుగా ఉన్నది. అదే

ప్రత్యేకంగ ఉండడము అంటే! అదీ ద్వీపంగా ఉండడం అంటే. మొత్తంతో కలసి ఉన్నామనే భావన లేకపోవడమే. అందులో మూడు గుణా లుంటాయి. అందుకే కృష్ణుడు ప్రకృతివే గుణాలు తప్ప నావి కాదంటాడు.

ఇక్కడ మూడు గుణాలంటే రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు. రజస్సు, తమస్సు, సత్త్వం. ఆ మూడు గుణాలచేత శరీరమనే లంకను పరిపాలిస్తుండడం ఉంటుంది. ఒకటి– దాని నుండి బయటకు వచ్చి దాన్ని చూడగలగాలి. రెండు– నువ్వు దానిలో ప్రవేశించ గలగాలి. మూడు– దానిలో నుండి బయటకు రాగలగాలి. ఒక జీవుడు శరీరములో ప్రవేశించి, వాడి లోపలకి వెళ్ళి వాడిని పైకి తీసుకురావాలి. అదే side ways నుండి వుండే మంత్రాలు. "side ways, verticle levels, meet centers." Side ways అంటే నువ్వు ఎదుటి వ్యక్తిలో చైతన్య స్వరూపుడిగా ప్రవేశించగలిగి ఉండాలి. వాడి లోపలకి verticle గా చేరగలిగి ఉండాలి. నీ చైతన్య స్థితికి వాడిని ఉద్ధరించగలిగి ఉండాలి. ఇవి సద్గురువుకుండే అర్హతలు.

అందుచేత హనుమంతుడు లంకాపట్టణము చూచినాడు అంటే యోగపరంగా దేహాన్ని చూచినాడు. జీవుడు దేహాన్ని దర్శించినాడు. జీవుడు ఎక్కడున్నా డక్కడ? అమ్మవారు అక్కడ బంధింపబడి ఉన్నది. తర్వాత వెతుకుతాడు. అందుకని లంకా పట్టణాన్ని ముందు ఒక over view చూసుకున్నాడన్నమాట. చూసుకొని అందులో దిగాడు. అందుచేతనే లంకలో నుండి బయటపడ్డ వాడల్లా ముక్తుడే! విభీషణుడొక్కడే తనకు తానుగా

లంకలో నుండి బయటకి రాగలుగుతాడు. లంక నుండి వేరు కాబడ్డాడు కాబట్టే దైవాన్ని చేరగలిగాడు. హనుమంతుడు లంకలో ప్రవేశించనూ గలడు, బయటకు రానూ గలడు. అతడు సద్గురువు. నేను ప్రవేశించ గలను కాని బయటకు రాలేను అంటాడు అంగదుడు. మనమూ ప్రవేశించగలం. కాకపోతే మన ప్రవేశం కూడ మనకి తెలియదు. అలాగే అభిమన్యుడికి పద్మవ్యూహంలో ప్రవేశం తెలుసు కానీ రాలేడు. అర్జునుడు రాగలడు. కృష్ణుడు రాగలడు. ద్రోణుడు రాగలడు. అంటే వాళ్ళు దాటినవాళ్ళు అని అర్థం. అలా ఉంటుంది అవగాహన.

అందుకని లంకా పట్టణాన్ని ముందు ఒకసారి చూచాడట. ఆ హనుమంతుడు పచ్చిక బయళ్ళనుండి పెద్దరాళ్ళు, చిన్నచిన్న కొండలు చూస్తూ ఆ ప్రదేశములో ఘుమఘుమ వాసనలు గుబాళిస్తున్న అడవుల మధ్య నుండి నడచినాడు. దట్టముగ చెట్లు కమ్ముకున్న శిఖరాలను, పూలు విరగబూసిన అడవులను కలయ తిరిగి ఎన్నో శిఖరాలతో ఉన్న లంక పర్వతము మీదికి పోయి, నిలచి లంకా పట్టణము చూచినాడు. ఆ తేజోవంతుడు, ఆ వానర పుంగవుడు అక్కడ వనాలను, ఉద్యానవనాలను, చక్కగా పూలు పూసిన సరళ దేవదారు వృక్షాలను, కొండగోగు చెట్లను, ఖర్జూర చెట్లను, గజనిమ్మ చెట్లను, కొండమల్లె చెట్లను, మొగలిపొదలను, కడిమి చెట్లను, అరటి చెట్లను, వేగిస చెట్లను, దేవకాంచన వృక్షాలను చూచినాడు. ఆ చెట్లలో కొన్ని పూల బరువుకు వంగి పోతున్నాయి. కొన్ని చెట్లకు పూలు తొడుగుతున్నాయి. పక్షి సమూహాలు అక్కడంతా విహరిస్తున్నాయి. గాలికి చెట్లన్నీ తల

లాడిస్తున్నాయి. విరగబూసిన కలువలతోను, కమలాలతోను నడబావులు, వివిధ జలాశయలు అక్కడ కనిపించినాయి. అక్కడ హంసలు, కారండవ పక్షులు విహరిస్తున్నాయి. అక్కడనే మనోహర మైన వివిధ క్రీడా ప్రదేశాలు, రమ్యోద్యానవనాలు ఆ కపి పుంగవునకు కనిపించినాయి. రావణాసురుడు తను సీతాదేవిని దొంగిలించుకు పోయినందువల్ల, ఆ కోదండపాణి రాముడు ఏ సమయాన్నయినా దండెత్తి వస్తాడేమోనన్న భయంతో మహోగ్ర ధానుష్కులను ఆ లంకాపట్టణమునకు కావలి ఉంచినాడు. అట్లా అంతటా కావలి కాస్తూన్న ఆ భయంకర ధానుష్క లందరినీ హనుమంతుడు చూచినాడు.

జీవప్రజ్ఞ చుట్టూ ఆవరణ లుంటాయి. అందులో ఉండే భయంకర ఆవరణ ఏదయ్యా అంటే అహంకారము. అది ఛేదిస్తే తప్ప జీవుడు దేవుడిని చేరలేడు. ఆ ఛేదనం గురువు చేసిపెట్టాలి. రాముడు వస్తాడేమోనన్న భయంచేత ఇదంతా. దేవకీదేవి బాగా దైవారాధన చేస్తుంటే, ఈమెకి భగవంతుడు పుడతాడంటే ఆవిడలో భగవంతుడు పుడతాడని. కంసుడు అడ్డుపడ్డాడు. అట్లాగే వీళ్ళంతా అడ్డుపడతారన్న మాట. అందుకే అంత కాపలా పెట్టి ఉంచాడు.

ఆ లంకాపట్టణమునకు చూట్టూ ఉన్న అగడ్త కమలాల తోను, కలువలతోను చాలా శోభాయమానంగా అనిపించింది. దాని ప్రాకారము బంగారుకాంతితో ధగధగాయమానంగా అనిపించింది. అన్నీ అక్కడే ఉన్నాయి. దివ్య సంపద కూడా అక్కడే ఉన్నది, కాని అహంకారము యొక్క అధీనంలో ఉండడం చేత మరొక రకంగ తయారైంది. ఆ పట్టణములో గృహాలన్నీ శరత్కాల మేఘాలవలెను,

అంతరిక్షములో ఒకదానికొకటి ఎదురు బొదురుగా నడిచిన గ్రహాలవలెను ఉన్నాయి. వీధులకి రెండు వైపులా ఉన్న భవనాలన్నీ తెల్లటి తళతళలతో ఆకాశాన్ని అంటుతూ ఉన్నాయి. ఆ భవనాలకి బంగారు బహిఃద్వారాలు అమర్చి ఉన్నాయి. ఆ బహిఃద్వారాల పైన లతలు, పువ్వులు చెక్కి ఉన్నాయి. చేపలు, మొసళ్ళు మొదలైన బొమ్మలు ఉన్న చిన్నచిన్నవి, పెద్దపెద్దవి జెండాలు ఆ పట్టణ మంతటా ఎగురుతున్నాయి. త్రికూట పర్వతము మీద మంగళ కరమైన తెల్లటి భవనాలతో ఉన్నందువల్ల అది ఆకాశంలో తేలి పోయి ఉన్న పట్టణమువలె కనిపించింది.

మన శరీర ధర్మాలన్నీ కూడా ఇందులో వివరిస్తుంటారు. త్రికూట పర్వతం మీద ఉండడం అంటే త్రిగుణముల ఆధారంగా, అది పునాదిగా ఏర్పడిన శరీరం ఇది. అందుకని త్రికూట పర్వతాల మీద ఉన్నది. దాని సహజమైన ఆకారం తెల్లటి ఆకారం. దాన్నే వజ్ర శరీరం అంటారు. ఆ వజ్ర శరీరం లోపల అంతర్భాగాలుగా చూస్తే బంగారు గోపురాలతో రకరకములైన భవనాలు కనిపించి నాయి. అది సూక్ష్మ శరీర వర్ణన. మనలో బంగారు శరీర మున్నది. వజ్రశరీర మున్నది. ఈ రెండు శరీరాలు కప్పబడిపోయి ఉండ డానికి కారణ మేమిటయ్యా అంటే కామమయ శరీరము, మనో మయ శరీరము.

మన మనస్సులో కలిగే భావాలు, మనలో కలిగే కోరికలు ఈ రెండు కలిపేసి ఆ వజ్ర శరీరాన్ని, బంగారు శరీరాన్ని తొక్కి పెట్టేసినాయి. అవి ఎక్కడో అడుగున పడి ఉంటాయి. కాని సద్గురువు వీటి పరిస్థితి ఎలా ఉందని చూస్తాడు. అవి బాగోలేక

పోతే ఈయన రక్షించలేడు. సూక్ష్మ శరీరాన్ని బొత్తిగా మరీ నాశనం చేసుకున్నారనుకోండి, రక్షించడానికి ఏ అవకాశం లేదు. బాగా విపరీతంగా కోరికలు కలిగిన వారికి సూక్ష్మ శరీరం ఎప్పుడో నాశనం అయిపోయి ఒక పెద్ద జబ్బులకు రేవుగ ఉంటుంది. ఇహ అప్పుడు సద్గురువు రక్షించడానికి ఏమీ వుండదు. ఎందుకంటే ఇవన్నీ ఉన్నాయి కాబట్టి అక్కడ ఉండే జీవుడిని రక్షించుకోవచ్చు. అసలు మొత్తము అంతా కాలిపోయింది అంటే, ఇహ రక్షించు కోడానికి ఏం లేదు. అలాగే మనోమయ శరీరం బాగున్నట్లయితే ఈ తెల్లటి కాంతి కనిపిస్తుంటుంది. అసలు ఒంట్లో ఎక్కడన్నా తెల్లని కాంతి అన్నది ఉన్నదా, ఉంటే దాన్ని పెంచవచ్చు. బంగారు కాంతి ఉందా, ఉంటే దాన్ని పెంచవచ్చు. బంగారుకాంతి పెరగా లంటే కామాన్ని నియమించుకోవాలి. సూర్యకాంతి లేదా వజ్రకాంతి పెరగాలంటే భావాలను నియమించుకోవాలి. ఈ రెంటిని మనం నియమించుకుంటుంటే మనలో అవి బాగా పెంపొందుతాయి. అటుపైన ధర్మాన్ని, దైవాన్ని ఆశ్రయించాలి. అంతా మనమే దాచేసుకుందాం, మనమే ఉంచేసుకుందాం, ఇలాంటివి కుదరదు. వాడిచ్చాడు. వాడి పనికి వాడుతుండాలి. మనమే వాడి వాళ్ళం. ఈ భావన ఉన్న సీతాదేవి అక్కడ ఉన్నది.

అంతేకాదు ఆ పట్టణం ఇంతకు మునుపు కుబేరుడిది. అదికూడా దొంగిలించేశాడు. కుబేరుడంటే సమస్త సృష్టిలోని విలువైన వస్తువులని కూడబెట్టే తత్త్వము. ఆ కూడబెట్టడంగానే ఈ శరీరంలోని పంచభూతాలను కూడబెట్టి, అటుపైన మనస్సుని కూడబెట్టి, అటుపైన దివ్య శక్తులని కూడబెట్టి, కొన్ని అసుర

శక్తులని కూడబెట్టి, లోపల సమస్త లోకాలని కూడబెట్టి, లోక పాలకులను కూడబెట్టి, గ్రహాలని కూడబెట్టి, ఈ శరీరంలో ఏ ఏ గ్రహాలు ఎక్కడున్నాయి? శని బావున్నాడా? ఎక్కడున్నాడు శని? కుజుడు బావున్నాడా? చంద్రుడు బావున్నాడా? అటుపైన బృహస్పతి ఎలా ఉన్నాడు, శుక్రుడెలా ఉన్నాడు, రవి ఎలా ఉన్నాడు, బుధు డెలా ఉన్నాడు? ఇవన్నీ కూడా సద్గురువు చూసుకుంటాడు. వీడి గ్రహ సంపత్తి ఏమిటి, వీడి సూక్ష్మ శరీరం యొక్క స్థితి ఏమిటి, వీడి వజ్ర శరీరం స్థితి ఏమిటి, ఇహ మిగతా మట్టికట్టడాలు ఎలా ఉన్నాయి ఇవన్నీ చూసుకుంటున్నాడు.

ఇక్కడ లంకా పట్టణ ప్రాకారానికి అండలుగా ఉన్న ఇసుకతిన్నెలు జఘనాలవలెను, శుద్ధోదకాలు కట్టుకున్న చీరల వలె వున్నాయి. ఇక్కడ ఇసుకతిన్నెలు అంటే మన శరీరములో కండలు తిరిగిన, సొంపైన శరీరముంటుంది మగవాడికి. ఆడ వారికి సౌందర్యంతో కూడిన శరీరం ఉంటుంది. ఆ సౌందర్యాన్ని ఇసుక తిన్నెలతో పోల్చడం అనేది కవులకు బాగా అలవాటైన విషయం. అది కవితకి సంబంధించిన విషయం. లోపల మాంసం యొక్క పరిస్థితి ఎలా ఉన్నది, రక్తప్రవాహమెలా ఉన్నది అని మనకు తెలియడానికి అగడ్తలలో ఉన్న శుద్ధోదకాలు కట్టుకున్న చీర వలెను, శతఘ్నులు, శూలాలు తలవెంట్రుకలతో పెట్టుకున్న కొప్పులవలెను, ఎక్కడ రోమము లుంటే అదృష్టమైన విషయము, ఎక్కడ రోమములుంటే దురదృష్టమైన శరీరము అనేది శారీరిక సాముద్రికములో తెలుస్తుంది.

సద్గురువు జీవుని సంస్కారం ఎలా ఉంది అని చూసు

కుంటున్నాడు. కోటబురుజులు కర్ణాభరణముల వలెను, ఆ లంకా పట్టణం సుందరాంగన వలె తోచింది. ఈ శరీరము అత్యంత ఆకర్షణీయమైన స్త్రీ అనే భావన 'పురంజనోపాఖ్యానము'లో చాలా చక్కగా వర్ణిస్తారు. అక్కడ కూడా ఇలాగే శరీరవర్ణన ఉంటుంది. ప్రతివారి శరీరము అందులో ఉండే జీవికి స్త్రీ. దాని తత్త్వాన్ని బట్టి అందులో జీవుడు హాయిగా ఉండడం, ఉండకపోవడం అనేది ఉంటుంది. దాన్ని వాళ్ళు ఎలా మలచుకుంటే అలా అవుతుంది. దివ్యంగా ఉంచుకుంటే దివ్యంగా ఉంటుంది. ఏబ్రాసిగ తయారు చేసుకుంటే ఏబ్రాసిగా ఉంటుంది. దైవం శుభ్రమైన ఇల్లే ఇస్తాడు. అందులో ఉండే వాడిని బట్టి ఆ ఇల్లు ఉంటుంది. కొంతమంది ఇంట్లో ఉంటే ఇల్లంతా కంపు కొడుతుంటుంది. కొంతమంది ఇంట్లో ఉంటే అంతకుముందు వాసనలు పోయి, శుభవాసనలు బాగా పెరుగుతుంటాయి. కొంతమంది చేతుల్లో ఏమి వచ్చినా బాగుపడిపోతుంటాయి. కొంతమంది చేతుల్లో ఏమివచ్చినా పాడైపో తుంటాయి. దేనివల్ల? వాటిని బట్టా, కాదు వీడిని బట్టి. కాబట్టిక్కడ ఈయన శరీరతత్త్వం ఎలా ఉన్నదో చూస్తున్నా డన్నమాట.

పూర్వం అక్కడ కుబేరుడు నివసిస్తూ ఉండేవాడు. ఆ పట్టాణాన్ని ఇప్పుడు రావణాసురుడు పరిపాలిస్తున్నాడు. మన శరీరం కూడా కుబేరుడిదే! కుబేరుడు మనకు ఉత్తరంలో ఉంటాడు. వాడు ఈ పట్టణాన్ని ఉండడానికి అద్దెకిస్తే మనం దీన్ని మనది అనుకుంటాం. మనదనుకోవడం లోంచే అన్నీ పుట్టుకొస్తాయి. అజ్ఞానం అంటే అదే! ఈ శరీరం మనది. మనం తెచ్చుకోలేదు, అది వచ్చింది. అది పోతుంటే ఏడుస్తుంటాం మనది కదా అని.

మనది కాదుకదా అని తెలిస్తే పోతేపోయె అని అనుకుంటాం. ఉన్నంతసేపు దాని ధర్మాన్ని నువ్వు పాలించాలి తప్ప, అది పోతుందేమో, అది పోతుందేమో, అనుకుంటే పోతుంది. ఎందుకు పోదూ? పెరుగుతూ ఉన్నంతకాలం దానిని కొన్నాళ్ళు దేహం అని పిలుస్తాం. చివికి పోవడం మొదలుపెడితే దాన్నే శరీరం అంటాం. *"శీరియతే ఇతి శరీరః"* అంటే చివికి పోయేది శరీరం అని అర్థం. చివికిపోయే ధర్మం శరీరానికి ఉన్నది. ఉన్నంతకాలం పని చేసుకుంటాం, అదీ ధీరత్వం, అదీ భారతీయత. పోతుందేమో అని దానికోసం తిరిగితే ఎట్లాగూ పోయేదానికి నువ్వు ఎన్ని చోట్ల తిరిగినా ఏం లాభం? ఈ లోపల చెయ్యాల్సిన పనులు చెయ్య కుండా అయిపోతుంది. పోతుంది కాబట్టి ఈ లోపల చెయ్యాల్సిన పనులు చేసేద్దాం అనుకోవడం ఒక పద్ధతి. పోతుందేమో అని ఏడుస్తూ దానికోసమే తాపత్రయపడుతూ చచ్చిపోవడం ఒక పద్ధతి. ఇది కుబేరుడిచ్చింది, కాబట్టి ఇది కుబేరుడిది కదా అనే భావనతో జీవిస్తే అది మనల్ని ఇబ్బంది పెట్టదు. లేకపోతే అది మనల్ని ఇబ్బంది పెడుతుంటుంది.

మహా సర్పాలు పర్వత గుహ కాచినట్లు శూలలతోను, పట్టిసాలతోను, పెద్ద పెద్ద కోరలతోను రాక్షసులు అనేకమంది ఆ పట్టణాన్ని కావలి కాస్తున్నారు. మొత్తం శరీరం అంతా రాక్షసుల చేతిలో ఉన్నది. ఎవరీ రాక్షసులు? అడ్డమైన భావనలు, అడ్డమైన కోరికలు. విపరీతమైన ఈర్ష్య, ద్వేషం, కోపం... ఇటువంటివన్నీ కలికాలంలో మనిషికి ఉంటాయి కదా! అట్లా రాక్షసులు కాపలా కాస్తూ ఉన్న లంకాపట్టణాన్ని, చుట్టూ ఉన్న మహా సముద్రాన్ని

హనుమంతుడు అప్పుడు తేరిపార చూచినాడు. చుట్టూ ఒక పెద్ద ఉప్పు సముద్రం. ఉప్పు సముద్రం చుట్టూ పంచదార సముద్రం, దాని చుట్టూ కల్లు సముద్రం, దాని చుట్టూ పాల సముద్రం, దాని చుట్టూ పెరుగు సముద్రం. ఆ పైన వెన్న- ఇలాగ మనకి రకరకాల సముద్రాలున్నాయి కదా! ఒక కేంద్రానికి ఇంకో కేంద్రానికీను. ఇవన్నీ కూడి వున్న ఈ సముద్రంలో తేలుతున్న ఒక తెల్లని కమలం లాంటి లంకా పట్టణాన్ని లేక జీవుల శరీరాన్ని చూచాడు. ఆ రావణాసురుని భయంకర శత్రువుగా భావించాడు. ఎవరు శత్రువు? మనకుండే అభిమానము, అహంకారము మన శత్రువులు.

ప్రహ్లాదుడు ఇంకెవరూ శత్రువులు లేరు నాన్నా! అని వాళ్ళ నాన్నకి చెప్పాడు. సి.వి.వి. గారు "శత్రువులా! నీ మొహం, నీలోనే ఉన్నారు చూసుకో!" అని చెప్పారు. నీలో శత్రువులే నీకు బయట కనిపిస్తుంటారు. వీడెందుకు శత్రువైనాడు? జీవుడికి శత్రువు వాడు. హనుమంతుడికి శత్రువు కాదు. మహాత్ములకి ఎవరూ శత్రువు లుండరు. వాళ్ళెంతసేపూ వీళ్ళెలా బాగుపడతారని చూస్తారు. బాగుపడాలంటే జీవుని బలం పెంచాలి. జీవుని బలం పెంచడానికి జీవుని వద్దకు దైవాన్ని తీసుకురావాలి. జీవుడు 'అది' కోరుకుంటే దైవాన్ని తీసుకురావడానికి ప్రయత్నం చేస్తాడు. అహంకారానికి కొంత నిప్పు పెడతాడు. అహంకారాన్ని కొంత తగ్గిస్తాడు. అహంకారం తగ్గుతూంటే జీవుడు దైవం వద్దకు చేరడానికి వీలుగా ఉంటుంది. అహంకారం బాగా బలుస్తుంటే ఏం లాభం లేదు.

వానరులు అందరూ ఈ మహా సముద్రాన్ని దాటలేరు. ఒకవేళ దాటి వచ్చినప్పటికినీ నిరర్థక మౌతుంది. ఈ లంకా

పట్టణాన్ని దేవతలైనప్పటికినీ జయించడం అశక్యము. దేవతలు జయించ లేరు. ఎందుకంటే శరీరంలో ఉండే దేవతలు శరీరంలో ఉండే రాక్షసులకి లొంగిపోయారు. రావణునికి గ్రహాలు, అష్టదిక్పాలురు లొంగిపోయారు కదా! కదిలితే తంతాను అంటే అట్లాగే కూర్చున్నా రందరూను. మంచి భావాలన్నీ తొక్కబడి, చెత్త భావాలన్నీ విజృంభించి పనిచేస్తున్నాయి కనుక దేవతలు జయించ లేరు. సురులకి, అసురులకి పైన ఉండేవాడుంటాడే అంటే ద్వంద్వాతీతుడొకడే దీన్ని జయించగలడు. అంతే తప్ప, దేవతా బలం చేత జయించలేరు.

అదే భగవద్గీతలో శ్రీకృష్ణుడు "అన్యదేవతారాధనలు వది లెయ్యరా, నన్ను పట్టుకో" అంటాడు. నేననే ప్రజ్ఞలోనుండే సుర శక్తులు, అసుర శక్తులు అన్నీ పుట్టుకొచ్చినాయి కాబట్టి నువ్వు నన్ను పట్టుకుంటే రెండూ నీకు లొంగుతాయి. దేవతలని పట్టు కుంటే వాళ్ళకి శత్రువులుగా రాక్షసులు ఎప్పుడూ పనిచేస్తుంటారు. అందుకని అన్యదేవతారాధన వలన ఏదో కొంత ప్రయత్నం జరుగు తుంది తప్ప దాన్నుండి ముక్తి లేదు. ముక్తి అంటే మనలో ఉన్న స్వభావాన్ని మనం అధిగమించి జీవించడమే. మన స్వభావానికి మనం లోబడి ఉన్నంత వరకు మనకి బంధనమే! ముక్తి రావాలంటే ముక్తి వచ్చేస్తుందా? ముక్తి కావాలంటే స్వభావాన్ని అధిగమించాలి. స్వభావాన్ని అధిగమించాలంటే మనలో ఏఏ తప్పులున్నాయో చూసుకోవాలి. ఆ పుచ్చులు, తుచ్చులు ఏరేసుకోవడానికి ఉపాయా లున్నాయి. ఈ ఉపాయాలన్నీ మించిన అసలు ఉపాయం దైవ మున్నది. దైవమును ఆరాధన చేస్తుంటే ధర్మము నందు ప్రేరణ

కలుగుతుంది. ధర్మమునందు ప్రేరణ కలగని దైవారాధన అంతా కలే! దైవారాధనకు దైవారాధన జరిగిపోతుంది, ధర్మము జరగదు. దైవారాధన ధర్మ ప్రేరణ కలిగించాలి. ధర్మాన్ని అనుసరించేవారికి నెమ్మదిగా మళ్ళీ బలం పెరుగుతుంది. సద్గురువు దగ్గరవుతాడు, దైవము దగ్గరవుతుంది. తద్వారా ఆటకి ఒక విడుపు ఉంటుంది. లేకపోతే కింద పడుతూ, మీదపడుతూ అలా ఆడుతూ ఉండడమే! ఏదో చేస్తున్నామనే భ్రమల్లో జీవిస్తూ ఉండడంగా ఉంటుంది.

ఈ లంకాపట్టణాన్ని దేవత లైనప్పటికినీ జయించడం అశక్యం. జయించగలిగే వాళ్ళే అయితే ఈ పాటికే జయించేసే వారుగా! జయించలేకే కదా ఈయన్ని పట్టుకొచ్చుకున్నారు. ఆ మహాబాహువు రాముడు వచ్చినప్పటికిన్నీ ఎటూ దారిలేకుండా దుర్గమంగా ఉన్న ఈ పట్టణాన్ని జయించలేడు. దైవము కూడా రాకుండా అహంకారం కట్టుదిట్టం చేసేస్తుందండీ! ఎవరు దారి చేయాలి? గురువే! గురువు వెళ్లి కొంచెం దారి చేస్తే ఆ దారి లోంచి కదా రాముడు నడచి వస్తాడు. హనుమంతుడు వేసిన వంతెన మీద కదా రాముడు నడచి వచ్చాడు. హనుమంతుడు కొంత లంకను తగులబెట్టడం వల్ల కదా అక్కడ కొంత భయం పెరిగింది! వాళ్ళని కొంత మానసికంగా బలహీనులని చేసి, వీళ్ళని తీసుకురావడానికి కావలసిన దారులు ఏర్పరచి, పట్టుకొస్తే కదా అయ్యింది.

రామనవమి నాడు ఒక కథ విన్నాను. బావుంది. సముద్రం దగ్గరకు వెళ్ళారట. వంతెన నిర్మాణం చేద్దామనుకున్నారట. సముద్రం మీద వంతెన నిర్మాణం ఎలా చేస్తాం? రాముడు ఒక బాణం తీసి సముద్రం మీద గురి పెట్టి, కోపంగా దారి ఇమ్మన్నాడు.

ఇమ్మంటే, సముద్రుడు దణ్ణం పెట్టి, ఇంకేమన్నా మార్గం చూసుకో మన్నాడు. ఎందుకనీ? రాముడు మానవుడిగానే ప్రవర్తించాలి. మానవాతీత శక్తులున్నవాడి చేతిలో నేను చచ్చిపోకూడదని రావణా సురుడు వరం కోరుకున్నాడు. కాబట్టి సముద్రుడు దారి యిస్తే, రాముడు దాటితే బ్రహ్మవరం బలం వాడికి ఉంటుంది. అందుకని మరేదన్నా మార్గం చూసుకో! మార్గమేమిటీ? హనుమంతుడు మాత్రమే! ప్రతి రాయి మీద 'రామ' అని రాయించి కోతులకిచ్చి నీటిలో వేయిస్తుంటే అవి నీటిలో తేలాయి. తేల్తుంటే రాముడికి ఆశ్చర్యం వేస్తుందిట. ఇదేమిటి మన పేరుకు ఇంత మహిమ ఉన్నదా అనుకున్నాడట. అనుకొని కొంత దూరం వెళ్ళి ఎవరూ చూడకుండా ఒక రాయి మీద 'రామ' అని రాసి నీళ్ళల్లో వేస్తే అదికాస్తా మునిగిపోయింది. మళ్ళీ వేశాడట. మళ్ళీ మునిగి పోయిందిట. చాలా బాధపడ్డాడట. ఇదంతా హనుమంతుడు చూస్తూనే ఉన్నాడట, కానీ రాముడికి తెలియదు ఆయన చూస్తున్నాడని. రాముడు అడిగాడట, చూశావా అని.

ఆ మొదటనుండి చూస్తూనే ఉన్నాను, అన్నాడట. మరి నేను రాయి వేస్తే మునిగిపోవడ మేమిటీ, నువ్వు రాయివేస్తే తేలడ మేమిటీ అంటే ముందు మీ పేరు మీద మీకు అంత నమ్మక ముండదు, రెండవది నువ్వు మాకు దైవానివి. మేమలా నమ్మాం. అందుకు మాకు పనిచేసింది. నీ నామం నీకు పనిచేయదు. మేము 'రామ' అని రాయడంతో ఆ రాయి దైవానికి దగ్గరవుతున్నది. రామనామం చేతే ఉపదేశం పొంది, అందులో చేతనమొచ్చి తేలిక అయిపోతోంది. కాని నీవు రాసినప్పటికీ రాయి నీ నుండి దూరమై

పోతుంది కదా! నువ్వు నీళ్ళల్లో వేస్తే మునిగిపోతుంది. దైవం దూరం చేస్తే జీవుడెలా బతుకుతాడు? అంటే రాముడికి నచ్చదు. ఏదో సర్ది చెప్పాడులే అనుకుంటాడు. ఇలా అని ఒక కథ ఒకాయన చెప్పారు.

అందుకే భక్తరాజ్ మహారాజ్ అంటారు 'నాకు దైవం అక్కర్లేదు, సద్గురువు చాలు' అని. దైవం ఇవ్వలేనిది సద్గురువు ఇవ్వగలడని. దైవం ఇవ్వలేడని కాదు, మన వద్దకు రాలేడు. మన అహంకారం మనం దాటలేం. మనకుండే త్రిగుణముల యొక్క బంధనం మనకుగా మనం దాటలేం. అది దాటినవాడు మనల్ని దాటించడానికి సంకల్పించుకుంటే మనం దాటడం జరుగుతుంది. ఇది దైవానుగ్రహంగా జరగాలి. గురువు ప్రత్యేకించి అనుగ్రహించడం ఉండదు. దైవము అనుగ్రహిస్తే గురువు వస్తాడు. దైవము అనుగ్రహించాలి అంటే ధర్మాన్ని బాగా పాటించాలి. ఇక్కడ అమ్మవారు ధర్మాన్ని పాటించిందా లేదా, లంకలో ఏం చేస్తోంది ఇవన్నీ తర్వాత వస్తాయి. ఆమెకి ఎంత దైవచింతన ఉన్నదో, ఎంత ధర్మ అనుసరణలో ఉన్నదీ మనకి తెలుస్తుంది. అంత తపన ఉన్న వారికి, జీవుని దగ్గరకి, దైవమే దూతను పంపడం మనకి మార్గం. అందుకే మనకు సద్గురువుల మార్గం ఏం చెప్తుందంటే, నీకుగా నీవు సద్గురువును ఎన్నుకొనే స్థితి లేదు. సద్గురువే నీ జీవితంలో ప్రవేశించి నిన్ను అనుగ్రహిస్తాడు. గురువు అనుగ్రహిస్తే దైవము అనుగ్రహిస్తాడు. దైవానుగ్రహం చేతనే గురువు నీ వద్దకు వచ్చాడు కాబట్టి, గురువు అనుగ్రహంగా దైవము నీ వద్దకు వస్తాడు. రామాయణం కూడా అదే చూపిస్తుంది.

ఈ రాక్షసులతో సామోపాయం పనిచేయదు. వీళ్ళంతా ఐశ్వర్యవంతులు. డబ్బుండి మదించిన వాళ్ళతో మంచి మాటలు చెప్తే వాళ్ళు వినరు. చేతకాని వెధవలు, వీళ్ళిలాగే మాట్లాడుతారు అనుకుంటారు. పరమగురువులు, హిమాలయాలు, సేవ– ఇలాంటి మాటలు చెప్తే ఎందుకొచ్చిందయ్యా ఇవన్నీ, ఏమన్నా పనికివచ్చే పని చేసుకో అని చెప్తారు. వీళ్ళు ధనానికి లొంగరు. మిత్రభేదానికి ఎడమే లేదు. వీళ్ళతో యుద్ధము చేయడమే అసంభవము. వీళ్ళతో ఏదీ కుదరదు, అంత బలంగా ఉన్నారని చూశాడు. ఆ ధీరుడు, ఆ వానరరాజు సుగ్రీవుడు, ఆ పరాక్రమవంతుడు అంగదుడు, నీలుడు, నేను తప్ప మరి వానరులెవరూ ఇక్కడకి రాలేరు. ఇంతకీ ఆ వైదేహి జీవించి ఉన్నదో లేదో! ఆమె జీవించి ఉంటే నేను ఆమెను చూచిన తర్వాత ఈ విషయము ఆలోచిస్తాను. జీవించి ఉండడం అంటే ఏది జీవనం? ధర్మము, దైవమే ప్రధాన మనుకొనే జీవనమే జీవనము. లేకపోతే 'పవన కుంభిత చర్మభస్త్రి కాక' అంటాడు ప్రహ్లాదుడు భాగవతంలో.

మన అదృష్టము కొలది తెలుగులో భాగవతం సంస్కృతములో భాగవతంకన్నా బాగా వచ్చింది. "*కంజాక్షునికి గాని కాయంబు కాయమే పవన కుంభిత చర్మ భస్త్రికాక*" ఊరికే గాలి నింపే తిత్తిలాంటిదే తప్ప నీ శరీరం, ఈ శరీరం దైవం కోసం వాడనప్పుడు ఇది ఎందుకూ, వెధవ శరీరం, ఇదొక గాలితిత్తి అన్నాడు. "*వైకుంఠు పొగడని వక్త్రమ్ము వక్త్రమ్మే ఢమఢమధ్వని తోడి ఢక్కగాక*", డప్పుకు నాలుకకి ఏమిటిరా తేడా, దైవాన్ని పొగడలేని వాడివి అని అంటున్నాడు ప్రహ్లాదుడు వాళ్ళ నాన్నతో. "హరి

పూజనములు చేయని హస్తంబు హస్తమే తరుశాఖ నిర్మిత దర్విగాక" దేవుడిని పూజ చేయని చేతులు చేతులా ! నీ చేతులకి, ఆ చెట్టు కొమ్మలకీ తేడా ఏమిటీ అని తండ్రిని అడుగుతున్నాడు. పూజ చేస్తావా? అబ్బే అది Priliminary అండీ, meditation చేస్తున్నాను కదా! అలా రకరకాలుగ ఉంటాయి భావాలు.

ముందు సీతాదేవి పరిస్థితి ఏమిటో! ఆవిడ హాయిగా రావణాసురునితో ఉందనుకోండి, గొడవే లేదు. రాముడికీ పనిలేదు, సుగ్రీవుడికీ పనిలేదు, హనుమంతునికీ పనిలేదు, కోతులకీ పనిలేదు. అందరూ ఎవరి దారిన వారు వెళ్ళి పోవచ్చును. అట్లా ఉంటే ఇంత తాపత్రయ పడనక్కర్లేదు కదా! జీవించి ఉంటే అంటే దైవమును గూర్చి జీవించడం. దైవము గురించి జీవించని వారంతా కూడా కదులుతున్న శవాలని రాస్తుంది భారతీయ వాఙ్మయము. అదీ సత్యం. అందుకని సద్గురువు అసలు అనేది వీడికున్నదా లేదా అని చూసుకుంటాడు. లేకపోతే దైవము పంపడు కదా! అయినా చూడవలసిన బాధ్యత గురువు కున్నది. ఎటువంటి పరిస్థితిలో వీడి దైవారాధన ఉన్నది, ధర్మాచరణ ఉన్నదీ దానిని బట్టి వస్తాడు. మనం అనుకొనేవి ఏమీ కావు. "I am the best deciple of Master E.K." అనుకుంటే అయిపోదు. ఎవరు ఏ గురువు గురించి అలా అనుకున్నా అయిపోదు. ఆ గురువు ఆ విధంగా అనుకోవాలి. "This is my best deciple" అని గురువు చెప్పాలి. ఆయ నెప్పుడూ చెప్పడు. చెప్పాలంటే చాలా ఉండాలి. అవి వీళ్ళ వద్ద ఉండక చెప్పలేక వెళ్ళిపోతాడు.

ఇంతకీ ఆ వైదేహి జీవించి ఉన్నదో లేదో! ఆమె జీవించి ఉంటే నేను ఆమెను చూచిన తర్వాత ఈ విషయము ఆలోచిస్తాను. దైవమే ఉపాయం, దైవం చేతే రక్షింపబడాలి. లంకలో ఉండే వైభవాలకి లోను కాకుండా, దైవంకోసం తపన చెందుతూ ఆమె వుంటే అపుడు ఆలోచిస్తాను. మనకి కాస్త భోగము వస్తే దైవము గుర్తుండదు. అందుకే మూడు చెప్పారు. యోగ జీవనము, భోగ జీవనము, రోగజీవనము. యోగజీవనము లేకపోతే ఫర్వాలేదు. యోగజీవనము లేని భోగజీవనము ఉంటే రోగజీవనము ఖాయం. అందుకని జీవుడి సంగతి చూసి ఈ లంక సంగతి ఆలోచిద్దాం అనుకున్నాడు.

ఎక్కడ కూర్చుందో అని వెతుక్కుంటాడు గురువు. ఎక్కడ కూర్చుంటుందీ ఎక్కడో మూలాధారములో, మలమూత్రాలవద్ద తలకిందులుగా పడివుంటాడు జీవుడు. వాడు అనుకున్న విలువ లన్నీ విలువలు కావు. ఈయన వద్ద అసలు విలువలు ఉంటే అవి అసలు విలువలు కావు. ఈ విలువలు వాడికి విలువలుగా అనిపించాలంటే వాడికి ఎన్ని పెట్టాలి? చావుకి పెడితే లంకణానికి ఒప్పుకున్నాడట. అంటే నువ్వు తింటే చచ్చిపోతావురా అంటే తినడు. అంతవరకు ఎవరూ మానరు. అందుకని జీవుడిని రక్షించుకోవడానికి శరీరాన్ని రకరకాలుగా తంటాలు పెట్టవచ్చు. అంటే వీడికి అసలు విలువ నేర్పాలి కదా! అని ఆ కొండ మీద నిలుచొని ఆ బలవంతుడు, హనుమంతుడు రామాభ్యుదయ కాంక్షి అనుకున్నాడు.

దైవము యొక్క అభ్యుదయాన్ని కాంక్షిస్తుంటాడు సద్గురువు.

ఎంత గొప్ప విషయము! దైవము యొక్క అభ్యుదయం అంటే జీవుల అభ్యుదయమే దైవము యొక్క అభ్యుదయం. జీవులంతా ఆయన పిల్లల్లాంటివారు. అందరూ వెళ్ళిపోయారు. వెళ్ళిపోయిన వాడు తిరిగిరాడు. తిరిగిరాకపోతే ఫర్వాలేదు వాడు సుఖంగా ఉంటే. కాని వాడు సుఖంగా లేడు. ఇహ ఆ తండ్రికి ఏం సుఖ మండీ? పిల్లలని కన్నారు, పిల్లలు తల్లితండ్రులని మరచిపోయి వెళ్ళిపోయారు. పోతేపోయారు కాని సుఖంగా ఉన్నారా అంటే అదీ లేదు. ఇహ ఆ తండ్రికి ఎలా ఉంటుందండీ! సుఖంగా ఉండడం అంటే ఎలా ఉండాలో తెలియదు. ఆయన చెప్తే వినరు.

హనుమంతుడు ఆలోచించడం మొదలు పెట్టినాడు. ఆ లంకాపట్టణాన్ని మహా ఘాతుకలైన రాక్షసులు పాలిస్తున్నారు. ఇంకా చూడగా హనుమంతునికి details కనిపిస్తున్నాయి. వాళ్ళందరూ ఉగ్రతేజస్కులు. వాళ్ళ పనుల్లో వాళ్ళు బాగా దిట్టగా ఉంటారు. అదే అసురులకి బలం. ఈ సురులకి ప్రమత్తత ఎక్కువ. మంచివాళ్ళకి ఉండే అలసత్వంలాగ ఉంటుంది. చెడ్డవాడు వుండేంత alert గా మనముండలేం.

మరువు మహర్షిని, ఏంటి గురువుగారూ ఏన్నాళ్ళనుండి ఈ పని చేస్తున్నారు అంటే, త్రేతాయుగం నుండి పనిచేస్తున్నాముగా! అన్నారట. అదేంటి ఇంతకాలం నుండి చేస్తున్నారు, మీలో ఏమన్నా తేడా ఉన్నదా! అని అడిగారట. మాలోకాదు, తేడా మీలో ఉన్నదని చెప్పారట. సరే నువ్వు ముందు ఇది ఒక 500 కాపీలు తీసుకురా అని ఒక సందేశమిచ్చి పంపారట. వాడు ఒక వ్రాయసకారుని వద్దకు వెడితే ఇన్ని కాపీలు తీయాలంటే 500 తాళ పత్రాలు

కావాలి కదా, అవన్నీ పోగెయ్యి అప్పుడు రాసి ఇస్తాను అన్నాడట. ఎన్నాళ్ళు పడుతుందంటే ఒక 10 రోజులు పడుతుందన్నాడట. అంతకన్నా తక్కువ పట్టదా అన్నాడట. అంతకన్నా తక్కువ పట్టదు అన్నాడట. అడ్వాన్స్ ఇమ్మన్నాడట. ఇచ్చేశాడు. 10 రోజులకి వస్తాను అన్నీ రాసిపెట్టు అన్నాడట. అలాగే అన్నాడు. వాడు వెళ్ళిపోయాడు.

ఇంతలో ఓ ఐదురోజుల తరువాత యింకోడు అటునుండి వచ్చాడట. వాడూ ఒక సందేశం పట్టుకొచ్చాడు. ఇది వెయ్యికాపీలు కావాలన్నాడట. తాళపత్రాలు లేవు అన్నాడట. లేవా అని కత్తి చూపించాడట. ఉంది బాబూ! అన్నాడట భయపడిపోయి. కానీ 500 మాత్రమే రాయగలను. అందులోనే 1000 రాయి అన్నాడట. లేకపోతే చంపుతాను అన్నాడట. ఎప్పుడిస్తావ్ అన్నాడట. 15 రోజులు పడుతుందన్నాడట. పదిహేనా! పగలు, రాత్రి తిండి తిప్పలూ తింటావో లేదో నా కనవసరం నాకు 3 రోజుల్లో కావాలి. అవన్నీ తయారుగా పెట్టకపోతే పీక కోసేస్తాను అన్నాడట. అయితే మరి అడ్వాన్స్ అన్నాడట. చంపేస్తాను అడ్వాన్స్ అంటే అన్నాడు. 10 రోజుల్లో వాడు వస్తాను అన్నాడు. అప్పుడే 5 రోజులై పోయింది. వీడేమో ఇంకో 3 రోజుల్లో వస్తాను అన్నాడు. వాడు మంచివాడు కదా వాడి పని చేయకపోయినా ఫర్వాలేదు. వీడి పని చేయకపోతే ప్రాణాలు తీస్తాడు అనుకున్నాడు.

పదిరోజులు గడిచాక అతడు వచ్చి ఏరా నా సంగతి ఏం చేశావ్, రాశావా? అంటాడు, మొదటివాడు. లేదుకదా అంటాడు. అదేమిటి ఎందుకు రాయలేదు అంటే జరిగిన సంగతి అంతా

చెప్తాడు. పోనీలే కనీసం నీ ప్రాణం దక్కింది. అంతేచాలు. చాల సంతోషం. అని మళ్ళీ అడ్వాన్స్ ఇచ్చి మళ్ళీ రాయి అని చెప్పాట్ట. గురువుగారు 10వ రోజున పిలిచాడట. ఏవిరా కాపీలు అంటే జరిగింది చెప్పాడట. అదేమరి వాళ్ళపనికి మీ పనికి తేడా! మీకు చేతకాదురా వాళ్ళతో సమానంగా పనిచేయడం. మీకే చేతనైతే ఇన్నాళ్ళు పట్టదురా ఈ పని, అని చెప్తారు. మీలాంటి చచ్చు వెధవలచేత పనులు చేయించుకోవడం వల్ల మా పనులు అవ్వవురా! అయినప్పటికీ మాకు ఓపిక ఎక్కువ. మిమ్మల్ని సమర్థులను చేసుకోడానికి మీకు ముందు 700 జన్మలు స్ఫూర్తినిచ్చి, మీకు తెలియకుండా మిమ్మల్ని బాగా తోముకొని తీసుకువస్తే 77 జన్మలు ఇంకా బాగా తోమి మీకు సమర్థత ఇస్తే, అప్పుడూ మీరు అహంకారులు కాకుండ అలా ఉంటే, అప్పుడు పనికి వస్తార్రా అంటారాయన.

ఎందుకంటే అన్నీ నేర్చుకొని అటుపోయే వాళ్ళుంటారు చాలామంది. ఎందుకంటే అది గొప్పగా ఉంటుంది. ఇందులో గొప్పతనమేమీ ఉండదు. ఏదో గావంచా కట్టుకొని, రావి ఆకులూ మట్టి ఆకులూ తింటూ, ఏవో మంచి నీళ్ళు తాగుతూ సత్కార్యాలు చేయాలి. అక్కడ వాళ్ళేమో రాజభవనాల్లో ఉంటూ, భోగాలు అన్నీ అనుభవిస్తూ ఉంటారు. ధర్మం జయించాలంటే ధర్మాన్ని ఆశ్రయించిన వాళ్ళ బలం ఎంత, అధర్మాన్ని ఆశ్రయించిన వాళ్ళ బలం ఎంత? వాళ్ళని బలహీన పరచాలి. అప్పుడే ఈ సత్తు కేసులన్నిటికీ మంచిరోజులు. వీళ్ళకి వీళ్ళుగా ఏం చేసుకోలేరు. మాస్టరుగారు అంటుండేవారు, కుంటివాడిని, అవిటివాడిని ఇచ్చి ధర్మ సంస్థాపన

చేయమంటే ఎవరు చేయగలరు అని. అందర్నీ తోముకొని, పనులు చేయించు కోవడమంటే వారంతా దైవాభ్యుదయ కాంక్షులే అని అర్థం. ఒక్కొక్కడికి ఒక్కో వెర్రి, ఒక్కొక్క ఆవేశం, ఒక్కో పట్టుదలా, ఒక్కో తీవ్రతా.... ఇలా వంద బలహీనతలు. ఇహ ఇలాంటి దానిలో జీవుడు బతికున్నాడో లేదో చూసి వాడిని బాగు చేసుకోవాలి. ఎందుకని ఆయనకి తెగని తాపత్రయం.

ఆ రాముడు, సీత అంటే చచ్చి పోతుంటాడు. చచ్చిపోవడ మంటే మమకారమా? కాదు, జీవుడి మీద దేవుడికి ఉండే అభిమానం. ఎంత చెడ్డా నా వాళ్ళు కదా అంటాడు. రాముడికి రావణుడు కూడా 'నా వాడే'. నీవాడే కానీ ఇహ తీసెయ్యి అని అందరూ వచ్చి చెప్తారు. దేహంలో నుండి తీసెయ్యి నీ వాడు నీ దగ్గరకు వస్తాడు అని చెప్తారు. తీసెయ్యి అని కోరకపోతే తీయడు. అదేకదా జయవిజయుల్లో ఒకడు. కుంభకర్ణుడు బయటివాడు, రావణుడు లోపలివాడు. విజయుడు అంటే బయట ఉంటాడు. Objective Mind. జయుడు అంటే బలంగా ఉంటాడు. లోపల రహస్యంగా ఉంటాడు. Subjective Mind. వాడిదగ్గర చాలా మాయ లుంటాయి. వీరందరూ మహా పరాక్రమవంతులు. నేను ఈ రూపంతో పోతే పట్టుకుంటారు. వాళ్ళు మాయ. కాబట్టి మాయ కేమిటయ్యా విరుగుడు అంటే మాయే! అదేకదా కృష్ణుడు చూపిస్తాడు. వాళ్ల మాయను బట్టి మన మాయ. 'చినమాయను పెనుమాయ, అటు నేనే ఇటు నేనే' అంటారు కదా! వాడు మాయల వాడైతే నేనూ మాయే. వాడు మాయ కాకపోతే నేను మాయ కాదు. టెర్రరిస్టు క్యాంప్‌లోకి పోలీస్ డ్రస్ వేసుకు వెడితే

వీడు ఎవడన్నదీ తెలిసిపోదండీ? వెంటనే కాల్చి చంపెయ్యరూ! కొంచెం వికారమైన బట్టలు వేసుకొని, నల్ల కళ్ళజోడు పెట్టుకొని, గడ్డం పెట్టుకొని, చారల బనీను వేసుకొని వెడితే నమ్ముతారు. అందువల్ల వారిని వంచన చేసే లోపలకి పోవాలి.

జీవుని ఉద్ధరించాలంటే, రాక్షసులని వంచన చేయాలి. అంటే మనలో ఉండే అసుర శక్తులకి తెలియకుండా సురశక్తులను పెంచాలండీ! అందుకని మనం సద్గురువు చెప్పింది ఆచరిస్తుంటే మనకి తెలియకుండానే మనకి కొంతబలం దొరుకుతుంది. ఏదో చెప్తుంటారు ఇవన్నీ, మనకి పనికి వచ్చేవా ఏమన్నానా అనుకుంటే లాభం లేదు. మన సంగతి అంతా మొత్తం స్కాన్ తీస్తారు. ప్రభాకర శాస్త్రి గారిని పడుకోబెట్టి సి.వి.వి. గారు మొత్తం పుట్టు పూర్వోత్తరాలు, పూర్వజన్మలు, దేహంలో ఉండే బాధలు, కారణాలు అన్నీ ఒక స్కాన్ తీస్తారు సి.వి.వి. గారు. తీసి, "ఇహ ఫర్వాలేదోయ్! నీ రోగాలన్నీ నేను చూసుకుంటాను. నువ్వు శుభ్రంగా ఉండవచ్చు, నీ యోగం నువ్వు చేసుకో" అని చెప్పారు. అదీ పరమగురువులు!

అట్లా చేయగలిగితేనే నేను లంకాపట్టణం లోనికి ప్రవేశించ గలుగుతాను. నేను చేయగల్గిన పనికి రాత్రే తగిన సమయం. రాత్రి అంటే చీకటి అనే అజ్ఞానంలో కూడ చూడగలిగినవాడు. రాక్షసులు చీకటి అనే అజ్ఞానంలో చూడలేరు. నిజానికి రాక్షసుల బలం రాత్రే ఎక్కువగా ఉంటుంది. అంటే వాళ్ళ జ్ఞానానికి అందని లోతులోకి నేను మారిపోవాలి. వాడికి నేను ఫలానా అని తెలియకూడదు. అంటే సద్గురువు నేనింతటి వాడినని చెప్పుకోకూడదు. చెప్పుకుంటే అక్కర్లేని వాళ్ళంతా చేరిపోతారు. ఊరంతా వచ్చి మీద పడి

పోతుంది, మనం చేద్దామనుకున్న పని మూలన పడిపోతుంది. మనం ఏదో గుట్టుగా తెలియకుండా ఉంటే, ఏ పనికోసం వచ్చామో ఆ పని చేసుకోవచ్చు.

దైవంకోసం వచ్చిన సద్గురువు, దైవం పనులు చేయాలంటే, ఊరంతా ఆకర్షించేస్తే ఈయన పని ఏంచేస్తాడు? అడ్డమైన వాళ్ళూ వచ్చేస్తారు. చుట్టుముట్టేసి బంధించేస్తారు. వాళ్ళవాళ్ళ కోరికలు తీర్చుకుంటుంటారు. అయిపోయింది. పనులు కావడంలేదని గోల. ఎంతోమంది సద్గురువుల వద్ద అది నేను విన్నాను. ఎట్లా అవుతుందీ? వచ్చిన పని కావాలంటే ఊళ్ళో వాళ్ళందరికి నువ్వు ఎంతటి వాడివో చూపించేస్తే అవుతుందా? కాదు. పనికిరానివాడిని దూరంగ పెట్టెయ్యగలగాలి. ఆ విషయంలో మాస్టర్ ఇ.కె. గారు బాగా చేసి చూపించారు. "వాడెంతటివాడైతే మనకేంటోయ్! వాడితో మనకి పని లేదు" అనేవారు. వాడు అధికారి కావచ్చు, డబ్బున్న వాడు కావచ్చు, రాజకీయ నాయకుడు కావచ్చు... వాడి చుట్టూ నువ్వు తిరక్క, నన్ను తిప్పక అని చెప్పేవారు. వాళ్ళందరూ వస్తే వాళ్ళ పనులు మనచేత చేయించుకుంటారు తప్ప మన పనులు వాళ్ళు చేస్తారా? చేస్తున్నట్లు నటిస్తారు. దణ్ణం పెడతారు, చుట్టూ చేరతారు, కైంకర్యాలు చేస్తారు. వాడి పని నువ్వు చేస్తుంటే నీ పని ఏమైపోతుంది? లేచిన దగ్గరనుండి వాడి పని నువ్వు చేస్తుంటే, పైవాడు అడుగుతాడు ఏరా! నా పని ఏం చేశావని? నీ పనికి ఖాళీ లేదు, వీళ్ళపని చూస్తున్నాను, ప్రస్తుతానికి బాగానే ఉందిక్కడ అని చెప్పుకోవాలి.

అందుకని లంకా పట్టణంలో చేరితే ఎటువంటి వాడైనా

దెబ్బతింటాడు. ఎంతోమంది ఈ ప్రపంచం అనే లంకలోకి ప్రవేశించి, సద్గురువు అనేవాడు అందులోంచి జారిపోయి, ఎక్కడో మూలన పడిపోయి, ఏరా ఇక్కడున్నావంటే కాళ్ళు విరిగి పోయినాయి మరిక వదిలెయ్యండి, తపస్సు చేసుకు వస్తాను అని చెప్తాడు. వాళ్ళు వచ్చిన పనులు కావు, వాళ్ళనుకున్నవి చేయ లేరు. అందరివీ చేయడం ఉంటుంది. అంతే కాదు ఎన్నో వ్యతిరేక శక్తులు వస్తుంటాయి. వాటన్నిటినీ కూడా నిర్జించుకోవాలి. మరి మనం వచ్చిన పనో? ఊరంతా పూసుకోకుండా, వచ్చిన పని గుట్టుచప్పుడు కాకుండా చేసుకు వెళ్ళిపోవాలి.

అందుకని వాళ్ళకి కనబడకుండా వెడితేనే కదా సీతని వెదకడానికి వెళ్ళగలం! వాళ్ళకి నేను ఇప్పుడే కనబడితే నేనొక్కడినే వాళ్ళతో యుద్ధం చేయాలి. అందుకని రాత్రి పిల్లి ఆకారం తీసు కున్నాడని చెప్తారు. పిల్లి ఆకారము అంటే రాత్రిపూట చూడగల తత్వము అని అర్థము. సద్గురువు రాత్రిపూట చూడగలడు. అంటే ఇతరులకు ఏది కనబడని విషయమో దానిని అతడు చూడగలడు. మన గురించి మనకి తెలియని విషయాలు అతడు చూడగలడు. మన గురించి మనకి తెలిసిన విషయములందు ఆయనకు శ్రద్ధ ఉండదు. ఎందుకంటే మన గురించి మనకి తెలిసిన విషయాలు పెద్ద విషయాలు కాదు. మాస్టారూ! చూశారా టెన్నిస్ ఆడుతుంటే ఎంత కండ వచ్చిందో అంటే బావుందోయ్! అంటారు. ఆయనకి మన కండ గురించి ఎందుకు? ఏవో చూపిస్తుంటాం మన వన్నీ ఆయనకి. ఆయనవి మనకి చూపిస్తే మనం చచ్చిపోతాం. అందుకని ఆయన ముందు రాత్రి ఎన్నుకున్నాడు. ఎందుకనంటే అజ్ఞానానికి

తెలియకూడదు. రాక్షసులంతా అహంకారులు అవడంచేత అజ్ఞానులు. అదొకటే మార్గం దైవానికి. హిరణ్యకశిపుడిని చంపినా, రావణుడిని చంపినా, కంసుడిని చంపినా, మరొకడిని చంపినా వాళ్ళ అజ్ఞానంలోంచి తీసే వాళ్ళకి అట్లకాడవేసి కాల్చేశాడు, అయిపోయింది. ఇంకొక పద్ధతి లేదు.

భయంకరమైన రాక్షసులు కావలి కాస్తున్నందువల్ల దేవతలైనా ఎదిరించలేని లంకాపట్టణాన్ని చూస్తూ, పదేపదే నిట్టూర్పులు విడుస్తూ "రావణాసురుడు దురాత్ముడు, వాడి కంట పడకుండా ఏదో ఒక ఉపాయంతో సీతాదేవిని చూడవలెను. ఎట్లా చేస్తే రాముని పని చెడిపోకుండా ఉంటుందో అట్లా చేయవలెను. ఆ జనకాత్మజ వద్ద ఎవ్వరూ లేనప్పుడు ఒంటరిగా పోయి చూడవలెను. ఆలోచన లేని దూతలు దేశకాల విరుద్ధంగ ప్రవర్తిస్తే, సూర్యోదయం వేళ చీకట్లు పటాపంచలు అయినట్లు కాబోతున్న పనులు కూడా నాశనమై పోతాయి." దైవదూత ఆలోచించి పని చేయాలి. దైవం గూర్చి ఆవేశం ఉంటే సరిపోదు. ఆలోచన ఉండాలి. లేకపోతే కాల విరుద్ధంగా ప్రవర్తిస్తాం. దానివల్ల అవ్వవలసిన పనులు పాడైపోతాయి.

ప్రభువు మంత్రులతో ఆలోచించి ఇది కార్యం, ఇది అకార్యం అని నిశ్చయించి, ఆజ్ఞాపించి నప్పటికినీ, మేమే పండితుల మను కొనే దూతలు చేతగాక పనులు పాడు చేస్తుంటారు. అసలు దైవాన్ని స్మరిస్తే నువ్వేం చేయాలో నీకు తెలుస్తుంది. ఈ ఉపాయం మనకి భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇస్తాడు. నీకేం చేయాలో తోచట్లేదా నన్ను ధ్యానించు, నీకు భావం వస్తుంది. మనస్ఫూర్తిగా "నేనేం

చేయాలి" అని నన్ను కోరు. నీకు నేను భావాన్ని బుద్ధిలోకంలో ప్రచోదనం చేస్తాను. హనుమంతుడు అదే చేస్తాడు. సీతాదేవి ఎంత సేపటికీ కనబడకపోతే, కళ్ళు మూసుకొని కాల స్వరూపుడైన లక్ష్మణుడిని, దైవం అయిన రాముడిని, ప్రకృతిమాత అయిన సీతని, తన తండ్రి అయిన వాయుదేవుని, సూర్యుడిని, అగ్నిదేవుడిని, చంద్రుడిని ప్రార్థిస్తాడు. నాకు దారి చూపించండి, నాకు ఎటు పోవాలో తెలియడంలేదని అడుగుతాడు. అవి ముందు ముందు శ్లోకాలలో వస్తాయి. అవి ప్రతిరోజు చదువుకోవలసినవి. దారి లేకుండ పోతుంటాం కదా! మనం నడిచిందే దారి అనుకుంటాం. అలా కాకుండా దారి సరిగ్గా దొరకాలంటే మనం ప్రార్థన చేయాలి, తండ్రిని. అంటే బ్రహ్మోపదేశం చేశాడని. ఇంతమందిని ప్రార్థన చేస్తాడు.

ప్రార్థన చేయగానే అశోకవనం వెళ్తే బావుంటుందేమో అనిపిస్తుంది. అప్పుడు అశోకవనం వెళ్తాడు. అందుకని ఎలా ప్రవర్తించాలో ఎప్పటి కప్పుడు సద్గురువే దైవాన్ని ఆరాధన చేసి తెలుసుకుంటుంటాడు. ఇహ మనమెంత? అది కారణంగా తామే పండితుల మనుకొనే వారు చేతకాక పనులు పాడుచేస్తుంటారు. ఎట్లాచేస్తే రామకార్యం చెడిపోకుండా ఉంటుందో, ఎట్లా చేస్తే నా మనసు వికలమైపోకుండా ఉంటుందో, అట్లాచేస్తే నా దుస్తర సముద్ర లంఘనం వ్యర్థమై పోకుండా సార్థకమౌతుందో అట్లా నేను ఇప్పుడు చేయవలెను. రాక్షసులు నన్ను చూచినట్లైతే 'రావణాసురుని నాశనము చేయవలెను' అని అనుకుంటున్న రాముని పని పాడైపోతుంది. ఇక్కడ నేను రాక్షసులకు తెలియకుండా ఉండడం

అశక్యం. ఒకవేళ నేను రాక్షసుల రూపం ధరించినప్పటికీ, ఏ రూపు ధరించినప్పటికినీ వాళ్ళు గుర్తుపట్టి పట్టుకు పోగలుగుతారు. ఏ రూపు లేనటువంటి వాయుదేవుని సహితము శాసిస్తున్నారు. వారి అనుమతి లేకుండా వాయుదేవుడు వీచనుకూడా లేడే! ఇహ రాక్షసులు తెలుసుకోనిది ఏమీ లేదు. నేను ఇక్కడ నా సహజ రూపంతో ఉన్నట్లయితే నాశనం అయిపోవడం తప్పదు. ఆ సుగ్రీవప్రభువు ప్రయోజనము పాడైపోక తప్పదు. అందుకని నేను ఏదో ఒక హ్రస్వరూపము ధరించవలెను. రామకార్య సాఫల్యము కోసము చీకటిపడ్డ తర్వాత లంకాపట్టణానికి పోవలెను. చొరనలవి కాకుండా రావణాసురుడు ఏలుతున్న ఈ మహాపట్టణానికి రాత్రి పూటనే పోవడానికి వీలవుతుంది. అప్పుడే భవనాలన్నీ వెతక డానికి, జనకాత్మజ సీతాదేవిని చూడడానికి సాధ్యమవుతుంది అని ఆ కపివీరుడు ఆలోచించి నిశ్చయం చేసుకున్నాడు.

సీతాసందర్శన ఉత్సుకతతో సూర్యాస్తమయము కోసం ఎదురుచూస్తూ ఉండిపోయినాడు. ముందు అంతా చూసుకున్నాడు. చేయాల్సిన పని ఏమిటి, ఇక్కడి పరిస్థితులు ఏమిటి, ఈ పరిస్థితిలో మనం ఎట్లా చేయాలి... ఇలా! మనల్ని రాముడు పంపించాడు కదా, ఎట్లా పడితే అట్లా చేసి అంతా రాముడు చూసుకుంటాడు అనుకుంటే ఉపయోగం లేదు. అలా అయితే ఏ కోతికైనా ఉంగరం ఇచ్చి పంపించవచ్చును కదా! హనుమంతుడికే ఉంగరం ఎందు కిచ్చాడు? కొంచెం ఆలోచించి, ఆవేశపడకుండా, సమయస్ఫూర్తితో పనిచేస్తాడని ఇచ్చాడు. ఎంత బాధ్యత అది. ఏం చేసినా రాముడు నాతో ఉన్నాడు కాబట్టి జరిగింది అని చెప్తాడు హనుమంతుడు.

కాబట్టి ఏ కోతిచేతనైనా ఆ రాముడు పని చేయించగలడు అని అనుకోడానికి వీలులేదు. దైవం మీద బాగా కాంక్ష పెరిగినప్పుడు ఏం చేస్తారంటే, ఏ కోతి చేతనైనా రాముడు చేయించగలడు అంటారు. ఏ కోతిచేతనైనా ఆ పని చేయించ గలిగితే కోట్లకోతులుంటే ఈ కోతినే ఎందుకు ఎన్నుకున్నాడు? ఈ కోతి ఆలోచిస్తుంది. అంతేకాదు, బలమున్నది, పని చేయగలదు, సమయస్ఫూర్తి ఉంది, జ్ఞానమున్నది. ముందే చెప్పాడు కదా తమ్ముడికి, ఇతడికి మూడో కన్నున్నది, మనం జాగ్రత్తగా ఉండాలి, మనకి కావలసినవాడు అని చెప్తాడు. కాబట్టి ఆ విధంగ కదా రాముడు ఎన్నుకున్నాడు. ఎన్నుకున్న హనుమంతుడు ఎంత ఆలోచించి చేస్తున్నాడు? మనం వాయుపుత్రులం, వాలే మనల్ని చంపలేక పోయాడు, వజ్రాంగశరీరం మనది, ఈ రావణా సురుడెంత, చూసుకుందాం అనిచెప్పి అలాగ వెళ్ళిపోకుండా ఆలోచించి రాత్రి వరకు వేచి వున్నాడు. ఆ తర్వాత పిల్లి వేషం ధరిస్తాడు. అయినప్పటికి చూస్తుంది లంకిణి. "ఎవర్రా నువ్వు?" అని అడుగుతుంది.

హనుమంతుడు లంకా తీరాన్ని చేరాడు. ఇంకా లంకలోకి ప్రవేశించలేదు. లంకలోకి ప్రవేశించకుండా దూరం నుండి లంకను చూచి, లంక దుర్భేద్యమని భావన చేశాడు. ఎవరికీ జయించ నలవికాని మహాపట్టణం అని భావన చేశాడు. కొంత నిరుత్సాహం చెందాడు. అందరం ఎలా వస్తాము, రావణుడితో ఎలా యుద్ధం చేస్తాం, అమ్మవారిని ఏ విధంగా రక్షించుకోగలం, ఎవరికీ వీలుపడదే అని భావన చేశాడు. పట్టణాన్ని కాపలా

కాస్తున్న రాక్షసులని చూశాడు. రాక్షసులు అంటే శరీరాన్ని రక్షణ చేసేవారని అర్థం. కనుక వాళ్ళు శరీరానికి తేడా పడేవాటిని లోపలకి ప్రవేశింపనివ్వరు. లోపల ఉన్న రాక్షసులు బయట దైవానికి సంబంధం లేకుండా జీవుడిని బంధించి తమకు బానిసగా చేసుకోవడానికి ప్రయత్నం చేస్తారు. ఆ విధంగ జీవుడు దేహాత్మ భావంలో ఇమిడి ఉంటాడు. ఎంతసేపూ తన దేహానికి ఏం కావాలో అదే జీవితంగా మలుచుకుంటుంటాడు. అదంతా చూచాడు. దేవతలకి గాని, దైవానికి గాని, ఇందులో ప్రవేశించి జీవుడిని రక్షించు కోవడము సులభమా అనే భావం కలిగింది. తను దైవదూతగా వచ్చినవాడు, కార్యం చెడిపోకుండా దానిని ఏ విధంగా నిర్వర్తించాలి అని ఆలోచన చేశాడు. ఆ ఆలోచన చేసి దేశాన్ని బట్టి, కాలాన్ని బట్టి దూత లేక సద్గురువు ప్రవర్తించాలి తప్ప, ఈ రెంటినీ గమనించకుండా ప్రవర్తించినట్లయితే కార్యం చెడిపోతుందని చెప్పి దూతలకి ఉండవలసిన కొన్ని కళ్యాణ గుణాలు ఇక్కడ వాల్మీకి మహర్షి తెలియ పరుస్తాడు. అలాగే సద్గురువుకు ఉండవలసిన కళ్యాణగుణాలు కూడా ఇక్కడ వివరించడం జరుగుతుంది.

దైవనిర్ణయాన్ని బట్టి కాలాన్ని దేశాన్ని ఎరిగి చేయవలసిన కర్తవ్యం నిర్వర్తించడమే తప్ప, దైవం తనను పంపించాడు కాబట్టి తనకు తిరుగులేదని ఎట్లాపడితే అట్లా చేయడానికి వీల్లేదు. వచ్చిన కార్యం సఫలీకృతం కాకపోతే దూతకు ఆనందం ఉండదు. సముద్ర లంఘనం అంటే దివ్యలోకాల నుండి దిగి వచ్చి జీవులని రక్షించ డానికి, వచ్చినవాడు ఆ వచ్చిన పని కాకపోతే ఇంత ప్రయాణము

వ్యర్థమైపోతుంది. దేహంలోఉండే దురభ్యాసాలకు తెలియకుండా సద్గురువు దేహాన్ని తనకు ఉన్ముఖం చేసుకోవాలి. ఎందుకంటే దురభ్యాసాలకి వీడివల్ల మనకు కీడు వస్తుందనుకుంటే వెంటనే అప్పుడే వ్యతిరేకిస్తాయి. అందుకని రాక్షసులు నిద్రపోతున్న సమయంలో, ఎవరికీ తెలియకుండా, రాత్రిపూట వెళ్ళాలని అనుకోవడం. రాత్రిపూట అంటే ఈ అజ్ఞానానికి సంబంధించిన శక్తులన్నీ నిద్రపోతున్న సందర్భంలో సద్గురువు లోపలకి ప్రవేశించి జీవుడిని మేలుకొలపటం చేయాలి. హ్రస్వరూపం ధరించినట్లు చెప్పారు అంటే సూక్ష్మశరీరం ధరించినాడని అర్థం. అంటే కనబడని రూపాన్ని ధరించినాడని అర్థం.

ప్రత్యేకించి భారతదేశంలో సూక్ష్మరూపంలో చాలామంది మహాత్ములు తిరుగుతుంటారు. మనకెవరికీ ఏం కనబడదు కదా! ఎందుకంటే రాక్షసులకి లోనైనవారం. రాక్షసులు అంటే దేహ బంధంలో పడి ఉన్నవారు. దేహం కోసమే జీవిస్తున్నవారము. దేహానికి రాజైన మనస్సు చెప్పే కార్యాలను చేసేవారము. అటువంటి వారికి సూక్ష్మరూపంలో ఉండే సద్గురువులు కాని, మహాత్ములు కానీ కనబడరు. ఈ భూమి యొక్క ప్రత్యేకత ఏమంటే, ప్రత్యేకించి భూగోళం మీద, భరతభూమి మీద సత్పురుషులు, యోగులు, ఋషులు, గురువులూ చేసే సంచారం ఈ భూభాగం మీద జరుగుతున్నంతగా ఎక్కడా జరగలేదని జ్వాల్‌కూల్ మహర్షి 'The Treatise On White Magic' అనే పుస్తకంలో వ్రాశారు. భరతభూమి పుణ్యభూమి అనడానికి ఇది ఒక ముఖ్యకారణం. మనం పుణ్యాత్ములం అని కాదు, మన భూమి

పుణ్యమైనది. ప్రస్తుతం మనం నాసిగ ఉన్నాం. జాతి చాల నాసి పద్ధతిలో ఉన్నది. కాని భూమి చాలా ఉత్తమమైన భూమి. ఎంతో మంది ఋషులు తపస్సు చేశారు. ఎంతోమంది యోగులు ఉద్భవించారు. మనుషులు మహాత్ములైనారు. వారి కారణంగా ఈ భూమి, వాతావరణం పవిత్రంగా ఉంటుంది. అది కారణంగా ఋషులు ఇక్కడ హాయిగా తిరగడానికి వీలుగా ఉంటుంది. వారు మన శ్రీశైలము ఇత్యాది పుణ్య క్షేత్రాలకి తప్పక వస్తుంటారు. అక్కడ ఉండే దైవదర్శనం చేసుకొనే పద్ధతి ఋషులలో ఉన్నది. ఆ విధంగా సంచరించే వారు మనకు గోచరించరు కదా! అందుకే లంకలో ఉండేవారికి గోచరించకుండా తిరిగేందుకు నిర్ణయించు కున్నాడు.

సూక్ష్మరూపం అంటే రెండు అర్థాలున్నాయి. చిన్నరూపమని ఒక అర్థం. ఎంత చిన్నరూపమైనా వాళ్ళకు తెలిసిపోతుందని చెప్పాడుగా ముందే. అందుకని కనబడని రూపం ధరించాలి. అంటే సూక్ష్మశరీరంతో కూడిన రూపం. అందుకని సద్గురువు సూక్ష్మశరీరధారి అయ్యి ఉండాలి. ప్రతివాడు పేరు పెట్టుకున్నంత మాత్రాన సద్గురువు కాదు. అలా అని పేరుపెట్టుకోక పోయినా సద్గురువే! సూక్ష్మశరీరం ఉంటే. అతడు సూక్ష్మ శరీరంతో సంచారం చేస్తుంటాడు. అలా సంచారం చేసి తనను స్మరించిన వారి వద్దకు వెడుతుంటారు. జీవులందరినీ సంరక్షించు కుంటుంటాడు.

అదే విధంగా తాను కూడా చేయాలని హనుమంతుడు నిశ్చయించుకున్నాడు. జీవులు నిద్రపోతుంటారు కాబట్టి రాత్రి

అయితే సులభంగా ఉంటుంది. సూర్యాస్తమయము అవుతూ ఉండగా దేహాన్ని కురచ చేసినాడు. పిల్లి అంత దేహముతో అద్భుతముగా కనిపించినాడు. పిల్లి అని ఎందుకన్నారంటే రాత్రి చూడగలదని అర్థం. రాత్రి పూట చూడగలగడం అంటే చీకట్లో చూడగలగడం. సూక్ష్మ శరీరధారులు మాత్రమే అలా చూడగలరు. గ్రంథాలన్నీ అలా రహస్యార్థాలతో నిండి ఉంటాయి. అసలు పిల్లి అంటే అపశకునంగా భావిస్తాం కదా! మామూలుగా అయితే పిల్లినే చూడం కదా! అలాంటిది పిల్లిగా అయిపోతే! పిల్లి అంత చిన్నరూపమని ఒక అర్థం, రాత్రిపూట చూడగలదని ఒక అర్థం. ఇంతకు ముందేమో ఒళ్ళు బాగా కురచ చేశాడని చెప్పారు. అంటే సూక్ష్మ శరీరధారి అయ్యి రాత్రిపూట చూడగలిగిన స్థితిలో ఉన్నాడని అర్థము. రాత్రిపూట చూడ గలిగినవాడే చూడగలిగినవాడు. పగలు చూడ గలిగినవాడు చర్మచక్షువులు కలిగినవాడు. రాత్రి చూడ గలిగినవాడు మూడవనేత్రం తెరచుకున్నవాడు. వాడికి చీకటిలేదు.

# 4

హనుమంతుడు సూక్ష్మశరీరంతో అద్భుతంగా కనిపించాడు. ఎవరికి? దేవతలకి, వాల్మీకి మహర్షికి. ఇంకెవరికీ కనిపించడానికి వీలులేదు కదా! సూక్ష్మశరీరంలో ఉన్నవాడిని సూక్ష్మ శరీరంలో ఉన్నవాళ్ళే చూడగలరు. మిగతావాళ్ళు చూడలేరు. అసురసంధ్య వేళ ఆ వీర్యవంతుడు హనుమంతుడు ఒక్క గంతువేసి పైకి ఎగిరి మనోహరమైన లంకాపట్టణము దగ్గరకు పోయినాడు. బహిర్ద్వారంలో నుంచి లోపలికి చూచినాడు. బంగారు వెండి స్తంభాలతోను, బంగారుమయమైన కిటికీలతోను, బంగారు రేకులు స్ఫటికములూ తాపటముచేసిన నేలలతోను ఉన్న ఏడు, ఎనిమిది అంతస్తుల ప్రాసాద గృహాలను చూచినాడు. వైడూర్యమణులు పొదిగి ముత్యాలతో ముగ్గులు పెట్టిన నేలలతోను, అంతటా చిత్రంగా అలంకరించిన బంగారు బహిర్ద్వారములతో అక్కడి రాక్షస భవనాలు ధగధగ లాడుతూ కనిపించాయి. తెల్లగా ఎంతో ఎత్తున ఉన్న విమాన గృహాలతోను, భీమబలులు అయిన రాక్షసులతోను, ఊహించనలవి కాని అద్భుతాకారముతోను, గంధర్వ నగరమువలె లంకా పట్టణము కనిపించినది.

అది అసలు గంధర్వనగరమే, కుబేరునిదే! ఇదంతా భౌతిక దేహ వర్ణన. భౌతికలోకాలలో ఉండేవాళ్ళు వీలైనంత బంగారాన్ని

పోగేసుకుంటుంటారు. వాళ్ళ మోజు అంతా బంగారం, మణులు, మాణిక్యాల మీద ఉంటుంది. తర్వాత హనుమంతుడు లంక దర్శనం చేసినప్పుడు పదార్థమయమైన విలువ ఒకటి చూపిస్తాడు. భోగపరమైన జీవనం ఒకటి, కామపరమైన జీవనం ఒకటి చూపిస్తాడు. అహంకారపూరితమైన భాషణం ఒకటి వినిపిస్తాడు. ఇవన్నీ లంకలో ఉంటాయి. అంతేకాదు లోపల హోమకుండాలు, మంత్రాలు చదివే ప్రదేశాలు, క్రతువులు చేసేవారిని చూశాడు. అవి కూడా ఉంటాయి. ఎందుకంటే వాళ్ళ రక్షణకోసం వాళ్ళు చేసుకొనేవి. మనం కూడా మనకోసం పూజలు చేసుకుంటాం కదా! మనం బావుండాలి, మనవాళ్ళు బావుండాలి- ఇలా స్వీయ రక్షణ మంత్రం పద్ధతిలో మనల్ని మనం రక్షించుకుందాం అనుకుంటే సీతాదేవి కాము. మనల్ని మనం రక్షించుకోవడం ఆర్య సంప్రదాయంలో లేదు. వీలుంటే ఎవర్నయినా నువ్వు రక్షించు. నీ రక్షణ సంగతి అంటావా దేవుడికి వదిలెయ్యి. నారు పోసినవాడు నీరు పోస్తాడు. నువ్వు ధర్మాన్ని పాలించు. నువ్వు రక్షించుకోగలిగిన వాడివైతే నువ్వు రక్షించుకో. అందుకని రక్షణకి ఉపాయము భగవంతుడే.

మనకన్న కొన్నికోట్ల రెట్ల శక్తిమంతురాలు, సమర్థవంతురాలు, విద్యావంతురాలు, జ్ఞానవంతురాలు అయినా, ఆ సీతాదేవి నన్ను నేను రక్షించుకోవడమేమిటీ రాముడు రక్షించుకోవాలి అని చెప్తుంది. అది భక్తియొక్క పరాకాష్ఠ. నిజమైన భక్తులు తమ్ముతాము రక్షించుకొనే ప్రయత్నములో ఉండరు. తమ్ముతాము రక్షించుకోవడమనేది ఒక మోహం, భ్రమ, అవివేకం, మాయావరణము. ఎవ్వరూ

తమ్ముతాము రక్షించుకొనే ప్రయత్నమే అక్కర్లేదు. 'అడవి రక్ష లేని *అబలుండు వర్థిల్లు, రక్షితుండు మందిరమున చచ్చు*' అన్నారు. Most secured persons can be killed. Most insecure persons continue to live కదా! ప్రక్కనే పామున్నా కాటెయ్యకుండా ఉన్నవా డున్నాడు. నిష్కారణంగా ఏదో వచ్చి చంపేసిన వాడి కథలు కూడా ఉన్నాయి. మనం చేసే రకరకాల పూజలు, హోమాలు, అభిషేకాలు భగవత్ప్రీతికోసం అంటే అదీ ఆర్యధర్మం. 'ఇందు కోసం' అని చేసేవి ఏవీ ఆర్యధర్మం కావు. ఇవన్నీ లంకలో జరిగేవి.

ఇంతకీ ఈయన మొట్టమొదటగా చూసిందేమంటే పెద్ద పెద్ద ఏడంతస్తుల మేడలు. వాళ్ళకి ఎంత ఉందంటే, బయట గోడలకే ఏకంగా ముత్యాలు, వజ్రాలు, మణులు, వైఢూర్యాలే అతికించేసుకున్నారు. బాగా ఉన్నవాడికి చూపించుకోకపోతే తోచదు. లేనివాడు ఏం చూపించలేడు కాబట్టి ఊరుకుంటాడు. అందుకని వాళ్ళ సంపదని వీలైనంత కనబడేట్లుగా, ప్రదర్శన చేస్తున్నట్లుగా మొదటి చూపులోనే తెలిసింది. బాగా కండలు తిరిగినవాళ్ళు ఇంటి ముందు కాపలాగ ఉన్నారుట. ఇది మొట్ట మొదట మనిషికి ఉండే భయాన్ని తెలియజేస్తుంది. దానికి ఏర్పాటు చేసుకున్న రక్షణ అదీ చూచాడు.

అప్పుడు హనుమంతుడికి సాచివ్యము చేసే వాడివలె తారాగణం తేజరిల్లుతూ వెన్నెల చాందినీని ఆకాశమెల్ల పరచి అనంత కిరణాలతో నిలుచున్నాడు. చంద్రుడు వచ్చాడు అంటే ఆచార్యుడు వచ్చినట్లు సంకేతం. సద్గురువు లంకా ప్రవేశము

చేస్తున్నాడని అర్థం. క్షీర మృణాల వర్ణముతో, శంఖప్రభలతో ఉదయించుచున్న ఆ ప్రభువు తామరకొలనులో తెల్లని కాంతులతో విహరిస్తున్న హంసవలె కనిపించినాడు. పరిపూర్ణమైన ఆత్మ వంతుడిని 'హంస' అని పిలుస్తారు. పరమహంసలు, హంసలు. హంస అంటే అతడే నేను అని తెలిసి హంస స్వరూపుడై జీవించేవాడు. దానికి మంత్రం 'సోహం'. ఆ కపిపుంగవుడు, ఆ మహామేధావి, ఆ తేజోమంతుడు, ఆ మహా సత్వసంపన్నుడు, వాయుదేవుని పుత్రుడు, హనుమంతుడు వేళ్ళాడుతున్న మేఘము వలె కనబడుతున్న లంబ పర్వత శిఖరము మీద నుండి మనో ధైర్యంతో ఆరాత్రి బయలుదేరి రావణాసురుడు ఏలుతున్న లంకా పట్టణములో రమ్యోద్యానవనాలను, జలాశయాలను చూస్తూ ప్రాకారము దగ్గరకు పోయినాడు. లంబకోణ పర్వతాలు సాధారణంగా కనిపించవు. అంటే verticles. మనకి verticles, horizontals అని రెండు ఉన్నాయి. verticles అంటే నిలువుగా ఉండేవి. horizontals అంటే అడ్డంగా ఉండేవి. పదార్థముయొక్క ప్రభావమంతా సమాంతరంగా ఉంటుంది. తేజస్సు యొక్క ప్రభావం అంతా కూడా ఉత్తరముఖంగా ఉంటుంది. ఉన్ముఖంగా అగ్గిపుల్లని ఎంత వంకరగా పెట్టి వెలిగించినా అగ్నిజ్వాల నిలువు గానే వస్తుంది. అగ్నిశిఖ ఎప్పుడూ ఊర్ధ్వముఖంగానే ఉంటుంది. verticle గానే ఉంటుంది.

కాబట్టి verticle గా ఉన్న కొండమీద నిలబడి చూశాడుట అంటే He has become more verticle అని అర్థము. మనిషి ఊర్ధ్వముఖానికి వెళ్ళాలంటే మనిషి నిట్టనిలువుగా పెరగాలి. అదే

మూలాధారం నుండి ప్రజ్ఞ పెరగడం అంటారు. ఆ పెరిగినవాడు దాని శిఖరాగ్రం చేరుకున్నాడు. అక్కడి నుండి లంకాపట్టణాన్ని చూడడం మొదలుపెట్టాడు. అక్కడి నుంచే లంక బాగా కనిపిస్తుంది. శరీరంలో ఉండేవాడికి శరీరం ఏం కనిపిస్తుంది? నీళ్ళల్లో ఉండేవాడికి నీళ్ళేం కనిపిస్తాయి. ఇంట్లో ఉండేవాడికి ఇంటి లోపల, బయట అందం ఎలా కనిపిస్తుంది? లంకా పట్టణంలో భవనాలు శరత్కాలపు మేఘాలవలె తేజరిల్లుతూ ఉన్నాయి. సముద్ర ఘోషవలె జనుల కలకలలు వినిపించినాయి. పట్టణాలలో ఆశ్రమాలలో లాగ ఉండవుకదా! ఎప్పుడూ జనులు మాట్లాడుకుంటుంటారు. సముద్రగాలి చల్లగా వీచుచున్నది. చతురంగబలాలు సంతోషముగా సింహనాదాలు చేస్తున్నారు. బహిర్ద్వారాల వద్ద మదపు టేనుగులు కట్టివేసి ఉన్నాయి. ఆయా భవనాలన్నీ మెఱపులతో కనిపించే మేఘాల వలె ఉన్నాయి. వీధులలో జ్యోతులు వెలుగుతూ ఉన్నాయి.

అమెరికాలాంటి దేశాలలో రోడ్లన్నీ రాత్రి పూట బ్రహ్మాండమైన కాంతితో వెలుగుతుంటాయి. రోడ్లు, ఇళ్ళు, బజార్లు అన్నీ కూడా విపరీతమైన కాంతిగా ఉంటాయి. ఎందుకంటే సంపన్న దేశాలు కనుక. మిణుకు మిణుకుమంటూ ఉండవు. పగలే రాత్రి చేసేస్తున్నట్లుగా ఉంటాయి అక్కడ ఉండే కాంతులు. ఆయా భవనాలన్నీ మెఱపులతో మెరిసే మేఘాలవలె ఉన్నాయంటే illumination. మొత్తం ఇప్పుడు భూమి మీద అన్నిటికన్నా బాగా ఎక్కువ illumined ఏదయ్యా అంటే Losvegas అనే ప్రదేశం. అక్కడ రాత్రి చీకటే ఉండదు. అంతా వెలుతురే! అన్ని భవనాలూ మనం

దీపావళికి పెట్టుకొనే దీపాలకన్నా కొన్ని కోట్ల రెట్లు ఎక్కువ వెలుతురు. మనం ఊహించుకోవచ్చు. మనం ప్రస్తుతం కరెంటు ఖర్చునో, నూనె ఖర్చునో, ఓపికలేకో, డబ్బులేకో మొత్తానికి అంత బాగా పెట్టడం లేదు. అసలు ఖాళీ లేకుండా మొత్తం అంతా దీపాలు పెడితే ఎలా ఉంటుందీ? అవన్నీ గిరగిరా తిరుగుతున్నా యనుకోండి ఎలా ఉంటుందీ? అలా మొత్తం అంతా కాంతి వంతంగా ఉంది. లోపల ఏం జరుగుతోంది? మామూలుగా మనం ఏమైతే చేయకూడదనుకుంటామో అవన్నీ జరుగు తుంటాయి. వాటి కోసం జనమంతా ఆ నగరాలకు పోతుంటారు.

అలా ఇక్కడి పట్నాలన్నీ మెఱపు తీగల్లా ఉన్నాయిట. వెలిగీ ఆరుతూండే దీపాలు పెట్టారుట. గాలికి చిన్నచిన్న గంటలు చప్పుళ్ళు చేస్తూ జెండాలు ఎగురుతున్నాయి. చుట్టూ ప్రాకారాలు బంగారు కాంతులతో ధగధగ లాడుతున్నాయి. Compound wall ఏకంగా అలా కట్టేసుకున్నారు. మనం తిరుపతి గుడికే పైన బంగారం చూసి, ఎక్కువ మోహం చెంది, ఆ దేవుడు చాలా గొప్పవాడనుకొనే స్థితి మనది. అదే శ్రీశైలం దేవుడికి ఏం ఉండదు, రాయి తప్ప. అందుకే తిరుపతికి జనం అంత ఎక్కువ, శ్రీశైలంకి వెళ్ళే జనం తక్కువ. తిరుపతి వెళ్ళి ఏంచూశావ్ అంటే వజ్రకిరీటం అనో, వజ్ర హస్తం చూశాననో చెప్తారు తప్ప దేవుడు కనిపించాడు అని చెప్పేవారు చాల తక్కువ. ఎంత బంగారం చేరితే అంత కలి చేరినట్లే. ఎందుకంటే బంగారంలో నువ్వుండమని కలికి పరీక్షిత్తు చెప్పాడు. ఈ వైభవాలన్నీ దాటి వేంకటేశ్వరస్వామి కనిపించాలంటే నీలో బాగా పాపాలు నశిస్తే తప్ప కనిపించదు. వేంకటేశ్వరుడు

అంటే పాపాలు నశింపచేసే అతి ముఖ్యమైన దేవతల్లో ముఖ్యుడు. 'వెంకట' అంటే పాపాలు. 'వేంకటా' అంటే వాటిని హరిస్తాడు. పాపాలు హరించే దేవుడికే మనం బంగారు, వెండి తొడుగులు వేసేసి కప్పేశాం. అలా ఉంటాయి మనం చేసే పనులు. అవన్నీ దైవం కోరాడని మనం అనుకుంటుంటాం. The Golden cow Doctrine అని ఉన్నది. అంటే దేవుడి చుట్టూ బంగారం పెంచి, దేవుడికి ఎంత వైభవం వచ్చిందో అనుకుంటాం. దేవుడి బంగారం లో బంగారం. మన వైభవం మనకి బంగారం మీద ఉండే మోజు.

అలా వీళ్ళు బంగారం ఎక్కితొక్కి ప్రహరీ గోడకి శుభ్రంగా బంగారాన్ని రేకులుగ చేసి అతికించేసుకున్నారు. ఆ ప్రాసాద భాగాలలో చతుశ్శాలలు వైఢూర్యములు పొదిగి సోపానాలతో స్ఫటికముల తళతళలతోను, ఆకాశమునకు ఎగిరిపోతున్నట్లుగా కనిపించినది. అందమైన నెమళ్ళు, క్రౌంచ పిట్టలు కలకల ధ్వనులు చేస్తున్నాయి. ద్వారాల వద్ద రాజహంసలు తిరుగుతున్నాయి. మనకు డబ్బుంటే బోలెడు పావురాలు, హంసలు, గుఙ్ఞాలూ చేరుస్తాము కదా! నృత్య గీత వాద్య ధ్వనులు, స్త్రీల ఆభరణాల చప్పుళ్ళూ మారు మ్రోగుతున్నాయి. ఆ లంకాపట్టణము 'విటపావతి' అనే కుబేరుని అలకాపట్టణము వలెను, దేవేంద్రుడికి తూర్పున ఉన్న 'వసౌకసారము' అనే పట్టణమువలెను తోచినది.

ఆ వీర్యవంతుడు ఆ పట్టణాన్నంతా చూచినాడు. అక్కడ ఉన్న ఆయుధధారు లందరినీ పరిశీలించి చూచి సంతోష పడిపోయినాడు. వీళ్లదంతా బయట బలమే కాని లోపల బలం కాదని సంతోషం కలిగింది. అంతకుముందు దూరం నుండి

చూచినప్పుడు చాలా బాధ పడతాడు. ఆ పట్టణం చూచి హనుమంతుడు విషణ్ణుడైనాడు. అయితే సీతాదేవిని చూడగలనన్న ధైర్యంతో సంతోషపడ్డాడు. వీళ్ళకి కండబలమే తప్ప అసలు బలం తక్కువని గ్రహించాడు. అతడు దూరం నుండి చూచి పట్టణాన్ని ఎవరూ జయించ లేరనుకున్నాడు. ఇప్పుడు దగ్గర నుండి చూచి ఆలోచించసాగాడు.

మనుషులు దగ్గర నుండి చూస్తే తప్ప అర్థం కారు. దగ్గర నుండి చూడడం అంటే మొహంలో మొహం పెట్టి చూడడం కాదు. అలా Now He could see in detail and in depth. లోపల అని తెలియడానికి ఊరికే ముఖద్వారం వద్దకు వచ్చి చూశాడట. అంటే మనం సింహద్వారం వద్దకు వచ్చి ఇంట్లోకి చూస్తే లోపలి గురించి ఒక అవగాహన రాదూ! అలాగ! అప్పుడు దగ్గర నుండి చూచి నాడు. ఆలోచించసాగినాడు. ఆ లంకాపట్టణము చొరనలవికానిదిగా కనబడుతున్నప్పటికినీ కుముదుడు, అంగదుడు, సుషేణుడు, మహేంద్రద్వివిజులు ఈ పట్టణాన్ని జయించగలరు. వారే కాదు సూర్యపుత్రుడు సుగ్రీవుడుకాని, కుశపర్వుడుకాని, ఋక్షుడుగాని, కేతుమారుడుకాని, నేనుగాని ఈ పట్టణాన్ని సులభంగా జయించగలం అనుకుంటూ ఆ మహాబాహువులు కలిగిన ఆ రామలక్ష్మణుల గురించి, వారి పరాక్రమము గురించి యోచించి నాడు. సంతోషంతో ఉప్పొంగి పోయినాడు. దూరము నుండి చూస్తేనేమో దుర్భేద్యంగా కనిపించింది. దగ్గరకి వెళ్ళి చూస్తే ఓస్! ఇంతేనా! అనిపించింది.

ఆ కపివీరుడు మళ్ళీ ఆ లంకాపట్టణాన్ని చూడసాగినాడు.

రత్నాలకాంతులు చీరెగాను, పశుశాలలు కర్ణభూషణాలుగాను, యంత్రాగారాలు స్థనాలుగాను, సర్వసమృద్ధి నవయౌవనము గాను, ఆ లంకాపట్టణము సింగారించుకున్న సీమంతినిగా కనిపించింది. ఆయా మహా గృహాలలో దేదీప్యమానంగా వెలుగుతున్న దీప కాంతుల వల్ల, ఆయా గృహాల తెల్లటికాంతుల వల్ల, వీధులలో వేళ్ళాడగట్టిన జ్యోతులవల్ల రావణాసురుడు ఏలుతున్న ఆ లంకాపట్టణములో చీకటన్నది లేదు. అంటే మనమెరిగిన చీకటి లేకుండా చేశాడన్నమాట. రాత్రంతా దీపాలు పెట్టేశాడు. ఇహ మీకు చీకటి లేదుకదా, రాత్రి కూడా పగలే చేసేశానన్నట్లు చెప్పాడు. అహంకార మున్నచోట ఇలా ఉంటుంది.

ఈ పట్టణము దూరం నుండి చూచినప్పుడు సద్గురువుకు కూడా చాలా భయంకరంగా ఉంది. మనమేమన్నా చేసిపెట్టగలమా ఇందులో బంధింపబడ్డవాడికి అన్నట్లుంటుంది. కాని ఇందులో బంధింపబడ్డవాడు వీటివేటికీ మోజు పడక ఉన్నాడు. వీటిలో వేటిమీద మోజు ఉన్నా నానాశ్రమపడి గురువు రానక్కర్లేదు. భోగాలతోను, కామాలతోనూ ఉన్న లంకలో ఉన్నా, వాటిలో మునగకుండా ఉన్న జీవునికోసం సద్గురువు. మనోమయ, కామమయ, అన్నమయ కోశాలలో కొట్టుకొనేవాళ్ళుంటారే వాళ్ళని సద్గురువు వచ్చి తీసుకువెళ్ళలేడు. నాకివి వద్దు, నన్ను దేవుని వద్దకు చేర్చు అనేవారికి సద్గురువు. అదే రామాయణం చూపిస్తున్నది. అందుకే సీత కోసం హనుమంతుడు వచ్చాడు. అలా ఉన్నవాడినే సద్గురువు ఉద్ధరించగలడు. అలా లేనివాడిని సద్గురువు ఉద్ధరించలేడు. సీతాదేవి రావణాసురుని ఇంట్లో మిగతా వాళ్ళతోపాటు

కనిపించిందనుకోండి. వచ్చినపని అయిపోయినట్లే! కాని ఇక్కడ ఆమెకి దేనిమీద మోజులేదు. ఆవిడ ఆభరణాలనే ఆమె చెట్టు మీద పెట్టేసింది.

ఆ కపివీరుడు మళ్ళీ లంకాపట్టణాన్ని చూడసాగాడు. అప్పుడు ఆ లంకాపట్టణములోకి రాబోతున్న హనుమంతుని లంకాధిదేవత చూసింది. వికృతాననముతో పెద్దపెట్టున అరుస్తూ లేచి హనుమంతుని ఎట్టఎదుట నిలుచొని 'నీవు ఎవడవు? నీవు అడవిలో ఉండవలసిన కోతివి. ఇక్కడికి ఏ పనిమీద వచ్చావు? నీ ప్రాణము తీస్తాను. నీవు ఏ పనిమీద వచ్చావో యథార్థం చెప్పు. ఓ కోతీ! రావణాసురుని సైన్యాలు అన్ని వైపులా కావలి ఉన్నాయి. ఈ పట్టణంలో చొరబడడము నీ తరం కాదు. ముందు చెప్పు. నీవు ఎందుకువచ్చావో' అంటూ అడ్డగించింది. ఇంత సూక్ష్మధారి అయిన హనుమంతుని చూడగలిగిందంటే ఆ లంకాధిదేవత ఎటువంటిదై ఉండాలి? ఆమె బ్రహ్మ వర ప్రసాదిని. చాలా ఉన్నతమైన జీవి. లంక అసలు కుబేరునిది. ప్రస్తుతం రావణుడు పరిపాలిస్తున్నాడు తప్ప, ఆమె గంధర్వరాజుకు సేవకురాలిగా ఆ పట్టణానికి రక్షణ ఇచ్చే కర్తవ్యంలో ఉన్నది. అందుకని ఆ పట్టణాన్ని కాపాడడం ఆమె వంతు. రాజుకు తెలియకుండా, లోపలకి రాకుండా చూడవలసిన బాధ్యత లంకాధి దేవతది. అందుకని ఆమె కాపలా కాస్తుంది. సూక్ష్మరూపంలో కూడా ఎవరూ లోపలకి రాకుండా చూడగలిగిన తేజస్సు కలిగినది లంక.

జీవుడు దేహాత్మభావన నుండి తప్పిపోకుండా, ఆ దేహంలో ఉండడానికి మూడు ముడులు ఉన్నాయి. మనం మూలాధారం

నుండి స్వాధిష్ఠానము వరకు చేరుకుంటే అక్కడికి ఒక ముడి విడుతుంది. ఆ ముడి విడిపోతేగాని దేహం దారివ్వదు. ఆ తర్వాత ఇంకో ముడి బ్రహ్మగ్రంథి. దాన్ని విడదీస్తే ఆ తర్వాత ఇంకో గ్రంథి హృదయంలోని విష్ణుగ్రంథి. అటుపైన భ్రూమధ్యంలో రుద్రగ్రంథిని విడదీయాలి. ఈ గ్రంథులన్నీ విడదీస్తే తప్ప జీవుడు అందులోంచి బయటకు రాలేడు. ఈ మూడు గ్రంథుల రూపంలోను లంక ఉంటుంది. శరీరానికి జీవుడికీ గల లంకెయే లంక. ఆ లంకే లంకాధిదేవతగా ఉండి శరీరంలోకి ఇంకో శక్తి ప్రవేశించకుండా కాపాడుతూ ఉంటుంది. అందుచేత దానిని చంపకుండా ఆ ముడి విడదీయాలి. ఎవరూ తమకు తాముగా ముడి విడతీసుకోలేరు. గురువు అనుగ్రహంతోనే ముడి విడివడుతుంది.

అట్లా అంటూ ఎట్టఎదుట నిలుచొని ఉన్న ఆ లంకాధి దేవతను ఆ పరాక్రమవంతుడు హనుమంతుడు చూచి 'నీవు అడిగినదంతా యథార్థం చెప్తాను. నీ ముఖం వికృతంగా ఉన్నది. ఎవతెవు? ఎందుకు ఈ పట్టణపు వాకిట నిలుచున్నావు? ఎందుకు దారుణంగా జడిపిస్తున్నావు' అని అడిగాడు. ఆ మాటకు ఆ కామ రూపిణికి కోపం వచ్చింది. ఆమె వాయుపుత్రుని చూసి 'ఓ కోతీ! రావణాసురుడు రాజు, మహా పరాక్రమవంతుడు. నేను ఆయనను కనిపెట్టుకొని ఉన్నాను. ఈ పట్టణానికి కావలి కాస్తున్నాను. నన్ను ఎవరూ ఎదిరించలేరు. నన్ను అలక్ష్యం చేసి నీవు ఈ పట్టణములోకి పోలేవు. ఇప్పుడే నిన్ను పెద్ద నిద్దురపోయేలా చేస్తాను, జాగ్రత్త. ఓ కోతీ! నే నెవరనుకున్నావు? నేనే ఈ లంకా పట్టణాన్ని, అంటే అధిదేవతను. నా సంగతి చెప్పాను. ఇక నీ సంగతి చెప్పు' అన్నది.

ఈ శరీరం అనే పట్టణానికి రాజు అహంకారం. దాని పేరే రావణాసురుడు. ఆ అహంకారం అనే కోటలో జీవాత్మ బందీకృతుడై ఉన్నది. త్రిగుణాలలో కూడా రజస్సు నుండి అహం అనే ప్రజ్ఞ పుడుతుంది. దాని అధీనంలో మనస్సు, ఇంద్రియాలు, శరీరం జీవుడు కూడా ఉంటారు. ( ప్రతి గ్రామానికి ఒక అధిదేవత ఉంటుంది. ఆ గ్రామదేవత అనుగ్రహం ఉంటే మనం బావుంటాము.) హనుమంతుడు పర్వతం వలె అచలంగా, అకంపంగా నిలబడ్డ ఆ పర్వతాకారిణిని చూచి 'పెద్ద ప్రాకారంతో బహిర్ద్వారంలో కోట బురుజుతో ఉన్న ఈ లంకాపట్టణం చూడ వలెననే కుతూహలంతో వచ్చాను. ఇక్కడ ఉన్న పెద్దతోటలు, భవనాలు చూచిపోతాను' అని చెప్పినాడు. ఆ మాటలకు ఆ కామరూపిణి మరింత పరుషంగా 'ఓ వానరుడా నీకేదో దుర్బుద్ధి పుడుతోంది. ఇది రావణాసురు డేలుతున్న లంకాపట్టణం. నీవు లోపలకి పోవడానికి వీలులేదు. నేను చంపివేస్తాను' అన్నది. అందుకు హనుమంతుడు 'ఓ లంకా! నీవు శుభకరివి. నేను ఈ పట్టణమంతా తిరిగి చూచి వచ్చినదారిన పోతాను' అన్నాడు.

'ఏమిటీ' అంటూ ఆ లంకాధిదేవత భయంకరంగా అరిచింది. అరచెయ్యి చాచి హనుమంతుని కొట్టింది. అతనికి మంచి దెబ్బ తగిలింది. క్రోధపరవశుడై ఎడమచేతి వ్రేళ్ళు ముడిచాడు. కెవ్వున కేకవేసి పిడికిలితో ఆ లంకాధిదేవతను కొట్టాడు. కాని ఇది ఆడది, దీన్ని చంపకూడదనుకున్నాడు. దానితో కోపం తగ్గింది. సద్గురువు శరీరాన్ని ఏమీ చేయడు. పట్టణంలోని రాక్షసులను అనగా శరీరంలోని రోగాలను చంపి దాన్ని

కాపాడతాడు. యోగానికి దేహం తయారుకావాలి కదా! అలాగే యోగం చేసేవారి శరీరం పలుచగా ఉండాలి. కేక వెయ్యడం అంటే సద్గురువు మంత్రం చెప్పడమే! దాంతో శరీరంలో ప్రకంపనలు పుడతాయి.

హనుమంతుని పిడికిటిపోటుకు ఆ లంకాధి దేవత అవయవాలు స్వాధీనం తప్పిపోయాయి. ఆ వికారాకారి వికృతంగా నోరు తెరిచింది. వికృత బుద్ధితో తటాలున నేలకూలింది. అట్లా నేలకూలిన రాక్షసిని హనుమంతుడు తేరిపార చూచినాడు. అతడు సమస్తమూ తెలిసినవాడు. ఆమె ఆడదని జాలిపడ్డాడు. ఆ రాక్షసి చాలా భయపడిపోయింది. గర్వం లేకుండా గద్గద స్వరముతో 'మహాబాహూ! అనుగ్రహించు. ఓ వానరోత్తమా! నీవేమో మంచి వాడవు. నన్ను అనుగ్రహించు. స్త్రీని చంపకూడదనే నియమాన్ని మహాబలవంతులు, ధైర్యవంతులు తప్పరు. నీవు నన్ను చంపవద్దు. నేను సాక్షాత్తు లంకాధి దేవతను. నన్ను ఎవరూ జయించలేరు. అయితే నీవు మహా బలవంతుడవు, అమిత పరాక్రమ వంతుడవు. నీ పరాక్రమంతో నన్ను జయించి నావు' అన్నది. లోపలున్న దురభ్యాసాలకు మొదటి దెబ్బ తగిలింది. లోపలున్న ఇతర అలవాట్లు బలహీనపడతాయి. చెడు అలవాట్లు, చెడు తిరుగుళ్ళు కూడా తగ్గిపోతాయి. సద్గురువు దేహాత్మ భావాన్ని జయిస్తే లోపలున్న రాక్షసులు నశిస్తారు.

"ఓ వానరోత్తముడా! నీవు ఇప్పుడు ఇక్కడికి వచ్చినావు. నేను నీ దర్శనం చేశాను. నీవు నన్ను జయించినావు. బ్రహ్మదేవుడు చెప్పిన సమయం వచ్చింది. ఇక ఈ రాక్షసులు నాశనమై పోతారు.

అది స్వయంభూయైన బ్రహ్మదేవుని నిర్ణయం. అది దబ్బర కాదు. దానికి తిరుగులేదు. సీతాదేవిని దొంగిలించుకొని రావటంతో దురాత్ముడైన ఈ రావణాసురునికి, సమస్త రాక్షసులకు చేటుకాలం వచ్చింది. ఓ వానరోత్తమా! నీవు ఈ పట్టణములోనికి పో, ఏవేవి చూడాలని అనుకుంటున్నావో అన్నీ చూడు, కావలసిన పనులన్నీ చక్కబెట్టుకో. రావణాసురుడు ఏలుతున్న ఈ లంకాపట్టణానికి బ్రహ్మదేవుని నిర్ణయం తప్పదు. నీకు శుభం అవుతుంది. యథేచ్ఛగా, యథా సుఖంగా ఈ పట్టణమంతా తిరిగి చూడు. ఆ జనకాత్మజ సీతాదేవిని వెదకు" అన్నది.

ఆ కామరూపిణి లంకాధిదేవతను, ఆ మహా తేజోవంతుడు హనుమంతుడు ఓడించి లంకా నగర ద్వారంలో నుండి కాకుండా ప్రాకారం నుండి ఎగిరి లోపలకి పోయాడు. శత్రుగ్రామానికి, శత్రునగరానికి బహిర్ద్వారం నుండి పోకూడదని, అందులోనూ శత్రువును జయించ దలచినప్పుడు అలా ఎంతమాత్రం చేయ కూడదని శాస్త్రం చెబుతుంది. హనుమంతుడు సర్వ శాస్త్రాలూ చదివినవాడు. అందువల్ల బహిర్ద్వారం నుండి కాక ప్రాకారం నుండి ఎగిరి లంకాపట్టణం లోనికి పోయినాడు. ఎక్కడికైనా ప్రయాణమయ్యేటప్పుడు, దేవాలయానికి, గృహ ప్రవేశమప్పుడు, వివాహం చేసుకొనేటప్పుడు మొదట కుడిపాదం పెట్టాలని, శత్రు పట్టణంలోనికి పోయేటప్పుడు ముందుగా ఎడమపాదం పెట్టవలెనని బృహస్పతి చెప్పినాడు. అందువల్ల హనుమంతుడు లంకాపట్టణము లోనికి అడుగు వేసీ వేయడమే ఎడమపాదం మోపినాడు. (మంచి చోట కుడి పాదం పెట్టాలి. ఎదుటివాడి నాశనం కోరితే ఎడమ

పాదం పెట్టాలి. సత్పురుషులు సహజంగానే కుడికాలు పెడతారు. తూర్పు లేదా ఉత్తర ముఖంగా కూర్చుంటారు. అలాంటివి మనం కూడా అభ్యాసం చేసుకోవాలి.)

ఆ ధైర్యవంతుడు హనుమంతుడు రాత్రి లంకాపట్టణ వీధుల గుండా నడచినాడు. రమణీయమైన ఆ పట్టణమంతా చూచినాడు. ఎటుచూచినా, ఎటుపోయినా నృత్య గీత ధ్వనులు మారుమ్రోగు తున్నాయి. స్త్రీ పురుషులు సంతోషాతిశయంతో పెద్ద పెట్టున నవ్వుతున్నారు. వజ్ర ఖచితమైన గృహాలు దేవేంద్రుని ఏనుగువలె తెల్లటి కాంతులతో తేజరిల్లుతున్నాయి. నాలుగు మూలలా నాలుగు గదులతో, నాలుగువైపులా నాలుగు ద్వారాలతో ఉన్న 'పద్మ' అనే గృహాలను, నడుమ బయలు ఉండి దక్షిణ ద్వారం లేని 'వర్ధమానం' అనే గృహాలను, అలాగే తూర్పు వాకిలి లేని 'స్వస్తికం' అనే గృహాలను చూచినాడు. ఆ గృహాలన్నీ పూలతో అలంకరించి ఉన్నాయి. ఆ హనుమంతుడు చిత్రవిచిత్రమైన రంగు రంగుల పూలదండలతో అలంకరించి ఉన్న ఆ భవనాలన్నిటినీ చూచి ఆ పట్టణమంతా తిరుగుతూ సీతాదేవిని తాను చూడగలననుకొని సంతోషపడ్డాడు. వివిధాకారాలతో వివిధ వర్ణములతో ఉన్న ఇంటింటికీ పోయి చూచినాడు. ఆ భవనాలలో స్త్రీలు మద్యపానం చేసి దేవలోకంలోని అప్సరాంగనలవలె మంద్ర, మధ్యమ, తార స్థాయిలలో ఆలాపిస్తున్న మధురగానం విన్నాడు. ఆ గృహాలలో స్త్రీలు మెట్లు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అయ్యే కాలి అందెల చప్పుళ్ళు, మొలనూళ్ళ చిరుగంటల చప్పుళ్ళు, వీర పురుషులు తమ పరాక్రమం చెప్పుకుంటూ భుజాలు అర చేతులతో చరచుకుంటున్న

చప్పుళ్ళు, యోధులు సంతోష, అతిశయాలతో అరుస్తున్న అరుపులూ విన్నాడు.

ఆ హనుమంతుడు అలా పోతూ రాజవీధిలోని రాక్షస సైన్యాన్ని చూచాడు. ఆ సైన్యం మధ్యభాగంలో ఉన్న అనేకమంది రాక్షస సంచారులను చూచాడు. చారులను చూచాడు. కూట, ముద్గర, ముసల ఆయుధధారులను, శతఘ్నులను ప్రయోగించే వాళ్ళను, చిల్లకోలలో చెట్లను ఆయుధాలుగా వాడే వాళ్ళను, పట్టిసాలతో పోరాడేవాళ్ళు, క్షిపణి, పాశము, వజ్రము మొదలగు ఆయుధాలతో ఉన్న యోధులను, రాజ చిహ్నాలు చెక్కించిన రాజ జెండాలను పట్టుకొని ఉన్న వాళ్ళను, ఒట్టి జెండాలను పట్టుకొని ఉన్న వాళ్ళను చూచాడు.

(లంకలో రకరకాల అలవాట్లు మూల బలంగా ఉన్నాయి. వాళ్ళు చేసే పనుల ద్వారా వారి ఆయుధాలు తెలుస్తాయి. కొంత మంది బాంబులు కురిపించేలా మాట్లాడితే, మరి కొంతమంది తలమోదేలా మాట్లాడుతారు. కొంతమంది గుచ్చేలా మాట్లాడుతారు. వారి ఆలోచన, మాట అలాగే ఉంటాయి. అవేవీ దివ్యాస్త్రాలు కావు. సద్గురువు వారందరినీ అణిచెయ్యాలి మరి.)

ఆయా గృహాలలో యజ్ఞదీక్షలో ఉన్న వారిని, దీక్ష అయి పోయిన ముండిత శిరస్కులను, జడలతో జపం చేస్తున్నవారిని, ఎద్దుతోలు కట్టుకున్న వారిని, అరిష్టాలు పోవడానికి పిడికిటిలో దర్భలను మంత్రించి ఇచ్చేవారిని చూచాడు.

లంక మనలోని మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరకాలను ఏలుతుంటుంది. చీకటిలో వెలుగును చూడగలిగిన వాడే సద్గురువు. ధర్మ సమ్మతమైన కార్యక్రమాలను ఆయన ప్రోత్సహిస్తాడు. దుష్ఫలితములనిచ్చే కార్యక్రమాలకు తానే అడ్డుపడతాడు. అది కూడా శిష్యులకు తెలియదు. తాను సర్వస్వతంత్రుడనని నిరూ పించుకుంటాడు. చిన్నచిన్న చిట్కాలతో కర్మను పక్కకు జరపడు. 'నన్ను ఆశ్రయించదలచుకుంటే నేను అన్నిటిని వదిలిస్తాను' అన్నారు. అహంకార ప్రజ్ఞను అణచివేసేవాడే సద్గురువు. లోపలున్న అరిషడ్వర్గాలను జయింపచేసి నిజస్వరూపం తెలియజేసేవాడు సద్గురువు. నిజమైన భక్తుడికి దైవంకాని, సద్గురువుకానీ కర్మను శిథిలం చేస్తారు. అదీ సన్మార్గము.

అలా హనుమంతుడు శత్రువులను చంపడానికి చేసే అభిచారక హోమాలను కూడా చూశాడు. ఇంకా ఆ పట్టణంలో వికృత ముఖాలు గలవారిని, వంకర ముఖాలు కలవారిని, ఎక్కువ తక్కువ దేహాలు కలవారిని, ఒంటికన్ను, ఒకే చెవి ఉన్నవారిని, వేలాడుతున్న పొట్ట వున్నవారినీ చూస్తూ ముందుకు సాగాడు. ఆ పట్టణంలో అమూల్య ఆభరణాలను ధరించి చిత్రవిచిత్ర వేషాలతో యథేచ్ఛగా విహరిస్తున్న వారిని చూచాడు. ఆ పట్టణంలో ఆయా వీధులలో ఉన్న వారందరినీ చూచిన హనుమంతుడు అంతట పట్టణ మధ్యభాగంలోని రావణాసురుని మందిరానికి పోయాడు. అది ఒక పర్వత శిఖరంపై ఉన్నది. చుట్టూ పెద్ద ప్రాకారము, బంగారపు బహిర్ద్వారము , అగాధమైన అగడ్తలు ఉన్నాయి.

రావణుడిది వ్యాపకపు ప్రజ్ఞ, తన్ను తాను మరచిన జీవుడు అహంకారంలో పడతాడు. తాను వేరు, మిగిలినదంతా వేరు అని భావిస్తూ అన్నీ దోచుకుంటాడు. తనను తాను రక్షించుకోవాలనే భావం ఎక్కువగా ఉండి పెద్ద పెద్ద ప్రహరీగోడలు, కందకాలు మొదలైన ఏర్పాట్లు చేసుకుంటాడు. ఇప్పట్లో అన్ని భవనాల కన్న ఇన్సూరెన్సు వారి భవనాలు ఎత్తుగా కనిపిస్తున్నాయి. It is a representation of human fear. మనిషిలో భయం పెరిగే కొద్దీ ఆ భవనం ఎత్తుకూడా పెరుగుతుంది. 'లోపల నుండి స్త్రీల ఆభరణాల ధ్వనులు వినబడుతున్నాయి. బంగారు ప్రాకారాలు మణులతోను, మహార్ఘమైన ముక్తా మణులతోను, అలంకరించిన అంతర్భాగాలతోను, కృష్ణాగరు చందనాది ధూపాలతోను తేజరిల్లు తున్న రావణాంతఃపుర మందిరంలోనికి హనుమంతుడు గుట్టు చప్పుడు కాకుండా పోయినాడు. ఆయన రాజభవనంలోకి మరింత కాంతివంతుడై వెళ్ళాడు. ఆకాశ మధ్యంలో కాంతులు వెదజల్లు తున్న చంద్రుడు ఆవుల మందలో దొర్లుతున్న ఆబోతువలె కనిపించాడు. ఆ శీతాంశుడు ఈ లోకంలోని సమస్త జనుల దుఃఖాలూ పోగొడుతూ సముద్రాన్ని ఉప్పొంగ చేస్తూ సర్వభూతా లనూ తేజరిల్లచేస్తూ ఆకాశంలో తిరుగాడుతూ ఉన్నాడు.'

(సద్గురువు అహంకార ప్రజ్ఞకు తెలియకుండానే జీవుడి లోనికి ప్రవేశిస్తాడు. అహంకారం రకరకాలుగా మాయ చేస్తుంది. జీవప్రజ్ఞ తన పరిధిలో నుండి దాటిపోకుండా రకరకాల వైభవా లను చూపి ఆకర్షిస్తుంది. కాని సద్గురువు తన పూర్ణకాంతితో అహంకార ప్రజ్ఞలోకి ప్రవేశించాడు. గురువు చంద్రుడు. దక్షిణాయ

నానికి అధిపతి. సూర్యుడు లేనప్పుడు (పరమాత్మ లేనప్పుడు) చంద్రుడే దారి చూపుతాడు. అందుకే సద్గురువు సాన్నిధ్యము, పౌర్ణమి రెండూ ఒకటే! అందుకే పూర్ణిమా ధ్యానం ముఖ్యం. చంద్రకాంతి ద్వారా సద్గురువును చేరవచ్చు. సూర్యకాంతిని మనం భరించలేం కానీ, చంద్రకాంతి ఆహ్లాదంగా ఉంటుంది. అందుకే ఆకాశంలో చంద్రుడు బాగా వెలుగుతూ ఉంటే సద్గురువు సాన్నిధ్యం దగ్గరవుతున్నదని అర్థం.

ఏ కాంతి భూమి మీద మంధర పర్వతంపై తేజరిల్లుతూ ఉంటుందో, ఏ కాంతి రాత్రి ఆరంభ సమయాన సముద్రంపై తేజరిల్లుతూ ఉంటుందో, ఏ కాంతి నీళ్ళల్లో పద్మాలపై తేజరిల్లుతూ ఉంటుందో, ఆ కాంతితో చంద్రు డప్పుడు తేజరిల్లుతూ ఉన్నాడు. వెండి పంజరంలో గల హంస వలెను, మంధర పర్వతకంధరంలో నిలుచున్న సింహం వలెను, మదపుటేనుగుపై కూర్చున్న మహావీరుని వలెను చంద్రు డప్పుడు ఆకాశంలో భాసిస్తూ ఉన్నాడు. వాడి కొమ్ముల తెల్ల ఆబోతువలెను, ఉన్నత శిఖరాల శ్వేత మహా పర్వతం వలెను, తెల్లటి దంతాలకు బంగారు తొడుగువేసిన మదపుటేనుగు వలెను తేజరిల్లుతున్నాడు. వర్షాకాలం వెళ్ళిపోయినందువల్ల నీటి తుంపరలు అడ్డం లేకుండా, శీతాకాలం రానందువల్ల మంచు మకిలి లేకుండాను, సూర్య కాంతులు సంగ్రహించి తక్కిన గ్రహాలు కనబడకుండా చేసి మాలిన్యమేమీ లేకుండా కాంతిలక్ష్మికి తన ఒడిలో ఆశ్రయమిచ్చిన శశాంకుడు అప్పుడు ఆకాశంలో విరాజిల్లు తున్నాడు.

(ఆశ్వయుజ, కార్తీకాలు శరదృతువు. వసంతానికి సూర్యుడు

అధిపతి అయితే శరదృతువునకు చంద్రుడు అధిపతి. అందుకే అమ్మవారి పూజలు ఆశ్వయుజంలోను, హనుమజ్జయంతి వైశాఖ, కార్తీకమాసంలోను చేస్తారు.)

'సింహం గుహలో నుండి శిలాతలానికి వచ్చినట్లు, మదపు టేనుగు మహా రణరంగానికి వచ్చినట్లు, రాజు రాజ్యానికి వచ్చినట్లు అప్పుడు చంద్రుడు ఆకాశానికి వచ్చాడు. రాత్రి ఆరంభ కాలాన చీకట్లను తన పండు వెన్నెలతో తొలగ దోసినాడు. మాంస భక్షణ సంస్కారాదులకు రాక్షసులను పురిగొల్పినాడు. కోపాభిమాన సంబంధమైన మనోవికారాలను కామినీకాముకులకు పోగొట్టినాడు. జగత్తంతా స్వర్గతుల్యం చేసినాడు.' (ఇదీ సద్గురువు కార్యక్రమం. పౌర్ణమి సంస్కారహీనులకు మదాన్ని, కామాన్ని పెంచుతుంది. అదే పౌర్ణమి సంస్కారవంతులకు జీవచైతన్యాన్ని పెంచుతుంది. పౌర్ణమి నాడు ప్రేమికులు పిచ్చెక్కినట్లుగా తిరిగితే సత్సాధకులు దైవ సాన్నిధ్యానికి చేరువగా ఉంటారు.)

కర్ణపేయంగా వీణావాద్య తంత్రీనాదాలు వినబడుతున్నాయి. స్త్రీలు తమ భర్తలతోకూడా పడుకొని హాయిగా నిదురపోతున్నారు. నక్తంచరులు అత్యద్భుత రౌద్రమూర్తులై విహరిస్తున్నారు. మద్య పానంతో మత్తెక్కి మైమరచి నిద్రపోతున్నవారిని, రథాలతో, గుఱ్ఱాలతో, భద్రాసనాలతో సర్వసన్నద్ధంగా ఉన్నవారిని అక్కడి ఇండ్లలో ఆ బుద్ధిమంతుడు హనుమంతుడు చూచినాడు. ఇక్కడ ఇప్పుడు రాక్షస వీరులు మత్తెక్కి ఒకళ్ళనొకళ్ళు కౌగిలించుకుంటూ ఉన్నారు. భుజాలు చరుచుకుంటున్నారు. కైపుతో పేలుతున్నారు. ఒకళ్ళ నొకళ్ళు వెక్కిరించుకుంటూ, రొమ్ములు విరుచుకుంటూ

కనబడ్డ ఆడవాళ్ళమీద పడుతున్నారు. ఆ రాక్షసుల ఇండ్లలో అప్పుడు కొందరు మదవతులు చందనాది మైపూతలు పూసు కుంటున్నారు. కొందరు యువతులు నిద్ర పోతున్నారు. కొందరు సుందర వదనులు పకపకా నవ్వుతున్నారు. కొందరు కాంతలు కోపంతో నిట్టూర్పులు విడుస్తున్నారు. కొందరు సుందరాంగనలు సరస సల్లాపాలలో మునిగి తేలుతున్నారు. ఏనుగులు ఘీంకారాలు చేస్తున్నవి. వీరపురుషులు ఇష్టాగోష్ఠి చేస్తున్నారు. మడుగులో పాముల వలె బుసలు కొడుతున్నారు. బుద్ధిమంతులు మనోహరంగా మాట్లాడుకుంటున్నారు. కొందరు తమ పనులను శ్రద్ధా సక్తులతో చక్కబెట్టుకుంటున్నారు. కొందరు మంచి మంచి పేర్లు పెట్టి పిలుచుకుంటున్నారు. వారిలో కొందరు జగత్ప్రసిద్ధులు. వారందరినీ హనుమంతుడు చూచినాడు. నానాగుణములు కలవారిని, తమ గుణాలకు అనుగుణంగా వ్యవహారాలను చక్క పెట్టుకుంటున్న వారిని, తమ రూపాలకు అనుగుణంగా వ్యవహారా లను చక్కపెట్టుకుంటున్న వారిని, తమ రూపానికి అనురూపంగా ప్రవర్తిస్తున్నవారిని, కురూపులను, విరూపులను కూడా చూచాడు.

ఆభరణాలతో అందంగా అలంకరించుకొని పతుల విషయా లలో పరిశుద్ధంగా ప్రవర్తిస్తున్న స్త్రీలను, ఓర చూపులతో కను బొమలు త్రిప్పుతూ తమ పురుషులను మద్యపానానికి పురి కొలుపుతూ చక్కని చుక్కలవలె తేజరిల్లుతున్న స్త్రీలను, సౌందర్య కాంతులతో తేజరిల్లుతూ తమ ప్రియులు కౌగిలించుకుంటే సిగ్గుపడుతూ, సంతోషంలో ఓలలాడుతూ పూలలో దాగుకొని పెంటి పిట్టవలె కనబడుతున్న వారిని, మేడల మీద ప్రియుల

ఒడిలో కూర్చున్నవారిని, పెండ్లి చేసుకొని పతివ్రతా ధర్మంతో తమ ప్రియులను మిను మిక్కిలి సంతోష పెడుతున్న కొందరిని, రాత్రి సమయంలో దిగంబరులై బంగారు తీగలవలె తళతళలాడుతున్న వారిని, కుందనపు బొమ్మలవంటి వారిని, భర్తృ వియోగంవల్ల చంద్రునివలె పాలిపోయినవారిని, తమ తమ ప్రియులను వెదుక్కుంటూ పోయి కలుసుకొని సంతోష పడుతున్నవారిని, తమ ఇండ్లకు వచ్చిన ప్రియులను కలుసుకొని సంతోష పెడుతున్న వారిని హనుమంతుడు చూసినాడు. అప్పుడు హనుమంతుడు ఆ రాక్షసాంగనలలో మనుష్య స్త్రీలు ఉన్నది లేనిదీ కనుక్కోవడానికి చంద్రుని కాంతితో తేజరిల్లుతున్న స్త్రీల ముఖాలను వరుసగా చూచినాడు. (సరియైన కళతో ఉన్నా సంస్కారం లేని ముఖాలు కొన్ని, సంస్కారంతో బాటు అందంగా ఉండే ముఖాలు మరికొన్ని. సద్గురువు బాహ్య సౌందర్యం కంటే అంతః సౌందర్యాన్ని చూస్తాడు.)

రాముడు చెప్పిన సీతాదేవి సొమ్ముల ఆనవాళ్ళు కనబడతా యేమోనని మెఱపుతీగల వంటి ఆభరణాలు పెట్టుకున్న వారిని చూచాడు. ఎంత వెదికినా ఆ సౌందర్యవతి, ఆ అయోనిజ, ఆ కృశాంగి సీతాదేవి హనుమంతుడికి కనబడలేదు. హనుమంతుడు తన చిత్తం వచ్చిన రూపం ధరించి ఎక్కడికైనా పోగలడు. అలాపోయి ఆయా విమాన గృహాలన్నీ వెదికాడు. అతనికి ఆ జనక రాజసుత జానకి కనబడలేదు. ఆ ధైర్యవంతుడు మరొక్కసారి ఆయా విమాన గృహాలన్నీ వెదికి చూచినాడు. ప్రయోజనం లేకపోయింది.

అక్కడ సువర్ణ కాంతులతో తేజరిల్లుతూ చుట్టూ సువర్ణ

ప్రాకారంలో ఉన్న భవనమొకటి కనిపించింది. హనుమంతుడు ఆ భవనం వద్దకు పోయినాడు. క్రూర సింహాలు నివసిస్తున్న మహావనం మాదిరిగా మహా భయంకరులైన రాక్షసుల కాపలాలో అది కపికుంజరునికి కనిపించినది.

ఆ ధీమంతుడు హనుమంతుడు ఆ భవనాన్ని అన్నివైపులా తిరిగి చూచినాడు. దాని బహిర్ద్వారం వెండితో చేసి, బంగారం తోను, వివిధ రత్నాలతోను అలంకరించి ఉన్నది. లోపలి కక్ష్యలన్నీ విశాలంగాను, విచిత్రంగాను కనిపించినాయి. ఆయా కక్ష్యలలో మనోజ్ఞమైన ద్వారాలతో మందిరాలు కనిపించినాయి. ఏనుగు లెక్కిపోయే శూరులూ, ఏ పనైనా ఎంతమాత్రమూ అలసట లేక చేసే యోధులూ, మంత్రి ప్రధానులూ ఆ మందిరంలో నివసిస్తున్నారు. ఎదిరించ నలవి కాకుండా రథాలను ఎక్కడికైనా లాక్కుపోయే గుఱ్ఱాలూ, సింహ వ్యాఘ్ర కవచాలతోను, బంగారు వెండి దంతాలతో చేసిన బొమ్మలతోను మహాధ్వనులు చేస్తూ పోయే రథాలు అక్కడ కనిపించాయి. అక్కడనే మహారథులు నివసిస్తు న్నారు. ఆ మహారథులు ఎక్కిపోయే మహా రథాలు, వారు కూర్చొనే మహా ఆసనాలు అక్కడనే కనిపించాయి. అక్కడనే ఉన్న పెద్ద పెద్ద జంతువులు, పెంపుడు జంతువులు, రకరకాల పక్షులూ అక్కడ అసంఖ్యాకంగా తిరుగుతూ ఉన్నాయి. సుశిక్షితులైన రాక్షసులు అక్కడ కావలి కాస్తున్నారు. మహా సౌందర్యవతులైన స్త్రీలు అక్కడంతటా తిరుగుచున్నారు. ఆయా మందిరాలలో సంతోష అతిశయంతో యువతులు విర్రవీగుతున్నారు. అది రాక్షసులందరికీ ఉనికి పట్టు. వారి వారి ఆభరణాల ధ్వని సముద్ర ఘోషవలె

వినిపించింది. రాజ చిహ్నాలైన ఛత్రచామరాదులు ఉన్నాయి. చందనాగరుల ఘుమఘుమ వాసనలు గుబాళిస్తున్నాయి. వీణలు, మృదంగాలు మ్రోగుతున్నాయి. శంఖారావం ఆకాశాన్ని అంటుతూ ఉన్నది. మహావీరులైన రాక్షసులు నివసిస్తున్నందువల్ల అది సింహాలు నివసిస్తున్న మహా వనంగా హనుమంతుడికి తోచింది. అక్కడ ఎప్పుడూ గంధ పుష్పాలతో పూజలు జరుగుతున్నాయి. (అహంకారికి దగ్గరగా ఉన్నది రాజసం. రజోగుణం కలవాడు ఏది చేసినా విపరీతమైన ఖర్చు. డాంబికము. అక్కడ ప్రవేశించేది రజోగుణము. సాత్వికం తక్కువ, రాజసం ఎక్కువ.)

రాక్షసులు ఎప్పుడూ కావలి ఉండడం చేత ఆ రాచనగరు లోనికి పోవడం ఎవరి తరమూ కాదు. అది సముద్ర గంభీరమైనది. ఆ భవనాల మధ్య మహా రత్న ఖచితమైన మహద్భవనమొకటి కనిపించినది. అది రావణాసురుని భవనము. రావణాసురుని రాజనగరునంతా ఆ మహా కపి తిరిగి చూచాడు. అంతమంది రాక్షస వీరులతో, అన్ని ఏనుగులతో, అన్ని గుఱ్ఱాలతో, అన్ని రథాలతో విరాజిల్లుతున్న ఆ రాజనగరం లంకపట్టణానికి ఆభరణమని హనుమంతుడు అనుకొని తాను వచ్చిన పని చేయడానికి బయలుదేరినాడు. అక్కడ మహా పెద్ద ఏనుగులు ఉన్నాయి. హనుమంతుడు నిర్భయంగా అక్కడి ప్రాసాదాలూ, ఉద్యానవనాలలో సీతాదేవిని వెదుకుతూ ఇంటింటికీ పోయినాడు. ముందుగా ఆ పరమ పరాక్రమవంతుడు రావణాసురుని మంత్రి ప్రహస్తుడి ఇంటికి పోయినాడు. ఆ ఇల్లు వెదకి అక్కడి నుండి మహాపార్శ్వుడనే మంత్రి ఇంటికి పోయినాడు. అక్కడి నుండి

మేఘంలా కనిపించే కుంభకర్ణుని ఇంటికి, అటునుంచి విభీషణుని ఇంటికి పోయినాడు. అలా వరుసగా మహోదర, విరూపాక్ష, విద్యుజిహ్వాల భవనాలకు, వజ్రదంష్ట్రుడు, పరమ పరాక్రమవంతు డైన శుకుడి మందిరానికి, ధీమంతుడైన తారణుడి ఆవాసానికి, ఇంద్రజిత్తు భవనానికి, జంబుమాలి, సుమాలి, రశ్మికేతువు, సూర్యకేతువు, ధూమ్రాక్షుడూ, సంపాతి, విద్యుద్రూపుడు, ఘనుడు, విఘనుడు, శుకనాసుడు, యుద్ధోన్మత్తుడు, ధ్వజగ్రీవుడు, విద్యుజిహ్వుడు, ఇంద్రజిహ్వుడు, కరాళుడు, పిశాచుడు, శోణితాక్షుడు అనే వారి ఇళ్ళకు పోయి ఆ ఇళ్ళలో సీతాదేవిని వెదకుతూ వారి సిరి సంపదలను గమనించినాడు.

ఆ ధైర్యవంతుడు, ఆ తేజోవంతుడు ఆ భవనాలన్నీ తిరిగి చూస్తూ రాక్షసేంద్రుడైన రావణాసురుని భవనము దగ్గరకు పోయి శూలాలు, ముద్గరాలు, తోమరాలనే ఆయుధాలు పట్టుకొని పడుకొని ఉన్న రాక్షసాంగనలను, వికృత నేత్రలను చూచినాడు. అక్కడనే వివిధ ఆయుధాలతో ఉన్న మహాకాయులను, వివిధ సేనలను చూచినాడు. అమిత వేగంతో పోయే ఎర్రగుఱ్ఱాలను, తెల్ల గుఱ్ఱాలను, మదపుటేనుగులను చూచాడు. ఆ గుఱ్ఱాలు, ఏనుగులూ కులము కలవి. అక్కడనే కవచములు తొడుగుకొని సూర్యప్రభలతో వెలుగుతున్న పదాతులు కనిపించారు. వివిధమైన శిబికలున్నూ అక్కడనే ఉన్నాయి. అక్కడ లతా గృహాలు, చిత్తరువులతో అలంకరించుకొని ఉన్న చిత్రకళలు, జాలువులతో నిర్మించిన క్రీడా పర్వతాలు, ఇంకా ఇతరమైన క్రీడా స్థలాలు, సంభోగ గృహాలు, పగలు విలాసంగా పొద్దుపుచ్చే ఇళ్ళు, నెమళ్ళు

ఉంటున్న ఇళ్ళు, ఇంకా ఆయా పక్షులు నివసించే గూళ్ళు, పతాకాలు చెక్కిన స్తంభాలు, రత్న నిధులు హనుమంతుడికి కనిపించాయి. అది మందర పర్వతంతో సరిసమానమైనది. ధీరులు, తాపసులు, దృఢవ్రతులు అయిన వారికి లభ్యమయ్యే శివస్థానంలా అనిపించింది. అనంత కిరణాలతో సూర్యుడి వలె ఆ భవనం రత్నకాంతులతో రావణాసురుడి పరాక్రమ అతిశయంతోనూ తేజరిల్లుతూ ఉంది.

(హనుమంతుడు శివ భక్తుడు. అందుకే ఆయనకు శివుడి భావన కూడా ఉన్నట్లుగా అనిపించింది. ఒక్కొక్క జీవుడి శరీరం లోనికి వెళ్ళి అక్కడున్న పరిస్థితులన్నీ చూచాడు. అలాగే రావణాసురుడి భవనంలో కూడా చూచాడు. అక్కడ శివభక్తితో పాటు కొంత కర్మ కూడ ఉన్నది.)

హనుమంతుడు అక్కడ బంగారుమయమైన శయ్యలు, బంగారు ఆసనాలు, భోజనపాత్రలు చూచాడు. రత్నమయమైన పానపాత్రల నిండా మద్యము, మధువు ఉన్నాయి. ఆ భవనం మనోహరంగా కనిపించింది. స్త్రీల అందెల చప్పుళ్ళు, మొలనూళ్ళ చప్పుళ్ళు, మృదంగ ధ్వనులు, కరతాళ ధ్వనులు వినిపించినవి. విశాలమైన కక్ష్యలతో, ప్రాసాద సమూహములతో, వందలకొద్దీ ఉత్తమాంగనలతో ఉన్న ఆ మహా భవనంలోకి హనుమంతుడు పోయినాడు.

రావణాసురుని రాజభవన సమూహాలు, వైడూర్య మణి ఖచితమైన కిటికీలు, ఆ కిటికీలలో గుంపులు గుంపులుగా

విహరిస్తున్న పక్షులు, వర్షాకాలంలో ఆకాశాన్ని అంటి తిరిగే మేఘ సమూహాల వలెను, తళుక్కున ఆ మేఘాలలో కనిపించే మెఱపు తీగె వలెను, వాన కురుస్తుందేమోనని ఎగిరిపోయే పక్షిసమూహాల వలెను కనిపించినవి. ఆయా కక్ష్యలలో ఉన్న భవనాలలో వివిధ శాలా గృహాలు, నానావిధ కర్మశాలా గృహాలు కనిపించాయి. శ్రేష్ఠమైన శంఖాయుధశాలలు, చాపాయుధశాలలు, మనోహరమైన చంద్రశాలలు ఉన్నాయి. అవన్నీ ఎంతో విశాలమైనవి. వివిధ మణిఖచితమైనవి. వాస్తు దోషము ఏమీ లేనివి. అందువల్లనే సురాసురు లందరూ ఆ గృహాలను మెచ్చుకున్నారు. వాటినన్నిటినీ రావణాసురుడు తన భుజబలంతో సంపాదించాడు. ఆ భవనములన్నీ ఈ భూమి మీద సర్వగుణోత్తరంగా ఉండవలె ననుకొని మయుడు వాటన్నిటినీ తీర్చిదిద్దినాడు.

ఆ బలవంతుడు హనుమంతుడు ఆ గృహా లన్నిటినీ తిరిగి చూచినాడు. ఆ గృహాల మధ్యన మేఘరూపంతో ఎంతో ఎత్తుగాను, బంగారు మయమైన సుందరరూపంతోను, మనోహరం గానూ రావణాసురుడి ఆత్మబలానురూపంతో అప్రతిమానంగా ఉన్న రావణాసురుని భవనోత్తమము కనిపించింది. అది దైవయోగం వల్ల ఈ భూమి మీదకి వచ్చిన స్వర్గధామం వలె విజయకాంతులతో విరాజిల్లుతూ ఉన్నది. వివిధ రత్నఖచితమైన ఆ భవనం నానా తరులతాదుల పూలతోను, ఆ పూల పుప్పొళ్ళతోను కమ్ముకున్న పర్వత శిఖరం వలె, ఆ భవనోత్తమములో కనిపించే అందగత్తెలు మేఘాలలో మెరిసే మెఱపుల వలె, ఆకాశంలో హంసలు మోసుకు పోతున్న బ్రహ్మదేవుడి విమానం వలె, బహురత్న చిత్రితమైనందు

వల్ల గైరికాది ధాతువులతో ధగధగలాడుతూ ఉన్న పర్వతాగ్రం వలె, చంద్ర శుక్రాది గ్రహాలు తేజరిల్లే ఆకాశం వలె, నానావిధ వర్ణాలతో భాసించే ఇంద్ర ధనుస్సు వలెను హనుమంతుడికి కనిపించింది.

అది ఆ రాచనగరులో ఉన్న విమాన గృహా లన్నిటికన్నా శ్రేష్ఠమైనది, ఉన్నతమైనది, ఉత్తమమైనది. ఈ భూమి నిండా పర్వత పంక్తులు ఉన్నట్లు, ఆ పర్వత పంక్తులలో నానావిధ వృక్షాలు ఉన్నట్లు, ఆ వృక్షాలన్నీ పూలుపూసి ఉన్నట్లు, ఆ పూలలో కింజల్కాల రేకులు ఎంతో రమణీయంగా ఉన్నట్లు, ఆ భవనంలో నేలమీద వివిధ మణులతో చిత్రించి ఉన్నది. రత్నప్రభలతో విరాజిల్లుతున్న ఆ మహా గృహము పేరు పుష్పకము. ఆ పుష్పక విమాన గృహములో రావణాసురుడు నివసించు చున్నాడు. ఆ పుష్పకము కుబేరుడిది. ఆ పుష్పక విమానంలో వైడూర్యమణులతో చిత్రించిన పక్షులు, పగడాలు, వెండితో చేసిన పక్షుల ప్రతిమలూ, వివిధ లోహాలతో చేసిన పాముల ప్రతిమలూ, ఆయా జాతుల అవయవాల పొంకము తెలియచేసేట్లు చేసిన గుఱ్ఱాల ప్రతిమలు మనోహరంగా కనిపించాయి. అక్కడ చిత్రించి ఉన్న పక్షులు సొగసు అయిన ముక్కులతో బంగారుపూలు, పగడాల పూలు రాలిన అందము అయిన వంకర రెక్కలు మురిపెముగా ముడుచు కొని మన్మథుడికి తోడువచ్చినట్లు కనిపించినవి. మదపుటేనుగులు వాటంతట అవి తామరకొలనులో విహరిస్తూ పద్మ కింజల్కాలు అంటుకున్న దేహాలు వేసుకొని తొండాలతో కలువ పువ్వులు

జల్లుతూ పద్మహస్త అయిన లక్ష్మీదేవిని అభిషేకం చేస్తున్నట్లు చిత్రించిన చిత్తరువును అక్కడ హనుమంతుడు చూచినాడు.

రమణీయము, మంగళకరము అయిన మహాపర్వతము వలె కనిపించే ఆ మహా విమాన గృహాన్నీ, వసంత ఋతువులో విరగబూసిన పూల ఘుమఘుమలు గుబాళించే ఆ పర్వతగుహల వంటి గృహాలను హనుమంతుడు తిరిగి చూసి విస్మితుడు అయినాడు. ఆ రాజనగరులో ఉన్న భవనాలలోను, లంకాపట్టణములో ఉన్న భవనాలలోను ఆ రామాయత్తచిత్త సీతాదేవి అతనికి కనిపించలేదు. అందుకు దుఃఖపడి పోయినాడు. అప్పుడు ఆ హనుమంతుడి మనస్సు పరిపరివిధాల పోయింది. అతనిది అకుంఠిత ధైర్యము. అతని చూపు ఎంత దూరమైనా పోతుంది. మళ్ళీ ఆ వైదేహిని, ఆ సీతాదేవిని వెతకడానికి కృతనిశ్చయు డైనాడు. ఆ మహావిమాన గృహం మధ్యన నవరత్న ఖచితమైన ఒక గొప్ప విమానాన్ని హనుమంతుడు చూచినాడు. దాని దగ్గరకు పోయినాడు. తప్తకాంచనముతో చేసిన బంగారు కిటికీలు దానికి అమర్చి ఉన్నవి. అది ఎంతగానో భాసిస్తూ ఉన్నది. (మన మొత్తం శరీరానికి ఏదైతే ఆధారమో అక్కడ కుబేరు డుంటాడు. అక్కడి వరకు రావణాసురుడు ఆక్రమించాడు. అవన్నీ దివ్యమైనవే గాని అహంకార ప్రజ్ఞకు లోబడి ఉన్నాయి.)

ఆ పుష్పకం అతి ప్రయత్నంతో విశ్వకర్మ నిర్మించినది. అందులో ప్రతిదాన్ని ముందుగా పరిశీలించి, అది తగినది అనిపించినప్పుడే దానిలో అమర్చినాడు. ఆ విమానంలో మహార్ష మైన మణులు అన్నివైపులా పొదిగి ఉన్నాయి. అందులో ఉన్న

విశేషాలు దేవతా గృహములలో సైతమూ లేవు. అందులో ఏది చూచినా అతిశయంగా అనిపించక తప్పదు. ఏ భాగం చూచినా ఆశ్చర్యము వేయుచున్నది. అది తపోనుష్ఠానము వల్లను, పరాక్రమము వల్లను లభ్యమౌతున్నది. అది గోపుర పద్మకలశ నానావిధ విచిత్ర సన్నివేశాలతో నిర్మించినది. ఒక్కొక్కవైపు ఒక్కో విధంగా కనిపిస్తుంది. అందులో శిల్ప విశేషాలన్నీ సరి సమాన మైనవి. ఏ వైపు నుండి చూచినా అది అత్యంత రమణీయంగా గోచ రిస్తుంది. ఆ విమానంలో కూర్చున్న దాని యజమాని ఎక్కడకు పోవలెనో మనస్సులో నిశ్చయించుకుంటే అది అక్కడికి పోతుంది. అంతేకాదు యజమాని మనోభావాన్ని బట్టి అది వేగంగా కాని, మందంగా కాని పోతుంది. దానిని నివారించడం ఎవరి తరమూ కాదు. అది వాయు సమాన వేగంతో పోతుంది. మహాత్ములు, పుణ్యాత్ములు, పరమ సంపన్నులు, కీర్తివంతులు, ఆనందకలశులైన దేవేంద్రాదుల నివాస నిలయం వంటిది. అది సొగసైన వస్తువు లతో మహా సొగసైన పనితనంతో చేయబడింది. చిత్ర విచిత్రమైన అనేక శిఖరాలతోను, మనోహరమైన శరశ్చంద్ర స్వచ్ఛ కాంతుల తోను, గైరికాది ధాతువులతోను, ధగధగలాడే అవాంతర శిఖరాల మధ్య ఆ విమాన గృహం మహా పర్వత శిఖరం వలె కనిపించింది. గుండ్రంగా, వంకరగా, విశాలముగా ఉన్న కర్ణాలతో, కుండలాలతో, శోభించే ముఖాలతో, మహా కాయాలతో ఆకాశంలో సంచారం చేసే నిశాచరులు, మహావేగంతో పోయే భూతగణాలు, వేలకొద్దీ ఆ విమానాన్ని మోస్తున్నాయి. వసంతకాల పుష్ప సమూహంకన్నా మనోహరంగాను, వసంత ఋతువుకన్నా రమణీయంగానూ ఉన్న ఉత్తమమైన ఆ పుష్పక విమానాన్ని హనుమంతుడు చూచాడు.

ఉత్తమమైన పుష్పక విమానం మీదకి హనుమంతుడు మెట్లెక్కి పోయినాడు. అక్కడ వాయుదేవుడు వివిధ రూపాలు ధరించినట్లుగా భక్ష్యాలు, వివిధ అన్నాలు, మద్యాలు ఘుమ ఘుమ వాసనలు కొడుతూ వున్నాయి. బంధువైనవాడు తన ఆప్త బంధువుకు ఎదురుగుండాపోయి పిలుచుకుని వచ్చి తన ఇల్లంతా చూపించినట్లు ఆ మహా బలవంతుని హనుమంతుని ఆ సుగంధం 'రావణాసురుడు ఇక్కడే వున్నాడు, ఇటు రా' అని పిలిచింది. పరమ శోభనాకారంతో రావణాసురుని మనఃకాంత మాదిరిగా వున్న ఆ విశాల శాలాగృహం లోనికి హనుమంతుడు పోయి చూశాడు. అక్కడ సోపానాలకు మణులు పొదిగి వున్నవి. బంగారు కిటికీలు అలంకారముగా కనిపించినవి. కింద స్ఫటికాలు తాపడం చేసి వున్నవి. మధ్య మధ్య దంతాల బొమ్మలు పెట్టి వున్నవి. ముత్యాల తోనూ పగడాలతోనూ వివిధ మణులతోనూ అలంకరించిన వెండి బంగారు స్తంభాలు వంకర టింకర లేకుండా నిలువుగా ఎంతో ఎత్తున అమర్చి వున్నవి. ఆ స్తంభాల చివరన అమర్చిన పక్షుల రెక్కల వంటి రెక్కలు ఆకాశానికి ఎగుర వేసుకుని పోతున్నట్లుగా కనిపించినవి.

అక్కడ నేలమీద పెద్ద విశాలమైన కంబళము పరచి వున్నది. ఈ భూమిపై వున్న మహా సముద్రాలు, మహానదులు, వివిధ అరణ్యాలు, మహాపర్వతాలు, ఆయా దేశాలు, ఆయా పట్టణాలలో వున్న భవనాలు చిత్రీకరించి వున్నాయి. ఇంకా నాణ్యమైన జంబు ఖానాలు పరచి వున్నవి. మధురగానం చేసే పక్షులు అక్కడ నివసిస్తూన్నవి. దివ్య సుగంధం అక్కడ గుబాళిస్తూ వున్నది. అగరు

ధూపాలు వేసినందువల్ల ఒక చోట పొగ వన్నెలోనూ, ఆ ధూపాలు పాకని చోట హంసవలె నిర్మలంగా తెల్లగాను, పూలు చల్లిన చోట చిత్ర వర్ణాలతోను, కోరిన కోర్కెలు తీర్చి మనసుకు ఉల్లాసము కలిగించే వశిష్ఠ మహర్షి కామధేనువు వలె కనిపించింది. రకరకాల రంగులతో ముచ్చట గొలుపుతూ ఆ భవనము దివ్య సంపదతో లక్ష్మికి పుట్టినిల్లుగా కనిపించింది.

కన్నతల్లి తన స్పర్శ రూప శబ్ద రస గంధాదులతో తన పుత్రుని త్వక్ చక్షు శ్రోత్ర జిహ్వాఘ్రాణాలు అనే పంచేంద్రియాలను తృప్తి పరచేలా శైత్య మాంద్య సౌరభాలతో అక్కడ గాలి వీస్తూ ఆ హనుమంతుడి త్వగింద్రియాన్ని, సుందర వస్తువులతో నేత్రేంద్రియాన్ని, నృత్య గీత వాద్య ధ్వనులతో అతని కర్ణేంద్రియాన్ని, అమృతోప మానమైన పాన భక్ష్య అన్నాదులతో అతని రసనేంద్రియాన్ని, అగరు చందనాది ధూపాలతో అతని ఘ్రాణేంద్రియాన్ని ఆ విశాల శాలా గృహము సంతోష పెట్టింది.

హనుమంతుడు ఆ భవనాన్ని చూసి ఇది స్వర్గమా! దేవ లోకమా! దేవేంద్రుని అమరావతి పట్టణమా! తపస్సిద్ధి రూపమైన బ్రహ్మలోకమా! అని ఆలోచించసాగినాడు. అక్కడి బంగారు సెమ్మెలలో దీపాలు నిశ్చలంగా ఏదో ధ్యానం చేస్తున్నట్లు వెలుగు తున్నాయి. పెద్ద జూదగాళ్ళకు ఓడిపోయిన చిన్న జూదగాళ్ళ వలె మణి ప్రభలతో వెలుగుతున్న పెద్ద పెద్ద స్తంభాల ఎదుట ఆ కాంచన దీప కళికలు కదలక మెదలక వెలుగుతూ కనిపించాయి. ఆ దీపాల కాంతులు, రావణాసురుని దేహకాంతులు, అతడు

పెట్టుకున్న ఆభరణ కాంతులు ఏకమై ఆ విశాల శాలా గృహంలో ఏక జ్వాలగా వెలుగుతున్నట్లు హనుమంతునికి కనిపించింది.

అక్కడ చిత్ర కంబళము మీద రంగు రంగు చీరలతో, రంగు రంగుల పూలదండలతో, నానావిధ అలంకారాలతో, నానావిధ వేషాలతో ఉత్తమాంగనలు పడుకుని నిద్రపోతూ వున్నారు. వారందరూ మద్యపానము చేశారు. క్రీడించిన రాత్రి తిరిగిపోయి సొమ్మసిల్లి నిద్ర పోయినారు. పద్మవనంలో హంసలవలెను, తుమ్మెదల వలెను ఆభరణాల చప్పుళ్ళు ఏవీ లేకుండా ఆ ఉత్తమాంగనలు నిశ్శబ్దంగా నిద్రపోతున్నారు. ఆ అందగత్తెలు కళ్ళు మూసుకుని పళ్ళు కనబడ కుండా నిద్రపోతున్నారు. వారి ముఖాల నుండి పద్మ సుగంధము వీస్తూ వున్నది. సూర్యోదయము కాగానే వికసించి, చీకటిపడగానే ముకుళించుకునిపోయే పద్మాలవలె వారి ముఖాలు కనిపించినవి. ఆ స్త్రీల ముఖాలు సుగంధాది ఘుమఘుమలతో అచ్చం పద్మము మాదిరిగా వున్నవి. కాబట్టి మదమెక్కి మైమరచిపోయి మకరందం కోసము పద్మాల మీదకి పోయే తుమ్మెదలు తప్పకుండా ఆ స్త్రీల ముఖ పద్మాల మీద పదే పదే వాలుతాయి అని హనుమంతుడు అనుకున్నాడు. ఉత్తమ స్త్రీలు నిద్ర పోయేటపుడు పళ్ళు బయట పడవు. నోరు తెరుచుకోదు. నిర్మలమైన నక్షత్రాలతో శరత్కాల స్వచ్ఛ ఆకాశంవలె ఆ ఉత్తమాంగనలతో ఆ విశాల శాలా గృహము హనుమంతునికి కనిపించినది.

ఆ స్త్రీలందరి మధ్య పడుకుని వున్న ఆ కాంతిమంతుడు రావణాసురుడు నక్షత్రాల మధ్య చంద్రుని వలె తేజరిల్లుతూ

వున్నాడు. నేలరాలిన ఆ నక్షత్రాలు పుణ్య శేషము వలన ఆ స్త్రీల రూపము ధరించినవేమో అని అనుకున్నాడు. ఆకాశంలో నక్షత్రాల నైర్మల్యము తళుకు తళుకు మనే వాటి కాంతి రూపము విశాల శాలా గృహములో పడుకున్న స్త్రీలలో మూర్తీభవించినది. వారందరూ మద్యపానముచేసి మదన వ్యాపారంలో వున్నపుడు వారు పెట్టుకున్న పెద్ద పెద్ద పూలదండలలో ఆభరణాలు చిక్కుకుని పోయినాయి. వారు నిద్రకు లోబడిపోయారు. అందువలన వారి ఆభరణాలు మొదలగునవి స్థానాలు తప్పినవి.

కొందరి ముఖాల మీద తిలకాలు కరగిపోయినవి. కొందరి కాళ్ళ అందెలు జారిపోయినవి. కొందరి కంఠహారాలు పక్కకు పడిపోయినవి. కొందరి ముత్యాలహారాలు పేటలు తెగి దేహమంతటా వ్యాపించినవి. కొందరి చీరలు జారిపోయి మొలనూళ్ళు వదులు అయిపోయి పొర్లాడుతున్న గుఱ్ఱపు పిల్లల వలె కనిపించారు. చెవులకు పెట్టుకున్న కుండలాలు ధగధగ లాడుతూ మెడలో వేసుకున్న పూలదండలన్నీ నలిగిపోయి నిద్రపోతున్న ఆ స్త్రీలు అడవిలో మదపుటేనుగు నలగదొక్కిన పూల తీగలవలె కనిపించారు. ఆ ఉత్తమాంగనలు కొందరు పెట్టుకున్న ముత్యాలహారాలు చంద్ర కిరణాలవలె తేజరిల్లుతూ వారి స్తనాల మధ్య హంసలు పడుకున్నట్లుగా కనిపించినాయి. కొందరు పెట్టుకున్న వైడూర్య హారాలు వారి స్తనాల మధ్య కాదంబ పక్షులవలె కనిపించాయి. కొందరు పెట్టుకున్న హేమసూత్రాలు వారి స్తనాల మధ్య చక్రవాక పక్షులవలె కనిపించాయి. అట్లా పడుకున్న ఆ స్త్రీల జఘనాలు పెద్ద పెద్ద

ఇసుక తిన్నెల వలెను, వారి కంఠహారాలు హంస కారండ చక్రవాక పక్షుల వలెను, మొలనూళ్ళ గజ్జెలు మొగ్గల వలెను, వారి పెద్ద పెద్ద బంగారు ఆభరణాలు వికసించిన కమలాల వలెను, వారి అవయవాలు మొసళ్ళ వలెను, వారి దేహ కాంతులు గట్లవలెను, వారు శోభాయమానమైన నదుల వలెను కనిపించినారు.

ఆ ఉత్తమాంగనలు పెట్టుకున్న ఆభరణాలు వారి మృదువైన కరచరణాది అవయవాల మీదనూ, వారి స్తనాల మీదనూ అరవళ్ళు పడి ఆ అరవళ్ళే ఆభరణాల వలె శోభించినాయి. వారు విడుస్తున్న ఊపిరులకు వారి పమిట చెరగులు మాటి మాటికి వారి ముఖాల మీదకు కొట్టుకుంటూ మనోహరమైన కాంతులతో గాలికి ఎగిరే జెండాలవలె భాసించినవి. ఆ కాంతి సంపన్నులు చెవులకు పెట్టుకున్న కుండలాలు వారి ఊర్పులకు మందమందంగా చలిస్తున్నాయి. వారందరూ ఉత్తమాంగనలు. వారు వదిలే ఊపిరి స్వభావ సిద్ధంగా పరిమళిస్తూ వున్నది. అందులోనూ చక్కెర కలిపిన మద్యం తాగి వారు నిద్రపోతున్నందువల్ల మరింత మనోహరమైన సుగంధంతో వారు ఊపిరులు వదులుతూ రావణాసురుని సేవిస్తున్నట్లు కనిపించినారు.

వారిలో కొందరు మద్యము కైపు వలన ఒళ్ళు తెలియక రావణాసురుని ముఖమనుకుని పక్కన వున్న సవతుల ముఖాలు ఆఘ్రాణిస్తూ వున్నారు. తమను ఆఘ్రాణిస్తున్నవారు తమ సవతులని తెలియక ఆ వరాంగనలు మద్యపానపు కైపు వలన తమ ప్రభువు రావణాసురుడే తమను అట్లా ఆఘ్రాణిస్తున్నా

డనుకుని తమ సవతుల ముఖాలు ఆఘ్రాణిస్తూ వున్నారు. వారిలో కొందరు తమ వస్త్రాలు తలగడలుగా మడచి పెట్టుకుని నిద్ర పోతున్నారు. కొందరు తళతళలాడే దండకడియాలున్న తమ బాహువులను తలగడగా పెట్టుకుని నిద్రపోతున్నారు. అట్లా నిద్రపోతున్న వారి బాహువుల మీద తమ తలలు పెట్టుకుని కొందరు నిద్రపోతున్నారు. అట్లా నిద్రపోతున్న వారి తొడల మీద తమ తలలు పెట్టుకుని కొందరు నిద్రపోతున్నారు. కొందరు తమ పక్కనున్న వారి నడుముల మీద తమ తలలు పెట్టుకుని నిద్రపోతున్నారు. కొందరు పిరుదుల మీద తమ తలలు పెట్టుకుని, కొందరు తమ పక్కనున్న వారి మీద చేతులు కాళ్ళు వేసుకుని నిద్రపోతున్నారు.

అట్లా ఒకరి మీద ఒకరు పడి బాహువులు పెనవేసుకుని నిద్రపోతున్న ఆ స్త్రీల బాహువుల వరుస ఒక పూలదండ వలెను, వారి తలలు మత్తెక్కిన తుమ్మెదల గుంపుల వలెను, ఆ పూల దండల గుంపుల దగ్గరగా మూగుతున్నట్లుగా కనిపించినది. వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు వారి పూలదండలు కలసిపోయాయి. ఒకళ్ళ నొకళ్ళు పెనవేసుకుని పడుకున్నందువలన ఒకరి ముంగురులు మరొకరి ముంగురులతో పెనవేసుకుపోయాయి. వాళ్ళ కోక ముళ్ళు పెనవేసుకుపోయాయి. వైశాఖమాసంలో పూల తీగలన్నీ గాలికి పెనవేసుకుని ఒకదాని పూలగుత్తులు మరొక దానితో కలసి, ఒక దాని బోదె మీద ఒకటి అల్లుకుపోయి, ఒకదాని చిగుళ్ళు ఒకదాని మీద పడి గజిబిజి అయి ఒకే పూల దండవలె

కనిపించే లతావనము వలె ఆ రావణాసురుడి వనితావనం కనిపించింది.

అక్కడ నిద్రపోతున్న వారందరూ రాజర్షుల స్త్రీలు, దేవతా కన్యలు, దైత్యాంగనలు, గంధర్వ సుందరీమణులు, రాక్షసాంగనలు. వారందరూ ఆ రావణాసురుడికి కామవశంగతులై పోయినారు. వారెవరినీ రావణాసురుడు కామించి, బలాత్కరించి పట్టుకుని రాలేదు. ఆ స్త్రీలను లేవనెత్తుకుని వస్తే వాళ్ళ వాళ్ళు తన మీదకి యుద్ధానికి వస్తారని, అప్పుడు వాళ్ళతో తాను యుద్ధం చేయ వచ్చనే యుద్ధకాంక్షతో రావణాసురుడు ఆ స్త్రీలను చాలామందిని తీసుకుని వచ్చాడు. వారిలో కొందరు మదన మోహితులై రావణాసురుని వలచి వచ్చినారు.

అక్కడున్న ఏ ఒక్క స్త్రీని రావణాసురుడు తన పరాక్రమంతో లోబరచుకోలేదు. అతని సౌందర్యాది గుణాలకే ఆ స్త్రీలందరూ అతనికి లోబడి పోయినారు. వారికి ఎవరికీ ఏ ఇతరుల మీదనూ కోరిక లేదు. అంతే కాదు, అక్కడున్న ఏ స్త్రీ కూడా అదివరకు ఎవరి పెండ్లాము కాదు. వాళ్ళలో కులము తక్కువది ఒకతీ లేదు. రూపంలో లోపం వున్నది, నేర్పరి కానిది, సత్తువ తక్కువైనది, భర్తకు ఉపచారాలు చెయ్యనిది కాని ఒక్కతీ లేదు. కాంతుని కామించనది వారిలో ఒక్కతీ లేదు.

(రావణాసురుడు బలాత్కారంగా తెచ్చిన వారెవరూ లేరు. ఆయన బలాన్ని, వీర్యాన్ని, తేజస్సును, వర్చస్సును చూచి రాజర్షుల, దేవతల, రాక్షసుల కన్యలు, గంధర్వులు అందరూ కూడా అలా

లోబడిపోయారు. రావణుడు ఇంతవరకు ఇతరుల పెళ్ళాలను ఎత్తుకు రాలేదు. కన్యలనే ఎత్తుకు వచ్చాడు. వారందరూ ఆయనను వరించారు, కాబట్టి ఆయనతో వుండిపోయారు. అందరూ ఆయనను మోహించి చేరినవారే. అందరికీ ఆయనయందు, ఆయనకు అందరియందూ ఇష్టం వున్నది. రావణాసురుడు నరకాసురుడి లాంటివాడు కాడు అని తెలుస్తుంది. ఒక్క సీతాదేవినే ఆ విధంగా తీసుకువచ్చాడు. అందరూ వద్దని చెబుతున్నా కూడా వినడు.)

హనుమంతుడు ఆ స్త్రీలందరినీ చూచినాడు. సీతాదేవి కూడా వారితో కలసిపోతే తాను చెయ్యగలిగిందేమీ లేదు అని అనుకున్నాడు. దిగులు పడ్డాడు. ఆలోచించినాడు. తన ఊహ తప్పు అనుకున్నాడు. సీతాదేవి పాతివ్రత్యాది గుణాలలో అధికురాలు అని నిశ్చయించుకున్నాడు. ఈ రావణాసురుడు ఎందుకు ఆమెను అపహరించాడు, పరాక్రమంతో చేసింది దుష్కృత్యము. శివుడిని మెప్పించిన బ్రహ్మ వర్చస్సు, తేజస్సు కలిగినటువంటి పరాక్రమము వున్నది అనుకున్నాడు.

(ఆమె కూడా రావణుడితో కలసిపోతే తాను చెయ్యవలసిందేమీ లేదని సద్గురువు తిరిగి వెళ్ళిపోతాడు. ఎవరైనా వున్నాడంటే వాడి కోసం ఏదైనా చెయ్యాలి. హనుమంతుడికి కూడా ఎంత వెదికినా ఎక్కడా కనబడలేదన్నట్లుగా భావన చేయాలి. ఇది లోకంలో సర్వ సామాన్యం. రావణాసురుడు పరాక్రమవంతుడు, తేజోవంతుడు అయికూడా ఇలాంటి పని ఎందుకు చేశాడా అని జాలిపడ్డాడు.

రావణాసురుడికి అందానికి అందం, ఠీవికి ఠీవీ వున్నాయి. అతనికి లేనిదేమీ లేదు ఒక్క అహంకారం తప్ప. పెద్ద పెద్ద వాళ్ళుకూడా ఏదో చిన్న పొరబాటు వల్ల పతనం చెందడం అంటూ వుంటుంది. రావణాసురుడికే తప్పలేదంటే, ఇక మిగతావాళ్ళు ఎప్పుడు, ఎక్కడ దేనికైనా ఆకర్షింపబడి పతనం చెందగలరు.)

అక్కడట్లా వున్న హనుమంతుడు స్ఫటికాలతో తళతళలాడుతూ, రత్నాలతో ధగధగలాడుతూ వున్న ఆ స్వర్గధామం వంటి శయనాసన ప్రదేశాన్ని చూచాడు. అక్కడున్న వసారాలన్నీ బంగారంతోనూ, దంతాలతోనూ చేసి వైడూర్య మణులు పొదిగి విచిత్రమైన ఆకారాలతో వున్నాయి. ఆ వివిధాసనాల మీద మహార్ఘమైన వస్త్రాలు పరచి వున్నాయి. అవన్నీ ఎంతో విలువైనవి. అక్కడొక పరమాసనం (పెద్ద మంచం) కనిపించినది. అశోకపూల దండలు వ్రేలాడుతూ వున్నాయి. అది సూర్యప్రభలతో తేజరిల్లుతూ వున్నది. దాని తలవైపున ముత్యాల దండలతో తెల్లగా గుండ్రంగా చంద్రబింబమువలె ఒక శ్వేత ఛత్రము వున్నది. ఆ పరమాసనానికి అన్ని వైపులా స్త్రీలు చామరాలు వీస్తున్నారు. అక్కడ దివ్య సుగంధము గుబాళిస్తూ వున్నది. శ్రేష్ఠమైన అగరుధూపము అక్కడంతటా వ్యాపిస్తూ వున్నది. అక్కడొక పెద్ద దుప్పటి పరచి వుంది. ఆ దుప్పటి మీద పొట్టేళ్ళ తోళ్ళు కప్పి వున్నవి. అక్కడ అంతటా ఘుమఘుమలాడే పూలదండలు వేళ్ళాడుతూ వున్నవి.

ఆ పరమాసనము మీద రాక్షసులందరినీ సుఖపెట్టే మహాబాహువు, రాక్షసాధిపతి రావణాసురుడు నీలమేఘంవలె పడు

కున్నాడు. చెవులకున్న కుండలాలు ధగధగలాడుతూ వున్నాయి. ఉబ్బెత్తు కన్నులతో బంగారు సరిగ వస్త్రము కట్టుకుని వున్నాడు. ఘుమ ఘుమ వాసనలు గుబాళిస్తున్న రక్తచందనము అతని దేహమంతటా గుబాళిస్తూ వున్నది. అతడాకాశంలో సంధ్యాకాల రక్త కాంతులతో మెఱపుతో మెరిసే నీలమేఘం వలె కనిపించాడు. అతడు కామరూపుడు, శ్రేష్ఠమైన ఆభరణాలు అలంకరించు కున్నాడు. వృక్షాలు, గుల్మాలు, వనాలతో నిద్రపోతూవున్న మంధర పర్వతం వలె కనిపించాడు. నానావిధ క్రీడలు సలిపి అలసి నిద్రపోతున్నాడు. మదపుటేనుగువలె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు విడుస్తూ నిద్రపోతున్న ఆ రావణాసురుని శయ్య దగ్గరకు హనుమంతుడు పోయి చూచినాడు. ఆ హనుమంతుడి మనసు కలతబడిపోయి భయపడిన వాడివలె అక్కడి నుంచి తప్పుకుని మెట్లవద్దకు చేరినాడు. ఆ మెట్ల తిరుగుడులో వున్న వేదికపై కూర్చున్నాడు. నిద్రపోతున్న రావణాసురుని చూడసాగినాడు.

ఆ రావణాసురుడు పడుకున్న ఆ పరమాసనము మదపు టేనుగు పడుకున్న సెలయేటి మడుగువలె శోభాయమానంగా కనిపించింది. ఆ పరమ పరాక్రమవంతుడు రావణాసురుడు ఇంద్రధ్వజాల వంటి తన రెండు బాహువులను చాచి పడు కున్నాడు. అతడు ఐరావతముతో పోట్లాడినప్పుడు దాని దంతాల వల్ల అయిన గాయాల మచ్చలు ఎదురు రొమ్ముల మీదను, దేవేంద్రుడు వజ్రాయుధంతో కొట్టినప్పుడు పడ్డ గాట్ల మచ్చలు మూపురాల మీదను, మహావిష్ణువు చక్రాయుధంతో వేసిన దెబ్బల మచ్చలు హెచ్చు తగ్గులు లేకుండా వున్న రెండు భుజాల మీదను

కనిపించాయి. (రావణుడిని విష్ణువు చక్రాయుధంతో కొడితే గీతలు పడ్డాయి. దేవేంద్రుడు వజ్రాయుధంతో కొడితే గాట్లు పడ్డాయి తప్ప ఏమీ కాలేదు. సుదర్శన చక్రాన్ని కూడా ఎదిరించి బ్రతికిన పరాక్రమశాలి ఆ రావణాసురుడు.)

ఆ రావణుడి బాహువులు అమితంగా బలిసి వున్నాయి. అవి దేహ ప్రమాణానికి అనుగుణంగా వున్నాయి. బలిసిన బొటన వ్రేలు, తక్కిన వ్రేళ్ళు ఆ వ్రేళ్ళన్నిటికీ శుభలక్షణాలతో వున్న గోళ్ళు, ఆ వ్రేళ్ళకు ఉంగరాలు ధగ ధగ లాడుతూ కనిపించాయి. ఆ బాహువులు ఇనుప గుదియల వలె బలిష్ఠంగాను, ఏనుగు తొండాలవలె గుండ్రంగాను, విసరివేసిన ఐదు తలల పాముల వలెను, ఆ తెల్లటి పాన్పు మీద కనిపించాయి. ఆ బాహువులకు కుందేటి రక్తము వలె ఎర్రగా కనబడుతూ చల్లదనాన్నిస్తూ ఘుమ ఘుమ సువాసనలు గుబాళిస్తున్న చందనము పూసి వున్నది. ఉత్తమాంగనల గాఢాలింగనాది సంబంధము వల్ల ఆ బాహువులు మరింత ఘుమ ఘుమలు గుబాళిస్తున్నాయి. అవే, ఆ బాహువులే దేవ దానవ యక్ష గంధర్వుల నందరినీ గగ్గోలు పెట్టించినవి. కోపంతో తిరుగుతూ మంధర పర్వతము నడుమ నిద్రపోతూవున్న మహా సర్పాలవలే ఆ బాహువులు ఆ శయ్యమీద కనిపించినవి. కొండంతటి ఆ రాక్షసేశ్వరుడు పొడవాటి ఆ రెండు బాహువులతో రెండు శిఖరాలున్న మంధర పర్వతము వలె శోభించాడు.

ఆ రాక్షస సింహుని పెద్ద నోటి నుంచి మామిడి, పున్నాగ, పొగడ పూల వాసనలతో, మృష్టాన్నగంధముతోనూ, మద్యము ఘుమ ఘుమలతోను వస్తున్న నిశ్వాసాలు ఆ గృహమంతా

వ్యాపిస్తున్నాయి. బంగారంతో చేసి, ముత్యాలు, మణులు పొదిగి వున్న కిరీటము పక్కకు తొలగి వున్నది. ఉజ్జ్వల కుండల కాంతులతో ముఖము తేజరిల్లుతూ వున్నది. రక్తచందనపు మైపూతతోను, శోభాయమానమైన కంఠహారాలతోను, వెడల్పాటి పొడవైన బలిష్ఠమైన అతని విశాల వక్షస్థలము ధగధగలాడుతూ వున్నది. పైన కప్పుకున్న తెల్ల పట్టు ఉత్తరీయం చెదరిపోయి, నడుముకు చుట్టుకున్న పచ్చని వస్త్రము కదలిపోయి అతడు మినుముల రాశి వలె కనిపించాడు. పాము బుసలు కొడుతున్నట్లుగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వదులుతూ వున్నాడు. గంగానదీ జలాల మధ్యన పడుకున్న ఏనుగువలె నిద్రపోతున్నాడు. నాలుగు వైపులా వున్న బంగారు సెమ్మెలలో దేదీప్యమానంగా వెలుగుతున్న దీపకాంతుల వెలుతురులో అతడు పెట్టుకున్న ఆభరణాల కాంతులతోను మెఱుపులు మెరుస్తున్న మహా మేఘంవలె నిద్రపోతున్నాడు.

ఆ రాక్షసాధిపతి ప్రియ భార్యలు ఆ మహా పరాక్రమవంతుడి పాదాలవైపు, భుజాలవైపు పడుకుని నిద్రపోతున్నారు. చంద్రుని కాంతులతో తేజరిల్లుతూ, మనోహరమైన కుండలాల కాంతులతో శోభిస్తూ, వికసించిన పూలదండలతో ఘుమఘుమ లాడుతూ పడుకుని నిద్రపోతూ వున్న ఆ రావణాసురుడి భార్యల నందరినీ హనుమంతుడు చూశాడు. వారందరూ నృత్యం చేయడంలోనూ, వివిధ వాద్యాలు వాయించడంలోనూ అత్యంత నేర్పరులు. ఉత్తమాభరణాల ధగధగలతో ఆ స్త్రీలందరూ నిద్రపోతూ వున్నారు. బాహువులు తలగడగా పెట్టుకున్నందువలన ఆ బాహువులకు అలంకరించుకున్న బాహు మూపురుల వల్లను, చెవులకు పెట్టుకున్న

వజ్ర వైడూర్యమణులు పొదిగిన బంగారు కుండలాల వలెను ముఖాలు శోభాయమానంగా కనిపించినవి. మంగళకరమైన కుండలాలతో చంద్రబింబాలవంటి ముఖాలతో ఆ విమాన గృహము నక్షత్రాలతో నిండిన ఆకాశము వలె అగుపించినది.

యౌవన మద అతిశయ వ్యాయామంతో అలసిపోయిన ఆ తనుమధ్యలు ఎక్కడివారక్కడ పడుకుని నిద్రపోతున్నారు. కోమల మైన అవయవ నిక్షేపాలతో, మేలైన మేనిఛాయతో నట్టువరాలు నృత్యం చేస్తున్నట్లుగా విన్యస్త శుభ పర్వాంగిగా ఒకతె నిద్రపోతూ వున్నది. మహానదిలో తెప్పకొయ్యను పెనవేసుకుని తామరపూవు వలె ఒకతె పెద్ద వీణను కౌగలించుకుని నిద్రపోతూ వున్నది. చంకనెత్తుకున్న పసిబిడ్డవలె ఒక హసితేక్షణ చంకలో గుమ్మెట పెట్టుకుని నిద్రపోతున్నది. చిరకాలానికి వచ్చిన ప్రియుణ్ణి గట్టిగా కౌగిలించుకున్న సర్వాంగ సుందరివలె ఒక శుభస్తని రంజను గట్టిగా కౌగలించుకుని నిద్రపోతూ వున్నది. కాముకి ఏకాంతములో తన ప్రియుణ్ణి పట్టుకున్నట్లు ఒక కమలలోచన పిల్లనగ్రోవిని పట్టుకుని నిద్రపోతూ వున్నది. వాఙ్మయముతో నృత్యము చేస్తూ పెనిమిటిని పట్టుకున్నట్లు ఒక భామిని ఏడు తంత్రుల వీణను పట్టుకుని నిద్రపోతూ వున్నది. బంగారు కాంతులీను మృదువైన దేహాలతో మనోహరంగా కనిపిస్తున్న మత్తలోచన ఒకతె మద్దెలను కౌగిలించుకుని నిద్రపోతూ వున్నది.

తారుణ్యమదముతో అలసిపోయిన ఒక కృశోదరి తన పార్శ్వానికి బాహువులకు మధ్యను పణవాన్ని చంకలో పెట్టుకుని నిద్రపోతూ వున్నది. ఒక భామిని యువకుడైన ప్రియుణ్ణి, బిడ్డను

కౌగిలించుకుని పడుకున్నట్లు ఒక చేతితో ఒక డిండిమాన్ని, రెండవ చేతితో ఒక డిండిమాన్ని పట్టుకుని నిద్రపోతున్నది. యౌవన మదంతో ఒళ్ళు ఎరుగకుండా వున్న ఒక కమలపత్రాక్షి ఆడంబరము అనే వాద్యాన్ని గట్టిగా పట్టుకుని నిద్రపోతూ వున్నది. వసంత ఋతువులో వాడిపోకుండ వుండటానికి, తడిపినప్పటికిన్నీ వాడి పోయిన పూలదండవలె ఒక సుందరాంగి తెలియక జలకలశాన్ని బోరగిల తోసుకుని నీళ్ళతో తడిసి నిద్రపోతూ వున్నది. ఒక అబల సువర్ణ కలశాలవంటి తన స్తనాలను రెండు చేతులతోనూ పట్టుకుని నిద్రపోతూ వున్నది. నిండు చంద్రునివంటి ముఖముతో వున్న ఒక కువలయాక్షి మరొక సుశ్రోణిని కౌగిలించుకుని యౌవన మదంతో మైమరచి నిద్రపోతూ వున్నది. అట్లా అక్కడ స్త్రీలందరూ నానావిధ వాద్యాలను తమ రొమ్మునకు అదిమి పెట్టుకుని నిద్రపోతూ వున్నారు.

ఆ స్త్రీలందరికీ ఎడంగా ఏకాంత ప్రదేశంలో సుందరమైన శయ్యపై ఒక రూపసంపన్న పడుకుని వున్నది. ఆమె మండోదరి, రావణాసురుని ప్రియభార్య. ఆ అంతఃపురేశ్వరి ముత్యాలతోను, రత్నాలతోను పొదిగిన ఆభరణాలు పెట్టుకుని వున్నది. ఆమె దేహచ్ఛాయ బంగారం మాదిరిగా వున్నది. ఆమె దేహకాంతులతో ఆ ప్రదేశమంతా తేజరిల్లుతూ వున్నది. ఆ మనోహర రూపమును హనుమంతుడు చూచినాడు. ఆ రూప యౌవన సంపన్ననే సీతాదేవి ఏమో! అనుకున్నాడు. ఆ మహానుభావునికి సంతోషం వేసింది. కపి స్వభావముతో చేతులు చరచినాడు. తోకను ముద్దు పెట్టుకున్నాడు. ఆడినాడు పాడినాడు. అటు ఇటు తిరిగినాడు. స్తంభము ఎక్కినాడు,

అక్కడి నుండి క్రిందకు దూకినాడు. ఆ వెంటనే అక్కడ పడుకుని నిద్రపోతున్న ఆమె సీతాదేవి కాదని హనుమంతుడు అనుకున్నాడు. ఆలోచించ సాగినాడు.

రాముడిని ఎడబాసిన సీతాదేవి ఇట్లా నిద్రపోదు, భోజనం చేయదు, అలంకరించుకోదు, మద్యపానము చేయదు, రాముని తప్ప మరొకరిని దేవేంద్రుడినైనా దరి చేరనీయదు. రాముడితో సరి సమానుడు దేవతలలో సహితం లేడు. ఈ పడుకున్నామె సీతాదేవి కాదు. మరొకతే అని నిశ్చయించుకున్నాడు. అంతట హనుమంతుడు ఆ ప్రదేశంలో మళ్ళీ తిరగడం మొదలు పెట్టినాడు. అక్కడ పడుకుని వున్న స్త్రీలు కొందరు రతిక్రీడలకు అలసిపోయినారు. కొందరు పాటలు పాడి డస్సిపోయినారు. కొందరు నృత్యము చేసి బడలిపోయినారు. అందరూ తప్పతాగి మైమరచిపోయినారు. అందువల్లనే మద్దెళ్ళ మీద, పీఠాలమీద, ఆస్తరణముల మీదను పడి ఒళ్ళు ఎరుగకుండా నిద్రపోతున్నారు. ఆ సుందరీమణు లందరి మధ్యన పడుకుని నిద్రపోతున్న ఆ మహాబాహువు రావణాసురుడు పెద్ద ఆవుల మధ్యన నిద్రపోతున్న ఆంబోతువలెను, మహారణ్యంలో పెంటి ఏనుగుల మధ్య నిద్రపోతున్న పోతుఏనుగు వలెను శోభాయమానంగా కనిపించాడు.

హనుమంతుడు అక్కడినుంచి కోరుకున్న సమస్త తిను బండారాలు దొరికే పానశాలల వైపుకు పోయినాడు. అక్కడ జింకల మాంసము, దున్నపోతుల మాంసము, అడవిపందుల మాంసము వేరు వేరుగా పెట్టి వున్నాయి. వెడల్పాటి బంగారు పాత్రలలో సగం సగం తిని వదిలిపెట్టిన నెమలి మాంసము, కోడి మాంసము

వున్నాయి. పెరుగుతోను, లవణంతోను అడవిపంది మాంసము, గొర్రెమాంసము, ఏదుపంది మాంసము, జింకమాంసము, పక్వము చేసిన కొక్కెరల మాంసము, సగం తిని వదలివేసిన చకోరపక్షుల మాంసము, ఒంటిముల్లు చేప మాంసము, ఇంగువ మిరియాలు వేసి వండిన మాంసము, రకరకాల లేహ్యాలు, పానీయాలు, భోజ్య పదార్థాలు, ఉప్పు పులుపు ప్రధానంగా వుండే వ్యంజనాలు, చక్కెర, తేనె, ద్రాక్ష, దానిమ్మ మొదలగు మధుర పదార్థాలు కలిపి చేసిన చక్కని పలుచని రాగషాడబాలు, పాన పాత్రలలో వుంచిన వివిధ ఫలరసాలు హనుమంతుడు చూచినాడు.

ఇట్లా హనుమంతుడు ఏ ఒక్క జీవిని వదలకుండా వెతికాడు. అక్కడ ఆహారపదార్థాలు చూసిన హనుమంతుడు మనుషులను కూడా వండుకుని తింటున్నారా అని అనుమానంగా చూశాడు. అవి అన్నీ సమర్థులైన వంటవాళ్ళు రకరకాల రుచులతో రకరకాలుగా వండి వేరే వేరే పెట్టి వుంచినారు. అవే కాకుండా సముద్ర మథనమపుడు పుట్టిన సుర వంటి నిర్మల మైనటువంటి మద్యాలు, చక్కెర ఇప్పపూలు వేసి చేసిన మద్యాలు, తేనెతో చేసిన మద్యాలు, ద్రాక్షపండ్లతో చేసిన మద్యాలు, సుగంధ పుష్పాలతోను, మధుర ఫలాలతోను చేసిన మద్యాలు సుగంధము గుబాళిస్తూ వున్నవి. అక్కడ రకరకాల వెండి పాత్రలు, స్ఫటికాల పాత్రలు, బంగారు చెంబులు, వెండి కలశాలు, బంగారు కలశాలు కన్పించినవి. శ్రేష్ఠమైన పాన ద్రవ్యాలు సమృద్ధముగా వున్నవి. మణులు పొదిగిన బంగారు పాత్రల నిండుగా మద్యాలు వున్నవి. సగము త్రాగిన మద్యపాత్రలు, నిశ్శేషముగా త్రాగిన పాత్రలు,

ఏమాత్రము త్రాగకుండా వుండిన పాత్రలు, నిండా మద్యము వున్న పాత్రలు కనిపించినాయి.

ఒకచోట ప్రత్యేకంగా మద్యపాత్రలు పెట్టి వుంచినారు. ఒకచోట వివిధ భక్ష్యాలు పెట్టి వున్నాయి. తినగా మిగిలిన అన్నం ఒకచోట, పగిలిపోయిన పాత్రలు ఒకచోట వున్నవి. ఒకచోట పూల దండలు కలసిపోయి వున్నవి. ఒకచోట జలకలశాలు కనిపించి నవి. ఒకచోట పళ్ళాలు కనిపించాయి. పాన భోజన సమయము లలో ఆయా స్త్రీలు తీసివేసిన విలువైన కంఠహారాలు, బాహు మూపురులు, కాలిఅందెలు పడివున్నవి. నేలంతటా పూలు చల్లి వున్నాయి. అవన్నీ శోభాయమానంగా కనిపించినవి. ఆ పాన శాలలో సువర్ణ రత్నమయమైన శయనాసనాలు అగ్నిహోత్ర కాంతు లతో ధగధగలాడుతూ వున్నాయి. కొన్ని శయ్యలు శూన్యముగా వున్నవి.

అక్కడ కొందరు సర్వాభరణ భూషితులైన స్త్రీలు తమ సౌందర్యం గురించి చర్చించుకుంటున్నారు. కొందరు స్త్రీలు నృత్య గీతాదుల గురించి చెప్పుకుంటున్నారు. కొందరు స్త్రీలు దేశకాలోచిత విషయాలను గురించి మాట్లాడు కుంటున్నారు. కొన్ని శయ్యలమీద స్త్రీలు ఒకరినొకరు కౌగలించుకుని నిద్ర పోతున్నారు. కొందరు వరాంగనలు నిద్రాపారవశ్యములో నిద్ర పోతున్న అన్యస్త్రీల చీరలను లాగి కట్టుకుని నిద్రపోతున్నారు. మందమారుతానికి వలె వారి ఉచ్ఛ్వాస నిశ్వాసలవల్ల వారి వారి చీరలు, మెడలో వేసుకున్న దండలు చిత్ర విచిత్రముగా ఎగురుతూ వున్నవి. అక్కడ మధురమైన మద్యపు వాసనలతోనూ, చందనపు

వాసనలతోనూ, వివిధములైన పూల వాసనలతోనూ, నానావిధ ధూప వాసనలతోను గాలి వివిధ సుగంధాలతో చల్లగా, హాయిగా వీస్తూ వున్నది. షడ్రసాల సుగంధమూ, చందనాదుల సుగంధమూ, అగరు ధూప సుగంధమూ అప్పుడు ఆ విమాన గృహము అంతటా వ్యాపిస్తున్నది.

ఆ అంతఃపురములో అట్లా పడుకుని నిద్రపోతున్న స్త్రీలు కొందరు శ్యామ వర్ణంతో కనిపించినారు. కొందరు నల్లగాను, కొందరు బంగారు రంగుతోను కనిపించినారు. వారందరూ మదన వ్యాయామంలో అలసిపోయి నిద్రా పరవశులైనారు. అట్లా నిద్ర పోతున్న వరాంగన లందరూ ముకుళించుకుపోతున్న పద్మాలవలె కనిపించినారు.

ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఆ అంతఃపురములో ఏ ఒక్క ప్రదేశమును వదిలిపెట్టకుండా, ఏ ఒక్క మనిషిని వదిలి పెట్టకుండా అంతా చూసినాడు. కానీ సీతాదేవి మాత్రం ఆ బుద్ధిమంతునికి కనిపించలేదు. ఆ మహా తేజోవంతుడు అక్కడ అంతమంది స్త్రీలను చూస్తూ తాను ధర్మహాని చేస్తున్నానేమో అని సందేహ పడ్డాడు. పరాయివాడి అంతఃపురాంగన లందరూ నిద్ర పోతుండగా తానట్లా చూడడం ధర్మలోపం అవుతుందేమో అనుకున్నాడు. రావణాసురుడు ఎత్తుకువచ్చిన పరస్త్రీలందరినీ చూచినాను, కానీ ఆ స్త్రీలను అనుభవించవలెననే ఆసక్తితో నేను వారిని చూడలేదు.

లంకలో హనుమంతుడు తిండి, భోగం, స్త్రీలు ఇన్ని రకాల

సన్నివేశాలు చూశాడు, కానీ ఏ మాత్రము చలించలేదు. స్త్రీ పురుషుని అనుభవించాలని కానీ, పురుషుడు స్త్రీని అనుభవించాలని దృష్టితో కానీ చూస్తే అది ధర్మలోపం అవుతుంది. కానీ కేవలం చూడటం కోసమే చూస్తే ధర్మలోపం అవదు. మరి ఆడవాళ్ళున్న చోటనే సీతాదేవిని చూడాలి కదా! అంతమంది ఆడవాళ్ళను చూసినా ఆయనలో ఏ వికారాలు కలుగలేదు.

ఆ బుద్ధిమంతుడు హనుమంతుడు అచంచల మనస్కుడు. సీతాదేవిని చూడవలెనన్న ఒకే ఒక్క మనో నిశ్చయంతో అట్లా తిరిగి చూచినాడు. తాను చేయవలసిన పనిగురించి ఆలోచించినాడు. తానట్లా చేయడమే ధర్మ మనుకున్నాడు. పరపురుష లెవ్వరూ రాలేరను నమ్మకంతో రావణాసురుడి స్త్రీలందరూ విచ్చలవిడిగా నిద్ర పోతున్నారు. వారినందరినీ నేను చక్కగా చూసినాను. నాకు ఏ కొంచెము మనోవికారము కలుగలేదు. శుభాశుభ స్థితులలో ఇంద్రియాల ప్రవర్తనకు మనస్సే కారణము. మనసును బట్టి దేహేంద్రియాలు ప్రవర్తిస్తూంటాయి. నా మనస్సు వ్యవస్థ తప్పలేదు.

స్త్రీలలోనే స్త్రీలు వుంటారు. స్త్రీలు లేనిచోట నేను సీతాదేవిని వెతికితే ప్రయోజనం లేదు. అందువల్ల స్త్రీలు వుండేచోట నేను జాగ్రత్తగా వెతకవలెను. ఏ జాతి జంతువును ఆ జాతిలోనే వెతకడం ధర్మం. ఒక స్త్రీని సజాతీయులైన స్త్రీల లోనే వెతకాలి కానీ మృగాలలో వెతకటం నిరర్థకం. పరిశుద్ధమైన మనసుతో నేను రావణాసురుడి అంతఃపురమంతా వెతికినాను. అక్కడ దేవతాస్త్రీలు,

గంధర్వాంగనలు, నాగ కన్యలు కనిపించారు కానీ, సీతాదేవి మాత్రము కనిపించలేదు అనుకుంటూ అంతఃపురములోని తక్కిన స్త్రీలందరినీ పరిశీలించి వెనక్కి తిరిగి మళ్ళీ అంతఃపురమంతా వెదకడం మొదలు పెట్టాడు.

సీతాదేవిని చూడవలెనను ఉత్సాహంతో హనుమంతుడు ఆ భవనం మధ్యనున్న లతా గృహాలలోకి, చిత్రశాలా గృహాలలోకి, నిశా గృహాలలోకి పోయినాడు. అవన్నీ వెదకి చూసినాడు. అక్కడ ఎక్కడనూ ఆ శుభరతి రాముడి ప్రాణప్రియ సీతాదేవి కనిపించ లేదు. ఆలోచించ సాగినాడు. ఆ మైథిలి చనిపోయైనా వుంటుంది, లేదా ఏ గహన ప్రదేశంలోనైనా వుంటుంది అని హనుమంతుడు అనుకున్నాడు. వీడు ఈ రావణాసురుడు దుష్టకర్ముడు, ఏ చెడు పనైనా చేయగలడు. ఆ జనకాత్మజ సత్పథము తప్పి వుండదు. స్వశీల సంరక్షణాచిత్తయై వుంటుంది. అందువల్ల వీడు, ఈ రావణాసురుడు ఆమెను చంపివేసి వుంటాడు లేదా ఆ జనకరాజ పుత్రి ఈ రావణాసురుడి పనికత్తెలను, వారి వికారాకారాలను, వికృత వేషాలను, భయంకర నేత్రాలను, వికృత ముఖాలను చూసి భయపడి ప్రాణాలు విడిచి వుంటుంది.

సుగ్రీవుడు చండశాసనుడు, మహా బలవంతుడు. వానరు లందరూ కిష్కింధకు పోవటానికి అతడు పెట్టిన గడువు కాలం ఎప్పుడో అయిపోయింది. నాకు సీతాదేవి కనిపించలేదు. నేను వచ్చిన పనిని సాధించలేక పోయాను. ఇక అతని దగ్గరకు పోయే ప్రాప్తం నాకు లేదు. ఈ రావణాసురుని అంతఃపురమంతా వెతికినాను, వీడి స్త్రీలందరినీ చూసినాను. ఆ సాధ్వి సీతాదేవి

మాత్రం నాకు అగుపించలేదు. నా శ్రమంతా వృథా అయి పోయినది. నేను తిరిగిపోగానే వానరులందరూ నా చుట్టూ మూగుతారు. ఓ హనుమంతుడా నీవు పరాక్రమవంతుడవు. లంకా పట్టణానికి పోయినావు, ఏమి చేసినావో చెప్పు అని అడుగుతారు. నేను ఆ జనకాత్మజను చూడకుండా వారికి చెప్పగలిగేదేమిటి? ఈ కాలాతిక్రమమునకు వారందరూ ప్రాయోపవేశము చేయుట కన్న గత్యంతరము లేదు.

నేను సీతాదేవిని చూడకుండా పోయేటట్లయితే నన్ను చూచి జాంబవంతుడు ముసలివాడు ఏమడుగుతాడో? యువరాజు అంగదుడు నన్ను చూచి ఏమంటాడో? వానరు లందరూ సముద్రం దాటి వచ్చిన నన్ను చూసి ఏమేమి ప్రశ్నలేస్తారో! అందరూ నన్ను పనికిమాలినవాడు అని నిందిస్తారు. అయినా నేనిలా నిరుత్సాహ పడిపోయినందువల్ల ప్రయోజన మేమున్నది?

ఉత్సాహమే సర్వసంపదలకూ మూలము,
ఉత్సాహమే సర్వశుభాలకూ మూలము,
ఉత్సాహమే సర్వ కార్యాలకూ మూలము.

ఉత్సాహము వల్లనే ఏ పనైనా సమకూరుతుంది. ఏ ప్రాణి చేసే పనైనా ఉత్సాహంవల్లనే సఫల మవుతుంది. ఉత్సాహమే ఉత్తమోత్తమమైన శక్తి. ఇపుడు ఉత్సాహంతో మళ్ళీ వెతకడమే నా కర్తవ్యం. ఇదివరకు వెదకని ప్రదేశాలు, వెదకిన ప్రదేశాలు మళ్ళీ వెదకి చూస్తాను. ఇదివరకు వెదకిన పానశాలలు, పుష్పగృహాలు, క్రీడా శాలలూ, ఈ భవనోద్యాన వనాలమధ్య వున్న వీధులూ,

ఇంకా నేను వెతకని ప్రదేశాలు వెదకడమే నా కర్తవ్యం అని హనుమంతుడు అనుకున్నాడు..

ఇది చాలా అద్భుతమైన విషయం. మనిషి ఎట్టి పరిస్థితుల లోనూ ఉత్సాహం మాత్రం పోగొట్టుకోకూడదు. హనుమంతుడు తనకు తానే ఉత్సాహం తెచ్చుకున్నాడు. ఉత్సాహంగా కర్తవ్యం మొదలుపెట్టి చేస్తూంటే క్రుంగుదల వుండదు. కర్తవ్యం నిర్వర్తించక ఊరికే సమస్య గురించి ఆలోచిస్తూంటే నిరుత్సాహము బాగా వచ్చేస్తుంది. ఆ బుద్ధిమంతుడు హనుమంతుడు ఆయా ప్రదేశా లన్నీ మళ్ళీ వెదకడం మొదలు పెట్టినాడు.

# 5

హనుమంతుని మనసు దుఃఖముతో కొట్టుకులాడింది. ఆలోచించసాగాడు. ఎన్నిసార్లు వెదకినా ఏమీ కనిపించలేదు. ఆ విమాన గృహ ప్రాకారం మీదకి వచ్చిన ఆ వేగవంతుడు హనుమంతుడు మేఘము మధ్యన మెఱపువలె తేజరిల్లినాడు. ఆ కపివర్ణుడికి అంతఃపురంలో సీతాదేవి కనిపించలేదు. ఆలోచించ సాగాడు. "లంకా పట్టణమంతా ఎంతో గాలించాను. ఆ వైదేహి, ఆ సర్వాంగసుందరి సీతాదేవి కనిపించలేదు. ఈ లంకలో వున్న పర్వతాలు, తటాకాలు, సరస్సులు, సెలయేళ్ళు, నదులు, బురదతో వున్న అడవులు, ముఖ్యపర్వతాలు అన్నీ కలియతిరిగినా సీతాదేవి కనిపించలేదు. ఆ వృద్ధరాజు సంపాతి ఇక్కడ రావణాసురుని ఇంట్లో సీతాదేవి వున్నదని చెప్పినాడు. కాని, ఆమె కనిపించలేదు.

పరమభాగవతులకు ఉనికిపట్టు అయిన విదేహ దేశములో, అందులో సత్పురుషులు నివసించే మిథిలా పట్టణంలో ఆమె పుట్టినది. జనక మహారాజు కూతురిగా దుష్టాచారుడైన రావణా సురుడికి వశం అవుతుందా! రావణాసురుడు ఆమెను తీసుకుని వచ్చేటపుడు వెనక నుంచి రామబాణాలు వచ్చి పడతాయేమో అనే భయంతో అమిత వేగముతో ఎగిరి వస్తుంటే ఆమె మధ్యలో జారి

పడిపోయిందేమో! అట్లా కాకపోయినట్లయితే సిద్ధులు సంచారము చేసే ఆకాశ మార్గాన రావణాసురుడు ఆమెను ఎత్తుకుని వస్తూంటే క్రింద సముద్రాన్ని చూచి గుండె చెదిరి ఆమె పడిపోయిందేమో! రావణాసురుడు అమిత వేగముతో వస్తుంటే వాడి భుజాల ఒత్తిడికి ఆ విశాలాక్షి ప్రాణము వదిలిందేమో! వాడు సముద్రం మీద అట్లా వస్తుంటే ఆ జనకాత్మజ పెనగులాడి సముద్రంలోకి జారి పడిపోయిందేమో! అయ్యో ఆమె తన శీలాన్ని కాపాడుకుంటూ వుంటే ఈ క్షుద్రుడు రావణాసురుడు దిక్కులేని ఆమెను, ఆ దీనురాలను భక్షించి వేసినాడేమో! అట్లా కాకపోయినట్లయితే ఆ హసితేక్షణ సీతాదేవిని ఈ రావణాసురుడి భార్యలు దుష్ట మృగాలు అయి కబళించి వేసినారేమో లేక ఆ ఘోరుచందాన ఆ పద్మపత్రాక్షి సీతాదేవి రామ వదనారవిందాన్ని ధ్యానం చేస్తూ దీనురాలై పంచత్వం పొందినదేమో (అంటే శరీరం వదిలేసిందేమో) లేక హా రామా! హా లక్ష్మణా! హా అయోధ్యా ! అని ఏడ్చి ఏడ్చి ఆ వైదేహి, ఆ మైథిలి, సీతాదేవి ప్రాణమును వదిలి పెట్టిందేమో!

అట్లా కాకపోయినట్లయితే రావణాసురుడి ఇంట్లోనే పంజరంలో పెట్టిన గోరువంక వలె ఏ నేలమాళిగలోనైనా ఏడుస్తూందేమో! ఆ జనకరాజు కూతురు, రాముడి భార్య, ఆ సుమధ్యమ, ఉత్తమ పత్రాక్షి సీతాదేవి రావణాసురుడికి వశమవుతుందా? ఆ జనకాత్మజను, రాముడి ప్రియభార్యను దాచివుంచినా, ఒక వేళ ఆమె సముద్రంలో పడిపోయినా, ఆమె చచ్చిపోయినా, నేను ఆ విషయం రాముడికి చెప్పకూడదు. అయ్యో ! చెప్పకపోయినా దోషమే, చెప్పినా దోషమే. చెప్పినట్లయితే అతను చచ్చిపోతాడు, ఆ

దోషము నన్ను బాధిస్తుంది. ఇక నేనేమి చేయవలెను? ఒకదాని కొకటి విరుద్ధంగా నున్నవే? ఈ పనిట్లా అయిపోయింది. ఈ స్థితి గతులలో ఉపాయమేమిటి?" అని విచారముతో హనుమంతుడు ఆలోచించసాగినాడు.

"నేను సీతాదేవిని చూడకుండా ఇక్కడినుంచి కిష్కింధా నగరానికి పోయినట్లయితే నేను సాధించుకు పోయిన దేమిటి? ఈ సముద్ర లంఘనము, ఈ లంకాపట్టణమంతా వెతకటము, ఈ రాక్షసగృహాల నన్నిటినీ పరిశీలించడం ప్రయోజనము మాలిన పనులవుతాయి. సీతాదేవి కనబడలేదనే కర్ణకఠోరము, దారుణము, క్రూరము, తీక్షణము, పరమ అప్రియము అయిన ఆ మాట చెప్పగానే రాముడి దేహేంద్రియాలు తపించిపోతాయి. అతను ప్రాణాలను వదులుతాడు. ఆ రాముడి మీద అమిత స్నేహంతో నున్న లక్ష్మణుడు రాముడు పోయిన తరువాత బ్రతికి వుండడు. ప్రాణాలు వదులుతాడు. రామ లక్ష్మణులు చనిపోయారని తెలియ గానే భరతుడు చనిపోతాడు. భరతుడు చనిపోయిన వార్త తరువాత శత్రుఘ్నుడు బ్రతికివుండటం వుత్తది. నలుగురు కొడుకులూ చనిపోయిన తరువాత వారి తల్లులు కౌసల్య సుమిత్ర కైకేయి దేవులునూ చనిపోతారు. సందేహం లేదు.

సుగ్రీవుడు కృతజ్ఞుడు, సత్యసంధుడు. రాముడు చనిపోవడం చూసి అతడు ప్రాణాలను వదులుతాడు. భర్త శోకంతో బాధ పడుతూ మనసంతా పాడైపోయి రుమ ప్రాణాలను వదులుతుంది. వాలి పోయిన దుఃఖంతో తార ఇప్పటికే కృశించి పోయింది. ఇక రాజైన సుగ్రీవుడు పోయిన తర్వాత ఆమె బ్రతకదు. తల్లితండ్రులు

పోయిన దుఃఖంతో, సుగ్రీవుడు పోయిన దుఃఖంతో అంగదుడు చచ్చిపోతాడు. రాజు చచ్చిపోయిన తర్వాత వానరులందరూ అరచేతులతోను, పిడికిళ్ళతోను నెత్తి బాదుకుని ఏడుస్తారు. సుగ్రీవుడు వారు కోరిన కోర్కెలన్నీ చెల్లిస్తూ, పెద్దల నందరినీ గౌరవిస్తూ, చిన్న వాళ్ళందరినీ బుజ్జగిస్తూ వుండేవాడు. అటువంటి సుగ్రీవుడు చనిపోయిన తర్వాత వానరులు జీవించరు. వానరు లందరూ కలసి మెలసి వనాలలోను, పర్వతాలమీద, వారి వారి ఇండ్లల్లో క్రీడించటం అనేది ఇకమీదట వుండదు. రాజు పోయినా డన్న దుఃఖంతో మంత్రులందరూ చనిపోతారు. వానరులందరూ ఆలుబిడ్డలతో పర్వత శిఖరాలమీంచి నేలమీదకు దూకి చనిపోతారు. ఇట్లా కాకపోయినట్లయితే విషము పుచ్చుకునైనా, ఉరి పోసుకునైనా, మండుతూన్న నిప్పులలోకి దూకి అయినా, ఉపవాసాలు చేసి అయినా, ఆయుధాలతో పొడుచుకుని అయినా చచ్చిపోతారు."

ఇక ఒక్కరూ జీవించి వుండరు. అందరూ చనిపోతారు. ఒక chain లాగా వచ్చేసిందన్న మాట భావన. మనక్కూడా ఒకసారి ఏదైనా భావన వస్తే అది అలా పట్టుకు పోతూంటుంది. అదేమిటి ఇలా వచ్చేస్తోంది! అని ఆలోచిస్తూంటే ఆశ్చర్యం వేస్తుంది, ఆపలేం కదా!

"నేను కిష్కింధకు పోవటంతో ఇక్ష్వాకువంశం అంతా నాశనం అయిపోతుంది. ఘోరరోదన ఆరంభం అవుతుంది. వానరులు ఎవరూ జీవించరు. అందువలన నేను కిష్కింధకు పోను. సీతాదేవిని చూడకుండా సుగ్రీవుడి దర్శనం చేయను. నేనిక్కడనే వుండిపోయి నట్లయితే ఆ ధర్మాత్ములు, ఆ మహారథులు రామ

లక్ష్మణులు నేను సీతాదేవిని వెదికి వస్తాననే ఆశతో జీవించి వుంటారు. వానరులందరూ బ్రతికి వుంటారు. ఇక నాకు ఇక్కడ ఆ జనకాత్మజ కనపడక పోయినట్లయితే నేను వానప్రస్థుడనై ఏ చెట్టు క్రిందనైనా కూర్చుని చేతికి అందింది, నోటికి అందింది తింటూ కాలక్షేపం చేయటమే కర్తవ్యం లేదా కందమూల ఫలాలు బహుళంగా దొరికే సముద్ర ప్రాంత ప్రదేశంలో చితి పేర్చుకుని అగ్నిహోత్రుడికి హారతి అయిపోవాలి. అట్లా కాకపోయినట్లయితే ఉపవాస వ్రతం ఆరంభించి ప్రాణాలు త్యజించాలి. నా దేహాన్ని అపుడు కుక్కలు, కాకులు తింటాయి. మహర్షులు ఇటువంటి మరణాన్ని అంగీకరించారు. నేను ఇట్లా చేస్తాను, జానకి కనపడక పోయినట్లయితే సముద్ర జలాల్లో దూకి ప్రాణాలను వదిలేస్తాను.

ఈ రాత్రి మంగళకరంగా ఆరంభమయింది కదా, పూర్ణ కాంతులతో పూర్ణచంద్రుడు కనిపించినాడు, శుభంగా వుంది, బాగుంటుంది మనకి, అంతా మంచి జరుగుతుంది అనుకున్నాడు, అది మళ్ళీ గుర్తు వచ్చింది. వెలుగు అంతకన్నా మనోహరంగా తోడయింది. కీర్తిమాల నా మెడలో పడుతుంది అనుకున్నాను కాని సీతాదేవి కనిపించలేదు. ఇంత రాత్రీ నిరర్ధక మైపోయింది. కాబట్టి నేను తిరిగిపోను. నియమబద్ధుడనై ఏ చెట్టు కిందైనా తపస్సు చేస్తాను. ఆ హసితేక్షణను సీతాదేవిని చూడకుండా ఇక్కడి నుండి పోయి అంగదుడిని, వానరులను కలుసుకోను. నేను పోయి వారిని చూచినట్లయితే వాళ్లందరూ ప్రాయోపవేశం చేసి చచ్చిపోతారు.

చచ్చిపోవటం వల్ల అనేక దోషాలు వస్తాయి. జీవించి వుంటే ఎప్పటికైనా శుభ ఫలాలు సంప్రాప్తం అవుతాయి. అందువల్ల

జీవించి వుండవలెను.” మనమూ అంతే కదా, కష్టాలు వచ్చినపుడు ఇక చచ్చిపోతే పీడా వదిలిపోతుంది అనిపిస్తుంది. చచ్చిపోయి సాధించేదేమీ లేదు. బ్రతికుంటే ఎప్పటికైనా శుభాలు వస్తాయి. కాబట్టి ఎప్పుడూ అశుభాలే వుండవు, శుభాలు కలుగుతాయి అనేటటువంటి భావంతో జీవించి వుండటమే మంచిది అని మరో ధర్మం రామాయణం చెపుతోంది.

“ఈ మహా బలవంతుడు దశగ్రీవుని చంపివేస్తాను. సీతాదేవి కనపడితే కనపడుతుంది లేకపోతే లేదు. వీడు చేసిన పనికి నేను బదులు చేసినట్లయినా అవుతుంది. అలా కాదు, వీడిని, ఈ రావణాసురుడిని సముద్రము మీదుగా ఎత్తుకునిపోయి పశువును పశుపతికి సమర్పించినట్లుగా వీడిని రాముడికి సమర్పిస్తాను, ఆ యశస్విని రామపత్ని సీతాదేవి కనపడేంత వరకూ ఈ లంకా పట్టణంలో పదే పదే వెతుకుతాను.” మళ్ళీ ఆ భావం పోయింది, మళ్ళీ వెతుకుదాం అనుకున్నాడు.

“నేను అపుడు సంపాతి చెప్పిన మాటలను బట్టి పోయి రాముడిని తీసుకు వచ్చినట్లయితే ఏమయివుండేదో!” ‘అక్కడుంది సీతాదేవి’ అని సంపాతి చెప్పాడు కాబట్టి, అక్కడ వుండే వుంటుందిలే అని రాముడిని పట్టుకు వచ్చేస్తే ఎట్లా వుండేదో అని అనుకున్నాడు. “అసలు భార్య కనపడక దుఃఖ పరవశుడై పోయేవాడు, అతనికి కోపం వచ్చి వానరులందరినీ బాణాలతో దహించి వేసేవాడు. అపుడు అట్లా చేయకపోవటమే మంచి దయింది. నా వలన నరులు గాని, వానరులు గానీ చచ్చి

పోకూడదు. నేను నియమితాహారంతో జితేంద్రియుడనై ఇక్కడనే వుండిపోతా.

అదిగో మహోన్నత వృక్షాలతో కనపడుతోంది అశోకవనం. నేను ఈ వనము ఇదివరకు వెతకలేదు. ఇపుడు ఈ వనము వెతుకుతాను. అష్ట వసువులకు, ఏకాదశ రుద్రులకు, ద్వాదశా దిత్యులకు, సప్త మరుత్తులకు నమస్కారం చేస్తున్నాను, 33కోట్ల దేవతలకూ నమస్కారం చేస్తున్నాను, ఎందుకంటే అంతా వెతికాను, చివరగా ఇదొక్కటే మిగిలివున్నది. ఇదే ఆఖరి అవకాశం. ఈసారి రాక్షసులందరినీ దుఃఖాల పాలు చేస్తాను. వీరందరినీ జయిం చేస్తాను. తపస్వికి తపస్విని వలె, ఇక్ష్వాకు రాముడికి ఇక్ష్వాకు కుల పావని సీతాదేవిని సమర్పిస్తాను" అనుకుంటూ ఆ మహా తేజోవంతుడు మారుతాత్మజుడు ఒక ముహూర్తం సేపు ఆలోచించి నాడు. అతనికి దుఃఖ మంతరించినది. ఇంద్రియ వ్యాకుల ముడిగి పోయినది.

"రామలక్ష్మణులకు నమస్కారము, జనకాత్మజ సీతాదేవికి నమస్కారము, రుద్రునికి నమస్కారము, ఇంద్రునకు నమస్కారము, యముడికి నమస్కారము, అగ్నిహోత్రునికి నమస్కారము, సూర్య చంద్రాదులకు, మరుత్త గణాలకు నమస్కారము– అంతట సుగ్రీవు నకు నమస్కారము చెప్పినాడు. దశ దిశలు తేరిపార చూచినాడు.

రాముడు, లక్ష్మణుడు అంటే దైవము, కాలము అని అర్థం. రోజూ దైవానికి, కాలానికి దణ్ణం పెట్టుకోవాలి. సీతాదేవి అంటే ప్రకృతి. ప్రకృతికి రోజూ దణ్ణం పెట్టుకోవాలి. రుద్రునికి, ఇంద్రు

నకు, యముడికి దణ్ణం పెట్టుకోవాలి. ఇంద్రునికి దణ్ణం పెట్టడం అంటే, తూర్పు తిరిగి దణ్ణం పెట్టుకోవాలి. అలాగే యముడికి దక్షిణానికి తిరిగి, అగ్నిహోత్రునికి ఆగ్నేయ దిక్కుకు తిరిగి, మరుత్త గణాలకు వాయవ్య దిశగా చూస్తూ దణ్ణం పెట్టుకోవాలి. సూర్య చంద్రాదులకు దణ్ణం పెట్టుకోవాలి. ఇవన్నీ మనకి సంధ్యావందనంలో ఇచ్చారు. వీరందరికే కాక ఎవరైతే ఈ కార్యం మీద తనను నియమించారో అతనికి కూడా దణ్ణం పెట్టుకోవాలి. ఎందుకంటే మనల్ని పరిపాలించేవారి రూపంలో విష్ణువుంటాడు. అందుకని సుగ్రీవుడికి దణ్ణం పెట్టుకున్నాడు. ఇంతమందికీ దణ్ణం పెట్టి అశోకవనం వైపునకు బయల్దేరాడు.

ఒక సంకటంతో కూడినటువంటి కార్యము, కష్టంతో కూడినటువంటి కార్యము జరిగేటపుడు మనం దేవతలందరినీ తప్పక అనుకూలింప చేసుకోవాలి. కొంత క్లిష్ట పరిస్థితులు తొలగుతున్న కొలదీ దేవతలకు బాగా దణ్ణం పెట్టుకోవడం జరగాలి. ఎందుకంటే, దేవతల యొక్క సహకారం వున్నట్లయితే, పని సానుకూలం అవుతుంది. సద్గురువే ఆ విధంగా దేవతలను ఆరాధన చేస్తున్నపుడు మనమెంతటి వాళ్ళం!? అందుచేత సద్గురువు దేవతారాధన కూడా నేర్పుతాడు. ఎందుకంటే, దేవతా రాధన బాగా నేర్చుకుంటే, ఆ ఆరాధన కారణంగా అందులో వుండే భక్తి శ్రద్ధలు అనుసరించి మనకు దేవతలు అనుకూలిస్తే, మనము చేసే కార్యాలు సఫల మవుతాయి. అలా కాకపోతే సఫలం కావు. హనుమంతుడు తాను జ్ఞానవంతుడైనప్పటికీ, ఆత్మవంతుడైనప్పటికీ ఈ విధమైన ప్రవర్తనను ప్రదర్శించాడు. కాబట్టి మనకు కూడా అదే

మార్గదర్శకత్వం. దాన్ని మనం కూడా అనుసరించడానికి ప్రయత్నం చేయాలి.

సద్గురువులు సత్యదర్శులైనప్పటికీ, జ్ఞానులైనప్పటికీ కూడా దేవతలందరినీ కార్యానుకూలతకోసం ప్రార్థన చేయడం వారి దైనందిన జీవితంలో గమనిస్తాం. మనం కూడా ఆ విధంగా దైవ ప్రార్థన చేయడం చాలా ముఖ్యం. ప్రతి నిత్యమూ సూర్యచంద్రులకు, అగ్నికి, ఆ పైన రామునకు అంటే దైవమునకు, లక్ష్మణునకు అంటే కాలమునకు, సీతాదేవికి అంటే ప్రకృతికీ, అటుపైన రుద్రునకు ప్రార్థన చేయాలి. రుద్రుడు మనలో ప్రాణశక్తిని పెంచే తత్త్వము కలవాడు. రుద్రుడే మనలను మృత్యుముఖం నుండి రక్షించి, బంధము విడదీసి, మృత్యువుతో మనకుండే ముడి విడదీసి అమృతత్త్వముతో మనకుండే సంబంధము విడదీయక ఉంచుతాడు. అదే మనం జపించే మృత్యుంజయ మంత్రం. జీవుడు మృత్యువుతో ముడి వేయబడతాడు. అమృతత్త్వముతో సహజంగా కలిసి వచ్చాడు. కనుక అమృతత్త్వము నుండి విడదీయకు, మృతత్త్వము నుండి నన్ను విడదీయుము అని కోరే మంత్రము. "మృత్యోర్ముక్షీయమా అమృతాత్" అనాలి. మామృతాత్ అనకూడదు. మా అమృతాత్ రెండూ పక్కపక్కనే ఉంటాయి. సరిగ్గా పలకకపోతే ఒకదానికొకటి అయిపోతుంది.

కుంభకర్ణుడు ఇంద్రాసనం అని అడగబోయి నాలుక తడబడి నిద్రాసనం కోరడంవల్ల "నిద్ర" ఇచ్చేశాడు బ్రహ్మదేవుడు. అందుకని మనం పలికే విషయంలో ఉండే భావాన్ని సరిగ్గా అవగాహన చేసుకొని పలకాలి. అలా పలకకపోతే మనం

మంత్రాలను ఎంత గొప్పగా చదివినప్పటికీ తిరిగి వచ్చి మనకి తగులుతుంటాయి. హనుమంతుడు సద్గురువు, జ్ఞాని. వేదములు తెలిసినవాడు. సూక్ష్మశరీరము కలిగినవాడు. దూరదృష్టి కలవాడు. అష్ట సిద్ధులూ కలిగినవాడు, యోగులలో ఉత్తముడు. అటువంటి వాడు కూడా దైవారాధన చేశాడూ అంటే మనం దాన్ని అలక్ష్యం చేయడం, నిర్లక్ష్యం చేయడం కేవలం మన ఆలసత్వం, మనలో ఉండే తమస్సు కారణమని తెలియాలి తప్ప అదేదో గొప్పతనమని అనుకోవడం పొరపాటు.

అందుచేత ఇంత వెతికినా కూడా కార్యసిద్ధి కలుగకపోయే సరికి వీరందరినీ ఒక్కసారి ప్రార్థిస్తాడు. స్మరిస్తాడు. స్మరించగానే అశోకవనంలో ప్రవేశించాలనే సంకల్పం కలుగుతుంది. ఆ సంకల్పం ఆధారంగా అశోకవనానికి బయలుదేరుతాడు.

ఇంతకు ముందు దేవతలను ప్రార్థించాడు. ఇప్పుడు మహర్షులను కూడా ప్రార్థిస్తున్నాడు. మనం కూడా ప్రతినిత్యం ఒక్కసారి సప్తర్షులను భావన చేయాలి. ధ్రువుణ్ణి, సనక సనంద నాదులను, గురు పరంపరను ఒక్కసారి భావన చేయాలి. ఇవన్నీ మనం ప్రతినిత్యం చేస్తుండాలి. దిక్కులను, దిక్కుల అధి దేవతలను ఒక్కసారి గుర్తు తెచ్చుకుని దణ్ణం పెట్టుకుంటూ ఉండాలి.

ఆ మహావనంలో అనేక అవాంతర ఉద్యానవనము లున్నవి. ఆ మహావనము ఉదయిస్తున్న సూర్యకాంతితో తేజరిల్లుతూ వుంది. వివిధ వృక్షాలు పూలతోను, పండ్లతోను వున్నవి. అక్కడ మదించిన కోకిలలు కుహూకుహూ నాదాలు చేస్తూ, తుమ్మెదలు ఝుంకారం

చేస్తూ, నెమళ్ళు మత్తెక్కి కేకలు వేస్తూ వుంటాయి. ఏయే జంతువులు, ఏయే కాలాలలో ఉత్సాహాతిరేకంతో వుంటాయో ఆ అశోకవనంలో ఆయా జంతువులన్నీ ఆయా కాలభేదం లేకుండా అన్ని కాలాల్లోనూ ఉత్సాహాతిరేకంతో వుంటూ వున్నవి. అక్కడి మహావనంలో ఆ వరారోహను, ఆ అనిందితను సీతాదేవిని హనుమంతుడు వెదకడం మొదలుపెట్టి ఆ చెట్టు మీద నుండి ఈ చెట్టు మీదికి, ఈ చెట్టు మీదినుంచి ఆ చెట్టు మీదికి దూకుతూ వుంటే ఆ చెట్లన్నీ కదిలిపోయాయి. వాటిమీద హాయిగా నిద్రపోతున్న పక్షులన్నీ మేల్కొన్నాయి. భయపడిపోయి, రెక్క లల్లాడించుకుంటూ ఆ పక్షుల గుంపులు ఆ చెట్లమీద నుండి యెగిరిపోతూ వుంటే వాటి రెక్కల తాకిడికి ఆ చెట్ల నుంచి రకరకాల, రంగురంగుల పూలతో అక్కడి భూమి సింగారించుకున్న సుందరాంగి వలె శోభించింది.

ఆ మహాబలవంతుడు హనుమంతుడు తన బలమంతటి తోనూ కదిలించటంవల్ల పూలు, ఆకులు, మొగ్గలు రాలిపోయి పందెంలో ఓడిపోయిన జూదగాడు తన బట్టలు, ఆభరణాలు క్రింద పెట్టినట్లుగా కనిపించింది. హనుమంతుడు ఊగించిన ఊపుకు పెద్దగాలికి పూలు, ఆకులు, మొగ్గలు రాలిపోయి, పక్షుల గుంపులన్నీ యెగిరిపోయి ఆ చెట్ల బోదెలు మాత్రమే మిగిలినవి.

అట్లా హనుమంతుడు తన తోకను ఒక్కొక్క చెట్టుకు చుట్టి తన కాళ్ళతో ఆ చెట్టును తన్నిపెట్టి రెండుచేతులతోనూ ఆ చెట్టును ఊగిస్తూ వుంటే విడిపడిపోయిన తలవెంట్రుకలతోను, ఆలింగ నాదుల వలన రాలిపోయిన చందనాది మైపూతలతోను, అధరపానం

వల్ల తెల్లబడిపోయిన పెదవులతోను, పూలమొగ్గలవంటి దంతాలతోను, గోళ్ళ నొక్కులు, పళ్ళకొరుకుడు వల్లను పడిన గాట్ల తోను, సంభోగశాంతయైన స్త్రీ వలె ఆ అశోకవనం కనిపించింది. వర్షాకాలంలో వింధ్యపర్వతం మీద మేఘసమూహాలను వాయు దేవుడు చెల్లాచెదరు చేసివేసినట్లు అప్పుడా అశోకవనంలో పూలతీగలన్నింటినీ హనుమంతుడు చిందర వందర చేసినాడు.

ఇలా హనుమంతుడు అశోకవనమంతా కలయ తిరుగుతాడు. అలా కలయతిరిగిన తరువాత అక్కడున్న యెన్నో వనాలను, తటాకాలను, ఎత్తైన ప్రదేశాలను, వనాలలోని పెద్ద పెద్ద రాజప్రాసాదాలను చూస్తాడు. అలా చూచిన ఇంత వనంలోను ఒక పెద్ద కొండ వుంది. ఆ కొండమీద ఒక ఇరుగుడు చెట్టు వుంది. ఆ ఇరుగుడు చెట్టునే 'శింశుపా వృక్షము' అంటారు. దానిమీద ఎక్కి చూస్తే మొత్తమంతా కనిపిస్తుంది. చెట్టు ఎక్కి చూడనవసరం లేదు అన్న భావనతోనే ఆ ఇరుగుడు చెట్టు ఎక్కి కూర్చుంటాడు. అది చాలా పూలతో నిండివుండటం చేత పూలు, ఆకులు, కొమ్మల మధ్యన తేజరిల్లితూ తన శరీరాన్ని మరగుపరచి, అక్కడే కూర్చొని సీతాదేవి ఎక్కడవుందో చూద్దామని నిర్ణయం చేసుకొని ఈ విధంగా అనుకుంటాడు. ఈ చెట్టుమీద కూర్చునే సీతాదేవి ఎక్కడవుందో కనిపెడతాను. ఆ దుఃఖార్త సీతాదేవి రామ దర్శనాయత్త చిత్తంతో వియోగంతో అటూ యిటూ తిరుగుతూ యాదృచ్ఛికంగా ఇటు రావచ్చు. ఆ దురాత్ముడి ఈ అశోకవనం మహా రమణీయంగా వున్నది. సంపంగి, చందనము, పొగడచెట్లు యెంతో శోభాయ మానంగా వున్నవి. ఈ తామరకొలను మనోహరముగా వున్నది.

మధురగానము చేసే పక్షుల గుంపులు యిక్కడ అశేషముగా వున్నవి. రామమహిషి, రాముని ప్రియురాలు, ఆ పతివ్రత, ఆ జానకి వనసంచార కుశల, ఆ రమామణి రామమణి తప్పకుండా ఇక్కడికి వస్తుంది. రామవియోగ దుఃఖంతో కృశించిపోతూ, ఆ పూజ్యురాలు, ఆ మృగశాబాక్షి సీతాదేవి తన మనస్తాపాన్ని పోగొట్టు కొనడానికైనా ఈ తామరకొలను దగ్గరున్న ఉద్యానవనానికి రావచ్చును. ఆ వామలోచనకు వనవాసమంటే యెంతో యిష్టం. ఆ వనచారిణి సీతాదేవి రామవియోగ శోకంతో తపించిపోతూ యిక్కడికి రావచ్చును. ఆ జనకరాజ సుత, రాముడి ప్రియభార్య, ఆ సీతాసతి యిదివరకు వన్యమృగాలకోసం మోజుపడుతూ వుండేది. ఆ వరవర్ణిని, ఆ యౌవన మధ్యస్థ సీతాదేవి సంధ్యను ఉపాసిస్తుంది. శుభచరాలతో వున్న ఈ నది దగ్గరకు సంధ్యావందనం చేయ డానికి తప్పకుండా వస్తుంది. ఆ శుభాంగికి, రామపత్నికి, శుభ కరమైన ఈ అశోకవనం తగినట్లుగా వున్నది. చంద్రబింబము వంటి ఆ సీతాదేవి జీవించి వున్నట్లయితే శుభ జలాలతో ప్రవహిస్తూవున్న ఈ నది దగ్గరకు ఆమె తప్పకుండా వస్తుందని అనుకున్నాడు.

ఇట్లా ఆలోచించుకుంటూ ఆ మహా పరాక్రమవంతుడు హనుమంతుడు విరగబూసి దట్టముగా ఆకులు కమ్ముకొని వున్న ఆ శింశుపా వృక్షము మీద జారగిల కూర్చొని సీతాదేవికోసం వీక్షిస్తూ అన్నివైపులా చూడసాగినాడు. సీతాదేవిని వెతకడానికి అట్లా ఇరుగుడు చెట్టుమీద కూర్చున్న హనుమంతుడు అన్నివైపులా చూస్తూ అక్కడ భూమిని, ఆ అశోకవనాన్ని చూచాడు. రకరకాల

చెట్లను, ఆ చెట్లకువున్న పూవులను, వాటి అందాన్ని చూశాడు. ఋతుభేదం లేకుండా పూలుపూస్తున్న చెట్లను, వందలకొద్దీ వున్న అశోక వృక్షాలు సూర్యకాంతితో యేవిధంగా తేజరిల్లుతున్నాయో చూశాడు. అంటే తెల్లవారుతూ వుంది. రాత్రంతా వెదికాడు. సూర్యోదయ కాంతిలో అశోకచెట్ల సౌందర్యాన్ని, ఆ సమయంలో పువ్వులెట్లా పూస్తున్నాయో చూశాడు. పూలచెట్లు ఏ విధంగా బరువుకు వంగిపోయి వున్నాయో చూశాడు.

అలా చూస్తూ ఆ అశోకవనం యొక్క అందానికి ఆశ్చర్య పడిపోతాడు. ఆ దగ్గరలోవున్న చైత్యప్రాసాద గృహాన్ని కూడా చూశాడు. ఆ పైన ప్రాసాదంలో హనుమంతుడు ఒక స్త్రీని చూశాడు. ఆమె చుట్టూ రాక్షసాంగనలు వున్నారు. ఆమె మాసిపోయివున్న చీర కట్టుకొని వున్నది. ఆమె ఉపవాసాలతో కృశించిపోయి దైన్యంగా మాటి మాటికీ నిట్టూర్పులు విడుస్తూ వున్నది. ఆమె ఆకారాన్ని బట్టి గుర్తుపట్ట నలవి కాకపోయి నప్పటికీ శుక్లపక్ష పాడ్యమినాటి నిర్మల చంద్రరేఖ వలె మనోహర కాంతితో కనుపించింది. మాసి నలిగిపోయిన పసుపు పచ్చని రంగు చీర ఒకే ఒక్కటి ఉత్తమమైనది చుట్టుకున్నందువల్ల ఆమె దట్టంగా పొగలు కమ్ముకున్న అగ్నిశిఖవలె తోచింది. ఆమె దుఃఖము వలన అలంకారాదులు చేసుకోలేదు. అందువల్ల ఆమె బురదలో పద్మము లేని పద్మిని వలె కనిపించింది. ఆమె అంగారక గ్రహ బాధను అనుభవిస్తున్న రోహిణి వలె కనిపించింది.

(సీతాదేవి కట్టుకున్న చీర పసుపురంగులో వుంది. హను మంతుడు చూసిన సీతాదేవి బంగారు రంగులో వుంది అంటే అది

ఆమె సూక్ష్మశరీరం. మామూలుగా సద్గురువు రక్త మాంసాలుగల శరీరాన్ని చూడక ఆ శరీరానికి ఆధారమైన సూక్ష్మశరీరం ఏ పరిస్థితుల్లో వుంటుందో చూస్తాడు. చంద్ర రేఖవలె కాంతి వంతంగా, అగ్నిహోత్రంవలే వుంది అనడంలో తపస్సు చేసే వాళ్ళకు లోపల అగ్ని బాగా ప్రజ్వలిస్తూ వుంటుంది. తపస్సు చేయనివాడికి మణులు బొగ్గుల కుంపటిలా వుంటుంది. రోహిణీ నక్షత్రం శోభాయమానమైన నక్షత్రం. ఆర్యక వృషభరాశిలో వుంటుంది ఆజ్ఞాచక్రం. అది రుద్రుని కన్ను, కాంతివంతంగా వుంటుందనీ చెబుతారు. అదే వైశాఖ పౌర్ణమినాడు పరమగురువు లందరూ ఆ సంవత్సరానికి సంబంధించిన దివ్యప్రణాళికలను గూర్చి సమావేశమవుతారు. అందుకే దానిని 'వృషభాక్షి' అని పిలుస్తారు. రోహిణీ నక్షత్రంలాంటి సీతాదేవి తాను అనుభవిస్తున్న బాధలవల్ల అంగారకుడివలె ఎర్రగా కనిపించింది.)

"ప్రియజను లెవరూ కనబడక, యెటు చూసినా రాక్షసస్త్రీలు కనబడుతున్నందువల్ల మందలో నుండి తప్పిపోయి కుక్కల బారికి చిక్కుకున్న లేడిపిల్ల వలె ఆమె చూస్తోంది. నల్లని పామువలె జఘనాలవరకూ వ్రేళ్ళాడే జడతో ఆమె శరత్కాలంలో నల్లటి వనపంక్తులు గల భూమిమాదిరిగా తోచింది. సుఖం అనుభవించ వలసిన ఆమె, యెన్నడూ యే దుఃఖమూ యెరుగని ఆమె అట్లా ఆ దుఃఖంతో తపించి పోతూవున్న ఆ విశాలాక్షిని హనుమంతుడు చూచి ఆలోచించినాడు. ఆయా కారణాలనుబట్టి ఆమెయే సీతాదేవి అనుకున్నాడు. ఆ కామరూపుడు, రాక్షసుడు యెత్తుకొని పోతుండగా తాము, వానరులు చూచిన స్త్రీరూపం అదేనేమో అని తోచింది.

నిండు చంద్రునివంటి ముఖం, సొగసైన కనుబొమ్మలు, గుండ్రముగా అందమైన స్థనాలు గల ఆమె తన దేహకాంతులతో అన్ని దిక్కులా చీకట్లను పోగొడుతూ వుంది. నల్లని తల వెంట్రుకలు, దొండపండువంటి పెదవులు, ఏ లోపమూ లేని అవయవాలు, పసుపువన్నె, తామరరేకులవంటి నేత్రాలు, జగత్తు అంతటికీ ఏకైక సుందరి అయిన రతీదేవివలెనూ, జగత్తంతటికీ సంతోషాన్నిచ్చే పండువెన్నెల వలెనూ, ఆ పద్మదళాయతాక్షి కనిపించింది. నియమాలను పాటిస్తూవున్న తాపసాంగనవలె ఆమె నేలమీద కూర్చొని వుంది. ఆమె సందేహంలో పడ్డ స్మృతి వాక్యమువలెనూ, క్షీణించిపోయిన సంపదవలెనూ, విశ్వాసం పోయిన శ్రద్ధవలెనూ, భగ్నమైపోయిన ఆశవలెనూ, విఘ్నాలువచ్చిన కార్యసిద్ధివలెనూ, కలతపడిపోయిన బుద్ధివలెనూ, లేనిపోని అపవాదులు వచ్చి చెడిపోయిన కీర్తి వలెనూ తోచింది.”

(సందేహంలో పడ్డప్పుడు కాలము, స్మృతి వాక్యము అంటే ధర్మము, నమ్మకములాంటి వాటిని కూడా ప్రశ్నించేలా చేస్తుంది. కష్టాలు వచ్చినప్పుడు అవన్నీ భ్రమ అనిపించేలా చేస్తుంది. విశ్వాసం పోయినప్పుడు నిజమైన శ్రద్ధ వుండదు. ఎందుకంటే ఆపద మనసును తినేస్తూ వుంటుంది. అదో రకమైన యాంత్రికత వచ్చేస్తుంది. లోపల శోభాయమానంగా కనిపించే సీతాదేవి బయటికి మాత్రం నిస్పృహతో నీరసించిపోయి కనిపిస్తుంది. హనుమంతుడు సాధారణ దృష్టితో బాటు లోదృష్టి కూడా కలవాడు. లోచూపుతో లోపల విషయాలు చూసి యీమె సీతాదేవి అని గ్రహించాడు. అలాగే బయటచూపుతో ఆమె యెటువంటి దురవస్థలో వున్నదో

తెలుసుకున్నాడు. ఇది సద్గురువు చూపు. ఆయన జీవి పరిస్థితి లోపలా చూస్తాడు, బయటా చూస్తాడు. బయటి పరిస్థితుల ప్రకారం దేశకాలములందు ఆ జీవికిగల సన్నివేశాలతో బాహ్య రూపం వుంటుంది. బయటిది వ్యవస్థ. ఆ వ్యవస్థ బాగుంటే లోపల వున్న వెలుగు బయటకు కూడా గోచరిస్తూ వుంటుంది. వ్యవస్థ చెడి వ్యక్తి వుంటే అతడు బయట నిస్పృహ, నిరాశ, అలసత్వం, సందేహం, అవిశ్వాసం, భగ్నమైన ఆశలతో బయటకి దెబ్బతింటూ వుంటాడు. అలా ఆమె లోపల అగ్నిశిఖలా తేజస్సుతో బంగారు రంగుగల సూక్ష్మశరీరంతో, చంద్రకాంతితో, అగ్నియొక్క శక్తితో వున్నది.)

"రాముడు దగ్గరలో లేనందువల్ల మనోవ్యథ పడుతూ, రావణాసురుడు అపహరించుకొని వచ్చినందువల్ల బాధపడుతూ వుంది. బెదిరిన జింకపిల్ల వలె అన్నివైపులా చూస్తూ, వంకరలు తిరిగిన కనురెప్పలనిండా కమ్ముకున్న కన్నీళ్ళు కారుతూ, ముఖాన సంతోష చిహ్నలేవీ లేకుండా, యెప్పుడూ అలంకారం చేసుకోవలసిన ఆమె దీనురాలై ఏ అలంకారమూ చేసుకోక వర్షాకాలంలో మేఘాలు కమ్ముకున్న చంద్రబింబము వలె కనిపించింది."

(దైవాన్ని చేరాలని తపన వుండేవారికి యెప్పుడూ, దేని యందునూ తృప్తి వుండదు. ఎన్నివున్నా అసంతృప్తి. అందుకే ముందుగా తృప్తిగా వుండమని గురువులు చెబుతారు. ఆ తృప్తి బాహ్యావిషయాలలో వుండాలి. ముందుకు వెళ్ళేకొద్దీ తృప్తి వుండదు. అంతర్విషయాలలో తృప్తి లేనివాడే సత్సాధకుడని జ్వాలాకూలుడు చెబుతాడు. ఆయన "A disciple is one who is never at rest,

who is always restless, who is ever contended" అన్నాడు. తృప్తిగా, ఆనందంగా, చిరునవ్వుతో వుండాలన్నది మొదటి దశ. రెండవ దశలో దైవం గురించి అన్వేషణ తీవ్రమైనప్పుడు చిరునవ్వు వుండదు. దైవానికి దగ్గరకాక తృప్తిగా వున్నాడంటే వాడు సాధకుడు కాడు. సత్యాన్వేషి కూడా కాడు. అది తృప్తి కాదు. బయటి విషయాలు పూర్తి అయినప్పుడు యెలా తృప్తిగా వుంటామో, లోపలి అన్వేషణ, ఆరాధన పూర్తి కానప్పుడు తృప్తి వుండదు. అందుచేత అసలైన శిష్యునికి అంతర్ముఖంగా తృప్తి వుండదు. 'స్థిర సుఖ మాసనం' అన్నది ప్రాథమిక దశలో కావాలి. మెట్లెక్కే కొద్దీ ఆరాటం వస్తుంది. అది పూర్తి అయ్యేదాకా ఆనందం లభించదు. ఉద్ధవుడికి, గోపికలకు తృప్తి వుండదు. 'అది' పొందిన తరువాతే తృప్తి. శుకుడికి, నారదుడికి యెప్పుడూ తృప్తి. ఎందుకంటే వాళ్ళిద్దరూ 'అది' పొందారు. రాముడుంటేనే సీతాదేవికి వనం బాగుంటుంది.

దైవం లేకుండా సంపద వుంటే అది వెక్కిరించినట్లుగా వుంటుంది. దైవం వుండి సంపద లేకపోయినా యేమీ ఫరవా లేదు. దైవము, సంపద వుంటే అది యోగము. అదే రాజయోగం. సత్సాధకుడిని సంపద కావాలా? దైవం కావాలా? అంటే అతడు దైవమే కావాలి అంటాడు. యోగి అయిన వాళ్ళకు దైవంతో బాటు సంపద కూడా వుంటుంది. కానీ రెండింట్లో దైవమే ముఖ్యం. మనకే ఆనందం లేకపోయినప్పుడు మన చుట్టూ యెన్ని వున్నా ఆనందం కలిగించలేవు.)

"అభ్యాసం లేనందువల్ల మరపు తగిలిన విద్యవలె కనిపించిన

ఆ సీతాదేవిని హనుమంతుడు పదేపదే చూచి సందేహంలో పడిపోయాడు. భాషాసంస్కారం లేనందువలన ఒక అర్థానికి బదులుగా మరొక అర్థం స్ఫురింపచేసే వాక్కువలె అలంకారం చేసుకోనందువలన మారు రూపు పడిపోయిన ఆ సీతాదేవిని పరిశీలించి చూచినాడు. రాముడు చెప్పిన ఆనవాళ్ళు ఆలోచించి చూచినాడు. బహుకష్టము మీద ఆమె సీతాదేవే అనుకున్నాడు.”

(భగవంతుడు ఎవరిని అనుగ్రహించ దలుస్తాడో వారి చిహ్నాలు కూడా సద్గురువుకు తెలిపి పంపుతాడు. రాముడు హనుమంతునికి అందుకోసమే సీతను గురించిన వివరాలు, ముద్రికను యిచ్చాడు. సద్గురువుకు యెన్ని బాధ్యతలున్నాయో సుందరకాండ వివరించి చెబుతుంది. హనుమంతుడు ఆమెను బైటా లోపల కూడా పోల్చిచూచాడు. దైవము చేత అందింపబడిన చిహ్నాములు యెవరి యందు గోచరిస్తాయో వారిని అనుగ్రహిస్తాడు. అందుకు సత్సాధకుడు కూడా పరిపక్వత చెంది వుండాలి. ఏ భక్తుడి కథ అయినా వేచి, కాచి చూచినదే. చాలా పరీక్షలు పెట్టి అంతర్ముఖంగా స్థిరంగా వున్నాడా? అని చూస్తాడు. బయటికంటే లోపల బాగుండాలి. అలా పరీక్ష చేసికానీ ఒక సద్గురువు సత్సాధకుడిని అంగీకరించకూడదు. ఒకరి బాధ్యత చేపట్టామంటే వాడిని ఆసాంతం ఉద్ధరించాలి. వాడి కర్మను భరించాలి. ఒకసారి మాట యిచ్చాక ధర్మపరంగా ఆ మాటకోసం యేమైనా చెయ్యాలి. అందుకోసమే కదా ధర్మరాజు, హరిశ్చంద్రాదులు నానాబాధలు పడ్డారు.)

“ఆ అనిందితను, ఆ జనకరాజ సుతను, ఆ విశాలాక్షిని

చూచి, యుక్తియుక్తమైన హేతువులను చూచి ఆమెయే సీతాదేవి యని హనుమంతుడు నిశ్చయించుకోవడానికి మొదలు పెట్టినాడు. ఆమె యేయే అవయవాలకు యేయే ఆభరణాలు పెట్టుకుందని రాముడు చెప్పినాడో ఆయా ఆభరణాలన్నింటినీ ఆ చెట్టుకొమ్మల మీద చూచినాడు. భర్త దగ్గరలో లేనప్పుడు ఆభరణాలు పెట్టుకో కూడదు అని ఆమె వాటిని చెట్టుకొమ్మలకు తగిలించింది. ఆ చెట్టు కొమ్మలమీద ధగధగ లాడుతున్న ఆభరణాలన్నింటినీ హనుమంతుడు చూచినాడు. ఆమె చెవులకు పెట్టుకొనే కర్ణా వేష్టాలను, శదంష్ట్రా లను, రత్నాలు, పగడాలతో, నానా వర్ణాలతో తళతళలాడుతూ వున్న హస్తాభరణాలతోను, బహుకాలం ఆమె ఆయా ఆభరణాలను దేహము మీద పెట్టుకోవడం వలన ఆమె దేహము మీద పడ్డ ఆభరణాల అరవళ్ళను (గుర్తులను) పోల్చి చూచినాడు. అవి రాముడు చెప్పిన ఆభరణాలే, అవి ఆవిడవే అని తెలుసుకున్నాడు. ఆవిడ ఋష్యమూక పర్వతంపై పడవేసిన ఆభరణాలు పోను మిగతావి అవే అని అనుకున్నాడు.”

(సత్పురుషులు ఆభరణాలను విశేషంగా చూస్తారు. అంటే మనిషిలో వున్న సద్గుణాలే ఆభరణాలు. ఏయే సద్గుణాలతో చక్కని సాధన చేస్తూ దైవ సాన్నిధ్యాన్ని అనుభవిస్తున్నటువంటి జీవిని అహంకారం యెలా యెత్తుకుపోయిందో అది రాముడు హనుమంతునికి చెప్పాడు. సత్సాధకుడు దైవాన్ని మరచిన క్షణంలో అహంకారం అతనిని యెత్తుకుపోతుంది. ఇక మనలాంటి వారి మాట చెప్పనక్కర లేదు. లౌకికంగా ఆలోచించినా కూడా మనసు బాగో లేని సీత వాటిని చెట్టుకొమ్మలకు తగిలించింది.)

"అప్పుడు ఆమె ఋష్యమూక పర్వతం మీద బంగారు రంగులో వున్న ఉత్తరీయము జారవేసింది. ఇప్పుడు ఆమె అదే రంగుతో, అదే కాసెతోవున్న చీర కట్టుకొనివుంది. అయితే బహు కాలం నుండి విడవకుండా కట్టుకున్నందువల్ల చీర బాగా నలిగిపోయి, మాసిపోయి వుంది. ఈ గంగ వర్ణాంగే ఆ రాముడి ప్రియమహిషి. ఎట్టయెదుట కంటికి కనబడుతున్నప్పటికీ యెప్పుడూ ఆ రాముడి మనసులో వున్న పతివ్రత, సీతాదేవి యీమెయే. ఆపత్సమయంలో ఆడదానిని కాపాడవలెననే కారుణ్యం వలన, తనను ఆశ్రయించిన ఆడదానిని కాపాడలేక పోయానే అనే అనుతాపం వల్ల, తన భార్యను తనకు తెలియకుండా యెవడో యెత్తుకుపోయినాడనే దుఃఖము వల్ల, తన ప్రియురాలు తన దగ్గరగా లేకుండా పోయిందేనన్న మదనతాపం వల్లను ఈ విధంగా అనుతాపము, కారుణ్యము, దుఃఖము, మదన తాపము అనే నాలుగింటితో రాముడు యెవరికోసం బాధపడుతున్నాడో ఆమెయే యీమె. ఈ దేవి అంగ ప్రత్యంగ సౌష్టవము, ఆ రాముడి అంగ ప్రత్యంగ సౌష్టవము ఒక్క మాదిరిగా వున్నాయి."

(రాముడికి ఆడవేషం వేస్తే సీతాదేవి వలె, సీతాదేవికి మగవేషం వేస్తే రాముడి వలె కనబడతారు. అది అన్యోన్యత. మైత్రేయ మహర్షి బొమ్మను బాగా పరిశీలిస్తే స్త్రీయో, పురుషుడో తెలియదు. రాముడి వల్ల సీత, సీత వల్ల రాముడు అలా వుంటారు. పరమాత్మ వల్లనే జీవాత్మ. పరమాత్మ నుండి వచ్చిన జీవాత్మ అదే కాంతి, సౌష్టవము, అదే స్పర్శ, అదే రంగు కలిగి వుంటాడు. ఆయన వేరుగా వుండడు.)

ఆ విధముగా ఆమె కనుపించినందుకు ఆశ్చర్యపడ్డాడు. ఈ హసితేక్షణ రాముడికి తగినట్లుగా వున్నది. ఈ దేవి మనసులో ఆ రాముడు, ఆ రాముడి మనసులో సీతాదేవి మెదులుతూ వుంది. ఇట్లా ఒకరి మనసులో ఒకరు మెదులుతూ వున్నందువల్లనే ఇక్కడ ఈ సీతాదేవి, అక్కడ ఆ రాముడు మెదులుతూ వున్నారు. ఈ సీతాదేవిని యెడబాసిన రాముడు దుఃఖంతో దేహాన్ని చాలించ కుండా వుండటం ఆశ్చర్యమే. ఈ మత్తకాశినిని, సీతాదేవిని విడిచి పెట్టి ఇంతవరకు రాముడు జీవించి వుండటం దుష్కరమైన విశేషము అనుకుంటూ హనుమంతుడు సీతాదేవిని చూచి సంతోషపడి ఆ రామ ప్రభువును మనసులో ప్రశంసించినాడు. ప్రశంసించ వలసిన సీతాదేవిని, సుగుణాభి రాముడైన రాముడిని మనసా ప్రశంసిస్తూ హనుమంతుడు దుఃఖపడిపోయినాడు.

(సత్సాధకుల మనసులో దైవం తప్ప యింకొకటి వుండదు. దైవం కూడా సత్సాధకుల మనసులో వుంటాడు. అందుకే దేవుడు భక్తుల హృదయాలలో వుంటాడని చెబుతూ వుంటారు కదా! ముందుగా హనుమంతుడికి కూడా గొప్పగా అనిపించలేదు కాని, సీతాదేవిని చూశాక ఆయన బాధ నిజమేనని అనిపించింది. అంత వీరుడు యింత చిన్న విషయానికి యెందుకంత దుఃఖపడు తున్నాడా అనుకున్న హనుమంతుడికి యిది కనువిప్పు. భక్తుడికి, భగవంతుడికీ గల సంబంధం రామాయణంలో తప్ప మరెక్కడా కనిపించదు. అందుకే యిది సుందరం. సీత బ్రతకడానికి కారణం రాముడే. అలాగే రాముడు కూడా సీతకోసమే బ్రతికి వున్నాడు. ఉత్తరకాండలో సీతాదేవి నిష్క్రమించగానే రాముడు కూడా సరయూ

నదిలో కలసిపోతాడు. అందుకే సీతారాములవలె అన్యోన్యంగా వుండమని ఆశీర్వదిస్తారు. వాళ్ళు తమతమ కష్టాలను లెక్క చేయలేదు. అందుకే యింత అన్యోన్యమైన దంపతుల స్థితిని చూచి హనుమంతుడు దుఃఖపడిపోతాడు.)

"ఆ తేజస్వి కొంచెం ఆలోచిస్తాడు. అతని కన్నుల నిండా కన్నీళ్ళు కమ్ముకుని, సీతాదేవిని గురించి దుఃఖ పడిపోయినాడు. గురుశిక్షితుడైన లక్ష్మణుడు యీమెను యెప్పుడూ పూజిస్తూ వుండేవాడు. ఈమె రాముడి ప్రియురాలు. సీతాదేవి యిక్కడ యిట్లా దుఃఖపడుతూ బాధపడుతున్నది. ఇంతకూ కాలాన్ని యెవరూ అతిక్రమించలేరు.

(సృష్టిలో వున్నవారు కాలాన్ని అతిక్రమించ లేరు. "కాల మన్నియు చేయుచుండును, విచిత్రము దుస్తరమెట్టి వారికిన్" అన్నారు. కాలానికి తలవంచి పడివుండాలి. వేచివుండాలి. దైవాన్ని ఆరాధించాలి. కాలం బాగాలేనప్పుడు పిచ్చిపనులు చేయకూడదు. దైవ దూషణ చేసినా దాని ద్వారా దైవాన్నే స్మరిస్తూ వుంటాము కదా! కంసాదులు చేసింది అదే. అందుకే "*వైరిక్రియా సామాదిన్ శిశుపాల ముఖ్య నృపతుల్*" అని చెప్పారు కదా! ఇటువంటి కథలు మొత్తం భూగోళంలో యిక వేరే యే సంప్రదాయంలోనూ కనిపించవు. దైవం గురించి మన దగ్గర వున్నంత సాధనా సంపత్తి యింకెక్కడా వుండదు. రామదాసు కూడా 'ఎవడబ్బ సొమ్మని' అన్నాడు కదా! కాలం మీద, దైవం మీద గల నమ్మకమే సత్పురుషులను నిలబెడుతుంది. ధర్మాన్ని నమ్మి కాలానికి తల వంచి బ్రతకాలి. రామస్మరణలోగల ఆసక్తి, అనురక్తి వేరేవాటిలో

లేదు. 'రా' అన్నది అగ్నిబీజము. అందుకే యెవరూ రామభక్తుల దగ్గర వెకిలి వేషాలు వెయ్యలేరు.)

"రాముడి పరాక్రమము, ఆ బుద్ధిమంతుడు లక్ష్మణుడి పరాక్రమము యీమె యెరుగును. అందువల్లనే వర్షాకాలంలో గంగానది వలె యీమె యెక్కువగా కలతబడి పోకుండా వున్నది. సీతారాములు సత్‌స్వభావంలోను, సదాచారంలోను, వయసులోను సమానులుగా వున్నారు. ఉభయులు సద్వంశాలలో పుట్టినారు. ఆ రాముడికి సీతాదేవి తగినట్లుగా వుంది. ఈ హసితేక్షణకు ఆ రాముడు తగినట్లుగా వున్నాడు. తప్తకాంచనమువలెను, సర్వలోక ప్రియమైన మహాలక్ష్మీదేవి వలెను తేజరిల్లితున్న సీతాదేవిని చూస్తూ, రాముని తలచుకొని ఈ విశాలాక్షి కోసం ఆ మహాబలవంతుడు రాముడు వాలిని చంపేశాడు. ఈమెకోసమే రావణాసురుడు అంతటి కబంధుని చంపివేసినాడు. దేవేంద్రుడు శంబరాసురుని వలె యీ సీతాదేవి నుంచే రాముడు దండకారణ్యంలో భయంకర పరాక్రములైన విరాధుని, జనస్థానంలో భయంకర కర్ములైన పదునాలుగు వేలమంది రాక్షసులను అగ్నిజ్వాలల వంటి బాణా లతో చంపివేసినాడు. ఆ విహితాత్ముడు రాముడు యీమెనుంచే మహా పరాక్రమవంతులైన ఖర దూషణ త్రిశిరులను యుద్ధములో సంహరించినాడు. ఈమె నుంచే యెవరికీ జయింప నలవి గాని వాలియొక్క వానర రాజ్యాన్ని, లోకమంతా గౌరవిస్తున్న వానరుల ఐశ్వర్యాన్ని సుగ్రీవుడు సంపాదించ గలిగినాడు. ఈమె నుంచే నేను సమస్త నదులు, నదములు సంగమించే రత్నాకరుని దాటి లంకా పట్టణాన్ని చూస్తున్నాను.

ఈ సీతాదేవికోసం రాముడు సముద్ర పర్యంతమైన భూమిని, భూమినే కాదు యీ జగత్తునంతా తలక్రిందులు చేసివేసినా సమంజసమేనని అనిపిస్తుంది. త్రిలోక రాజ్యము హెచ్చా? ఆ జనకరాజసుత సీతాదేవి హెచ్చా? అని అడిగినట్లైతే త్రిలోకరాజ్యము సీతాదేవిలో వీసముపాలు చేయదు. నాగలితో దున్నుతున్న యజ్ఞక్షేత్రములో యీ ధర్మశీల, యీ జనకరాజ సుత, యీ భర్తృ దృఢవ్రత భూమిని ఛేదించుకొని పద్మరాగము, శుభకరము మొదలగు కేదారాంశువులు కమ్ముకొని ఉద్భవించినది. యుద్ధములో వెనుకకు తిరుగని పరమ పరాక్రమవంతుడు, ధర్మశీలుడు అయిన దశరథమహారాజుకు యీ యశస్విని పెద్దకోడలు అయ్యింది. ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, విజితాత్ముడు అయిన రాముని ప్రియభార్య అయిన యీ సీతాదేవి యిప్పుడు రాక్షస స్త్రీల వశమైనది."

(జీవుడి కథగా చెప్పుకుంటే త్రిలోక రాజ్యము సీతాదేవికంటే యెక్కువ కాదు అనడంలో ఆమె లక్ష్మీదేవి, ప్రకృతి, పరాశక్తి అని భావన చేయవచ్చు. జీవుడి యొక్క అనుభూతికోసం సృష్టి చేయ బడ్డవి. కాబట్టి యీ లోకములకన్నా జీవాత్మయే గొప్పవాడు. అందుకే ఆత్మ దర్శనులకు సమస్త లోకము లందలి దేవతలు సహక రిస్తారు, అనుగ్రహిస్తారు లేక అనుసరిస్తారు. ఎవడైతే తనను తాను తెలుసుకుంటాడో ఆ సమయంలోనే అతడు భగవంతుని కూడా తెలుసుకుంటాడు. అంటే అతడు భగవత్ సమానుడుగా భూమి మీద చరిస్తూవుంటాడు. సమస్తలోకములు భగవంతుని ఆధీనంలో వున్నట్లే ఆత్మదర్శనుల ఆధీనంలోకూడా వుంటాయి. మనుషులు, దేవతలు, సమస్త లోకముల వారు ఆయనను పూజిస్తారు అని

చెప్పడంలో ప్రతి సద్గురువు కూడా పంచభూతములు, అన్ని రకముల దేవతలచే గౌరవింప బడతాడు. ఎందుకంటే జీవాత్మ సహజంగా దైవాత్మ స్వరూపమే. లోకముల యందు ఆసక్తి కలిగి దైవమును మరచినపుడు బంధింపబడతాడు.

అందుకే మనవారు అద్వైత సిద్ధాంతాన్ని అవగాహన చేసుకొని *"దేహో దేవాలయః ప్రోక్తో జీవో దేవ స్సనాతనః"* అన్నారు. అంటే యీ దేహంలో గల జీవుడు 8 పొరలకు సంబంధించిన ప్రకృతియందు అంటే అహంకారము, బుద్ధి, చిత్తము, మనస్సు, ఇంద్రియములు, ప్రాణశక్తి, కోరికలోకములు, భౌతిక శరీరము. ఇవన్నీ ఆవరించి జీవుని బుద్ధి పనిచేస్తే అతడు బంధింపబడిన జీవుడవుతాడు. ఈ 8 ప్రకృతులు కాక 9వ వాడుగా తాను పదవది అయిన భగవత్ తత్త్వమునందు అనుసంధానం చెందినట్లయితే యీ 8 ప్రకృతులు అతడికి లోబడి వుంటాయి.

9+10=19, అలాగే మళ్ళీ 1+9=10, అలాగే మళ్ళీ 1+0=1 అంటే ఏకత్వం పొందుతాడు. ఆవిధంగా పరతత్త్వంతో కూడిన జీవుడు పరమాత్ముడే అయిపోతాడు. అందుకే *'జీవాత్మ పరమాత్మాచ ముక్తానాం పరమాగతిః'* అన్నారు. అదే జీవుడు 8 ప్రకృతులతో కూడిన యీ సృష్టియందు బద్ధుడైతే 9+8=17, మళ్ళీ 1+7=8 అవుతాడు. తొమ్మిదవదైన జీవతత్త్వము ఎనిమిది ప్రకృతులతో కలిస్తే ప్రకృతి పరమవుతాడు. దైవంతో అనుసంధానం చేసుకుంటే దైవమే అయిపోతాడు. జీవాత్మ పరమాత్మతో అనుసంధానం చెందితే యిక సృష్టిలో యే ప్రజ్ఞలూ అతనిని బంధింపలేవు. ఆ స్థితిలో వారికి సృష్టి ప్రజ్ఞలన్నీ సహకరించేలా వుంటాయి. అదే

జీవతత్త్వము యొక్క ప్రత్యేకత. మనం కూడా భూమిలో నుంచి పుట్టుకొచ్చాం కానీ మనం అది కాదు. మనం సూర్యప్రజ్ఞతో పుట్టాం. కాని మనం పంచభూతాలతో అనుసంధానం చెందడం చేత, దైవాన్ని మరవటంచేత మనమంతా Earthy Beings. భూమిలో పుట్టినటువంటి వారు అని అంటారు.

సీతాదేవి కూడా అలాంటి ప్రజ్ఞ కలది అంటే తనను తాను మరువని స్థితి కలిగి వున్నది. అందుకే శివధనుస్సు గల పేటికను అవలీలగా తోసివేస్తుంది. రాముడు ఆ వింటిని యెక్కు పెట్టగలడు. అలా కొంతమంది దేహములో తెలిసి పుడతారు. కొంతమంది అంత ప్రజ్ఞలేక పుడతారు. ప్రజ్ఞలేక దేహములో పుట్టినవాడు ఆ ప్రజ్ఞను సంపాదించుకొని మళ్ళీ వెలుగులో పుట్టాలి. అందుకే పెద్దలు 'నీ మొదటి పుట్టక చీకట్లో, రెండవ పుట్టుక వెలుగులో జరుగుతుంది. నీవు మళ్ళీ వెలుగులో పుడితే ద్విజత్వం సంపాదించుకున్న వాడవవుతావు' అని అంటారు.

వెలుగులో పుట్టడం అంటే మనకున్న యీ మట్టిశరీరం ఆధారంగా మనం చేసే ధర్మాచరణం, దైవారాధన, యోగం, సాధనల ద్వారా సూక్ష్మ శరీరాన్ని పటిష్ఠం చేసుకుంటే అది వెలుగు శరీరం అవుతుంది. అందులో మనం ప్రవేశించి ఆ శరీరం ద్వారా బయటికి వచ్చి దీనిని ఈ శరీరాన్ని మనం చూడగలిగితే అప్పుడు మనం వెలుగులో పుట్టినవాళ్ళ మవుతాము. దానినే రెండవ జన్మ అంటారు. అలా రెండవసారి పుట్టినవాడే బ్రాహ్మణుడు. కేవలం పుట్టినంత మాత్రాన, ఉపనయనం చేసుకున్నంత మాత్రాన బ్రాహ్మణుడు కాడు.

పంచభూతాలలో పుట్టినవాడు భూమికి అతీతమైన ప్రజ్ఞ. ఆ జీవతత్త్వం యిందులో యిమిడిపోయి, బంధింపబడి వుంటుంది. అందులోనుండి ఉద్ధరింపబడి తనకు తానుగా తెలిసి పుట్టే వారందరూ మహాత్ములే. వారందరూ చిరంజీవులే. వారు చక్కని చిహ్నములతో పుట్టుకొస్తారు. శుభకరమైన పద్మరాగములాంటి కేదారాంశువులతో శుభచిహ్నములతో పుట్టినది అనడంలో మహత్తర కార్యములు చేసే శ్రీరాముడు, శ్రీకృష్ణుడు లాంటి వారు పాదము లలో, హస్తములలో శుభ చిహ్నములతో పుడతారు. వారికి ప్రత్యేకంగా సాధనా కార్యక్రమం వుండదు. సీతాదేవి కృతకృత్యయైన తత్త్వం. కేవలం ఒక్క కోరిక కోరడం ద్వారా యీవిధమైన పరిస్థితిలో పడ్డది. మనలో కోరికలు యెక్కువ అయ్యేకొద్దీ మనం దైవానికి దూరంగా వుంటాం. కానీ దైవానికి దూరమైన స్థితిలో కూడా దైవమునే నమ్మి, దైవము కొరకు జీవించే వ్యక్తిలా సీతాదేవి కనుపిస్తుంది. రాక్షసులు (అసురులు) జీవుని అహంకారము అధీనంలో వుంచుతారు. దైవాధీనంలో వుంచేవారు సురలు. సీత కోరిన కోరిక ధర్మపరం కానప్పుడు రాక్షసుల ఆధీనంలో వుంది. అందుకే కోరికలు ధర్మపరంగా వుండాలని రామాయణం చూపిస్తుంది.)

"ఈమె భర్తమీద తనకున్న ప్రేమాతిశయాల నుంచి సమస్త భోగాలు త్యజించి వేసింది. దుఃఖాలను లెక్కచేయకుండా భర్త వెంట నిర్జన అరణ్యాలకు వచ్చింది. కందమూల ఫలాలతో సంతృప్తి చెందింది. భర్తకు సేవ చేయడమే తన పనిగా పెట్టుకున్నది. స్వంత యింట్లో వున్నట్లుగా పరమసంతోషంతో భర్తతో మహారణ్యంలో

కాపురము చేస్తున్నది. ఎప్పుడూ చిరునవ్వు చిందులాడుతూ మాటలాడే యీ బంగారు బొమ్మ, యీ సీతాదేవి యెన్నడూ యెరుగని ఆపదల పాలై యీ యాతనంతా ఓర్చుకుంటూ వుంది. దాహమైనవాడు చలివేంద్రమును చూడవలెను. అదే విధంగా రాముడు యీ శీల సంపన్నను సీతాదేవిని చూడవలెను. రాజ్యమును పోగొట్టుకున్న వాడు మళ్ళీ రాజ్యాన్ని సంపాదించవలెను. అదే విధంగా యీ రాముడు మళ్ళీ యీ సీతాదేవిని సంపాదించుకొని సంతోష పడవలెను. కోరుకోవలసిన భోగ పదార్థాలన్నీ వదులుకొని, బంధుజనుల నందరినీ వదులుకొని రామాగమన కాంక్షతో యీ దేహము చాలించకుండా వున్నది. ఇప్పుడు యీమె యీ రాక్షస స్త్రీల వంకగాని, యీ పూలచెట్ల వంక గాని, పండ్లచెట్ల వంకగాని చూడటంలేదు. ఏకాగ్రచిత్తంతో ఆ రాముని ధ్యానం చేస్తూ వున్నది. స్త్రీలకు అన్ని ఆభరణాలకన్నా ఆభరణమైనవాడు భర్త. ఆ భర్త దగ్గరలో లేనందువల్ల యీ సీతాదేవి శోభించడం లేదు. ఆ ప్రభువు రాముడు యీమె లేదు అనే దుఃఖంతో చనిపోకుండా జీవించి వున్నాడు. ఆ రాముడు తప్ప మరొకడు యిలా బ్రతికి వుండలేడు.

ఈ అశితకేశాంత, యీ శతపత్రేక్షణ యిట్లా దుఃఖం అనుభవించడం చూస్తూవుంటే యీమె సుఖదుఃఖాలతో యేమాత్రమూ సంబంధంలేని మధ్యస్థుడినైన నా గుండెలు తరుక్కు పోతున్నాయి. ఈమెను రామలక్ష్మణులు రక్షించినారు. ఈమె భూదేవి వంటి క్షమావంతురాలు. ఇటువంటి యీ పద్మపత్రాక్షి సీతాదేవిని వికృత నేత్రాల రాక్షస స్త్రీలు కావలి కాస్తున్నారు. మంచుకొట్టుకొని, కాంతులు మాసిపోయిన పద్మలత వలెను, ప్రియుని యెడబాసిన

చక్రవాక పిట్ట వలెను దుఃఖపరంపరతో బాధపడుతూ యీామె చూచేవారికి జాలిగొలిపే దురవస్థలో పడిపోయింది. ఈ అశోక వనంలో పూల బరువుకు వంగిపోయిన చెట్లు, మంచు వదలిన తర్వాత చల్లని వెయ్యి కిరణాలతో ఉదయించిన చంద్రుడు యీామెను మరింత దుఃఖ పెడుతున్నాడు" అని అనుకున్నాడు హనుమంతుడు.

ఇట్లా ఆ బలవంతుడు, ఆ వేగవంతుడు హనుమంతుడు అనుకుంటూ యీామె సీతాదేవి అని నిశ్చయించి ఆ శింశుపా వృక్షము మీద కూర్చున్నాడు. నల్లటి నీళ్ళలో హంస వలె, నిర్మల ఆకాశమధ్యంలో తెల్లకలువపూల గుత్తి వంటి స్వచ్ఛంద చంద్రుడు పోయినాడు. నిర్మల ప్రభలతో తేజరిల్లే చంద్రుడు సాయం చేయ డానికి వచ్చిన వానివలె తన చల్లటి కిరణాలతో హనుమంతుని సంతోష పెట్టినాడు. బరువు యెక్కువై నీటిలో మునిగిపోతున్న నావవలె శోక భారముతో నిండు చంద్రబింబము వంటి సీతాదేవి కుంగిపోతూ వుంది.

ఆ వైదేహి సమీపంలో భయంకరులైన రాక్షసాంగనలు వున్నారు. వారిలో ఒకతి ఒంటి కంటిది. ఒకతె ఒంటి చెవిది. చెవులు మూసుకొని పోయింది ఒకతె, చెవులే లేనిది యింకొకతె. ఒకతె ముక్కులతో నెత్తివైపు ఉచ్ఛ్వాస నిశ్వాసములు వదలుతూ వుంది. ఒకతె తల యెంతో పెద్దది. ఒకతెకు మెడ సన్నగా, పొడుగ్గా వున్నది. ఒకతెకు తలవెంట్రుకలు కాసినే వున్నాయి. ఒకతెకు తలవెంట్రుకలు లేవు. కంబళివంటి తలవెంట్రుకలు గలది ఒకతె. ఒకతెకు చెవులు, నొసళ్ళు వేళ్ళాడుతూ వున్నాయి. ఒకతెకు

చన్నులు, కడుపు వ్రేళ్ళాడుతూ వున్నాయి. ఒకతెకు పెదవి వ్రేలాడుతుంటే ఒకతెకు గడ్డంలో పెదవి వున్నది. ఒకతెకు ముఖము, ఒకతెకు మోకాళ్ళు వ్రేలాడుతున్నవి. ఒకతె పొట్టిది, ఒకతె పొడుగాటిది. ఒకతె గూనిది. ఒకతె మరీ వంకరటింకరది. ఒకతె మరుగుజ్జుది. ఒకతె మిట్ట పళ్ళది. ఒకతె నోరు వంకరది. ఒకతె పిల్లి కళ్ళది. ఒకతె వికృత ముఖం గలది. (ఇదంతా సాముద్రికం. ఈ ఆకారాలు యెవరిలోనైనా వుంటే వారిలో వికారా లుంటాయి. తెలిసినవాళ్ళు వీటిని బట్టి స్వభావాలు నిర్ణయిస్తారు. ముఖం యెట్లావుందో దానిని బట్టి వాళ్ళ స్వభావాన్ని అవగాహన చేసుకోవచ్చు.)

"వారందరూ వికారాకారులు. వారిలో కొందరు కారు నలుపుతోను, కొందరు గోరోచనం రంగుతోను వున్నారు. వాళ్ళందరి ముఖాలలోను కోపం తాండవమాడుతూ వుంది. వాళ్ళందరూ కలహప్రియులు. ఇనుముతో చేసిన నల్లటి పెద్ద శూలాలు, కూటాలు, ముద్గరాలు అన్ని ఆయుధాలు ధరించి వున్నారు. వాళ్ళలో కొంతమందికి తలలు దేహాలలో యిరుక్కు పోయినాయి. కొంతమంది ఒంటిచేతి వాళ్ళు, కొంతమంది ఒంటిపాదం వాళ్ళు, కొంతమంది గాడిద చెవుల వాళ్ళు, కొంతమంది గుఱ్ఱపుచెవుల వాళ్ళు, కొంతమంది ఆవుచెవుల వాళ్ళు, కొంతమంది ఏనుగు చెవుల వాళ్ళు, కొంతమంది కోతి చెవుల వాళ్ళు, కొంతమంది పెద్ద పెద్ద ముక్కుల వాళ్ళు అయితే కొంతమందికి ముక్కులే లేవు. కొంతమందికి ముక్కులు అడ్డంగా వున్నాయి. కొంతమందికి ముక్కులు వికృతంగా వున్నాయి. కొంతమందికి ఏనుగు తొండా

లంత ముక్కులు వున్నాయి. ఏనుగు పాదాలవాళ్ళు కొందరు, ఆవు పాదాలవాళ్ళు కొందరు, మహా పాదాల వాళ్ళు కొందరు, పాదాలకు జుట్టువున్న వాళ్ళు కొందరు, పెద్ద తల అంతకన్నా పెద్ద మెడవున్న వాళ్ళు, పెద్ద పెద్ద స్తనాలున్నవారు, పెద్ద పెద్ద పొట్టలున్న వారు, పెద్ద నోరు, అంతకన్నా పెద్ద కన్నులున్నవాళ్ళు, పొడుగాటి నాలుక లున్నవాళ్ళు, పొడుగాటి గోళ్ళు వున్న వాళ్ళు, మేక ముఖాలు, ఏనుగు ముఖాలు, ఆవు ముఖాలు వున్నవాళ్ళు, ఆడపంది ముఖాల వాళ్ళు, ఒంటెముఖాల వాళ్ళు పరమ భయం కరంగా వున్నారు. ఈ రాక్షసాంగన లందరూ యెప్పుడూ మద్యము తాగుతూ, మాంసము తింటూ, ఒంటినిండా మాంసము, నెత్తురు పులుముకొని చూచేవాళ్ళకు ఒళ్ళు గగుర్పొడిచేలా వున్నారు. వాళ్ళందరూ సీతాదేవి చుట్టూ కూర్చుని వున్నారు. వాళ్ళందరినీ హనుమంతుడు చూచినాడు.

అక్కడ చెట్టుక్రింద కూర్చొనివున్న అనిందితను, ఆ జనకాత్మజను ఆ కాంతిమంతుడు హనుమంతుడు చూసినాడు. ఆమె దుఃఖముతో తపించిపోతూ వున్నది. కాంతులు మాసిపోయి వున్నది. తలవెంట్రుకలు దుమ్ముకొట్టుకొని వున్నది. పుణ్యము నశించిపోయి యీ భూమి మీదపడ్డ నక్షత్రం మాదిరిగా వున్నది. ఆ సదాచార వంతురాలు తన భర్త దగ్గరలో లేనందువల్ల ఆభరణా లన్నింటినీ పెట్టుకోవడం మానివేసింది. భర్తవాత్సల్యమే తనకు అమూల్యాభరణమని భావించింది. అటువంటి సీతాదేవి రాక్షసాధిపతి రావణాసురుడికి చిక్కింది. ఏనుగులమందను వదలి పెట్టి సింహముపాలైన పెంటి ఏనుగు మాదిరి వుంది. శరత్కాల

మేఘం కమ్ముకున్న ప్రతిపద చంద్రుని వలె హ్రస్వము గాను, అస్పష్టంగాను వున్నది. దేహ సంస్కారం లేక మారురూపు పడిపోయి, వాడుకలేక పాట తప్పిన వీణ మాదిరిగా వున్నది. అట్లావున్న సీతాదేవిని హనుమంతుడు చూచాడు.

(సీతాదేవి పూర్తిగా భగవంతుడి దర్శనంకోసం మాత్రమే వేచి వున్నది. ఇక మిగిలినవేవీ అవసరం లేని స్థితిలో వున్నది. కాకపోతే అహంకారం యొక్క అధీనంలో వున్నది. దైవం యొక్క ఆరాధనలోనూ వున్నది. సత్సాధకులు కూడా అహంకారం యొక్క ఆధీనంలో వున్నా దైవం యొక్క ఆరాధనలో వుంటారు. ఈ అహంకారం నుండి నన్ను రక్షించు అని ఆరాధన చేస్తూ వుంటారు. ప్రతివారికీ నేను అనే ఒక భావన వుంటుంది. అదే అహంకారం. ఎందుకంటే ఈ 'నేను' ఆ 'నేను' కు సంబంధించినదే. అందుచేత మనకు ప్రత్యేక అస్తిత్వముందని, మనలో యీ గుణాలున్నాయన్న భావనే మన గురించి వేరుగా అంచనా వేస్తుంది. భగవంతుని అస్తిత్వమే మనయందున్నదని గుర్తిస్తే అది భక్తి అవుతుంది. మనలోని సద్గుణాలు భగవంతుని అస్తిత్వమైతే మనలోని దుర్గుణాలు అహంకారం యొక్క అస్తిత్వమే. కాబట్టి భగవంతుడి ఆరాధన యందుండేవారు అహంకార పురుషుని నుండి బయట పడవెయ్యమని కోరుకుంటారు. అహంకార మున్నంతవరకూ అజ్ఞానం వుంటుంది. తానొకడు వేరుగా వున్నాడని అనుకోవడం వల్లనే కదా మిగతావారంతా తనకన్నా వేరు అని అనుకుంటూ వుంటారు. అలా అనుకోవడం చేత చేసే చేతలలో లోటుపాట్లు వుంటాయి. అందుకే సీతాదేవి దైవం యొక్క అనుగ్రహం కోసము, అహంకారం

యొక్క పరిష్కారం కోసం యెదురు చూస్తూ వుంది. ఆమె నక్షత్రంలా వుంది అనడంలో ఆమెకు క్షత్రము (నాశం) లేదని అర్థం.

మనం కూడా సహజంగా తేజోవంతులం, ఆత్మవంతులం కాని యిక్కడ నేలమీద పడిపోయాము. కానీ సీతాదేవికి అది గుర్తుండి దైవం యొక్క దర్శన, స్పర్శన, సంభాషణాది విషయముల యందు ఆసక్తి వుండటం చేత ఒక రకంగా చూస్తే చాలా స్పష్టం గాను, మరో వైపునుండి చాలా అస్పష్టంగాను వున్నది. అహంకార ప్రజ్ఞకు లోనై వుండటం చేత అస్పష్టంగా వున్నది, దైవమునందు ఆసక్తి కలిగి వుండటం చేత స్పష్టంగా వున్నది. సద్గురువు రెండూ చూశాడు కాని, ఆమెలో దైవారాధనమే యెక్కువగా వుండి రాముడు యెప్పుడు వస్తాడా అని యెదురు చూస్తూ వుంది. అందుకే ఆయన సంతోషించాడు. సద్గురువు కూడా శిష్యుని వ్యక్తిగత సమస్యలకే ప్రాముఖ్యత నిస్తున్నాడా? లేక తన యొక్క నిజ స్వరూపాన్ని తెలుసుకోవడానికి ప్రాముఖ్యత నిస్తున్నాడా? అని చూస్తాడు. వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం కోరుకొనే వారందరు అహంకారానికి లోబడినవారే. అవి యెప్పటికీ తీరవు. సముద్రంలో అలల వలె సమస్యలు వస్తూ వుంటాయి. అలలు వుండకూడ దనుకుంటే సముద్రం లోపలికి వెళ్ళాలి. అలాగే జీవుడు కూడా దైవం యొక్క సాన్నిధ్యం పొందినపుడు మాత్రమే యిక సమస్యలు లేని స్థితికి వస్తాడు. సమస్యలున్నా అతనిని ముట్టుకోవు. అలలు వుండవచ్చు కాని లోపలికి వెళ్ళిన వాడికి అలల తాకిడి వుండదు. అహంకారం చేత కొంత అలజడి, ఆరాధన చేత కొంత స్థిరత్వము

రెండూ గోచరిస్తున్నాయి అంటే +, - రెండిటినీ హనుమంతుడు చూశాడు.)

"పెనిమిటి అయిన రాముడి వెంట యెప్పుడూ వుండవలసిన ఆ సీతాదేవి యీ రాక్షసాంగనల వశం అయ్యింది అని బాధపడుతూ వుంటాడు. శోక సాగరంలో మునిగి తేలుతు, ఆభరణాలు పెట్టుకో నందువల్ల ఆమె పూలు లేని పూలతీగ మాదిరిగా వుంది. అమె కట్టుకున్న చీర నలిగిపోయి, మాసిపోయి వుంది. ఆమె దీను రాలిగా వుంది. అయితే భర్త పరాక్రమం తెలిసి తన శీలాన్ని తానే రక్షించుకుంటూ వుంది." (మనకూ అలాగే భర్త పరాక్రమంపై నమ్మకం వుండాలి. దైవం నన్ను నిరాకరించడు, దైవం నన్ను రక్షిస్తాడు, దైవం నన్ను మరువడు, నిర్లక్ష్యం చేయడు. అందుచేత ఆయనే ఉపాయమని నమ్మి అన్ని కష్టాలను అధిగమించవచ్చు. అది సత్సాధకులకు గల దృఢనమ్మకం.)

"ఆ హసితలోచన సీతాదేవి బెదిరిపోయిన జింకపిల్లవలె అన్ని దిక్కులూ చూస్తూవుంది. చెట్ల చిగురుటాకులు దహించి వేసేలా ఆమె వేడి వేడి నిట్టూర్పులు విడుస్తూ వుంది." (ఆమెకు భర్త గురించి తపన, జీవుడిగా దైవంగురించిన తపన, ఆరాధన. ఎటు వైపునుంచి అయినా రాముడు కానీ, రామదూతలు కానీ వచ్చి రక్షిస్తారేమో అని ఆరాటపడుతోంది.)

శోక సమూహం ఆకాశం దహించి వేస్తున్నట్లుగా వుంది. ఆమె శోకము సముద్ర తరంగాలవలె లేస్తున్నట్లుగా వుంది. అయితే భూదేవిమాదిరిగా ఓర్పుతోనూ, ఆభరణాలేవీ పెట్టుకోకపోయినా

సహజ సౌందర్యంతోనూ, తీర్చిదిద్దిన అవయవాలతోనూ వున్న సీతాదేవిని చూచి హనుమంతుడు సంతోషపడ్డాడు.

ఆ మదిరేక్షణను చూస్తూ ఆనందబాష్పాలు వదలినాడు. రాముని తలచుకున్నాడు. సీతాదేవి కనిపించినందుకు ఉప్పొంగి పోయి మనసా రామ లక్ష్మణులకు నమస్కారం చేసినాడు. రాక్షసాంగన లకు తాను కనబడకుండా వుండటానికి ఆ ఇరుగుడు చెట్ల ఆకులు కప్పుకొని ఆ చెట్టు కొమ్మ మీదనే కూర్చున్నాడు.

(ఒక సత్సాధకుడు కనిపిస్తే సద్గురువు కూడా ఈ విధంగా పులకిస్తాడు. సాధకుడికి సద్గురువు దొరకటం ఎంత దుర్లభమో, సద్గురువుకు సత్సాధకుడు దొరకటం కూడా అంతే దుర్లభం. సద్గురువుకోసం చాలామంది సాధకులు అంటే ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు వెదుకుతూ వుంటారు. సద్గురువుకు సత్సాధకుడు కావాలి. ఎందుకంటే ఆయన వచ్చినపని అటువంటి వాళ్లకోసమే. శిష్యుడి కోసం గురువుకూడా వెదుక్కుంటాడు. ధర్మకార్యాలు చేస్తూ, సేవా కార్యాలు చేస్తూ, దైవపరమైన తత్త్వాన్ని వివరిస్తున్నప్పటికీ ప్రతి సద్గురువూ సరియైన శిష్యులకోసం, సత్సాధకులకోసం వెదుకు తాడు. రామకృష్ణ పరమహంస కూడా వివేకానందుడు కనబడగానే తాను వెదకుతున్న శిష్యుడితడేనని తెలిసి చాలా ఆనందం పొంది నృత్యం చేస్తాడు. 'ఇన్నాళ్ళకు కనిపించావా!' అంటూ కన్నీళ్ళు కారుస్తూ కౌగలించుకుంటాడు. వివేకానందుడు ఆయనను చూచి ఇలా ఏడ్చేవాడు గురువేనా! అని ఆశ్చర్యపోతాడు. రామకృష్ణ పరమహంస భవతారిణి ఆలయానికి రమ్మని పిలిస్తే అప్పుడు కాక ఎప్పుడో వెళతాడు. అప్పుడుకూడా శ్రీ రామకృష్ణ పరమహంస

అంతే ప్రేమాభిమానాలను చూపిస్తాడు. అప్పుడు వివేకానందుడు ఆయనను "దైవమును చూశారా?" అని ప్రశ్నిస్తే రామకృష్ణుడు "నీవు చూస్తావా?" అని ఎదురు ప్రశ్న వేసినపుడు వివేకానందుడు "చూడాలనే నా తపన" అంటాడు. ఆ జవాబుకు పరమహంస "అలా అయితే నా ప్రక్కన కూర్చో" అని మంచంపై తన ప్రక్కన కూర్చుండబెట్టుకొని ఆయన కాలుపై తన కాలు వేస్తాడు. అంతే, వివేకానందుడు తనను తాను మరచిపోయాడు. వివేకానందుడనే జీవచైతన్యం మొత్తం విశ్వచైతన్యంలో కలసిపోయింది. చాలా సేపు అలాగే వుండిపోతాడు. ఎంతో సేపటికి మెలకువ వస్తుంది. అప్పుడు రామకృష్ణ పరమహంసతో "నాకు ఇంకా చాలా బాధ్యత లున్నాయి. ఇప్పుడే లేనివాడిగా (అహంకారం లేనివాడిగా) చెయ్య కండి" అని అడిగితే, అందుకు ఆయన "నీవు అడిగావు కాబట్టి చూపించాను" అన్నాడు. అప్పుడు వివేకానందుడికి రామకృష్ణ డంటే ఏమిటో తెలుస్తుంది.

అలా హనుమంతుడు సద్గురువుగా సీతాదేవిలో (జీవుడిలో) బయటి విషయాలుకాక లోపలి విషయాలు చూసి ఉప్పొంగి పోతాడు. తన పనులకు ఎవరు ఉపయోగపడతారా? అని చూసేవాడు సద్గురువు కాదు. మాస్టర్ ఇ.కె. గారిలో అలాంటి గుణాలను చూశాను. ఆయన "నీ సంగతి నీవు ఏడిస్తే అంతే చాలు. నా కోసం నీవు ఏం చెయ్యనక్కరలేదు" అనే వారు. సద్గురు ప్రవేశం అహంకార పురుషుడికి, వాడి సేనకు తెలియకుండా జరుగుతుంది. తెలిస్తే జీవుడిని చంపేద్దాం అనుకుంటాడు. జీవాత్మ పరమాత్మ వైపుకు మొగ్గకుండా వుండటానికి రకరకాలుగా ప్రయత్నం

చేస్తుంది. దైవంకాని, దేవదూతలు కానీ ప్రవేశించడానికి అడ్డుపడు తుంది. అందుకే మంచిపనులు వాయిదా పడుతూంటాయి. చివరిలో రాముడు లక్ష్మణుని రావణుని దగ్గర రాజనీతి నేర్చుకోమని పంపితే రావణుడు "రాజుగా నీలో మంచి సంకల్పాలు వచ్చినప్పుడు దానిని వాయిదా వేయకు" అని చెప్పాడు. అక్కడున్న రాక్షసాంగనలందరూ అహంకారపు సైన్యమే. అందుకే వారికి కనబడకుండా దాక్కున్నాడు సద్గురువు. అంటే మన కుడికన్నులో (యమున) నుంచి గురువు పింగళ నాడిలో ప్రవేశిస్తాడు).

*(మొదటి భాగము సమాప్తము)*

**DHANISHTA PUBLICATIONS**
D.No. 15-7-1, Angels' Enclave,
Krishna Nagar, Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1 | Agni | E/G/S |
| 2 | Akashakaya (Etheric Body) | K |
| 3 | Amanaskudu | T/K |
| 4 | Ambareeshudu | T |
| 5 | An Insite into The WTT | E |
| 6 | Antardarsana Dhyanamulu | T |
| 7 | Anveshakudu | T |
| 8 | Asangudu | T/K |
| 9 | Ashram - Regulations for Entry | E/G/S |
| 10 | Ashram Leaves | E/G/S |
| 11 | Aswini Devatalu | T |
| 12 | Atmasadhana Sutramulu | T |
| 13 | Ayurvedic Principles for daily life | E/G/S |
| 14 | Bharateeya Sampradayamu | T/K/H |
| 15 | Bhagavathamurthy Bheeshmudu | T |
| 16 | Bhagavatha Sukthamu I & II | T |
| 17 | Cow | E/S/T/K |
| 18 | Devapi Maharshi Bodhalu - 1 | T/K/H |
| 19 | Devapi Maharshi Bodhalu - 2 | T/K/H |
| 20 | Dhanakamuni Katha | T |
| 21 | Dharma Vigrahudu - Sri Ramudu | T |
| 22 | Discipleship | E |
| 23 | Doctrine of Eternal Presence | E/S |
| 24 | Enlightening Encounters | E |
| 25 | From Teachers Pen | E |

**The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.**

| | | |
|---|---|---|
| 26 | Gajendra Mokshanamu | T |
| 27 | Gayatri Mantra Avagahana | T |
| 28 | Geethopanishat - Sankya Yogamu | T |
| 29 | Geetopanishad - Karma Yogamu | T |
| 30 | Geetopanishad - Gnana Yogamu | T |
| 31 | Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 32 | Geetopanishad - Dhyana Yogamu | T |
| 33 | Geetopanishad - Vijnana Yogamu | T |
| 34 | Geetopanishad - Akshara Parabrahma Yogamu | T |
| 35 | Geetopanishad - Rajavidhya Rajaguhya Yogamu | T |
| 36 | Geetopanishad - Vibhuthi Yogamu | T |
| 37 | Geetopanishad - Purushottama Prapti Yogamu | T |
| 38 | Geetopanishad - Bhakthi Yogamu | T |
| 39 | Good Friday | E/G/S/F/H |
| 40 | Guru Sishya Samvadamu | T |
| 41 | Health & Harmony - 1 | E/G |
| 42 | Health & Harmony - 2 | E |
| 43 | Healer's Handbook | E |
| 44 | Healing Episodes | E |
| 45 | Hercules - The Man and The Symbol | E/G/S |
| 46 | Himalaya Guru Parampara (The Hierarchy) | T/H/K |
| 47 | Jupiter - The Path of Expansion | E/G/S |
| 48 | Just Adjust - Yoga of Synthesis | E/G/S/F |
| 49 | Jyotirlinga Yatra | T |
| 50 | Jyotisha Vignanamu | T |
| 51 | Katha Deepika | T |
| 52 | Kapila & Kardama - The Quintessence of the path | E/G/S |
| 53 | Kumara Sambhavam | T |
| 54 | Listening to The Invisible Master | E/G/S/F/H/K |
| 55 | Lord Maitreya - The World Teacher | E/G/S/F |
| 56 | Maitreya Maharshi Bodhalu - I | T/K |
| 57 | Maitreya Maharshi Bodhalu - II | T/K |
| 58 | Mana Mastaru Garu | T |
| 59 | Mantrams - Their Significance & Practice | E/G/S |

| | | |
|---|---|---|
| 60 | Marana Rahasyam - 1 (Markandeya) | T |
| 61 | Marana Rahasyam - 2 (Sathi Savitri) | T |
| 62 | Marana Rahasyam - 3 (Nachiketa Vidya) | T |
| 63 | Maria Magdalena | E/S |
| 64 | Marriage - A Sublime Sacrament | E |
| 65 | Mars - The Kumara | E/G/S |
| 66 | Maruvu Maharshi Bodhalu - 1 | T/K/H |
| 67 | Maruvu Maharshi Bodhalu - 2 | T/K/H |
| 68 | Master C V V - Janmadina Sandesamu | T/K |
| 69 | Master C V V - Nuthana Yogamu | T/k |
| 70 | Master C V V - Saturn Regulations | E/G |
| 71 | Master C V V - Yogamu - Karma Rahityamu | T/K |
| 72 | Master C V V - Yogamu | T/K |
| 73 | Master C V V - Yogamu Sadhana Sootramulu | T |
| 74 | Master CVV-The Initiator, Master EK-The Inspirer | E |
| 75 | Master E K - The New Age Teacher | E/S/G/T |
| 76 | Master M N - The Feiry Flame | E/G/S/T |
| 77 | Mercury - The Alchemist | E/G/S |
| 78 | Messages of Master E K | E |
| 79 | Mithila - The New Age Syllabus | E/G/S |
| 80 | Moon - The key | E |
| 81 | New Age Hospital Management | E/G/S/F |
| 82 | Nutrients For Discipleship | E |
| 83 | Occult Meditations | E/G/S |
| 84 | Om | T/K |
| 85 | Om Namo Narayanaya | E/G/S |
| 86 | On Change | E/G/S |
| 87 | On Healing | E/G/S |
| 88 | On Love | E/G/S |
| 89 | On Service | E/G/S |
| 90 | On Silence | E/G/S |
| 91 | Parikshit - The World Disciple | E/G/S/F |
| 92 | Prayers | E/G |
| 93 | Pranayamamu | T/K |
| 94 | Rudra | E/G/S |

| | | |
|---|---|---|
| 95 | Rukhmini Kalyanamu | T |
| 96 | Sai Suktulu | T/K |
| 97 | Sambala | T |
| 98 | SAM - Mantra of Saturn | E |
| 99 | Sanghaneethi | T |
| 100 | Sankhya - The Sacred Doctrine | E/S |
| 101 | Saraswathi - The Word | E/G/S |
| 102 | Saturn - The Path of Systematised Growth | E/G/S |
| 103 | Shiridi Sai Sayings | E/G/S/ |
| 104 | Shodasopachara Pooja - Avagahana | T |
| 105 | Sound - The Key and Its Application | E/S |
| 106 | Spiritual Fusion of East & West | E |
| 107 | Spirituality in Business & Management | E/G/S |
| 108 | Sri Dattatreya | E/G/S/T/H |
| 109 | Sri Krishna Namamrutham | T |
| 110 | Sri Guru Padukastavam | T/K |
| 111 | Sri Lalitha- I | T |
| 112 | Sri Lalitha- II | T |
| 113 | Sri Lalitha - III | T |
| 114 | Sri Lalitha - IV | T |
| 115 | Sri Lalitha - V | T |
| 116 | Sri Lalitha - VI | T |
| 117 | Sri Lalitha - VII | T |
| 118 | Sri Lalitha - VIII | T |
| 119 | Sri Lalitha - IX | T |
| 120 | Sri Lalitha - X | T |
| 121 | Srimad Ramayana - Dharma Kusumalu - I | T |
| 122 | Srimad Ramayana - Dharma Kusumalu - II | T |
| 123 | Sri Sastry Garu | E/G/S/F/T/K |
| 124 | Sri Suktham | E |
| 125 | SUN - That I AM | E/S |
| 126 | Swetha Padmamu | T |
| 127 | Teachings of Lord Maitreya - I | E/S |
| 128 | Teachings of Lord Maitreya - II | E/S |
| 129 | Teachings of Master Morya - I | E/S |

| | | |
|---|---|---|
| 130 | Teachings of Master Morya - II | E/S |
| 131 | Teachings of Master Koot Hoomi - I | E/S |
| 132 | Teachings of Master Koot Hoomi - II | E/S |
| 133 | Teachings of Madame HPB | E/G/S |
| 134 | Temple Service | E |
| 135 | The Aquarian Cross | E/G/S |
| 136 | The Aquarian Master (Biography and Yoga of Master CVV) | E/G/S |
| 137 | The Doctrine of Ethics | E |
| 138 | The Etheric Body | E/G/S |
| 139 | The Golden Stairs | E |
| 140 | The Mysteries of Sagittarius | E |
| 141 | The Path of Synthesis | E |
| 142 | The Splendour of Seven Hills | E/T/H/K |
| 143 | The Teacher - Meaning & Significance | E |
| 144 | The Teachings of Kapila | E |
| 145 | Teachings of Lord Sanat Kumara | E/G/S |
| 146 | The Theosophical Movement | E/G/S |
| 147 | The White Lotus | E/G/S |
| 148 | The Wisdom of Nakshatrams | E |
| 149 | The World Teacher | E |
| 150 | Uranus - The Alchemist of the Age | E |
| 151 | Varuna Graha Prabhavamu | T |
| 152 | Venus - The Path to Immortality | E/G/S |
| 153 | Violet Flame Invocations | E/G |
| 154 | Vrutrasura Rahasyamu | T |
| 155 | Vishnu Suktam | E |
| 156 | Wisdom Buds | E/S |
| 157 | Wisdom Teachings of Vidura | E/G/S |
| 158 | Yama Geetha | T |

**Please visit our website**
www.dhanishta.org
info@dhanishta.org




## శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు-1

రచన : మాస్టర్ పార్వతీకుమార్

వాల్మీకి రామాయణమందలి బాలకాండ,
అయోధ్యకాండల యందలి ఘట్టములను
88 శీర్షికలుగ సులభమైన శైలిలో
ఈ గ్రంథమందు వివరింపబడినవి.

వెల : రూ॥ 100-00

---

## శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు-2

రచన : మాస్టర్ పార్వతీకుమార్

వాల్మీకి రామాయణమందలి అరణ్యకాండ,
కిష్కింధకాండలలో గల సున్నితమగు
ధర్మములను 98 శీర్షికలుగ సులభమైన శైలిలో
ఈ గ్రంథమందు వివరింపబడినవి.

వెల : రూ॥ 100-00




ప్రతులకు :

ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్,
విశాఖపట్నం - 530 002 ఫోన్ : 0891-2701531
www.dhanishta.org info@dhanishta.org



రామాయణమందు సాధకులకు అత్యుత్తమమైన అనుగ్రహమును అందించేటటువంటిది సుందరకాండ. ప్రతి వారు తప్పక అవగాహన చేసుకొని, గురుతత్త్వాన్ని పరిపూర్ణంగా ఆశ్రయించి తద్వారా దైవమును చేరే సమస్తమైన ఉపాయములు సుందర కాండలో చెప్పబడి ఉన్నాయి. జీవాత్మ వేల లక్షల జన్మలు ఎత్తిన వెనుక, తను చేసే తిరుగు ప్రయాణంలో దైవాన్ని చేరవలసిన ఉపాయములన్నీ సుందరకాండలో ఇమిడి వున్నాయి. ఒక జీవుని జీవితంలోకి ఒక సద్గురువు ప్రవేశించడం అనే ఘట్టంకన్నా అత్యుత్తమమైన ఘట్టం వేరే ఏదీ లేదు కాబట్టి అది 'సుందర కాండము'. జీవునికి జీవనము సుందరమైనది కావాలంటే సద్గురువు ఆశ్రయం లభించాలి. సద్గురువు నందు దైవమును దర్శించాలి. సద్గురువును అవగాహన చేసుకొని, అతను తెలిపిన మార్గంలో నడిచి వెళ్ళాలి. సద్గురువు ఒక తపన చెందుచున్న జీవుణ్ణి ఏ విధంగా స్పృశిస్తాడు అనేది ఈ కాండములో చెప్పబడినది.

ధనిష్ఠ